Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!

సంపుటి: 56 • సంచిక: 115 • శనివారం 5 ఆగస్టు 2017 • హైదరాబాద్ * పేజీలు: 12+4 • వెల: 5.00 Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

ముహూర్తం | శ్రీ హేవళంబినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, తిథి: శుద్ధ త్రయోదశి రా. 8.16 వరకు, అనంతరం చతుర్దశి; నక్షత్రం: పూర్వాషాఢ రా. 12.07 వరకు, అనంతరం ఉత్తరాషాఢ; అమృతకాలం: రా. 6.55 నుండి 8.40 వరకు; వర్జ్యం: ఉ. 8.15 నుండి 10.01 వరకు; దుర్ముహూర్తం: ఉ. 5.44 నుండి 7.26 వరకు; రాహుకాలం: ఉ. 9.00 నుండి 10.30 వరకు; యమగండం: మ. 1.30 నుండి 3.00 వరకు;



మేడ్చల్ జిల్లా లక్ష్మీపూర్ గ్రామసభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్. సభకు హాజరైన గ్రామస్తులు

ఒకేరకం పంటలేయొద్దు

కొత్త స్టార్టర్లు ఇస్తాం

విద్యుత్, నీరు ఇక వృథా కాదు • ప్రతి గ్రామంలో వైకుంఠధామం పేరుతో శ్మశాన వాటికలు • లక్ష్మీపూర్ లక్ష్మీదేవిలా కళకళలాడాలి • వచ్చే జూన్ నుంచి పాములపర్తి ప్రాజెక్టుకు నీళ్లు • రిజిస్ట్రేషన్ మ్యూటేషన్‌లో త్వరలో మార్పులు తీసుకొస్తాం • మేడ్చల్ జిల్లాలో సీఎం కేసీఆర్ పర్యటన • గ్రామసభల్లో వరాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : 'నాతో పెట్టుకుంటే... అయి తీరాలి.. నేనసలే మొండి నా కొడుకుని.. ప్రజల సంఘటిత శక్తి కొన్ని లక్షల టన్నులు ఉంటుంది... లక్ష్మాపూర్ పిడికిలిలా ఉండాలి... ఐక్యమత్యంగా ఉండాలి... మంచిగా ఉండాలి... తిట్టుకోవడం... కొట్టుకోవడం బంద్ కావాలి... పోలీసు కేసులు లేకుండా చేసుకోవాలి' అన్నారు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్. ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రం నుంచి శుక్రవారం తిరిగి వస్తూ మేడ్చల్ జిల్లా లక్ష్మాపూర్, కేశవరం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన గ్రామసభలో కేసీఆర్ పాల్గొని గ్రామ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ ప్రజల 3వ పేజీలో...

ప్రజాక్షేత్రంలోకి కేసీఆర్

తెలంగాణ పునర్నిర్మాణానికి ప్రజాభిప్రాయ సేకరణ 3

విపక్షాల ఎత్తుగడలకూ చెక్

కమల సారథి రామ్‌మాధవ్?

కేంద్ర కేబినెట్‌లోకి అమిత్ షా!

ఆయన స్థానంలో రామ్‌మాధవ్

ప్రధాని మోడీ అభిమతమిదే



రామ్‌మాధవ్‌ను పార్టీ జాతీయాధ్యక్షుడిగా నియమిస్తే దక్షిణాదిన పార్టీ పటిష్టతకు వీలేర్పడుతుందని మోడి, షా బృందం భావిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా తెలుగురాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడుల్లో కూడా పార్టీ ఎక్కువ సంఖ్యలో ఎంపీ సీట్లు పొందగలుగుతుందని వీరు విశ్వసిస్తున్నారు. అవసరమైతే ప్రాంతీయ పార్టీలతో పొత్తు కుదర్చడంలో రామ్‌మాధవ్ మంచిదిట్ట. గతంలో దక్షిణాదికి చెందిన బంగారు లక్ష్మణ్, వెంకయ్యనాయుడులు పార్టీ జాతీయాధ్యక్షులుగా పనిచేసినా అప్పటికి పార్టీకి ఇంతటి ప్రాభవం లేదు. దీంతో దక్షిణాదిన బీజేపీ పుంజుకోలేక పోయింది. కాగా ఇప్పుడు ఉత్తరాదిన బీజేపీ పటిష్టంగా మారింది.

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లోపు దక్షిణాదిన మరింత బలం పుంజుకోవాలని బీజేపీ వ్యూహరచన చేస్తోంది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పార్టీ ప్రస్తుత ప్రధాన కార్యదర్శుల్లో ఒకరైన రామ్‌మాధవ్‌ను వినియోగించుకోవాలని ఆ పార్టీ తలపోస్తోంది. పార్టీ ప్రస్తుత అధ్యక్షుడు అమిత్‌షా త్వరలో జరిగే మంత్రివర్గ విస్తరణలో కేబినెట్ బెర్త్ ఆశిస్తున్నారు. అప్పటికి ఆయన పదవీకాల పరిమితి పూర్తవుతుంది. ఈసారి రామ్‌మాధవ్‌కు ఈ బాధ్యతలు అప్పగించాలని మోడి తలపోస్తున్నారు. ఇందుకు ఇప్పటికే వ్యూహం సిద్ధమైంది. సుమారు నెలరోజుల ముందునుంచే ఇందుకు తగ్గట్లుగా పార్టీ నేతల అభిప్రాయ సేకరణ జరుగుతోంది. ఈలోగా రాష్ట్రానికి చెందిన వెంకయ్యనాయుడును ఉపరాష్ట్రపతి పదవికి ప్రతిపాదించారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రామ్ మాధవ్‌ను రాజస్థాన్ లేదా మధ్యప్రదేశ్‌ల నుంచి రాజ్యసభకు నామినేట్ చేసి కేంద్ర కేబినెట్‌లోకి తీసుకోవాలన్న ప్రతిపాదన కూడా వచ్చింది. రామ్‌మాధవ్ మాత్రం ప్రభుత్వ పదవికంటే పార్టీ పదవిపైనే మక్కువ చూపుతున్నట్లు సమాచారం. మోడి కూడా ఈ దిశగానే యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా అమలాపురానికి చెందిన 3వ పేజీలో...



కృష్ణమ్మ జాడేది!?

నదీపరివాహక ప్రాంతంలో కానరాని నీటిప్రవాహం

కర్ణాటక నుంచి రాని కృష్ణా జలాలు

అడుగంటుతున్న జూరాల.. సాగర్ ఆయకట్టు ప్రశ్నార్థకం

ఆందోళనలో ఆయకట్టు రైతులు.. ఖరీఫ్‌కు కష్టాలేనా?

హైదరాబాద్, ఆంధ్రప్రభ: నాగార్జున సాగర్ ఆయకట్టు రైతాంగం పరిస్థితి ఈ ఏడాది కూడా ప్రశ్నార్థకంగా కనిపిస్తోంది. కృష్ణమ్మ కర్ణాటక నుండి కదలకపోవడంతో.. కృష్ణాజలాలు.. తెలంగాణకు ముఖం చాటేశాయి. పట్టిసీమ రిజర్వాయర్‌తో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతాం గం కొంత ఉపశమనం పొందుతున్నా.. తెలంగాణ రైతాంగం మాత్రం తీవ్ర ఆందోళనలో ఉన్నారు. గత ఏడాది జూరాలకు పెద్దఎత్తున వచ్చిన వరదతో పాలమూరు జిల్లాలు సస్యశ్యామలం కాగా, ఈ ఏడాది పాలమూరు కూడా ఆందోళన చెందుతోంది. ఇక నాగార్జునసాగర్ పరిధిలో గత ఏడాదే ఖరీఫ్ కటీఫ్ కాగా, ఈ ఏడాది కూడా పరిస్థితి అలానే ఉంటుందన్న ఆందో ళన వ్యక్తమవుతోంది. నాగార్జునసాగర్ లెఫ్ట్ కెనాల్ ద్వారా నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లోని ఆరు లక్షల ఎక రాలకు సాగునీరు అందాల్సి ఉంది. నీరు లేక ఆయకట్టు రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. మరోవైపు తాగునీటి సమస్య కూడా పొంచి ఉంది. నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు కలిపి సాగర్ ద్వారా 3.8లక్షల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉండగా, కనీస నీటి మట్టం కంటే దిగవన నీరుండడం.. చుక్క నీరు కూడా ఆగస్టు మొదటివారం వచ్చినా రాకపోవడంతో రైతుల్లో తీవ్ర బాధ వ్యక్తమవుతోంది. గత ఏడాది ఆలస్యంగా వచ్చిన వరదతో రబీ సాగయినా.. ఈ ఏడాది మళ్ళీ ఖరీఫ్‌పై కత్తి వేలాడుతోంది. 2014లో రబీకి మాత్రమే నీరిచ్చి 2వ పేజీలో...

కర్ణాటకపై రగులుతున్న తెలుగు రైతు

2లో



ఓటు హక్కుకు రెట్టింపు విలువ

ఎన్నుకున్న వారికి దించేసే అధికారం... త్వరలో రైట్ టు రీకాల్ చట్టం

ఒక్కసారి గెలిస్తే ఐదేళ్ళు ఢోకాలేదన్న ప్రజా ప్రతినిధుల డొంక కదిలే విధంగా కేంద్ర ప్రభుత్వం ఈ సంచలనాత్మక నిర్ణయం తీసుకుంది. ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నా, లేకున్నా పదవి అనుభవిస్తానన్న ఎమ్మెల్యేల అభిప్రాయాన్ని కూకలివేళ్ళతో పెకిలించబోతున్నారు. పనులు చేసినా, చేయకున్నా అడిగే నాథుడే లేడన్న భావనను ప్రజల్లోంచి తొలగించనున్నారు. వాగ్దానాలు నిలబెట్టుకోక పోయినా, క్షేత్రస్థాయిలో సమస్యలు పట్టించుకోకపోయినా ఓట్లేసి ఎన్నుకున్న ఆ ప్రజలకే దించేసే అధికారం కల్పించబోతున్నారు.

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రజాస్వామ్య వ్యవస్థలో పెను మార్పులకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అమూల్యమైన తమ ఓటు హక్కుతో ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే దించేసే అధికారాన్ని కూడా ప్రజలకు కల్పించాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి ప్రతిపాదనను ఇటీవల జరిగిన కేంద్ర మంత్రిమండలి ఆమోదించింది. ఓటు హక్కుకు రెట్టింపు విలువ కల్పించాలన్న లక్ష్యంతో 1951 ప్రజా ప్రాతినిధ్య చట్టాన్ని సవరించబోతున్నారు. స్వతంత్ర్య భారత దేశంలోనే మొట్టమొదటిసారిగా చేపట్టిన ఈ మహా సంకల్పాన్ని కార్యరూపంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు ప్రారంభమయ్యాయి. అందుకోసం రాజ్యాంగ సవరణ అవసరమవుతున్నందున అన్ని రాష్ట్రాల అభిప్రాయాలను తీసుకుని ముందడుగు వేయాలని కేంద్ర హోంమంత్రిత్వశాఖ నిర్ణయం తీసుకుంది. ఆ మేరకు తెలంగాణ ప్రభుత్వానికి కూడా లేఖ రాసినట్లు తెలుస్తోంది.

ప్రస్తుతం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సాధారణ పరిపాలన శాఖ పొలిటికల్ కార్యదర్శి పరిశీలనలో ఉన్న కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనకు సీఎం కేసీఆర్ ఆమోదం మేరకు కేబినెట్ అజెండా అంశాల్లో చేర్చనున్నారు. ప్రజలకు విశిష్ట అధికారాన్ని కల్పించే అత్యంత ప్రాధాన్యత కలిగిన ఈ అంశంపై త్వరలో జరిగే రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో ప్రధానంగా చర్చించనున్నారు. అనంతరం అభిప్రాయాన్ని కేంద్రానికి పంపనున్నారు. ఈ విధంగా అన్ని రాష్ట్రాల అభిప్రాయాలను తెలుసుకున్న తర్వాత 3వ పేజీలో...



తహసీల్దార్ శ్రీనివాసరావు

ఈ తహశీల్దార్ మహా ముదురు!

భూమిని మింగిన 'భూ రక్షకుడు'

సర్కార్ నేలపై పచ్చనోట్ల పంట

సర్టిఫికెట్ల నుంచి ఇసుక వరకు

ఆధారాలతో సహా 15 పేజీల నివేదిక

సస్పెన్షన్‌కు కలెక్టర్ సిఫారసు

అయినా సరే ఎవరిదో ఒకరి అండ

వివరాలు 10లో...

ఔరా..!



డబుల్ బెడ్‌రూం ఇళ్లు

నిరుపేదల ఆత్మగౌరవం

పిట్టలు పట్టేవాళ్లకూ 2 పడకల గదుల ఇల్లు

మందపల్లిలో డబుల్ బెడ్ రూం ఇళ్లు ప్రారంభోత్సవంలో మంత్రి హరీష్‌రావు 9



మందపల్లిలో వాటర్ ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న నీటిపారుదల శాఖ మంత్రి హరీష్ రావు

ఆ పిటిషన్లు గాంధీభవన్‌కు పంపుతా

అవి చదివి జవాబివ్వండి

కేసులు వేసి అభివృద్ధిని అడ్డుకుంటున్నారనే సీఎం ఆవేదన 10

కాంగ్రెస్ నేతలకు మంత్రి హరీష్ సూచన

డ్రగ్స్ దందా కేసు

లేడీ డాన్ సంగీత అరెస్ట్



లేడీ డాన్ సంగీతను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలిస్తున్న మహిళా పోలీసు

సంపన్నుల పిల్లలకు డ్రగ్స్ సరఫరా చేసినట్టు ఆరోపణలు

ఇంజనీరింగ్ విద్యార్థులకు డ్రగ్స్ విక్రయం... అమ్మాయిల సరఫరా

పోలీసుల విచారణలో విస్తుపోయే వాస్తవాలు వెల్లడించిన సంగీత

2లో

హైదరాబాద్‌లో అత్యాధునిక లాజిస్టిక్ పార్కు

ఐటీ, ఐటీఈఎస్ కంపెనీలకు మౌలికసదుపాయాలు కల్పించడమే లక్ష్యం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణాలో పెద్దఎత్తున విస్తరిస్తున్న ఐటీ, ఐటీఈఎస్ సంస్థలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా హైదరాబాద్ నగర శివారులో అత్యాధునిక లాజిస్టిక్ పార్కును నెలకొల్పి సేవలందిస్తున్నట్లు సేఫ్ ఎక్స్‌ప్రెస్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రూబల్ జైన్ తెలిపారు. కూచారంలోని ఆటో ఇండస్ట్రియల్ పార్కులో 16 ఎకరాల విస్తీర్ణంలో మొదటి లాజిస్టిక్ పార్కును నెలకొల్పామన్నారు. ప్రస్తుతం రూ.32 కోట్ల వ్యయంతో ప్రారంభించిన తమ సంస్థ సేవలను త్వరలోనే రూ.300 కోట్ల భారీ పెట్టుబడితో విస్తరించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారమిక్కడ ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు లూదియానా, ఔరంగాబాద్, బెంగుళూరు, ముంబై నగరాల్లో లాజిస్టిక్ పార్కులను నెలకొల్పి సేవలందించిన సేఫ్ ఎక్స్‌ప్రెస్ సంస్థ ప్రస్తుతం హైదరాబాద్‌లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంలో సేవలందించేందుకు సిద్ధమైందన్నారు. అత్యంత శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో మొదటి స్థానంలో ఉన్న హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో 1300లకు పైగా ఐటీ, ఐటీఈఎస్ సంస్థలు ఉన్నట్లు తెలిపారు. అయితే ప్రస్తుతం తెలంగాణాలో 14, ఆంధ్రప్రదేశ్‌లో 15 కంపెనీలతో ఎంవోయూ కుదుర్చుకుని కార్యకలాపాలు కొనసాగిస్తున్న తమ సంస్థ త్వరలో మరిన్ని కంపెనీలతో అవగాహన ఒప్పందాలకు సిద్ధమైందని ఎండీ రూబల్ జైన్ వివరించారు.

హైదరాబాద్‌లో మరో ఎలక్ట్రానిక్స్ క్లస్టర్

కేంద్రానికి కేటీఆర్ కృతజ్ఞతలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : హైదరాబాద్‌లో మరో ఎలక్ట్రానిక్ తయారీ క్లస్టర్‌కు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. 310 ఎకరాల్లో రూ.437 కోట్ల వ్యయంతో టిఎస్-ఐఐసి అభివృద్ధి చేయనున్న క్లస్టర్‌కు కేంద్ర ఎలక్ట్రానిక్, ఐటి మంత్రిత్వశాఖ ఆమోదం తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి శాఖ సంయుక్త కార్యదర్శి అజయ్ కుమార్ సమాచారం అందించారు. నాలుగు రోజుల కిందే ఒక ఎలక్ట్రానిక్ తయారీ క్లస్టర్‌కు అనుమతి ఇచ్చారు. రంగారెడ్డి జిల్లా రావిర్యాలలో 600 ఎకరాల్లో రూ.667 కోట్లతో అభివృద్ధిచేసే క్లస్టర్‌కు మొదట అనుమతి లభించింది. రెండో క్లస్టర్‌ను కూడా దానికి సమీపంలోనే ఏర్పాటు చేయనున్నారు. రెండో క్లస్టర్‌కు కూడా అనుమతి ఇచ్చినందుకు ఐటి పరిశ్రమలశాఖ మంత్రి కేటీ రామారావు కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే ఐటిరంగం దేశంలోనే రెండోస్థానంలో నిలువగా, ఎలక్ట్రా నిక్స్ రంగంలో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధంచేసింది. మరోవైపు అనేక సెజ్‌లు, ఇండస్ట్రియల్ పార్కులు, హబ్‌లు అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వం ఇప్పుడు ఎలక్ట్రానిక్ హార్డ్‌వేర్‌పై దృష్టిసారించింది. ఎలక్ట్రానిక్ క్లస్టర్లకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో ఈ రంగంలో ఉత్పత్తులకు హైదరాబాద్ కేంద్రంగా నిలువనుంది. రంగారెడ్డి జిల్లాలో గత వారంలో 600 ఎకరాల్లో ఎలక్ట్రానిక్ క్లస్టర్లకు అనుతించిన కేంద్రం ఇప్పుడు మరో 310 ఎకరాల్లో అనుమతించడం ప్రభుత్వానికి ఎంతో కలిసి వస్తుంది. దీనికి అవసరమైన రూ.437 కోట్లలో రూ.150 కోట్ల మేరకు కేంద్ర ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనకు ఆర్థికసాయం అందించనుంది. ఈ క్లస్టర్ల ద్వారా రూ.1100 కోట్లతో అభివృద్ధిచేసి వేలాదికోట్ల పెట్టుబడులు రాబట్టేందుకు ప్రభుత్వానికి అవకాశం కలిగింది.

కొత్త హంగులతో సరికొత్త పాలసీ

- సిద్ధమవుతున్న నూతన మద్యం పాలసీ
- లాటరీ విధానంపై మీమాంస
- కీలక మార్పులపై చర్చలు
- స్లాబులు, ఫీజులపై మార్పులు తథ్యం
- వ్యాపారుల మార్జిన్ పెంపు
- అదనపు ప్రివిలేజ్ ఫీజు ఎత్తివేత



ఆంధ్రప్రభ, హైదరాబాద్: నూతన మద్యం పాలసీలో కీలక మార్పులు రూపుదిద్దుకుంటున్నాయి. రెండేళ్ల క్రితం రూపొందించిన పాలసీకి గడువు ముగియనుండటంతో ఆబ్కారీ శాఖ కీలక మార్పులతో సరికొత్త పాలసీ దిశగా ముందుకు వస్తోంది. ఈ ఏడాది అమలు చేయనున్న నూతన మద్యం విధానానికి అధికారుల కసరత్తు తీవ్రతరం చేస్తున్నారు. సెప్టెంబర్ 1నుంచి అమలులోకి రానున్న నూతన ఆబ్కారీ విధానాన్ని మరింత పకడ్బంధీగా ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. ఈ ఏడాది పాలసీలో కొత్తగా దుకాణాల సంఖ్య పెంపు, లైసెన్సుల రుసుములు, స్లాబులపై కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నట్లుగా తెలిసింది. హైదరాబాద్ అంతర్జాతీయ ఖ్యాతికి అనువుగా కొన్ని దుకాణాలకు 24 గంటల వ్యాపారానికి అనుమతించాలన్న ప్రతిపాదనకు డ్రగ్స్ వ్యవహారంతో బ్రేకులు పడినట్లుగా తెలిసింది. సమయ పాలనలో పెద్దగా మార్పులు లేకుండా వ్యాపారులకు మెరుగైన ప్రయోజనాలే లక్ష్యంగా కొత్త పాలసీ ముసాయిదా సిద్ధమవుతోంది. ప్రధానంగా వ్యాపారుల లాభాల మార్జిన్‌ను 20శాతం నుంచి 30శాతానికి పెంచడం, జీఎస్టీ నేపథ్యంలో అదనపు అమ్మకాలపై ఉన్న అదనపు ప్రివిలేజ్ రుసుమును పూర్తిగా ఎత్తివేయడంకానీ ఇప్పుడున్న 7రెట్ల అమ్మకాలను 14 రెట్లకు పెంచే యోచన చేస్తున్నారు. ఈ మేరకు వ్యాపారులకు వెసులుబాటు కల్పించే చర్యలకు దాదాపు ఆమోదం లభించినట్లుగా తెలుస్తోంది. గతేడాది ఎక్సైజ్ పాలసీని అక్టోబర్ 1నుంచిసెప్టెంబర్ 31 వరకు నిర్దేశించారు. ఈ ఏడాది నూతన పాలసీలో భారీ సంస్కరణలు అమలులోకి తెచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. 2015-17 రెండేళ్ల కాలానికి రిటైల్ మద్యం దుకాణాలను కేటాయించారు. దాదాపు 2216 మద్యం దుకాణాలకు లైసెన్సుల జారీకి ప్రభుత్వం మొగ్గుచూపినా ఈ ఏడాది మరికొన్ని దుకాణాలను కొత్తగా నోటిఫై చేసే అవకాశాలు ఉన్నాయని తెలిసింది. తాజాగా జాతీయ రహదారులకు సమీపంలోని మద్యం దుకాణాలను తరలించే యోచనతోపాటు, జనాభా ఆధారంగా అనుమతించే వైన్ దుకాణాల సంఖ్య పెరిగే అవకాశాలున్నట్లుగా సమాచారం. గతేడాది 2215 మద్యం దుకాణాల లైసెన్సు రుసుములద్వారా రూ. 1217.39 కోట్లను ప్రభుత్వం ఆర్జించింది. అవే కాకుండా గుడుంబా కట్టడి, కల్తీ మద్యం నివారణతో రాబడి భారీగా పెరిగింది. మద్యం అమ్మకాలపై 170 శాతంగా ఉన్న అమ్మకం పన్నును 90 శాతానికి కుదించినా పెరిగిన విక్రయాలతో భారీ వృద్ధిరేటు సాకారమవుతోంది. ఫలితంగా రాష్ట్ర రాబడుల్లో కీలకంగా ఉన్న అమ్మకం పన్ను(వ్యాట్)లో మద్యంపై వస్తున్న వ్యాట్ ఆదాయమే 4వ వంతుకు మించుతోంది. ఇది తాజాగా మొత్తం రాబడిలో 40 శాతానికి మించుతోంది. 1993-94లో 5.76 కోట్లుగా ఉన్న మద్యంపై వ్యాట్ ఆదాయం తాజాగా గత ఆర్థిక ఏడాది రూ. 7421 కోట్లకు చేరింది. రెవెన్యూ రాబడుల్లో కీలక ఆదాయాలనందించే శాఖల్లో వాణిజ్య పన్నుల శాఖ తర్వాత ఆబ్కారీ శాఖ కీలక స్థానాన్ని ఆక్రమిస్తోంది. ఇందులో వ్యాట్ ఆదాయంతోపాటు ఎగుమతి, దిగుమతి సుంకాలు, అదనపు ప్రివిలేజ్ ఫీజులు ఖజానాకు సిరులు కురిపిస్తున్నాయి.

భారీ వృద్ధి రేటు...

తాజాగా ఈ వార్షిక యేడాది తొలి త్రైమాసికంలో వాణిజ్య పన్నుల్లో 8.20 శాతం వృద్ధిరేటు నమోదుతో తెలంగాణ రాష్ట్రం ప్రధాన ఆదాయం, మిగులు ఉన్న రాష్ట్రాల జాబితాలో తొలి స్థానంలో నిలిచింది. ఇందులో మద్యం విక్రయాలపై సమకూరుతున్న పన్నుల వాటా కీలకంగా మారుతోంది. గతేడాది మద్యం విక్రయాలపై తొలి మూడు మాసాల్లో రూ. 1384కోట్లు రాబడి రూపంలో సమకూరగా అది ఏ యేడాదిలో రూ. 1952 కోట్లకు చేరింది. దీంతో సుమారు రూ. 567 కోట్ల అదనపు ఆదాయం మద్యం పన్నుల రూపంలో ఖజానాకు కలిసి వచ్చింది.

పెరుగుతూ వస్తున్న రాబడి...

90వ దశకంలో రెండంకెలకు మించని వ్యాట్ ఆదాయం క్రమంగా పెరుగుతూ వస్తోంది. 2000 ఆర్థిక ఏడాదిలో రూ. 510 కోట్లకు, 2006-07లో రూ. 1205 కోట్లకు, 2011-12లో రూ. 2877కోట్లు, 2012-13లో రూ. 3862 కోట్లుగా నమోదైంది. 2012-13లో ప్రభుత్వం మద్యం అమ్మకాలపై ఏకీకృత పన్నును అమలుచేస్తూ మొత్తం పన్నులను ఒకే తాటిపైకి తెస్తూ వ్యాట్‌ను 170 శాతానికి పెంచింది. అనంతరం 2016లో దీనిని 90శాతానికి కుదించారు.

అదనపు ప్రివిలేజ్ రుసుము ఎత్తివేత...

మద్యం అమ్మకాలపై గత ఐదేళ్లుగా ఆబ్కారీ శాఖ అదనపు ప్రివిలేజ్ రుసుమును వసూలు చేస్తోంది. లైసెన్సు ఫీజులపై 7 రెట్లకు మించిన మద్యం విక్రయాలపై 14.5 శాతం అడిషనల్ ప్రివిలేజ్ ఫీజును వసూలు చేస్తోంది. ఈ రుసుమును నూతన పాలసీలో ఎత్తివేయాలని యోచిస్తోంది.

కృష్ణమ్మ జాడేది!?

(మొదటిపేజీ తరువాయి)

ఖరీఫ్‌కు ఇవ్వకపోగా, 2015-16లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇపుడూ సాగర్ ఆయకట్టు పరిస్థితి అంతక న్నా అధ్వాన్నంగా ఉందని రైతులు ఆందోళ నగా ఉన్నారు.

ఏదీ నీరు..

అదిగో కృష్ణమ్మ.. కదిలివస్తోంది.. నారాయణపూర్ నుండి జలాలు విడుదల య్యాయని వారం రోజులుగా ప్రకటనలు వస్తున్నా.. ప్రకటనలకు, ఆచరణకు సంబం ధం లేకుండా నీరు విడుదలవుతోంది. నారాయణపూర్ నుండి విడుదలైన నీటితో లెక్కప్రకారం ఇప్పటికే జూరాల నిండాల్సి ఉండగా, కర్ణాటక నిర్మించిన కొత్త ప్రాజెక్టు లతో.. వేసిన అడ్డుకట్టలతో నీరు ఆశించినంతగా రావడం లేదు. మరోవైపు ఎగువ నుండి నీరు వస్తుందని, జూరాల నుండి ఇతర ప్రాజెక్టులకు నీళ్ళు విడుదల చేయడంతో.. ప్రాజెక్టులోకి నీరు పెరిగి నిండాల్సిందిపోయి అడుగం టింది. నారాయణపూర్ ప్రాజెక్టు నుండి జలవిద్యుత్ కోసం 6వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తుండగా, ఇందులో 3వేల క్యూసెక్కులకు మించి నీరు దిగువకు రావడం లేదు. దీనికి తోడు ప్రాజెక్టును ఆనుకుని ఉన్న నెట్టెంపాడుకు రెండుపంపుల ద్వారా నీటిని నింపాల్సిన అధికారులు ఒకే పంపు ద్వారా పంపిస్తున్నారు. మరోవైపుకు సమాంతర కాల్వకు, భీమాకు నీరు విడుదల చేస్తున్నారు. ప్రారంభంలో జూరాల ప్రాజెక్టులో 9.657టీఎంసీలు ఉండగా, కర్ణాటకలో కురిసిన వర్షాలు.. వరదలు వస్తాయన్న అంచనాలతో ప్రాజెక్టు నుండి నీటిని ఇతర ప్రాజెక్టులకు వదిలారు. ఫలితంగా ప్రాజెక్టు అడుగంటగా, ఎగువ నుండి వచ్చిందేమీ లేదు. దీంతో జూరాల నుండి నీటి విడుదల నిలిపే అవకాశం కనబడుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 5.46 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉండగా, 1.8టీఎంసీల నీరు మాత్రమే వదలడానికి వీలుగా ఉంది. ఈ ప్రాజెక్టులోకి శనివారం 3700క్యూసెక్కుల వరదనీరు వచ్చింది.


ఎందుకీ కష్టం..

ఆల్మట్టి, నారాయణపూర్‌కు పెద్ద ఎత్తున వరదనీరు వస్తున్నా.. కర్ణాటక ప్రభుత్వం జూరాలకు నీటిని విడుదల చేయడం లేదు. ప్రాజెక్టులు నిండిన అనంతరం నీటిని కాల్వల ద్వారా మళ్ళించుకుంటూ రిజర్వాయర్లు, చెరువులు నింపుకుంటున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టు నుండి రోజుకు 6 వేలక్యూసెక్కుల నీటిని జలవిద్యుత్ కోసం వదులుతుండగా, ఇందులో 3 నుండి 4వేల క్యూసెక్కుల నీరు మాత్రమే జూరాల చేరుతోంది. నారాయణపూర్‌కు జూరాలకు మధ్య గూగుల్ బ్యారేజీ నుండి నీటిని చెరువులకు తరలించుకుంటున్నారు. దీంతో జూరాలకు ఆశించిన స్థాయిలో ఇన్‌ఫ్లో రావడం లేదు. దీనికి తోడు నారాయణపూర్ నుండి నీటిని విడుదల చేస్తామని చెబుతున్న అధికారులు చుక్క నీరు కూడా ఇవ్వడం లేదు. ఏపీ ప్రభుత్వం నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టును సాకుగా చూపి.. అదనపు వాటా జలాల కింద కర్ణాటక ప్రభుత్వం నాలుగు ప్రాజెక్టులకు అనుమతులు తెచ్చుకుని పనులు చేపట్టడంతో పాటు ముందు జాగ్రత్తగా చేసుకున్న వ్యూహంతో.. తెలంగాణ రాష్ట్రానికి తీవ్రకష్టాలు ఏర్పడ్డాయి. ఇప్పటికీ కృష్ణాజలాలపై ప్రభుత్వవర్గాలు మాత్రం ఆశాభావంతో ఉన్నాయి. జూరాలను గట్టెక్కించినా.. సాగర్ ఆయకట్టు పరిస్థితి మాత్రం అగమ్యగోచరంగానే కనిపిస్తోంది. ప్రభుత్వం తగిన వ్యూహం రూపొందించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

కర్నాటకపై రగులుతున్న తెలుగు రైతు

- కృష్ణా ప్రాజెక్టుల కింద ఖరీఫ్ ఖతం!
- నిండుకున్న జలాశయాలు
- ఎండుతున్న నారుమళ్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు గడిచిపోయినా కృష్ణానది పరివాహకంగా ఉన్న ప్రధాన ప్రాజెక్టుల్లోకి చుక్కనీరు లేక మైదానాలను తలపిస్తున్నాయి. దిగువ కృష్ణా పరివాహకంగా శ్రీశైలం నుంచి పులిచింతల దాక సుమారు 60 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగుపై ఆశలు వదులుకోవాల్సి వస్తోంది. ప్రాజెక్టులు నిండి వరినాట్ల సమయానికంతా ఆయకట్టుకు నీరు రాకపోంతుందా అన్న ఆశతో రైతులు నార్లు పోసుకున్నారు. ఇపుడు నార్లు ఎదిగివస్తున్నా నాటువేసేందుకు నీటిజాడలే కనిపించ టంలేదు. అదను దాటిపోతే ఇక ఖరీఫ్ సాగు లక్ష్యాలు ఖతమైనట్టే అన్న ఆందోళనలు వెలిబుచ్చుతున్నారు. ఎగువన కర్నాటక రాష్ట్రంలో ఆలమట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో నిండినప్పటికీ దిగువకు నీటిని వదలకుండా తమ నోట మట్టికొడుతున్నారంటూ కర్నాటక ప్రభుత్వ తీరుపై తెలుగు రాష్ట్రాల్లోని రైతులు భగ్గుమంటున్నారు. ఆలమట్టి, నారాయణపూర్ జలాశయాలతోపాటు కృష్ణానదివెంట పలు చోట్ల గూగుల్ వంటి బ్యారేజీలు ఎత్తిపోతల పథకాల ద్వారా కృష్ణాజలాలను కర్నాటక అక్రమ మార్గాల్లో మింగేస్తోంది. ఆయకట్టు పరిధి లోనికి రాని వందలాది చెరువులను కూడా కృష్ణా జలా లతోనే నింపేసు కుంటు న్నారు. దీంతో వారం రోజుల కిందటే తెరుచు కోవాల్సిన ఆలమట్టి నారా యణ పూర్ జలాశయాల గేట్లు ఇంకా తెరుచుకో నేలేదు. ఇదే పరిస్థితి కొనసాగితే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని 60లక్షల ఎకరాల ఆయకట్టులో లేట్ ఖరీఫ్‌కు కూడా అవకాశాలు ఉండవం టున్నారు.



ఆలమట్టికి 146టీఎంసీల చేరిక

కృష్ణానదిలో ఈ ఏడాది జూన్ ప్రారంభం నుంచి ఇప్పటివరకూ నీటి ప్రవాహాలను పరిశీలిస్తే ఎగువనుంచి ఆలమట్టి జలాశయంలోకి 146.85టీఎంసీల నీరు చేరింది. ఆలమట్టి జలాశయం పూర్తిస్థాయి నీటినిలువ సామర్థ్యం 129 టీఎంసీలు కాగా గిరిష్ట నిలువ సామర్థ్యానికి మించి 17టీఎంసీల నీరు అధికంగానే చేరింది. అయినా ఇంతవరకూ ప్రాజెక్టు గేట్లు తెరుచుకోనేలేదు. శుక్రవారం కూడా ఎగువ నుంచి 21003క్యూసెక్కుల నీరు జలాశయంలోకి చేరుతుం డగా విద్యుత్ ఉత్పత్తిద్వారా 20వేల క్యూసెక్కులు, పంట కాలవలకు 1003 క్యూసెక్కు ల నీటిని వాడే సుకుం టున్నారు. ప్రాజెక్టులో కేవలం ఒక టి న్నర టీఎంసీల ఖాళీ మాత్రమే ఉంచారు.

3000 క్యూసెక్కులు దారిలోనే ఆవిరి!

దిగువన నారాయ ణపూర్‌లో కూడా జూన్ నుంచి ఇప్పటివరకు ఎగువ నుంచి 34.62టీఎంసీల నీరు చేరింది. ప్రాజెక్టులో 0.60టీఎంసీ మేర ఖాళీ ఉంది. ఎగువన ఆలమట్టి నుంచి విడుదలవుతున్న 20వేల క్యూసెక్కుల నీటిలో మూడు వేల క్యూసెక్కుల నీటిని కర్నాటక ప్రభుత్వం అక్రమంగా నిర్మించుకున్న ఎత్తిపోతల పథకాలకు వాడుకుంటోంది. దీంతో నారాయణపూర్ జలాశయానికి 17000క్యూసెక్కులు మాత్రమే చేరుతున్నాయి. ఈ జలాశయం నుంచి కూడా ఏకంగా 11566క్యూసెక్కులు ప్రధాన పంటకాలువలకు విడుదల చేస్తున్నారు. కేవలం ఆరు వేలక్యూసెక్కుల నీటిని మాత్రమే పవర్‌హౌస్ ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. ఆ నీటిలో కూడా మధ్యలో ఉన్న ఎత్తిపోతల పథకాలను తప్పించుకుని కేవలం 3710 క్యూసెక్కుల నీరు మాత్రమే జూరాల ప్రాజెక్టుకు చేరుతోంది. జూరాల ప్రాజెక్టుకు జూన్ నుంచి ఇప్పటివరకూ ఎగువ నుంచి 7.04టీఎంసీల నీరు చేరింది.

జూరాల జాలాశయం నుంచి 4331క్యూసెక్కుల నీటిని జూరాల ఆయకట్టుతోపాటు ఎత్తిపోతల పథకాలకు కూడా విడుదల చేస్తున్నారు. జూరాల పూర్తిస్థాయిలో నిండాలంటే ఇంకా 4.20టీఎంసీల నీరు చేరాల్సివుంది. ఈ పరిస్థితుల్లో దిగువన ఉన్న శ్రీశైలం, నాగార్జున సాగర్, పులిచింతల ప్రాజెక్టులకు నీరు చేరెదెన్నడూ, అవి నిండేదెన్నడు అన్న నిట్టూర్పులు వినిపిస్తున్నాయి. ఆలమట్టి ప్రాజెక్టు ఎగువన కర్నాకటలో వర్షాలు కూడా తగ్గుముఖం పట్టాయి. దీంతో కృష్ణానదిలో వరదనీటి ప్రవాహాలు రోజురోజుకు తగ్గిపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో జూరాల దిగువన ఉన్న శ్రీశైలం, నాగార్జున సాగర్ ఆయకట్టు రైతాంగం ఖరీఫ్‌పై పంటల సాగుపై సందిగ్ధంలో పడిపోయింది.

పోలీసుల కస్టడీకి కమింగా

హైదరాబాద్, ఆంధ్రప్రభ : డ్రగ్స్ కేసులో మరింత లోతుగా దర్యాప్తు చేసేందుకు ఎక్సైజ్ శాఖ కమిషనర్ చంద్రవదన్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్‌సబర్వాల్ సారథ్యాన పనిచేస్తున్న ఎక్సైజ్‌సిట్ నడుం బిగించింది. డ్రగ్స్ కేసులో అరెస్టైన ప్రధాన నిందితుడిగా భావి స్తున్న నెదర్లాండ్స్‌కు చెందిన మైక్ కమింగాను ఎక్సైజ్‌సిట్ కస్టడీలోకి తీసుకుంది. వైద్య పరీక్షల అనంతరం మైక్ కమింగాను ఎక్సైజ్ సిట్ విచారించనుంది. మూడు రోజుల పాటు తమ కస్టడీకి తీసుకున్న సిట్ అధికారులు హైదరాబాద్‌లో డ్రగ్స్ ఎవరెవరికి, ఏయే ప్రాంతాల్లో సరఫరా చేశాడనే వివరాలను రాబట్టనున్నట్లు తెలుస్తోంది.

మరో డ్రగ్స్ ముఠా పట్టివేత


- ఆరుగురు సభ్యుల అరెస్ట్
- 2. 5 కిలోల అల్ప్రాజోలం, అరకిలో డైజోపామ్ స్వాధీనం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా సంచలనం రేపిన డ్రగ్స్ కేసులో ఎక్సైజ్ సిట్ దూకుడు పెంచుతూ డ్రగ్స్ మహమ్మారిని కూకటివేళ్లతో పెకిలించేందుకు యత్నిస్తున్న సమయంలో భాగ్యనగరంలో యథేచ్ఛగా డ్రగ్స్ అమ్మకాలు కొనసాగుతుండటం గమనార్హం. అమీర్‌పేట మైత్రీవనం వద్ద నడిరోడ్డుపై డ్రగ్స్‌ను విక్రయిస్తున్న ఓ ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. సదరు ముఠా సభ్యుల నుంచి 2.5 కిలోల అల్ప్రాజోలం, అరకిలో డైజోఫామ్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముఠా సభ్యులు బాన్స్‌వాడ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి నుంచి డ్రగ్స్‌ను తీసుకుని హైదరాబాద్‌లోని మరో వ్యక్తికి ఇచ్చేందుకు వచ్చినట్లుగా పోలీసులు గుర్తించారు. గురువారం అర్ధరాత్రి విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు మూడు వైపుల నుంచి ఒకేసారి దాడి చేసి సదరు ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. వీరంతా సిద్ధిపేట ప్రాంతానికి చెందిన వారని పోలీసులు తెలిపారు. ముఠా సభ్యులతో పాటు స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తును తదుపరి విచారణ నిమిత్తం ఎస్ఆర్‌నగర్ పోలీసులకు అప్పగించారు. వీరిని కోర్టు ముందు ప్రవేశపెట్టి ఆపై కస్టడీకి తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో వారు ఎవరెవరికి మత్తు పదార్థాలు సరఫరా చేశారన్న విషయమై వారి సెల్‌ఫోన్లను విశ్లేషిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ముఠా సభ్యులను విచారించిన మీదట మరికొన్ని డ్రగ్స్ విక్రేతల ముఠా గుట్టురట్టయ్యే అవకాశం ఉంది.

లేడీ డాన్ సంగీత అరెస్ట్

సంపన్నుల పిల్లలకు డ్రగ్స్ సరఫరా చేసినట్లు ఆరోపణలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: నైజీరియన్ ముఠాతో కలిసి మాదకద్రవ్యాల డ్రగ్స్ వ్యాపారం చేస్తూ లేడీ డాన్‌గా మారిన విజయవాడకు చెందిన యువతి పాలకుర్తి సంగీత పోలీసు విచారణలో సంచలన విషయాలు వెల్లడి చేసినట్లు సమాచారం. సంపన్నుల పిల్లలకు వలవేసి వారికి డ్రగ్స్ సరఫరా చేసినట్లు తెలుస్తోంది. అంతేగాక, పలువురు యువతులను బలవంతంగా వ్యభి చార కూపంలోకి కూడా దించినట్లు పోలీసు విచారణలో సంగీత వెల్లడించినట్లు సమాచారం. తమకు ఎదురు తిరిగిన యువతుల నగ్న ఫోటోలు, వీడియోలు తీసి వారిని బ్లాక్‌మెయిల్ చేసినట్లు సంగీత చెప్పినట్లు తెలుస్తోంది. నైజీరియన్ ముఠాలోని సోమాయిల్ జాన్‌తో ప్రేమ లోపడిన సంగీత గత సంవత్సరం నుంచి డ్రగ్స్ వ్యవహారంలో కీలకంగా మారింది. రాజేంద్రనగర్ పీఎస్ పరిధిలోని బండ్లగూడ సన్‌సిటీలో ఓ ఫ్లాట్‌ను అద్దెకు తీసుకుని ఇతర నైజీరియన్లతో కలిసి ఉంటోంది. కాస్మోస్ గ్యాబ్రిల్ అనే స్నేహితుడి సహాయంతో కొకైన్, బ్రౌన్‌షుగర్, ఆంపిటమైన్ టాబ్లెట్లను తీసుకొచ్చి తన స్నేహితులైన జాన్, సిరిల్, హెన్రీలతో కలిసి హైదరాబాద్‌లో సరఫరా చేస్తున్నారు. సంగీత పేరు మీద బ్యాంకు ఖాతా, డెబిట్ కార్డు తీసుకుని వినియోగిస్తున్నారు. జాన్, సిరిల్‌లు నిజాం కాలేజీలో డిగ్రీ చదువుతున్నారు. కొందరు నైజీరియన్లు డ్రగ్స్ విక్రయిస్తున్నారనే సమాచారంతో రాచకొండ ఎస్‌వోటీ, ఎల్బీనగర్ పోలీసులు నిఘా పెట్టారు. ఈ క్రమంలోనే జులై 23న ఎల్బీనగర్ బస్టాపులో సంగీతను, జాన్‌ను అదుపులోకి తీసుకున్నారు.

టెట్ ఫలితాలు విడుదల

పేపర్-1లో 57.3% - పేపర్-2లో 19.5%



టెట్ ఫలితాలను విడుదల చేస్తున్న డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ జి. కిషన్, టెట్ కన్వీనర్ శేషుకుమారి

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో జులైలో నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) ఫలితాలను విడుదల చేశారు. పాఠశాల విద్యాశాఖ సంచాలకులు జి కిషన్, టెట్-2017 కన్వీనర్ శేషుకుమారి ఫలితాలను శుక్రవారం పాఠశాల విద్యాశాఖ కార్యాలయంలో విడుదల చేశారు. టెట్ పేపర్-1లో 57.37 శాతం అర్హత సాధించగా, పేపర్-2లో 19.51 శాతం అర్హత పొందారు. రాష్ట్ర వ్యాప్తంగా టెట్‌కు 3.56 లక్షల మంది దరఖాస్తు చేసుకున్న సంగతి తెలిసిందే. పేపర్-1కి రాష్ట్ర వ్యాప్తంగా 98,848 మంది హాజరు కాగా వారిలో 56,708 మంది అర్హత సాధించారు. పేపర్-2లో గణితం, సైన్స్ పరీక్షకు 1,11018 హాజరు కాగా వారిలో కేవలం 20,323 మంది అర్హత సాధించారు. సాంఘికశాస్త్రం పరీక్షకు 1,19,914 మంది హాజరైతే అందులో 24,732 మంది మాత్రమే అర్హత సాధించారు. టెట్ ఫలితాల్లో పేపర్-1లో గత ఏడాది కంటే అర్హత పెరిగిందని కిషన్ తెలిపారు. గత ఏడాదిలో పేపర్-1లో 54.45 శాతం అర్హత సాధిస్తే ఈసారి 57.37 శాతానికి పెరిగిందన్నారు. పేపర్-2లో మాత్రం గతం కంటే అర్హత శాతం తగ్గిందన్నారు. గత ఏడాదిలో పేపర్-2లో 25.05 శాతం అర్హత సాధించగా ఈ ఏడాదిలో 19.51 శాతం మాత్రమే అర్హత పొందారని తెలిపారు. పేపర్-1లో రాజన్న సిరిసిల్ల జిల్లా 74.27 శాతంతో మొదటి స్థానంలో నిలవగా రంగారెడ్డి జిల్లా 48.40 శాతంతో చివరి స్థానంలో ఉంది. పేపర్-2లో మంచిర్యాల జిల్లా 24.02 శాతంతో మొదటి స్థానంలో ఉండగా, సిద్దిపేట జిల్లా 16.80 శాతంతో చివరి స్థానంలో నిలిచింది. పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగ్ బరువును తగ్గించే విషయంపై స్కూల్ యాజమాన్యంతోపాటు, విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నామని పాఠశాల విద్యా శాఖ సంచాలకులు జి కిషన్ తెలిపారు. అవగాహన కల్పించడం కోసం గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. రాష్ట్రస్థాయిలో కూడా త్వరలోనే ఒకసమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. డ్రగ్స్ వ్యవహారంలోనూ అవగాహన కల్పించే కార్యక్రమాలను ఇప్పటికే మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

మంత్రి వచ్చాకే డీఎస్సీ!

- ఇప్పటికీ రూపొందని ఉపాధ్యాయ నియామక విధానం
- కొత్త జిల్లాల వారీగా భర్తీ చేస్తామని ప్రకటించిన సర్కార్
- కొన్ని జిల్లాల్లో ఖాళీలు లేని వైనం
- ఖరారు కాని రిజర్వేసన్లు
- సుప్రీంకోర్టు గడువులోగా ప్రక్రియ పూర్తి కావడం కష్టమే

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయ నియామక ప్రక్రియ మరింత ఆలస్యం కానుంది. టెట్ ఫలితాలు వెలువడిన తరువాత డీఎస్సీ నోటిఫికేషన్ వస్తుందని ఉపముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి కడియం శ్రీహరి కొద్ది రోజుల క్రితం తెలిపారు. అదే సందర్భంలో టెట్ ఫలితాలు వెలువడిన మరుసటి రోజుగానీ అవకాశం ఉంటే అదే రోజుగానీ డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేస్తామని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి ప్రకటించారు. శుక్రవారం టెట్ ఫలితాలు వెలువడ్డాయి. కానీ డీఎస్సీ నోటిఫికేషన్‌పై ఊసే లేదు. డీఎస్సీ నోటిఫికేషన్ రావాలంటే విదేశాల్లో ఉన్న ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి వచ్చిన తరువాత గానీ ప్రక్రియ ప్రారంభం కాదు. మంత్రిగారు ఆగస్టు 9న నగరానికి వస్తున్నట్టు తెలుస్తోంది. మంత్రి వచ్చిన తరువాత విద్యా శాఖ అధికారులతో చర్చించిన అనంతరం డీఎస్సీ నోటిఫికేషన్‌పై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అప్పటి వరకు డీఎస్సీపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. సుప్రీంకోర్టుకు ఇచ్చిన గడువు లోపు రాష్ట్రప్రభుత్వం డీఎస్సీ ప్రక్రియను పూర్తి చేసే అవకాశం కన్పించడం లేదు. సెప్టెంబర్ 11 లోపు డీఎస్సీ ప్రక్రియను పూర్తి చేస్తామని ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. సెప్టెంబర్ 11 లోపు డీఎస్సీ ప్రక్రియ పూర్తి అయ్యే అవకాశం లేదు. సర్కార్ ఎంత త్వరగా నోటిఫికేషన్ ఇచ్చి... డీఎస్సీని నిర్వహించాలని అనుకున్నా అది డిసెంబర్ లోపు పూర్తి అయ్యే అవకాశం లేదు.

ఇప్పటికీ ఖరారు కానీ విధి విధానాలు

తెలంగాణలో ఉపాధ్యాయ నియామక ప్రక్రియకు సంబంధించిన విధి విధానాలు ఇప్పటి వరకు తయారు కాలేదు. గతంలో ఉపాధ్యాయుల నియామకం జోనల్ వారీగా ఉండేది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత జోనల్ వ్యవస్థను రద్దు చేసి ఉపాధ్యాయ పోస్టులను జిల్లా పోస్టులుగా చేశారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయుల నియామక ప్రక్రియ జిల్లాల వారీగా చేపడతామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో జిల్లాల వారీగా భర్తీ ప్రక్రియ చేపడితే వారి స్థానికత స్పష్టత చేయాల్సి ఉంటుంది. కొత్తగా ఏర్పడిన జిల్లాల ప్రకారమే ఉపాధ్యాయుల నియామకం చేపడతామని సర్కార్ స్పష్టం చేసింది. కాబట్టి ఇప్పుడు జిల్లాల వారీగా ఖాళీల వివరాలు ప్రకటించాలి, వాటి భర్తీకి రిజర్వేషన్లను ప్రకటించాల్సి ఉంటుంది. కానీ ఇప్పటి వరకు అటువంటి ప్రయత్నం విద్యా శాఖ నుంచి జరగలేదు.

స్థానికతపై సర్కార్ స్పష్టత ఇవ్వాలి

తెలంగాణ రాష్ట్రంలోని 31 జిల్లాల్లో కేంద్రం ప్రకటించిన ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తి ప్రకారం చూసుకుంటే సుమారు 20 జిల్లాల్లో ఉపాధ్యాయుల ఖాళీలు ఉండబోవు. మరీ ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేస్తే ఆ 20 జిల్లాల్లోని నిరుద్యోగుల పరిస్థితి ఏమిటీ. వారు ఎక్కడ పోటీ పడాలనేది ప్రశ్నార్థకంగా మారనుంది. పాత జిల్లాల్లో ఒక్క జిల్లా మూడు, నాలుగు జిల్లాలుగా విడిపోయాయి. ఈ నేపథ్యంలో వారు చదువుకున్న ప్రాంతం ఒక జిల్లాలోకి వెళ్లగా... ఆయన నివాసం ఒక జిల్లాలో ఉంటుంది. ఈ నేపథ్యంలో అతను ఏ జిల్లాకు స్థానికత అనేది ప్రభుత్వం స్పష్టం చేయాల్సి ఉంటుంది. పాత వరంగల్ జిల్లాలోని జనగాం ప్రాంతానికి చెందిన వ్యక్తి ఇంటర్మీడియట్ నుంచి పీజీ వరకు వరంగల్ పట్టణంలో కొనసాగించాడు. ఇప్పుడు అతని స్థానికత ఏ జిల్లాకు వస్తుందనేది ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సి ఉంది. అతను పుట్టి పెరిగిన జనగాం ప్రాంతం ఇప్పుడు జనగాం జిల్లాగా మారింది... అతను చదువుకున్న వరంగల్ పట్టణం వరంగల్ అర్బన్ జిల్లాగా మారింది. ఈ నేపథ్యంలో అతను ఏ జిల్లాకు చెందిన వాడుగా ఉంటాడనేది తేల్చాలి.

జిల్లాల వారీగా తేలని పోస్టులు

రాష్ట్రంలో 8792 ఉపాధ్యాయుల ఖాళీలు ఉన్నాయని ప్రభుత్వం ప్రకటించింది. అయితే వాటిలో జిల్లాల వారీగా ఖాళీల వివరాలు స్పష్టంగా చెప్పలేదు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విద్యా హక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి ప్రకారం చూసుకుంటే సుమారు 20 జిల్లాల్లో ఉపాధ్యాయుల ఖాళీలు ఉండటం లేదు. ఇలా అయితే 20 జిల్లాలకు చెందిన నిరుద్యోగ బిఈడి అభ్యర్థుల పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారనుంది.

ఉపాధ్యాయుల ఖాళీల వివరాలు

తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో
కలిపి స్కూల్ అసిస్టెంట్ - 1754,
లాంగ్వేజ్ పండిట్స్ - 985
పిఈటీ- 374,
ఎస్‌జిటి- 4779

ఉర్థూ మీడియంలో

స్కూల్ అసిస్టెంట్- 196,
లాంగ్వేజ్ పండిట్స్- 26,
పిఈటీ- 42, ఎస్‌జిటి- 636

మొత్తం పోస్టులు- 8792

సిస్టర్ ఫర్ ఛేంజ్‌కు జాతీయ మద్దతు

కవిత స్ఫూర్తికి ప్రశంసలు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత చేపట్టిన 'సిస్టర్స్ ఫర్ ఛేంజ్' ప్రచారోద్యమానికి దేశవ్యాప్తంగా విశేష స్పందన కనిపిస్తోంది. ఈ ఉద్యమాన్ని మరింత మందికి చేరువ చేసేందుకు తయారు చేసిన వెబ్‌సైట్‌ను లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ పార్లమెంటులోని తన ఛాంబర్లో ప్రారంభించారు. 'చెల్లెలికి సోదరుడు రక్ష-సోదరుడికి హెల్మెట్ రక్ష' నినాదంతో తెలంగాణ జాగృతి సంస్థను నడుపుతున్న ఎంపీ కవిత సిస్టర్4ఛేంజ్ పేరుతో ప్రచారోద్యమాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. కవిత కృషిని స్పీకర్ సుమిత్రా మహాజన్ అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మహిళా కూడా తన సోదరులు క్షేమంగా ఉండాలని కోరుకుంటూ రాఖీ పండుగ నాడు అన్నదమ్ములకు రాఖీలు కడుతుంటారని స్పీకర్ తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్నవారిని చూసి ఎంపి కవిత చలించి పోయారని, అందుకే హెల్మెట్ ధరించాలన్న అవగాహనను మరింత పెంపొందించేందుకు కవిత నడుం బిగించారని స్పీకర్ కొనియాడారు. ఈ ప్రచారం వల్ల ద్విచక్ర వాహనాల ప్రమాదాల్లో అనేక మంది ప్రాణాలను కాపాడేందుకు వీలవుతుందని సుమిత్రా మహాజన్ అన్నారు. కవిత తాను స్వయంగా ఒక సోదరి కావడం వల్లనే ఇలా స్పందించి, 'సిస్టర్స్ 4ఛేంజ్' ప్రచారానికి తెరలేపారని స్పీకర్ వ్యాఖ్యానించారు. ఈ ప్రచార కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

రక్షా బంధన్ పండుగ మన దేశాని కెంతో విశిష్టమైనదని కవిత అన్నారు. ఇక్కడ తప్ప ప్రపంచంలో మరెక్కడా ఈ పండుగ జరగదన్నారు. అన్నా-చెల్లెల్లు, అక్కా-తమ్ముళ్ల సోదర భావానికి ప్రతీకగా మనం రక్షా బంధన్ పండుగను జరుపుకుంటామని చెప్పారు. తమ సోదరులు సుఖ సంతోషాలతో కలకాలం జీవించాలని సోదరీమణులు తమ సోదరులకు రక్షను కడుతారు. అయితే దుర దృష్టవశాత్తూ మన దేశంలో ప్రతి రోజూ దాదాపు 400 మంది వరకు ద్విచక్రవాహన దారులు రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్నారని కవిత తెలిపారు.

కేవలం ద్విచక్రవాహన దారులు తలకు హెల్మెట్ పెట్టుకోకపోవడం వల్లే ఇలా మృత్యువాత పడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క 2015 సంవత్సరంలో రోడ్డు ప్రమాదాల్లో 45,540 మంది తమ ప్రాణాలు కోల్పోయారని, వీటిలో 29శాతం మంది ద్విచ క్రవాహన దారులేకావడం తనను తీవ్రంగా కలచివేసిందని కవిత అన్నారు. ఈ నేపథ్యంలోనే సిస్టర్స్ 4 ఛేంజ్ ప్రచార కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. రక్షణ స్లోగన్ మాత్రమే కాదని, ప్రాణాలకు అదోక మార్గమన్నారు. అన్నా తమ్ముళ్లకు ''రాఖీ కట్టండి హెల్మెట్‌ను కూడా బహూకరించండి'' అని తానిచ్చిన సోషల్ మీడియా పిలుపునకు నెటిజన్లు తమ మద్ధతు తెలియజేస్తున్నారని, అన్ని వర్గాల వారూ ప్రచారంలో పాల్గొంటున్నారని కవిత తెలిపారు. ప్రతి ఒక్కరు 'సిస్టర్4 చేంజ్' కార్యక్రమంలో పాల్గొనాలని, ఇందుకోసం తమ పేర్లను నమోదు చేసుకోవాలని కవిత సూచించారు. ద్విచక్రవాహనాలు నడిపే తమ సోదరీమణులకు సోదరులు హెల్మెట్‌ను బహుకరించడం మరవకూడదన్నారు.

జగిత్యాలకు 3బైపాస్ రోడ్లు

4లేన్ల రహదారిగా ఆర్మూరు- రామగుండం

కేంద్రమంత్రి గడ్కరీకి కవిత ప్రతిపాదనలు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : తన నియోజకవర్గంతో పాటు తెలంగాణ రాష్ట్ర సమస్యలపై వరుసగా వేర్వేరు శాఖల మంత్రులతో భేటీ అవుతున్న నిజామాబాద్ ఎంపీ కవిత, బైపాస్ రోడ్ల నిర్మాణం కోరుతూ కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిశారు. మధ్యాహ్నం గం. 12.30 ని. సమయంలో నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యేలతో పాటు ట్రాన్స్‌పోర్ట్ భవన్‌లో గడ్కరీతో భేటీ అయ్యారు. జగిత్యాల పట్టణం మీదుగా సాగుతున్న రహదారులకు బైపాస్ రోడ్లు నిర్మించాల్సిన అవసరం గురించి వివరించి చెప్పారు. బైపాస్ రోడ్లు లేకపోవడం వల్ల భారీ ట్రక్కులు పట్టణం మధ్య నుంచే వెళ్తున్నాయని, తద్వారా రద్దీ పెరగడంతోపాటు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని ఆమె పేర్కొన్నారు. జగిత్యాల పట్టణానికి ప్రధానంగా 3 బైపాస్ రోడ్లు నిర్మించాల్సిన అవసరముందని ఆమె పేర్కొన్నారు. అందులో భాగంగా తొలుత, నిజామాబాద్ - ధర్మపురి మీదుగా వెళ్లే 63వ నెంబర్ జాతీయ రహదారిపై చల్గల్, పోలాస మధ్య బైపాస్ రోడ్డు నిర్మించాలని కోరారు. అలాగే నిజామాబాద్ - కరీంనగర్ మార్గంలో అంతర్గాం, దారూర్, రాజారాం గ్రామాల మీదుగా బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. జగిత్యాల పట్టణాన్ని అనుసంధానం చేసేలా 63, 563 నెంబర్ జాతీయ రహదారులను కలుపుతూ దారూర్, నర్సింగాపూర్, పోలాస గ్రామాల మీదుగా 3వ బైపాస్ రోడ్డు కోసం ప్రతిపాదనలను కవిత కేంద్ర మంత్రికి అందజేశారు. ఈ 3 బైపాస్ రోడ్లపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని మంత్రిని కోరారు. బైపాస్ రోడ్లతో పాటు పెరిగిన వాహన రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆర్మూరు -జగిత్యాల -రామగుండం రహదారిని 4లేన్ల రహదారిగా విస్తరించాలని కవిత కోరారు.

రుణమాఫీ పథకంపై పంజాబ్ అధ్యయనం

మంత్రి పోచారంతో ఆ రాష్ట్ర ప్రతినిధి బృందం భేటీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిన రుణమాఫీ పథకంపై పంజాబ్ రాష్ట్రం అధ్యయనం చేస్తోంది. అందులో భాగంగా హైదరాబాద్ వచ్చిన ఆ రాష్ట్ర ప్రతినిధి బృందం శుక్రవారం సచివాల యంలో వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డితో ప్రత్యేకంగా సమావేశమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేబినెట్ సబ్‌కమిటీ పర్యవేక్షణలో నాలుగు విడతల్లో రైతుల రుణాలను రద్దు చేశామన్నారు. 2014-15 లో 36 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరుస్తూ రూ.4040 కోట్ల నిధులను విడుదల చేశామన్నారు. అలాగే 2015-16లో మరో 35.30 లక్షల రైతు కుటుంబాలకు రూ.4040 కోట్లు, 2016-17 ఆర్థిక సంవత్సరంలో 35 లక్షల మంది రైతులకు రూ.4025 కోట్లు, 2017-18 ఆర్థిక సంవత్సరంలో మిగిలివున్న మరో 35 లక్షల రైతు కుటుంబాలకు రూ.3999 కోట్లు విడుదల చేసి ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నట్లు పోచారం వివరించారు. అనంతరం పంజాబ్ రాష్ట్ర ప్రతినిధి బృందం తెలంగాణ వ్యవసాయశాఖ కార్యదర్శితోనూ, వివిధ బ్యాంకుల ప్రతినిధులతోనూ చర్చించి మరిన్ని వివరాలు తెలుసుకున్నారు. ఈ సమావేశంలో పంజాబ్ వ్యవసాయ, సహకారశాఖ అదనపు ముఖ్య కార్యదర్శి డీపీరెడ్డి, ఆ శాఖ కమిషనర్ బల్వీందర్ సింగ్, సహకార బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్ ఎస్‌కే బాటిష్, ఆర్థిక శాస్త్రవేత్త డాక్టర్ సుఖ్‌పాల్ సింగ్, పంజాబ్ వ్యవసాయ వర్సిటీ ఉన్నతాధికారులు ఉన్నారు.

కమల సారథి రామ్‌మాధవ్?



(మొదటిపేజీ తరువాయి)

రామ్‌మాధవ్ 1981 నుంచి రాష్ట్రీయ స్వయం సేవక్‌లో పూర్తిసమయపు వాలంటీర్‌గా ఉన్నారు. ఆర్ఎస్ఎస్‌లో ఆయన పలుకీలక పదవుల్ని నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ ప్రచురించే ఇంగ్లీష్ పత్రిక ప్రజ్ఞాభారతి, హిందీ పత్రిక భారతీయ ప్రజ్ఞలకు ఆయన సంపాదకుడిగా వ్యవహరించారు. ఆర్ఎస్ఎస్ స్పాన్సర్ చేసిన అనేక ప్రచురణలకు ఆయన సుమారు 20ఏళ్ళ పాటు వార్తా విశేషాలందించారు. 2003 నుంచి 2014వరకు ఆర్ఎస్ఎస్ అధికార ప్రతినిధిగా పని చేసిన ఆయన 2014 నుంచి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శుల్లో ఒకరుగా ఉన్నారు.

మోడీ ప్రధాని అయ్యేందుకు వ్యూహరచన చేసిన బృందంలో రామ్‌మాధవ్ ఒకరు. ప్రధానిగా మోడి ప్రమాణస్వీకారోత్సవాన్ని కూడా రామ్‌మాధవ్ సూచనలు, సలహాలకు అనుగుణంగానే నిర్వహించారు. కామన్‌వెల్త్ దేశాల అధినేతల్ని ఈ ఉత్సవానికి ఆహ్వానించడం కూడా రామ్‌మాధవ్ ఆలోచనల్లో భాగమే. జమ్మూకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో రామ్‌మాధవ్ కీలకంగా వ్యవహరించారు. ఆ రాష్ట్రంలో పీడీపీ-బీజేపీల మధ్య పొత్తు కుదర్చడంలో కూడా ఆయనే కీలకం. జమ్మూకాశ్మీర్‌లో బీజేపీ అనుకూల ప్రభుత్వ ఏర్పాటు ఆయన చొరవ వల్లే సాధ్యమైంది. ఆ తర్వాత అసోం ఎన్నికల్లోనూ రామ్‌మాధవ్ చక్రం తిప్పారు. మణిపూర్ ఎన్నికల్లోనూ పార్టీ తరపున బాధ్యతలు నిర్వర్తించారు. మోడి విదేశీ పర్యటనల్లో కూడా రామ్‌మాధవ్‌దే ప్రధానపాత్ర. ఆయన తొలిసారిగా అమెరికా పర్యటనకు బయలుదేరే వారం రోజుల ముందే రామ్‌మాధవ్ ఆ దేశానికెళ్ళారు. అక్కడున్న భారతీయులతో రెండు దఫాలు సమావేశాలు జరిపారు. మోడికి భారతీయుల ఆహ్వానం నుంచి భారీ బహిరంగసభకు లక్షలాది మంది భారతీయులు పాల్గొనడం వరకు అన్నింటిని ఆయనే వ్యూహాత్మ కంగా నిర్వహించారు. ఆ తర్వాత చైనా పర్యటనలోనూ రామ్ మాధవ్ వ్యూహాలకే మోడి ప్రాధాన్యతనిచ్చారు. ఆఫ్ఘనిస్తాన్ పునర్నిర్మాణానికి భారత్ ఆర్థికసాయం చేయడం, ఇటీవల మంగోలియాకు భారీ రుణం ప్రకటించడం వంటివన్నీ రామ్‌మాధవ్ ఆలోచనలకు అనుగుణంగా మోడి తీసుకున్న నిర్ణయాలే.

రామ్‌మాధవ్‌ను పార్టీ జాతీయాధ్యక్షుడిగా నియమిస్తే దక్షిణాదిన పార్టీ పటిష్టతకు వీలేర్పడుతుందని మోడి, షా బృందం భావిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా తెలుగురాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడుల్లో కూడా పార్టీ ఎక్కువ సంఖ్యలో ఎంపీ సీట్లు పొందగలుగుతుందని వీరు విశ్వసిస్తున్నారు. అవసరమైతే ప్రాంతీయ పార్టీలతో పొత్తు కుదర్చడంలో రామ్‌మాధవ్ మంచిదిట్ట. గతంలో దక్షిణాదికి చెందిన బంగారు లక్ష్మణ్, వెంకయ్యానాయుడులు పార్టీ జాతీయాధ్యక్షులుగా పనిచేసినా అప్పటికి పార్టీకి ఇంతటి ప్రాభవం లేదు. దీంతో దక్షిణాదిన బీజేపీ పుంజుకోలేక పోయింది. కాగా ఇప్పుడు ఉత్తరాదిన బీజేపీ పటిష్టంగా మారింది. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ బీజేపీని ఏ విధంగానూ అందుకోలేకపోతోంది. 2019లోగా జరిగే అన్ని అసెంబ్లీ ఎన్నికల్లో సొంతంగా లేదా స్థానిక పార్టీలతో పొత్తెట్టుకునైనా అన్ని రాష్ట్రాల్లో బీజేపీ అనుకూల ప్రభుత్వాల్ని ఏర్పాటు చేయాలన్న లక్ష్యాన్ని ఇప్పటికే పార్టీ రామ్‌మాధవ్‌కు నిర్దేశించింది. ఈ దిశగా ప్రయత్నిస్తున్న రామ్‌మాధవ్‌ను నేరుగా అధ్యక్ష పదవిలో కూర్చోబెడితే మరిన్ని ప్రయోజనాలు ఉంటాయన్నది అధిష్టాన ఆలోచనగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి చెందిన రామ్‌మాధవ్ బీజేపీ జాతీయాధ్యక్షుడయ్యే అవకాశాలు మెరుగౌతున్నాయి.

జన్మభూమి కమిటీల రద్దుకు ప్రసంశలు



అమరావతి, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి: గత మూడేళ్ళలో తీసుకున్న అనేక పొరపాటు నిర్ణయాల్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం పునఃసమీక్షించడం విమర్శకుల ప్రశంసల్ని అందుకొంటోంది. జన్మభూమి కమిటీల్ని రద్దు చేయాలన్న నిర్ణయం అందర్నీ ఆకట్టుకుంటోంది. జన్మభూమి కమిటీలు సమాజంలో సమాంతర వ్యవస్థను నడుపుతున్నాయి. వృద్ధులు, వికలాంగులకిచ్చే పింఛన్ల నుంచి పేదలకు మంజూరుచేసే ఇళ్ళు, రేషన్‌కార్డులు, స్థలాల వరకు అన్నిట్లోనూ ఇవి వేలెడు తున్నాయి. జన్మభూమి కమిటీ సభ్యుల సిఫా ర్సుల మేరకే సంక్షేమ కార్య క్రమాల్ని ప్ర భుత్వం అమలు చేస్తోంది. దీన్ని ఆసరాగా చేసుకుని ఈ కమిటీలు ప్రజాస్వా మ్యయుతం గా గెలుపొందిన స్థానిక సంస్థల ప్రతినిధులపై పెత్తనాలు చేస్తున్నారు. అధికారులు, కాంట్రాక్టర్ల నుంచి పెద్దెత్తున మామూ ళ్ళు వసూలు చేస్తున్నా రన్న ఆరోపణలకు గురయ్యారు. ఈవ్యవస్థ కారణంగానే ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదార్లకు చేరడంలేదన్న విమర్శలున్నాయి. పైగా వీరికారణంగా ప్రభుత్వ ప్రతిష్ట మంటగలుస్తోంది. వీరి అవినీతి, అనైతిక చర్యలు అధినేతపై కూడా ప్రభావం చూపించేస్థాయికి చేరాయి. గతంలో చంద్రబాబు ముఖ్య మంత్రిగా ఉన్నప్పు డు కూడా పనికి ఆహారపథకమంటూ ఓ భారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అప్పటికి గోడౌన్లనిండా బియ్యం నిల్వలు మురిగి పోయాయి. ఈ బియ్యాన్ని ఉచితంగానైనా సరే పేదలకిచ్చేయమంటూ సర్వోన్నత న్యాయస్థానం ఉత్తర్వులిచ్చింది. అయితే ఉచితంగా పంపిణీ చేస్తే విలువుండదని భావించిన రాష్ట్ర ప్రభుత్వం పనికి ఆహారపథకంలో ఈ బియ్యం పంపిణీని మొదలెట్టింది. వీటి నిర్వహణాబాధ్యత తెలుగుదేశం ఎమ్మెల్యేలు, నాయకులకప్పగించింది. దీంతో ప్రజలంతా చూస్తుండగానే వారి కళ్ళముందే లారీలకు లారీల బియ్యం దారితప్పాయి. దీంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇదోపెద్ద వివాదంగా మారిం ది. లోకా యుక్తలో వాజ్యాలు నడిచాయి. కొం దరు సిట్టింగ్ ఎమ్మె ల్యేలపై కేసులెట్టారు. పలువుర్ని అవినీతి ఆరోపణల కింద అదుపులోకి తీసుకున్నారు. ఈ వ్యవ హారం తెలుగుదేశం ప్రతిష్టను మంట గలిపేసింది. ఆ తర్వాత 2004లో జరిగిన ఎన్ని కల్లో ఆ పార్టీని 52సీట్లకే పరిమితం చేసింది. పదేళ్ళ పాటు తెలుగుదేశం ప్రతిపక్షంగానే మిగిలేందుకు ఇది కూడా దోహదపడింది. ఇప్పటికైనా జన్మభూమి కమిటీల ముసుగులో కొందరు పార్టీ కార్యకర్తలు, నాయ కులు చేస్తున్న అరాచకాలు, అకృత్యాలు పార్టీ దీర్ఘకాలిక ప్రయో జనాలకు విఘాతాలు కలిగిస్తాయని బాబు గుర్తించడం.. ఆ పార్టీ అభిమానుల్నే కాదు.. సామాజిక నిపుణుల్లో కూడా ఉత్సాహం పెంచుతోంది. జన్మభూమి కమిటీల్ని రద్దు చేయడమే కాకుండా ఇంతకాలం వారు చేసిన అవినీతిపై సమగ్ర దర్యాప్తునకు కూడా ప్రభుత్వం ఆదేశాలు జారీచేయాలని వీరు డిమాండ్ చేస్తున్నారు.

ఓటు హక్కుకు రెట్టింపు విలువ

(మొదటిపేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణ బిల్లు ముసాయిదాను రూపొందించనుంది. అనంతర ఆ ముసాయిదా రాష్ట్రానికి కూడా రానుంది. అసెంబ్లీలో ప్రవేశపెట్టి చర్చించి, ఆమోదించి రాష్ట్ర గవర్నర్ ద్వారా కేంద్ర హోంశాఖకు పంపాల్సి ఉంటుంది.

ఒక్కసారి గెలిస్తే ఐదేళ్ళు ఢోకాలేదన్న ప్రజా ప్రతినిధుల డొంక కదిలే విధంగా కేంద్ర ప్రభుత్వం ఈ సంచలనాత్మక నిర్ణయం తీసుకుంది. ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నా, లేకున్నా పదవి అనుభవిస్తానన్న ఎమ్మెల్యేల అభిప్రాయాన్ని కూకలివేళ్ళతో పెకిలించబోతున్నారు. పనులు చేసినా, చేయకున్నా అడిగే నాధుడే లేడన్న భావనను ప్రజల్లోంచి తొలగించనున్నారు. వాగ్దానాలు నిలబెట్టుకోక పోయినా, క్షేత్రస్థాయిలో సమస్యలు పట్టించుకోకపోయినా వోట్లేసి ఎన్నుకున్న ఆ ప్రజలే దించేసే అధికారం కల్పించబోతున్నారు. ఎప్పుడో ఓసారి నియోజకవర్గానికి వెళ్ళి అలా కనిపించి ఇలా వస్తే సరి.. మళ్ళీ జనంతో అవసరం వచ్చేది ఐదేళ్ళకు కదా.. అప్పుడు చూసుకోవచ్చు.. అనే ధీమాతో ఉంటున్న ప్రజా ప్రతి నిధులకు వెన్నులో వణుకు పుట్టే విధంగా, వందశాతం ప్రజా సేవకునిలా, ప్రభుత్వోద్యోగిలా పనిచేసే రోజులు త్వర లోనే రానున్నాయి. డబ్బులు వెదజల్లి ఎన్నికల్లో గెలిచిన కొందరు ఎమ్మెల్యేలు నియోజకవర్గం అభివృద్ధిపై నిర్లక్ష్యం గా వ్యవహరిస్తే తిరిగి దించేసే విశిష్టమైన అధికారం ప్రజలకు కల్పించాలని కేంద్రంలోని నరేంద్రమోడీ సర్కారు నిర్ణయించింది. ప్రజాకాంక్షకు విరుద్ధంగా వ్యవహరించే ప్రజాప్రతినిధులను రీకాల్ ఆప్షన్ దించేసే అధికారాన్ని కల్పించాలన్న సంచలనాత్మక ప్రతిపాదన ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతోంది.

ముందుగా లోక్‌సభలో ప్రైవేటు బిల్లు


ప్రజలచే ఎన్నుకోబడిన ఎమ్మెల్యేలు సరిగా పని చేయకపోతే.. వారిని రీకాల్ చేసే అధికారం ఓటేసిన ప్రజలకు ఉండాలన్న ప్రతిపాదనపై ముందుగా లోక్‌సభలో ప్రైవేట్ బిల్లు ప్రవేశపెట్టనున్నట్టు అధికార పార్టీకి చెందిన ఒక పార్లమెంట్ సభ్యుడు ఇటీవలే ఢిల్లీలో ప్రకటించారు. నియోజకవర్గాల్లో పని చేయని ఎమ్మెల్యేలను తొలగించే అధికారం ఓటర్లకే ఇవ్వాలనేది కేంద్ర ప్రభుత్వ సంకల్పమని కూడా వెల్లడించారు. అందులో భాగంగానే.. పీపుల్స్ రిప్రజెంటేటివ్స్ యాక్ట్ 1951 చట్టానికి 2016లో పార్లమెంట్ సభ్యులు సవరణలు ప్రతిపాదించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతం రైట్ టు రీకాల్‌ను ఓ ప్రైవేట్ బిల్‌గా పెట్టబోతున్నట్టు పేర్కొన్నారు.

రీకాల్ ఎలా చేస్తారంటే...

ఈ బిల్లు చట్టంగా మారితే.. సంబంధిత ఎమ్మె ల్యేపై ఆ నియోజకవర్గంలో ఓటరుగా నమోదైన పౌరుడు నేరుగా శాసన సభాపతికి పిటిషన్ పెట్టుకునే అవ కాశం ఉంటుంది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టాలని ఎలక్షన్ కమిషన్‌కు సూచిస్తారు స్పీకర్. విచారణలో పిటిషన్ వ్యక్తి చెప్పిన విషయాలు వాస్తవమని నిర్ధారణ అయితే... ఈసీ సంబంధిత ఎమ్మెల్యేపై రీకాల్ ఓటింగ్ నిర్వహిస్తుంది. అం దులో 75శాతం మంది స్థానిక ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఓటు వేస్తే, అతని పదవి ఊడిపోవడం గ్యారంటీ. ఈ బిల్ సామాన్యుడికి దక్కనున్న బ్రహ్మాస్త్రం అంటున్నారు ప్రజా స్వామ్యవాదులు, రాజ్యాంగ నిపుణులు. రైట్ టు రీకాల్ బిల్ చట్టం అమల్లోకి వస్తే... ఎన్నికైన ఎమ్మెల్యే రెండేళ్ళలోపే పదవి కోల్పోయినా ఆశ్చర్యం లేదు. అందలం ఎక్కించిన ఓటరుకు అగాధంలోకి నెట్టే అధికారం కూడా రాబోతోంది.

మంత్రి తుమ్మలకు అస్వస్థత

ఆరోగ్యపరిస్థితిపై సీఎం కేసీఆర్ ఆరా



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరారు. గత రెండురోజులుగా జ్వరంతో ఉన్న ఆయనకు శుక్రవారం రక్తపువాంతులు కావడంతో వ్యక్తిగత సిబ్బంది సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో చేర్చారు. వెంటనే ఐసియులో చేర్చుకుని వైద్యులు ప్రత్యేక చికిత్సను అందించారు. మంత్రి ఆరోగ్య పరిస్థితికి సంబంధించి యశోద ఆస్పత్రి వైద్యులు డాక్టర్ ఎంవి రావు హెల్త్ బులెటిన్ విడుదల చేశారు. అల్సర్ వల్ల రక్తపువాంతులు జరిగాయని, దాంతో బిపి తగ్గించి చికిత్స చేశామని, బ్లీడింగ్‌ను ఆపామని వైద్యులు ప్రకటించారు. ఇపుడు ఎలాంటి సమస్యాలేదని శుక్రవారం సాయంత్రం ప్రకటించారు. అయితే మళ్ళీ బ్లీడింగ్ అయ్యే అవకాశం ఉన్నందున మరో రెండు రోజులు ఐసియులో ఉంచి చికిత్సను అందిస్తామని, ఆయనకు ఎలాంటి ప్రమాదం లేదన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ మంత్రి తుమ్మల ఆరోగ్య పరిస్థితిని, అందిస్తున్న వైద్య సేవల గురించి వాకబు చేశారు. మెరుగైన వైద్యసేవలందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. విషయం తెలిసిన వెంటనే ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వరరెడ్డి ఆస్పత్రిని సందర్శించి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరోగ్యస్థితిపై వైద్యులను వాకబుచేశారు. తర్వాత మంత్రి తుమ్మలతోనూ మాట్లాడారు. ఎమ్మెల్యేలు పువ్వాడ అజయ్, జలగం వెంకట్రావు తదితరులు ఆస్పత్రిని సందర్శించి తుమ్మల ఆరోగ్యపరిస్థితిని తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఒకే రకం పంటలేయొద్దు

కొత్త స్టార్టర్లు ఇస్తాం



మేడ్చల్ జిల్లా కేశవరం బహిరంగ సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

(మొదటిపేజీ తరువాయి)

విన్నపాలను ఆలకించిన కేసీఆర్ మాట్లాడుతూ, లక్ష్మాపూర్ గ్రామం లక్ష్మీదేవిలా కళకళలాడాలని కోరారు. టీవీలవల్ల జనం ఆగమవుతున్నారని, పట్టణాల్లోని ధనవం తులు కూడా గ్రామాల్లో ఫామ్‌హౌస్‌లు కట్టుకుంటుంటే గ్రామస్తులు మాత్రం పట్టణాల వెంట పడుతున్నారని అన్నారు. లక్ష్మాపూర్ గ్రామాభివృద్ధికి అప్పటికప్పుడు రూ.15 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. దోభీఘాట్, గ్రామ కమ్యూనిటీ హాల్, వైకుంఠధామం, బస్‌షెల్టర్ వంటి అభివృద్ధి కార్యక్రమాలను త్వరితగతిన ప్రారంభించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఏ పనికి ఎంతవు తుందో తెలిపి మరీ ఆ పనులకు నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. నిజామాబాద్ జిల్లా అంకాపూర్ తరహాలో లక్ష్మాపూర్ గ్రామం సైతం ఆదర్శంగా నిలవాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో పంటల కాలనీలు రావాలని చెప్పారు. రైతు సమాఖ్యపై ఆయన ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో ఏవి, ఎంత తింటారు? ఎక్కడ లెక్కలు లేవు. మనం ఎంత తింటాం.. ధర్మంమీద బతుకు తున్నాం.. ఎంత పంట పండించాం అని లెక్క తెలియాలి. ప్రపంచ వ్యాప్తంగా రైతుల బాధలు ఒకేలా ఉన్నాయి. 200 ఏళ్ళ కిందనే అభివృద్ధి చెందిన యూరోపియన్ దేశాల్లోనూ రైతులేమీ మంచిగ లేరు.. బీబీసీ లండన్ ఛానల్‌లో చూశాను. ఆలుగడ్డలకు మద్దతు ధర లేక వేలటన్నులు రోడ్లపై పడేశారు. రైతులు సంఘటితమయ్యే వేదికలు లేకనే ఇలా జరుగుతోంది. ఇండియాలోనే కాదు ప్రపంచంలోనే మొట్టమొదటి సారిగా రైతులను వ్యవస్థీకృతం చేయబోతున్నాం. రాష్ట్ర సమాఖ్య ఉండాలి. ఇందుకోసం ఈ సమాఖ్యకు రూ.500 కోట్లు ఇస్తున్నాం. రూ.10వేల కోట్లు గ్యారంటీ ఇచ్చి పంట కొననున్నాం. అలా రైతుకు మద్దతు ధర లభించి లాభాలు గడిస్తారు. దళారుల ఆట కట్టించవచ్చని కేసీఆర్ చెప్పారు. లక్ష్మాపూర్ గ్రామంలో రూ.75 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మిస్తామన్నారు. రూ.30 లక్షలతో మహిళా వేదిక వస్తుందన్నారు. ఈ గ్రామాభివృద్ధిపై శనివారం మధ్యాహ్నం జీవో విడుదల చేస్తామని సీఎం ప్రటించారు. పదిహేను రోజుల్లో కేశవరం రెవెన్యూ రికార్డులన్నీ మ్యూటేషన్ జరిగి తీరాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ మ్యూటేషన్‌లో మార్పులు తీసుకువస్తామని చెప్పారు. రాష్ట్రంలోని మూడు జిల్లాల్లో 24 గంటల పాటు వ్యవసాయ రంగానికి నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని అన్ని జిల్లాల్లోనూ ఇదే తరహాలో వ్యవసాయానికి కరెంట్ ఇస్తామని కేసీఆర్ చెప్పారు. ఇప్పుడున్న ఆటో స్టార్టర్లతో నష్టపోతున్నామని వాటి ద్వారా నీళ్ళు, విద్యుత్ వృథా అవుతోందని చెప్పారు. అందుకే వాటిని తొలగించాలని గ్రామ రైతులను కోరారు. వాటి స్థానంలో కొత్త స్టార్టర్లను ఇస్తామన్నారు. ఈ విషయాన్ని వివరంగా టీవీల ద్వారా ప్రకటిస్తామని పేర్కొన్నారు. వచ్చే ఏడాది జూన్ నాటికి పాములపర్తి ప్రాజెక్టుకు నీళ్ళు వస్తాయని, మేడ్చల్ నియోజకవర్గంలోని 374 చెరువులు నింపుతామని ఆయన చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా శామీర్‌పేట మండలంలోని చెరువులు నింపుతామని చెప్పారు. నాగిశెట్టిపల్లి, ముచ్చింతలపల్లి రోడ్లు, డ్రైనేజీ, లైబ్రరీ, గ్రామ పంచాయితీ భవనాలు, మార్కెట్ యార్డు, అంగన్‌వాడీ భవనాలు కావాలని అడిగారని ఆయన చెప్పారు. గ్రామస్తులు రూ.10 కోట్ల 75 లక్షలు అడుగుతున్నారని కానీ తాను రూ.12 కోట్లను ఇస్తున్నానని ప్రకటించారు. అయితే హరితహారంలో భాగంగా కేశవరం గ్రామంలో ప్రతి ఒక్కరూ ఇంటికి ఆరు మొక్కల చొప్పున నాటాలని ఆయన పిలుపునిచ్చారు. భవిష్యత్తులో మంచిగా బతకాలంటే చెట్లు నాటాలని కోరారు. త్వరలో రైతులకు కొత్తస్టార్టర్లను సరఫరా చేస్తామని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని సంవత్సరాలైనా గ్రామాల్లో శ్మశానవాటికలు లేవని అందుకే ప్రతి గ్రామంలో వైకుంటధామం పేరుతో స్మశానవాటికలను నిర్మిస్తామన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళ ఆలోచన ఎక్కడా లేదని అర్హులైన వారందరికీ ఇళ్ళను నిర్మించి ఇస్తామన్నారు. గ్రామస్తులు అడిగిన అన్ని కోరికలను తాను తీరుస్తున్నానని తాను అడిగే దాన్ని కూడా గ్రామస్తులు నెరవేర్చాలని కోరారు. మనం ఏదైతే కోల్పోయామో దాన్ని తిరిగి రాబట్టుకోవాలని అడవులను నరికేశామని, మొక్కలు సరిగా పెంచలేదని దీంతో ఎండలు పెరిగి పోయాయని కేసీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. హరితహారం కార్యక్రమం ఎవరికోసమో కాదని మన జీవితాల కోసమని చెప్పారు. ప్రతి ఇంటికి ఆరు మొక్కలను నాటితే ఆ కుటుంబానికి రెండు పాడి గేదెలను ఉచితంగా ఇస్తామని వాటిని వారే కొనుగోలుచేసి ఎంతకు కొన్నారే చెబితే అంత మొత్తాన్ని రెవెన్యూ అధికారులు చెల్లిస్తారని ఆయన పేర్కొన్నారు. వారంలో ఒకరోజు గ్రామంలో పవర్‌డేను నిర్వహించుకుని ఆ రోజు గ్రామస్తులంతా కలిసి కరెంట్ సమస్యను పరిష్కరించుకోవాలని కోరారు. లక్ష్మాపూర్ గ్రామానికి వంద డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళు మంజూరు చేస్తున్నట్టు సీఎం ప్రకటించారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి ఊపర్ షేర్వానీ అందర్ పరేషానీ తరహాలో ఉందని కేసీఆర్ అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ రైతాంగం ఘోరంగా దెబ్బతిందని వాపోయారు. బోర్లువేసి వేసి బొక్కబోర్లా పడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. రైతులు ఒకేరకం పంటలు కాకుండా క్రాప్ కాలనీలుగా విభజించుకోవాలని కోరారు. రైతులు వేసిన పంటకు వారే ధర చెప్పే పరిస్థితి రావాలని కోరారు. రైతులు దోపిడీకి గురికాకుండా ఉండాలంటే గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర రైతు సమాఖ్యలు ఏర్పడాలని స్పష్టంచేశారు. చెరువులను నింపి ఆ నీటిని పంటపొలాలకు విడుదల చేశాక మస్తుగా దావత్ చేసుకుందామని ఆయన లక్ష్మాపూర్ గ్రామస్తులకు చెప్పారు. గజ్వేల్‌తో సమానంగా మేడ్చల్‌ను అభివృద్ధి చేస్తామని కేసీఆర్ చెప్పారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రక్షాళన తీసుకువస్తామని, రెవెన్యూ శాఖను పారదర్శకంగా మారుస్తామని చెప్పారు. పర్యావరణం దెబ్బతింటే ఎన్ని ఆస్తులున్నా దండగేనని కోతులు గ్రామాల్లోకి వస్తున్నాయని అందరం చెట్లను నాటితే పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని చెప్పారు. త్వరలోనే రైతులు లంచాలిచ్చే పరిస్థితి నుంచి బయటకు రావాలి. ఆఫీసుల చుట్టూ రైతులు చక్కర్లు కొట్టే అవకాశం లేకుండా చేస్తున్నాం. అందుకే రెవెన్యూ కార్యాలయాలను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తున్నామని చెప్పారు. సమైక్య రాష్ట్రంలో మనకు రావలసిన నీటివాటా రాక అనేక ఇబ్బందులు పడ్డామని ఇకనుంచి పంటపొలాలకు పుష్కలంగా నీరు అందుతుందని కేసీఆర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి, మల్కాజ్‌గిరి ఎంపి మల్లారెడ్డి, ఇన్‌ఛార్జి కలెక్టర్ రఘునందన్‌రావు, జాయింట్ కలెక్టర్ ధర్మారెడ్డి, ఎమ్మెల్సీ షమ్మీపూర్ రాజు, మేడ్చల్ ఎమ్మెల్యే సుదీర్‌రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజాక్షేత్రంలోకి కేసీఆర్

రాష్ట్ర పునర్నిర్మాణానికి ప్రజాభిప్రాయ సేకరణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన వారందరికీ అందాలన్న లక్ష్యంతో తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ప్రజా క్షేత్రంలోకి వెళ్తున్నారు. అందులో భాగంగానే క్షేత్రస్థాయి పర్యటనలకు షెడ్యూల్ ఖరారు చేసుకున్నారు. ప్రతిరోజూ ఏదో ఒక జిల్లాలో రెండు గ్రామాలను సందర్శించి స్థానిక ప్రజల బాగోగులు స్వయంగా తెలుసుకోవాలని నిర్ణయించారు. ప్రతిపక్షాలు పనిగట్టుకుని ప్రభుత్వంపై బురదజల్లుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో తాను ప్రజా క్షేత్రంలోకి వెళ్తానంటూ ఇటీవలే ప్రకటించిన కేసీఆర్ శుక్రవారం రంగారెడ్డి, సిద్ధిపేట జిల్లాల్లోని కొన్ని గ్రామాలను సందర్శించారు. ప్రజా సమస్యలు, వాటి పరిష్కారానికి ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలను వెల్లడిస్తున్నారు. ఇందుకు సంబంధించి ముందుగా నిర్ణయించుకున్న కార్యాచరణ ప్రణాళిక ప్రకారం మొదటి దశలో జిల్లా కేంద్రాలు, రెవెన్యూ డివిజనల్ కేంద్రాల్లో పర్యటించాలనుకున్నప్పటికీ గ్రామస్థాయి నుంచి మొదలుపెట్టారు.

ఇది ఏడాది పాటు నిరంతరంగా కొనసాగే కార్యక్రమం అయినందున ప్రొటోకాల్ అధికారులు అన్ని సౌకర్యాలతో కూడిన ప్రత్యేక బస్సును ఏర్పాటు చేశారు. ఏడాది తర్వాత రెండో విడతగా చేపట్టే క్షేత్రస్థాయి పర్యటనల్లో మండల కేంద్రాల్లో పర్యటించనున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. అవసరమైతే జిల్లా, డివిజన్ కేంద్రాల స్థాయిలో భారీ బహిరంగసభలు ఏర్పాటు చేసి ప్రజలతో మమేకమయ్యేందుకు కేసీఆర్ భవిష్యత్ వ్యూహాలను రచిస్తున్నారు. తెలంగాణాను సస్యశ్యామలం చేయడానికి ఎంచుకున్న లక్ష్యాలను, ఇప్పటివరకు సాధించిన ఫలితాలను వివరించనున్నారు. వివిధ అంశాలను రాజకీయం చేస్తూ లబ్ధి పొందేందుకు ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేస్తున్న నేపథ్యంలో తానే స్వయంగా ప్రజల్లోకి వెళ్ళి వాస్తవాలు వెల్లడించేందుకు సిద్ధమయ్యారు. తెలంగాణ పునర్‌నిర్మాణంలో భాగంగా చేపట్టిన ప్రతిష్టాత్మక కార్యక్రమాలతో రాష్ట్రానికి చేకూరే ప్రయోజనం, తద్వారా పేద, మధ్యతరగతి వర్గాలు, ముఖ్యంగా రైతులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా చేకూరే లబ్ధిని వెల్లడించబోతున్నారు. అలాగే భావితరాల సంక్షేమానికి శాశ్వత ప్రాతిపదికన చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను గ్రామగ్రామాన ప్రకటించనున్నారు.

సుపరిపాలనకు, అణగారిన వర్గాల అభ్యున్నతికి ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించి వాటికి అనుగుణంగానే రోడ్‌మ్యాప్ సిద్ధం చేసుకుని ముందడుగు వేయాలన్నది కేసీఆర్ ఆలోచన. పేరుకుపోయిన సమస్యలను వెలికితీసి వాటి పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టనున్నారు. రాజకీయ, వ్యక్తిగత ప్రయోజనాల కోసం ప్రతిపక్ష కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు దిగజారుతున్న తీరును ప్రజల్లో ఎండగట్టాలన్న ఉద్దేశంతో ప్రజాక్షేత్రంలోకి వెళ్ళాలని నిర్ణయించుకున్నట్లు అధికారపార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇలాంటి పర్యటనలతో ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేయడంతో పాటు 2019 ఎన్నికల నాటికి మరింత అభిమానం చూరగొనాలన్నది ప్రభుత్వాధినేత వ్యూహాత్మక నిర్ణయం.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ


శనివారం 5 ఆగస్టు 2017

మంచిమాట ఒక మనిషి వ్యక్తిత్వాన్ని అతని సంభాషణ ద్వారానూ, సమయపాలన ద్వారానూ సులువుగా తెలుసుకోవచ్చు. ● నాథనియల్ ఎమ్మన్స్

వలసలకు వ్యతిరేకంగా ఒక్క అమెరికాలోనే కాక, ఆస్ట్రేలియా, యూరప్ దేశాల్లో పెద్ద చర్చ జరుగుతోంది. యూరోపియన్‌యూనియన్ (ఈయూ) నుంచి బ్రిటన్ వైదొలగడానికి (బ్రెగ్జిట్‌కి) ప్రధాన కారణం వలసలు పెరిగి పోవడమే.వీటిని అరికట్టకపోతే తమ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందన్న భయాందోళనలు పాలకుల్లో బయలుదేరాయి. వీటినిదృష్టిలో ఉంచుకునే ట్రంప్ ఏడు మాసాల క్రితం ఎన్నికల ప్రచారం సందర్భంగా తానుఅధికారంలోకి వస్తే వలసలను నియంతిస్తానంటూ వాగ్దానం చేశారు. హెచ్-1బీ వీసాల తగ్గింపు వల్ల ఎక్కువగా నష్టపోయేది భారత్‌కి చెందిన ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) నిపుణులే.ఈ విషయమై ప్రధానమంత్రి నరేంద్రమోడీ ట్రంప్‌ని వివిధ సందర్భాల్లో కలుసుకున్నప్పుడూ,మోడీ అమెరికాలో పర్యటించినప్పుడు ప్రత్యేకంగా ప్రస్తావించారు.

నూతన వలస విధానంతో భారతీయులకు మేలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వలసలపై తాను చేయదల్చుకున్నది క్రమంగా అమలులో పెడుతున్నారు. అక్రమ వలసలను నిరోధించడానికి ఆయన ఏడు ముస్లిం దేశాల పౌరుల ప్రవేశంపై నిషేధాన్ని (ట్రావెల్ బ్యాన్‌ని) విధిస్తూ జారీ చేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌ని కిందికోర్టులు కొట్టివేయగా,నిషేధిత దేశాలను ఆరుకి కుదించి కొత్త జాబితాతో రెండో ఉత్తర్వును జారీ చేశారు.దానిని కూడా కోర్టులు కొట్టి వేశాయి. అప్పుడు సుప్రీంకోర్టుకు వెళ్ళి కొన్ని మినహాయింపులతో ట్రావెల్ బ్యాన్‌ని ఆమోదించేందుకు సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించింది.వలసలకు వ్యతిరేకంగా ఒక్క అమెరికాలోనే కాక,ఆస్ట్రేలియా, యూరప్ దేశాల్లో పెద్ద చర్చ జరుగుతోంది. యూరోపియన్‌యూనియన్ (ఈయూ) నుంచి బ్రిటన్ వైదొలగడానికి (బ్రెగ్జిట్‌కి) ప్రధాన కారణం వలసలు పెరిగి పోవడమే.వీటిని అరికట్టకపోతే తమ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందన్న భయాందోళనలు పాలకుల్లో బయలుదేరాయి. వీటినిదృష్టిలో ఉంచుకునే ట్రంప్ ఏడు మాసాల క్రితం ఎన్నికల ప్రచారం సందర్భంగా తానుఅధికారంలోకి వస్తే వలసలను నియంతిస్తానంటూ వాగ్దానం చేశారు. హెచ్-1బీ వీసాల తగ్గింపు వల్ల ఎక్కువగా నష్టపోయేది భారత్‌కి చెందిన ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) నిపుణులే.ఈ విషయమై ప్రధానమంత్రి నరేంద్రమోడీ ట్రంప్‌ని వివిధ సందర్భాల్లో కలుసుకున్నప్పుడూ,మోడీ అమెరికాలో పర్యటించినప్పుడు ప్రత్యేకంగా ప్రస్తావించారు.వలసల నియంత్రణను చేపడుతూనే, ప్రతిభగల వారిపై వేటు పడకుండా చూడటానికి కొత్త విధానాన్ని తీసుకుని వస్తున్నట్టు ట్రంప్ ప్రభుత్వం ప్రకటించింది.ఈ విషయంలో విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్,వాణిజ్య శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కూడా అమెరికలో సంబంధిత శాఖ మంత్రులతో చర్చలు జరిపారు.అమెరికాలో ఐటి పరిశ్రమకు ఆటపట్టు అయిన సిలికాన్ వ్యాలీలో పని చేస్తున్న సాఫ్ట్ వేర్ ఇంజనీర్లలో భారతీయులే అత్యధికం. వారిలోనూ తెలుగువారి సంఖ్య ఎక్కువ. అందువల్ల వలసల విధానంలో ట్రంప్ తెచ్చే సంస్కరణల వల్ల వెంటనే నష్టపోయేది మన ఐటి ఇంజనీర్లే. ఇదే విషయాన్ని అమెరికన్ ప్రభుత్వాధినేతలకు గట్టిగా వివరించడంలో ప్రధాని మోడీ,ఆయన కేబినెట్ సహచరులు నిర్విరామంగా సాగించిన యత్నాలు,ఒత్తిడులు ఫలించాయి. దీంతో రిఫార్మింగ్ అమెరికన్ ఇమ్మిగ్రేషన్ ఫర్ స్ట్రాంగ్ ఎంప్లాయిమెంట్ (రైజ్) పేరిట కొత్త చట్టాన్ని రూపొందించారు.దీనికి ట్రంప్ ఆమోదం తెలిపారు. ఇది అమలులోకి వస్తే, ప్రతిభావంతులు,ఉన్నత విద్యావంతులు,సాంకేతిక నిపుణులకు ప్రయోజనం చేకూరుతుంది. అమెరికాలో స్థిరపడేందుకు దరఖాస్తు చేసుకునే ఇలాంటి వారంతా మన దేశానికే చెందిన వారేనని వేరే చెప్పనవసరం లేదు. ప్రతిభకూ, పరిశోధనకూ పట్టం కట్టే విధానం అమెరికాలో మొదటి నుంచి ఉంది. భారత్ నుంచి అమెరికాకు ఉన్నత విద్య కోసం, పరిశోధనల కోసం వెళ్ళిన తొలి తరం వారిలో అత్యధికులు భారతీయులే. వీరిలో కూడా తెలుగువారనేక మందిఉన్నారు. ఉదాహరణకు వైద్యరంగంలో అద్భుతాలు సృష్టించిన డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు మన తెలుగువారే. భీమవరానికి చెందిన ఆయన 75 సంవత్సరాల క్రితమే అమెరికా వెళ్ళి పరిశోధనలు సాగించి కణాల వృద్ధికి దోహదం చేసే విటమిన్‌ని కనుగొన్నారు. హార్వార్డ్ స్కూల్‌లో ట్రోపికల్ మెడిసిన్‌లో చేరి బోద వ్యాధి నిరోధానికి స్ట్రెప్టోమైసిన్ వంటి మందులను కనుగొన్నారు.అలాంటి ప్రతిభావంతులు ఎంతో మందిని అమెరికాలోని వివిధ యూనివర్సిటీలుఆహ్వానించి ఉన్నత పదవులు ఇచ్చాయి కూడా. ట్రంప్ ప్రభుత్వంలో కీలక పదవుల్లో పలువురు ప్రవాస భారతీయులు ఉన్నారు. ఐక్యరాజ్యసమితిలో అమెరికా రాయబారిగా వ్యవహరిస్తున్న నిక్కీ హేలీ భారత సంతతికి చెందిన వారే. కెనడాలో సర్వోన్నత న్యాయస్థానం న్యాయమూర్తిగా భారత సంతతికి చెందిన సిక్కు మహిళ ఇటీవల నియమితులయ్యారు. భారతీయులు ఎక్కడికి వెళ్ళినా తమ ప్రతిభను చాటుకుంటూ ఆయా ప్రభుత్వాల నుంచి గౌరవాలను పొందుతున్నారు.ఇప్పుడు ట్రంప్ ఆమోదించిన కొత్త వలస విధానం వల్ల ప్రతిభ ప్రాతిపదికగా గ్రీన్ కార్డు హోల్డర్లను (అమెరికాలో స్థిరపడే వారిని) ఎంపిక చేస్తారు. ఈ కొత్త వలస విధానం అమలులోకి వస్తే వలసల సంఖ్య బాగా తగ్గుతుంది.అమెరికాకే తొలి ప్రాధాన్యం నినాదంతో ట్రంప్ అధికారంలోకి వచ్చారు. అమెరికాలో ఉద్యోగాలు అమెరికన్లకేనని వాగ్దానం చేశారు. అమెరికాలో ఉద్యోగాలను భారతీయులు,చైనా వారూ కొల్లగొట్టుకుని పోతున్నారంటూ హోరెత్తించే ప్రచారం చేశారు.ఆయన అధికారంలోకి రాగానే విదేశీయుల ప్రవేశానికి ఆంక్షలుంటాయన్న సంగతి అందరికీ తెలుసున్న విషయమేఅయినా, మరీ అంత దూకుడును ప్రదర్శిస్తారని ఎవరూ అనుకోలేదు.అయితే,ట్రంప్ టార్గెట్ మొదటి నుంచి ముస్లిందేశాల మీదనే. ఉగ్రవాద సంస్థలకు చెందిన వారితో సంబంధాలున్న వారిని గుర్తించడం కష్టమవుతున్న కారణంగా ఇస్లామిక్ దేశాల పౌరుల ప్రవేశంపై ఆంక్షలు విధించాలని నిర్ణయించారు.ఆయన ఆలోచన ఒక రకంగామంచిదే అయినా, అలాంటి వారితో పాటు ప్రతిభావంతులకు కూడా నష్టం వాటిల్లుతుందన్న ఆందోళనను మన దేశంతోసహాపలు దేశాలు వ్యక్తం చేశాయి.దాంతో ఆయన పునరాలోచనలో పడి ఈ కొత్త చట్టానికి ఆమోదం తెలిపారు. ఆమాటకు వస్తే అమెరికాయే వలసల దేశం.ట్రంప్ తాత కూడా జర్మనీ నుంచి అమెరికా వచ్చి స్థిరపడ్డారు.ప్రతిభకూ, మెరుగైన సేవలకూ పెట్టింది పేరు అయిన భారతీయ సాంకేతిక నిపుణులకు రైజ్ చట్టం మరింత ప్రయోజనకరమే కానీ, దానివల్ల చేటు జరగదు.



శంకరాజీయం

- శంకర్ రాజ్
సీనియర్ పాత్రికేయుడు

కేరళలో పార్టీల కురుక్షేత్రం



తిరువనంతపురం ఒకప్పుడు కేరళ రాజధానిగానే ప్రసిద్ధి. కొద్ది సంవత్సరాల క్రితం అక్కడి అనంతపద్మనాభస్వామి ఆలయంలో నేలమాళిగల్లో లక్షల కోట్ల రూపాయిల విలువైన బంగారు ఆభరణాలు బయటపడిన తర్వాత దేశంలో అపార స్వర్ణ నిక్షేపాలు గల దివ్యక్షేత్రంగా ఇప్పుడు పేరొందింది. నిజానికి తిరువనంతపురం రాష్ట్ర రాజధాని అన్న పేరే కానీ, హైకోర్టు కూడా లేదు.చెప్పుకోదగిన పెద్ద పరిశ్రమ ఏదీ లేదు. కేరళ సంపదను వృద్ధి చేస్తున్నది ఎర్నాకుళమే.దానినే కోచ్చి అని పిలుస్తారు. బ్రిటిష్ వారి కాలం నుంచి నౌకాయాన వ్యాపారానికి కోచ్చి ప్రసిద్ధి చెందింది. ప్రధానమతాలైన హిందు,క్రైస్తవ, ఇస్లాం సంప్రదాయాలకూ,వాటి ఆరాధనా మందిరాలకూ కేరళ పేరొందింది.అందుకే కేరళను దేవుని రాజ్యంగా పిలుస్తుంటారు.ఈ మూడు మతాల సంప్రదాయాలూ, ఆచారవ్యవహారాలు ప్రజల ను ఏనాడూ విడదీయలేదు. పైగా,ఒకరి పర్వదినాల్లో మరొకరు పాల్గొన డం,పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకోవడం ఆనవాయితీ. ఇందుకు ఉదాహరణలు కోకొల్లలు. అన్నింటికన్నా,మనందరికీ సుపరిచితుడు, అభిమాన గాయకుడైన జేసుదాసును మించిన సర్వమత సమ్మతుడైన వ్యక్తి మరొకరు లేరు. ఆయన పుట్టుక రీత్యా క్రైస్తవుడు అయినప్పటికీ,ఆయన మిత్రులు, అభిమానులు,ఆరాధకులు అంతా హిందువులూ,మహ్మదీయలే.తెలుగులో స్వామి అయ్యప్ప కీర్తనలూ, గీతాలను మృదుమధురంగా ఆలాపించడం ద్వారా ఆయన తెలుగు ప్రజలకు మరింత సన్నిహితుడయ్యారు.కొబ్బరి తోటలకు ఆలవాలమైన కేరళ తెలుగునాట కోనసీమ వాతావరణాన్ని తలపింపజేస్తుంది. కేరళలోని కోవళం బీచ్ అందాలు మాటల్లో వర్ణించలేం.అందుకే అక్కడ నిత్యం ఏదో ఒక చలన చిత్రం చిత్రీకరణ జరుగుతూ ఉంటాయి. తెలుగు చిత్రాల షూటింగ్‌లు ఇప్పుడంటే యూరప్‌దేశాల్లో జరుగుతు న్నాయి కానీ, డబ్బై,ఎనభై దశకాల్లో కేరళలోనే జరిగేవి. కేరళ ఆదాయంలో ఎక్కువ భాగం పర్యాటక రంగం ద్వారానే ఇప్పటికీ వస్తోంది.ఇది ఒక పార్శ్వం. రాజకీయవైషమ్యాలకు కేరళ పేరు మోసింది. అక్కడ చిన్నా,చితకా పార్టీలు ఎన్ని ఉన్నా ప్రధానమైన పార్టీలు కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలే.కమ్యూనిస్టులు చీలిపోయిన తర్వాత కూడా వామపక్ష ఫ్రంట్ పేరిట ఐక్యంగానే ఉంటున్నారు.దేశంలో తొలి కమ్యూనిస్టు ప్రభుత్వంకేరళలోనే ఏర్పడింది.ఆ ప్రభుత్వానికి నేతృత్వం వహించిన ఈఎంఎస్ నంబూద్రిపాద్ దేశంలో కమ్యూనిస్టు ఉద్యమ పితామహుల్లో ఒకరు. పార్టీ విడిపోయిన తర్వాత ఎకె గోపాలన్, ఈకె నాయనార్‌వంటి యోధులు మార్క్సిస్టు పార్టీ పక్షాన,అచ్యుత మీనన్ వంటి సీనియర్ నాయకులు సీపీఐ తరఫున వామపక్షఫ్రంట్ మంత్రివర్గాల్లో ప్రముఖ పాత్ర వహించారు.ఈ కూటమికి దీటుగా కాంగ్రెస్ నేతృత్వంలో ఐక్య ప్రజాస్వామ్య ఫ్రంట్

(యూడీఎఫ్)ని కరుణాకరన్,ఆంటోనీ వంటి నాయకులు దీరిదిద్దారు. ఈ రెండు ఫ్రంట్‌లువంతుల వారీగా అధికారంలోకి రావడం కేరళలో ఒకసంప్రదాయం అయింది. వీటికి తోడు ఇప్పుడు బీజేపీ కూడా రంగప్రవేశం చేయడంతో రాజకీయాలు రక్తసిక్తమవుతున్నాయి.కమ్యూనిస్టులకు కన్నూరు కంచుకోట. కత్తులు దూసుకోవడం అక్కడ మామూలే.గతంలో కాంగ్రెస్,కమ్యూనిస్టుల మధ్య ఘర్షణలు జరుగుతూ ఉండేవి.ఈ రెండు పార్టీల మధ్య పొసగకపోయినా, బీజేపీ భావజాలాన్ని వ్యతిరేకించడంలో ఈ రెండు పార్టీలూ ఇప్పటికీ పరోక్షంగా ఏకమవుతున్నాయి. దేశమంతటా కాషాయ పాలన తీసుకుని రావడానికి బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా కంకణం కట్టుకున్నారు. పశ్చిమ బెంగాల్‌లో ప్రవేశించేందుకు పావులు కదిపారు.ఇప్పుడు ఆయన దృష్టి కేరళ మీద పడింది. షాకి ముందు ఎల్‌కె అద్వానీ వంటి అగ్రనాయకులు కూడా కేరళలో పార్టీ వేళ్లూనేట్టు చేయడానికిఎంతో శ్రమించారు.అప్పట్లో రాజకీయ ప్రత్యర్థులు పరస్పరం వాగ్బాణాలు సంధించుకోవడంతోనే సరిపెట్టేవారు.ఇప్పుడు దేశంలోని ఇతర ప్రాంతాల్లో మాదిరిగానేకేరళ రాజకీయాల్లోపెను మార్పులు వచ్చాయి. బాంబులసంస్కృతి తిష్ఠ వేసింది.తిరువనంతపురంలో బీజేపీ శరవేగంగా తన బలాన్ని పెంచుకుంటోంది. నగరంలో మొత్తం వంద వార్డులు ఉండగా,33వార్డులు బీజేపీ పట్టులో ఉన్నాయి.దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ నిర్వీర్యం కావడంతో దాని ప్రభావం కేరళ మీద కూడా పడింది.కాంగ్రెస్ ఓటమి వల్ల ఏర్పడిన శూన్యతను భర్తీ చేయడానికి బీజేపీ శతవిధాల ప్రయత్నిస్తోంది.బీజేపీ అనుబంధ విద్యార్థి సంఘమైన అఖిలభారత విద్యార్థి పరిషత్ (ఎబీవీపీ), మార్క్సిస్టు పార్టీ అనుబంధ విద్యార్థి సంఘమైన స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) ల మధ్య తరచూ ఘర్షణలు జరుగుతున్నాయి.అవి విద్యార్థుల నుంచి ఆయా పార్టీల కార్యకర్తలకు వ్యాపించాయి.బీజేపీని ఎదుర్కోవడం ఇటీవల కాలంలో మార్క్సిస్టులకు కష్టమవుతోంది. సైద్ధాంతికంగా తమ వాదనా పటిమతో గెలవడానికి బదులు భౌతిక దాడులకు దిగుతోంది.తిరువనంతపురంలో బీజేపీ కార్యాలయానికి మార్క్సిస్టులు నిప్పు పెట్టగా, మార్క్సిస్టుల ఆఫీసును బీజేపీ కార్యకర్తలు దగ్ధం చేశారు.గతంలో దాడులుజరిగినప్పుడల్లా ఇది కమ్యూనిస్టు గూండాల పనే అని కాంగ్రెస్‌వారూ, కమలనాథులూ ఆరోపించేవారు.ఇప్పుడు గూండాలు అన్ని పార్టీల్లోనూ ఉన్నారు. మార్క్సిస్టు, బీజేపీ కార్యకర్తల మధ్య జరుగుతున్న బాహాబాహీలకు పరాకాష్టగా ఇటీవల రాజేష్ అనే ఆర్ఎస్ఎస్ కార్యకర్త హత్య జరిగింది. ఈ రెండు పార్టీలూ రహస్యంగా సొంత సైన్యాలను నడుపుతున్నాయి. మార్క్సిస్టు పార్టీకి జిల్లాల స్థాయిలో హంతక దళాలు ఉన్నాయి. అయితే, ఈ దళాల్లో సభ్యుడు ఎవరైనా పట్టుబడితే అతడు తమ పార్టీ కార్యకర్త కాదనిమార్క్సిస్టు పార్టీ ఖండిస్తూ ఉంటుంది.దాంతో బీజేపీ కూడా ఇలాంటి ముఠాలను నిర్వహించడం మొదలు పెట్టింది.పశ్చిమ బెంగాల్‌లో మార్క్సిస్టు ఫ్రంట్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు,ముఖ్యమంత్రిమమతా బెనర్జీ అనుసరించిన వ్యూహాన్నే కేరళలో బీజేపీ అనుసరిస్తోంది. దాంతో దేవుని రాజ్యంగా ఒకప్పుడు పేరొందిన కేరళ ఇప్పుడు గూండాల రాజ్యంగా రూపుదిద్దుకుంది.మార్క్సిస్టు పార్టీ అధికారంలో ఉండటం వల్ల ఆ పార్టీ గూండాలు ఇప్పు డు బలోపేతులయ్యారు.రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ అధీనంలోనే హోం శాఖ ఉంది.ఆయనను చూసుకుని మార్క్సిస్టు పార్టీ వారు చెలరేగుతుండగా, కేంద్రంలో తమ పార్టీ అధికారంలో ఉందని బీజేపీ వారు రెచ్చి పోతున్నారు.పినరయ్ విజయన్ అధికారంలోకి వచ్చిన పదిహేడు మాసాల్లో నెలకి ఒకటి చొప్పున హత్య జరిగింది. దీంతో గవర్నర్ పి.సదాశివన్ ఆయనను హింసను అరికట్టేందుకు పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని నిర్మొహమాటంగా సలహా ఇచ్చారు.అన్ని వైపుల నుంచి ఒత్తిడి రావడంతో విజయన్ ఈ మధ్య కాలంలో సహనాన్ని కోల్పోతున్నారు. ఇటీవల పత్రికా గోష్ఠికి హాజరైన జర్నలిస్టులను వెళ్ళిపొండి అంటూ గట్టిగా అరిచారు. బీజేపీ నాయకులతో చర్చలు జరపడానికి ముందు ఇది జరిగింది.జర్నలిస్టుల పట్ల విజయన్ వైఖరిని సీపీఎం తప్పు పట్టింది. జర్నలిస్టులతో మర్యాదగా వ్యవహరించాలని క్లాస్ తీసుకుంది.

పినరయ్,కేరళ బీజేపీ శాఖ అధ్యక్షుడు కుమ్మానమ్ రాజశేఖరన్‌లు ఇద్దరూ శాంతినే కోరుతున్నారు.కానీ, కార్యకర్తలు వారి అదుపులో లేరు. వారు సృష్టించిన బడభాగ్ని వారిని దహించి వేస్తోంది.

రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా బీజేపీ రూపుదిద్దుకుంటోంది.మార్క్సిస్టు పార్టీలో వెనకబడిన తరగతుల వారు ఎక్కువ మంది ఉన్నారు. కానీ, రాష్ట్రంలో పలుకుబడి కలిగిన ఎజవా సామాజిక వర్గం వారు క్రమంగా బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారు. దీనికితోడు కేంద్రం తమ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేస్తుందేమోనన్న భయం సీపీఎంని వెంటాడుతోంది.1959లో కేరళలో ఈఎంఎస్ నంబూద్రిపాద్ నేతృత్వంలోని తొలి కమ్యూనిస్టు ప్రభుత్వం ఆనాడు కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం బర్తరఫ్ చేసిన సంఘటన వారికి తరచూ గుర్తు వస్తోంది. అప్పట్లో 14 రాష్ట్రా ల్లో 13 రాష్ట్రా లు కాంగ్రెస్ ఏలుబడిలో ఉండేవి.కేరళలో మాత్రం కమ్యూనిస్టులు అధికారంలో ఉండేవారు.ఇప్పుడు చక్రం తిరిగింది.కాంగ్రెస్ పాత్రను బీజేపీ వహిస్తోంది. అన్ని రాష్ట్రా ల్లో అధికారంలోకి వచ్చేందుకు చతుర్విధోపాయాలను అనుసరిస్తోంది.

దేశంలో అత్యధిక అక్షరాస్యత కలిగిన రాష్ట్రా ల్లో కేరళది మొదటి స్థానం.అటువంటి రాష్ట్రంలో నిత్యం హింస చోటు చేసుకోవడం ఆశ్చర్యమే. అయితే, కేరళలో రాజకీయ హింస కొత్త కాదు.1948లో ఆర్ఎస్ఎస్ అధిపతి ఎంఎస్ గోల్వాల్కర్ ర్యాలీలు నిర్వహించినప్పుడు తొలిసారిగా హింస చోటు చేసుకుంది.

కన్నూరు విషయానికి వస్తే బ్రిటిష్ వారి కాలంలో ఈ జిల్లాలో యోధులు ప్రాణాలకుతెగించి పోరాడారు. 18వ,19వ శతాబ్దాల్లో ఆనాటి యోధులు బ్రిటిష్ వారిపైవీరోచితంగా పోరాడారు. ఆ పోరులో బ్రిటిష్ వారిదే పైచేయి అయింది. అయితే, హింస మరో మలుపు తీసుకుంది.భూస్వాములూ, భూమిలేని నిరుపేదల మధ్య పోరుగా అది రూపు మార్చుకుంది.

ఒక దశాబ్దం అనంతరం ఆర్ఎస్ఎస్ కేరళపై దృష్టి సారించింది. అప్పట్లో మైసూర్‌కి చెందిన వాణిజ్యవేత్తలు ఆర్ఎస్ఎస్ కి అండగా ఉండేవారు. కేరళలో తమ వ్యాపారాన్ని విస్తరింపజేసుకోవడానికి ఆర్ఎస్ఎస్ నాయకులతో సంబంధాలు వృద్ధి చేసుకున్నారు. అయితే,కేరళలో ముఖ్యంగా, కన్నూర్‌లో వ్యాపారం అంతా ముస్లింల చేతుల్లో ఉండేది.ఆర్ఎస్ఎస్‌తో వారికి గల వైరం ఎలాంటిదో తెలిసిందే. ముస్లిం వ్యాపారవేత్తలు కమ్యూనిస్టులకు నిధులు అందించేవారు.

ఆర్ఎస్ఎస్ అధిపతిగా గోల్వాల్కర్ ఉన్నప్పుడు రెండు ర్యాలీలను ఆ సంస్థ నిర్వహించింది.1948లో తొలిసారిగా తిరువనంతపురంలో,1952లో ఆలప్పూళలో ఈ ర్యాలీలను నిర్వహించింది. త్రిసూర్,కొట్టాయం, ఎర్నాకుళం, పాలక్కాడ్ జిల్లాల్లో వరుసగా జరిగిన దాడులు హత్యలకు దారితీశాయి. మార్క్సిస్టు పార్టీ హిందువుల వ్యతిరేక పార్టీగా సంఘ్ పరివార్ ప్రారంభించిన ప్రచారం జనంలో క్రమంగా బలపడింది. దాంతో సిపిఎం కూడా హిందువులను ఆకర్షించేందుకు గణేష్ ఉత్సవాలనూ,ఇతర ఉత్సవాలను నిర్వహించేందుకు తమ కార్యకర్తలకు అనుమతి ఇచ్చింది.అంతేకాదు,కేరళలో ఆధ్యాత్మిక గురువుగా పేరొందిన నారాయణ గురు ఆరాధనోత్సవాలను కూడా పెద్ద ఎత్తున నిర్వహించడం మొదలు పెట్టారు.

మార్క్సిస్టులు, బీజేపీ వారూ హింసను ప్రోత్సహిస్తూనే ఉన్నారు.వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి పరిస్థితి ఏ రూపు తీసుకుంటుందో.కేరళలో కాంగ్రెస్‌ను తుంగలోకి ప్రజలు తుంగలోకి తొక్కారు. కేరళను బీజేపీ వారు దేవుని రాజ్యం అని అనకపోవచ్చు, దేవుడువదిలేసిన రాజ్యమని అనవచ్చు.కాని ఏ ప్రమాణంగా చూసినా, అక్షరాస్యత, ఆరోగ్యం, పరిశుభ్రత, హింస ఇలా ఏ విధంగా చూసినా అది విలక్షణమైన రాష్ట్రం అని అనవచ్చునేమో. స్వామి వివేకానంద అప్పట్లో కేరళను ఉన్మాదుల గృహం అని అనడం ఆశ్చర్యాన్ని కలిగించింది.

ప్రముఖుల ట్వీట్‌కారం

సచిన్‌పై నెటిజన్ల జోకులు



సచిన్ టెండుల్కర్.. క్రికెట్ జగత్తులో రారాజు. ఆట పరంగా ఆయనకున్న పేరు అంతాఇంతా కాదు. ఎవరూ వేలెత్తి చూప లేరు. రాజ్యసభ సభ్యునిగా మాత్రం పాపం విఫలమయ్యారంటున్నారు నెటిజెన్లు. గురువారం ఆయన చాలాకాలం తర్వాత రాజ్యసభకు హాజర య్యారు. దీనిని పురస్కరించుకుని సోషల్ మీడియాలో జోకులే.. జోకులు.. అలాంటిదే ఇదొకటి..


అమ్మ తరచూ మిమ్మల్ని ఫ్యామిలీ ఫంక్షన్లకు హాజరవ్వాలని కోరినప్పుడు.. అనే శీర్షికతో ఈస్ట్ ఇండియా కామెడీ పేరుతో ఈ ట్వీట్ చేశారు. ఇక్కడ పెట్టే ఉచిత ఆహారం కోసం వచ్చానంటూ.. వ్యాఖ్య రాశారు.

హ్యూమన్‌కు కొత్త శాస్త్రీయ నామం



మానవ జాతికి శాస్త్రీయ నామం హోమో సపియన్స్. ఇప్పుడది మారిపోయిందంటున్నారు **ప్రఖ్యాత వాణిజ్యవేత్త ఆనంద్ మహీంద్ర. హ్యూమన్‌కు కొత్త శాస్త్రీయ నామం హోమోవాట్సాపియన్స్ అంటూ సరదాగా ట్వీట్ చేశారు.** నిజమే కదా. వాట్సాప్‌ను ఉపయోగించని వారెవరున్నారు ప్రస్తుత కాలంలో. అందుకే హ్యూమన్‌ను ఇలా మార్చేసుకుంటే బాగుంటుంది కదూ!

మన పని మనం చేసుకుంటే...



అమితాబ్ బచ్చన్.. ప్రపంచ సినీ చరిత్రలోనే పరిచయం అక్కర్లేని వ్యక్తిత్వం. ఆయన చేసిన ఒక ట్వీట్ వాస్తవాన్ని ప్రతిబింబించింది. ఆ ట్వీట్ సారాంశాన్ని ఆచరిస్తే.. ఎంతో ఉపయోగం కూడాను. ఇంతకీ ఆ ట్వీట్ ఏంటనే కదా..

మన పని మనం శ్రద్ధగా చేసుకుంటే జీవితంలో సగం సమస్యలను పరిష్కరించుకున్నట్లే... నిజమే కదా.....

తెలంగాణ 'ఉపాధి'కి హామీ

దేశంలో గ్రామీణ పేదరికం, వ్యవసాయ కార్మికుల వలసలను నియంత్రించేందుకు యుపీఏ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం దేశవ్యాప్తంగా తీవ్ర ప్రభావం చూపింది. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కార్మికుల పనిదినాలు పెరగడంతో పాటు వారి కొనుగోలు శక్తి కూడా పెరిగిందని పలు సర్వేలు వెల్లడించాయి. మూడేళ్ల క్రితం నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో కూడా ఉపాధిహామీ పథకం గ్రామీణ ప్రాంత కూలీలకు ఆసరాగా నిలిచింది. రెండేళ్లుగా వర్షాభావం, కరవు సంభవించిన కూడా గ్రామీణ కూలీల వలసలు పెద్దగా పెరగలేదు.

తెలంగాణ రాష్ట్రంలో ఉపాధిహామీ పనులు జోరుగా సాగుతున్నాయని పంచాయతీరాజ్, గ్రామీణాభి వృద్ధిశాఖ కొన్ని లెక్కలను విడుదల చేసింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 53,91,433 కుటుంబాలకు చెందిన కూలీలు జాబ్‌కార్డులను పొందారు. వీరిలో 1,21,06,338 మంది కూలీలు ప్రతి ఏటా ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారని లెక్కలు చెబు తున్నాయి. 2015-16 ఆర్థిక సంవత్సరం లో రూ. 964కోట్ల పనిదినాలను కూలీలకు కల్పించింది. దాదాపు 1.77 లక్షల కుటుంబాలు 100రోజుల పని దినాలను పూర్తి చేసుకున్నారు. అంతేకాకుండా ఈ ఆర్థిక సంవత్సరంలోనే 23.25 లక్షల కుటుంబాల నుంచి 40.7లక్షల కూలీలు ఉపాధిహామీ పనుల్లో పాల్గొన్నట్లు అధికారులు ఇచ్చిన లెక్కల ప్రకారం తెలుస్తోంది. కూలీలకు రూ. 1300కోట్ల నిధులు వేతనాల రూపంలో కేంద్రప్రభుత్వం చెల్లించింది.

2016-17 ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీలో గతంలో పోల్చితే కేంద్రప్రభుత్వం నుంచి పెద్దగా నిధులు వెచ్చించలేదని చెప్పవచ్చు. కానీ ఈ ఏడాదిలో రాష్ట్ర ప్రభుత్వం కీలకమైన నిర్ణయం తీసుకున్నది. మెటీరియల్ కంపోనెంట్ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకున్నదని చెప్పవచ్చు. గతంలో ఎన్నడు కూడా ఈ నిధులను వినియోగించుకోలేదు. పైగా ఎమ్మెల్యే, ఎంపీ, గ్రామపంచాయతీల నిధుల సహకారంతో చేపట్టింది. ఆర్థిక సంవత్సరం చివరి మాసంలోనే కీలకమైన నిర్ణయాన్ని తీసుకుని నిధులను సద్వినియోగం చేసుకున్నదని చెప్పవచ్చు. దీనికి రాష్ట్రవ్యాప్తంగా 19,250 పనులకు రూ.889.39కోట్ల విలువగల ప్రతిపాదనలు వచ్చాయి. వీటిలో రూ.530కోట్ల పనులను మంజూరు చేయగా, మార్చి31వ తేదీ నాటికి రూ.381కోట్ల పనులను పూర్తి చేసింది. దీనివల్ల రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీకాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణం ప్రభుత్వం చేపట్టగలిగింది.



ఇవి కాకుండా 2016-17లోనే రాష్ట్రవ్యాప్తంగా ఉపాధిహామీ పనులకు రూ.2627.46కోట్ల నిధులను వెచ్చించింది. వీటిలో కూలీల వేతనాలకు రూ. 1423.43కోట్లు ఖర్చు చేసింది. ప్రస్తుత ఆర్థికసంవత్సరంలో (2017-18) గడిచిన మూడు నెలల్లోనే పెద్ద ఎత్తున ఉపాధిహామీ పనులు జరిగాయి. ఒక్క మూడునెలల్లోనే సుమారు రూ.1100 కోట్ల విలువ గల పనులను చేపట్టింది. దీంతో ఈ మధ్యకాలంలో తక్కువ కాలంలో ఈ స్థాయిలో నిధులను ఖర్చు చేయడం జరగలేదు.

ఉపాధిహామీ కూలీలకు పనిదినాలను పెంచేందుకు ప్రభుత్వ సంక్షేమ పథకాల్లోనూ భాగస్వామ్యం చేస్తుంది. దీంట్లో భాగంగానే హరితహారం, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలకు ఉపాధిహామీ నిధులను వెచ్చిస్తోంది. గడిచిన రెండేళ్లలోనూ హరితహారం కార్యక్రమంలో భాగస్వామ్యం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 4వేల నర్సరీలను ఏర్పాటు చేయగా, వాటిలో ఉపాధిహామీ పథకం కింద 1526 నర్సరీలను అభివృద్ధి చేసి మొక్కలను పెంచింది. ఈ నర్సరీలకు ప్రతి ఏటా రూ.200కోట్లు వెచ్చించాలని నిర్ణయించింది. ఈనర్సరీల్లో 20కోట్ల మొక్కలను పెంచేందుకు ప్రణాళికను సిద్ధం చేసింది. నాటిన మొక్కల పరిరక్షణకు ఉపాధిహామీ నిధులను వెచ్చిస్తుంది. ప్రతి మొక్క పరిరక్షణకు రూ.5లు చెల్లిస్తుంది.

సంపూర్ణ పారిశుద్ధ్యాన్ని పాటించేందుకు స్వచ్ఛ్ భారత్ కార్యక్రమంలో కూడా కూలీలను భాగస్వాములను చేస్తోంది. ప్రతి ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్డిని నిర్మించేందుకు చర్యలు తీసుకున్నది. దీని కోసం వ్యక్తిగత మరుగుదొడ్లకు రూ.12వేలు నిధులను ఉపాధిహామీ నుంచే వెచ్చిస్తుంది.

ఉపాధిహామీ కూలీలకు 100రోజుల పనిదినాల నుంచి 150 పనిదినాలకు రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. కూలీల వేతనాలను కూడా రూ.197గా నిర్ణయించింది. పని దినాలతో పాటు వేతనాలను పెంచడంతో గ్రామీణ కూలీల్లో ఆత్మస్థైర్యం పెరిగిందని చెప్పవచ్చు. భవిష్యత్‌లో మిషన్ కాకతీయ పనుల్లో కూలీలను భాగస్వామ్యం చేయాలని పంచాయతీరాజ్‌శాఖ యోచిస్తుంది. ఉపాధిహామీ అమల్లో కొన్ని ఇబ్బందులు కూడా ఉన్నాయి. కూలీలకు సకాలంలో వేతనాలను విడుదల చేయలేదు. అదే విధంగా పని ప్రదేశాల్లో కనీస వసతులను కల్పించడం లేదని ఆరోపణలున్నాయి. దీనికి తోడు మితిమీరిన రాజకీయ జోక్యంతో అక్కడక్కడ నిధుల దుర్వినియోగం తదితర ఆరోపణలు వచ్చాయి.

-దుర్గం శ్రీనివాస్

అభివృద్ధిని కదిలిస్తున్న అవినీతి?

పాఠకీయం

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలలోని ప్రభుత్వ కార్యాలయాలు అవినీతికి అడ్డాగా మారినాయి. సామాన్య ప్రజానీకం తమ పనుల నిమిత్తం మండల, డివిజన్, జిల్లా కేంద్రాలలోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళితే పైసలివ్వనిదే ఫైలు కదలదు. చేతులు తడిపితేనే పని అవుతుంది. లంచాలకు అలవాటుపడిన అధికారులు ప్రతీ పనికి ఓ రేటును నిర్ణయించి ప్రజలను జలగల్లా పీడించి అక్రమ సంపాదనకు మొగ్గుచూపుతున్నారు. ఒకవైపు అవినీతి నిరోధక శాఖ అధికారులు అవినీతి అధికారుల భరతం పడుతూ, అవినీతి తిమింగలాలను పట్టుకుంటున్నా అవినీతి తగ్గుముఖం పట్టడంలేదు. గత ప్రభుత్వంలో కంటే ప్రస్తుత ప్రభుత్వంలోనే అవినీతి తారాస్థాయికి చేరిందని బహిరంగంగా చర్చించు కుంటున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మంత్రివర్గ సమావేశాలలో, ఉన్నతా ధికారుల సమీక్షా, సమావేశాలలో అవినీతికి దూరంగా ఉండాలని ప్రతీ సారి చెబుతున్నా పరిస్థితిలో మాత్రం ఎలాంటి మార్పు లేదనిపిస్తోంది. ముఖ్యంగా రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్, ఖజానా కార్యాలయం, మండల ప్రజాపరిషత్, పోలీసు ట్రాన్స్‌పోర్ట్, శాఖలలో అవినీతి పెద్దఎత్తున జరుగుతోంది. గ్రామ స్థాయిలో గ్రామరెవెన్యూ అధికారుల అవినీతి లీలలు చెప్పాల్సిన అవసరం లేదు. మీసేవ కేంద్రాలలో సైతం సర్టిఫికెట్లను, సైతం నిర్దేశించిన ధర కన్నా అధికంగా వసూలు చేస్తు న్నారు. ప్రతీ ప్రభుత్వ కార్యాలయంలో పౌర సేవా పత్రాలను (సిటిజన్ ఛార్టర్) అమలు చేస్తేనే అవినీతి తగ్గుముఖం పడుతుంది. అవినీతి అధికారులను కఠినంగా శిక్షించాలి. చట్టాలలో కూడా మార్పు రావాల్సిన అవసరం వుంది. అవినీతి రహిత పాలనను ప్రభుత్వం అందించాలి.

-కామిడి సతీష్‌రెడ్డి
జడలపేట, జయశంకర్ జిల్లా

వజ్ర బస్సుల్లో రూ.25 రాయితీ

● ఆర్టీసీ ఎండీ జీవీ రమణారావు వెల్లడి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : మొబైల్ యాప్ ద్వారా టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులకు వజ్ర బస్సులలో రూ.25ల రాయితీ ఇవ్వడం జరుగుతుందని ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ జి.వి. రమణారావు తెలిపారు. ఈ రాయితీ నాలుగు బుకింగ్‌ల వరకు మాత్రమే వర్తిస్తుందని తెలియచేశారు. ఇప్పటి వరకు వజ్ర బస్సుల్లో ప్రయాణానికి మొబైల్ యాప్ ద్వారానే టికెట్లు బుక్ చేసుకొనే వెసులుబాటు ఉంది. ఇక మీదట డ్రైవర్ ట్యాబ్ ద్వారా నగదు లావాదేవితో కూడిన టికెట్ ఇచ్చే సౌకర్యం అందుబాటులోకి తేవడానికి చర్యలు తీసుకుంటున్నామని రమణారావు వెల్లడించారు. వజ్ర బస్సులను ప్రస్తుతం హైదరాబాద్ నుండి వరంగల్, నిజామాబాద్‌కు నడిపిస్తున్నారు. వజ్ర బస్సుల గురించి పెద్దగా ప్రచారం లేకపోవడం, మొబైల్ యాప్ ద్వారానే టికెట్ కొనుగోలు చేయాలనే నిబంధన వర్తింపచేయడంతో ప్రయాణికుల ఆదరణ అంతంత మాత్రంగానే ఉంది. టిమ్స్ ద్వారా బస్‌లోనే టికెట్ జారీ చేసే సౌకర్యాన్ని ప్రయాణికులు కోరుకుంటున్నారు. ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్ ఉన్న వారు మాత్రమే యాప్‌ను డౌన్ లోడ్ చేసుకొని టికెట్ కొనుగోలు చేయాలనే నిబంధన ప్రయాణికులను తీవ్రమైన అసౌకర్యానికి గురి చేసింది. దీంతో వజ్ర బస్సులకు ప్రయాణికుల ఆక్యుపెన్సీ రేషియో అంతంత మాత్రంగానే ఉంది. ఇదిలా ఉండగా దూర ప్రాంతాల ప్రయాణం కోసం ముందస్తుగా టికెట్ బుక్ చేసుకునే ప్రయాణికులకు కూడా ఛార్జీలో రాయితీ ఇవ్వాలని ఆర్టీసీ యోచిస్తుంది. ప్రైవేటు బస్సుల పోటీని తట్టుకొనేందుకు ఈ వెసులబాటు కల్పించడం అనివార్యం అని ఉన్నతాధికారులు తెలిపారు. ఈ విధానం అమలు పర్చడంతో డిమాండ్ మేరకు బస్సులను నడిపించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

బద్రి విశాల్ ట్రస్టు మెరిట్ స్కాలర్‌షిప్స్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: బద్రి విశాల్ పన్నాలాల్ పిత్తి ట్రస్ట్ ఆధ్వర్యంలో గత 2016-17లో మెరిట్ సాధించిన విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లను ఈనెల 5న అందజేయనున్నామని ట్రస్ట్‌ప్రతినిధి ఎ.నరసింహారావు తెలిపారు. మొత్తం 6వ తరగతి నుంచి పీజీ దాకా 8 శాతం పైగా మార్కులు సాధించిన 1500 మందికి రూ.75 లక్షలను స్కాలర్‌షిప్‌గా అందించనున్నామని తెలిపారు. రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌజ్‌లో జరిగే ఈ సదస్సుకు ఐటిశాఖ మంత్రి కేటీ రామరావు, హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి, ట్రస్ట్ చైర్మన్ శరద్ పిత్తి, ట్రస్టీ అక్షయ్ పిత్తిలు అందించనున్నారని ఆయన పేర్కొన్నారు.

మినీ నీటి ప్రాజెక్టులు చేపట్టాలి

● బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు



సిరికొండ, కెఎన్ఎన్ : తెలంగాణలో వ్యవసాయం అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయకపోతే 2019లో జరిగే ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అధికారం చేపట్టి రైతు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తుందని, రాష్ట్రప్రభుత్వం మినీ ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు అన్నారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా, సిరికొండ మండలంలోని గడ్కోల్‌లో నిర్వహించిన రైతు పంచాయతీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కప్పల వాగుపై మినీ ప్రాజెక్టు నిర్మాణం వల్ల మండలంలోని 15 గ్రామాల పొలాలకు సాగునీరు అందుతుందన్నారు. తూంపల్లి దొంగ చెరువుపై రిజర్వాయర్ నిర్మించి సాగునీటిని నిలువ చేయవచ్చని ఆయన అన్నారు.

కాకినాడ కార్పొరేషన్ ఎన్నికలు

ఎందుకు జరపలేదు?: హైకోర్టు

హైదరాబాద్,ఆంధ్రప్రభ : కోర్టుకు ఇచ్చిన హామీ మేరకు గత నవంబర్ లోపు తూర్పు గోదావరి జిల్లా, కాకినాడ నగరపాలక సంస్థకు ఎందుకు ఎన్నికలు నిర్వాహించలేదని ఉమ్మడి హైకోర్టు ఏపీ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి కరికాల వలవన్, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్ కుమార్‌లను నిలదీసింది. స్వయంగా కోర్టుకు హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశిస్తేనే ఆ నగరపాలక సంస్థకు ఎన్నికల ప్రకటన జారీ చేసినట్లుందని హైకోర్టు వ్యాఖ్యానించింది. మీరిచ్చిన హామీని కోర్టు తప్పుగా నమోదు చేసి ఉంటే ఆ విషయాన్ని మా దృష్టికి తీసుకు వచ్చి సవరించుకోవాల్సిన బాధ్యత మీపై లేదా అని ప్రశ్నించింది. హామీని తప్పుగా చేశామనే కారణం చూపుతూ.. హామీ ఇచ్చిన గడువు లోపు ఎన్నికలు ఎన్నికలు నిర్వహించ కపోవడానికి తాము బాధ్యులం కామని ఆ అధికారులు పేర్కొనడం సరి కాదంది. కోర్టు ధిక్కారణ కేసు పై విచారణ ముగించే ప్రసక్తే లేదని హైకోర్టు స్పష్టం చేసింది. కోర్టుకు ఇచ్చిన హామీని ఉద్దేశ పూర్వకంగా ఉల్లంఘించారా, లేదా, తేలుస్తామని చెప్పింది. ఈ వ్యవహారంపై పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి పూర్తి వివరాలతో ప్రమాణ పత్రం దాఖలు చేయాలని ఆదేశించింది.ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్,జస్టిస్ పి.నవీన్ రావులతో కూడిన డివిజన్ బెంచ్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.తదుపరి విచారణ వాయిదా వేసింది.


తల్లీ కుమార్తెల ఆత్మహత్య



కురవి, కెఎన్ఎన్ : తల్లిదండ్రులు గొడవ పడుతున్న క్రమంలో తల్లి పురుగుల మందు తాగుతుండగా నీవెందుకు తాగుతావు నేను కూడా తాగుతానని కూతురు సైతం పురుగుల మందు తాగటంతో అపస్మారక స్థితికి చేరిన ఇద్దరిని మానుకోట ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా వారిలో కూతురు మృతి చెందగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తల్లి మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా, కురవి మండలంలోని కాంపల్లి గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం కాంపెల్లి గ్రామానికి చెందిన నక్క కృష్ణయ్య, ఎల్లమ్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలు, వారిలో ఇద్దరికి వివాహం కాగా, చిన్న కుమార్తె స్వాతి ఖమ్మంలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతుంది. ఈ క్రమంలో గురువారం రాత్రి కుటుంబ కలహాల నేపథ్యంలో కృష్ణయ్య, ఎల్లమ్మ దంపతులు గొడవ పడ్డారు. తల్లిదండ్రులు గొడవ పడుతున్న క్రమంలో స్వాతి ఇద్దరిని వారించబోయింది. ఈ క్రమంలో ఎల్లమ్మ (45) పురుగుల మందు తాగింది. ఇది చూసిన కుమార్తె స్వాతి (19) కూడా తల్లి వద్ద ఉన్న మందు డబ్బాను గుంజుకుని తాగింది. ఎల్లమ్మ, స్వాతిలను మానుకోట ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా స్వాతి మార్గ మధ్యలో మృతి చెందింది. తల్లి ఎల్లమ్మ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ఆమనగల్లు రూరల్, కెఎన్ఎన్ : రంగారెడ్డి జిల్లా, ఆమనగల్లు మండలం పోలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తకుంట తాండాకు చెందిన రైతు కేతావత్ సీతారాం(36) శుక్రవారం ఉదయం అప్పుల బాధ భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు చెప్పారు. ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడినట్లు చెప్పారు. తనకున్న మూడెకరాల పొలంలో గత కొన్నేళ్లుగా జీవనం సాగిస్తున్న ఆయన ఇటీవల పత్తి పంట వేసి రెండు లక్షల వరకు అప్పుల చేశారని, వర్షాలు అనుకూలించక వేసిన పైర్లు ఎండిపోతుండడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన ఆత్మహత్య చేసుకున్నట్లు వారు పేర్కొన్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే వంశీచందర్ రెడ్డి శుక్రవారం మృతుని కుటుంబాన్ని పరామర్శించి, ప్రభుత్వ పరంగా ఆదుకునేందుకు కృషి చేస్తానన్నారు. మృతునికి భార్య మల్లి, కూతురు శ్రావణి, కుమారుడు శివకుమార్ ఉన్నారు.



సీతారాం (ఫైల్ ఫోటో)

రుణాల జాప్యం నివారణకు

ప్రత్యేక విభాగం

● కసరత్తు చేస్తున్న ఎస్సీ కార్పొరేషన్ ● తొలుత రాష్ట్రస్థాయిలో అమలు.. తర్వాత జిల్లాలకు విస్తరణ ● త్వరలో బ్యాంకర్లతో సమావేశం



హైదరాబాద్,ఆంధ్రప్రభ: షెడ్యూల్డ్ కులాల నిరుద్యోగులకు ఎస్సీ కార్పొరేషన్ మంజూరు చేసే రుణాల విషయంలో పర్యవేక్షణ కమిటి (థర్డ్ పార్టీ)ని నియమించాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఎస్సీ నిరుద్యోగ యువకులకు స్వయం ఉపాధి కోసం రుణాలు ఇవ్వడానికి యూనిట్లతో పాటు సరిపోను నిధులను విడుదల చేసినప్పటికి లబ్ధిదారులకు అందించడంలో చాలా జాప్యం జరుగుతోందని, తద్వారా నిర్దేశించిన లక్ష్యానికి చేరుకోవడం లేదని సంబంధిత అధికారులు గుర్తించారు. ఈ జాప్యాన్ని నివారించాలంటే ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని ఎస్సీ కార్పొరేషన్ భావిస్తోంది. ఈ ప్రత్యేక విభాగాన్ని తొలుత రాష్ట్రస్థాయిలో ప్రయోత్మకంగా ఏర్పాటు చేసి, ఆ తర్వాత జిల్లా స్థాయిలో నియమించాలనే అభిప్రాయంతో ఉన్నారు. దీనితో లబ్ధిదారులను గుర్తించి, యూనిట్ల విడుదలతో జాప్యం చేసిన అధికారులపై చర్యలకు తీసుకునేందుకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

కాగా కార్పొరేషన్ నుంచి రూ. లక్ష రుణం ఇస్తే.. అందులో బ్యాంకు 20 శాతం అంటే రూ. 20 వేలు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే బ్యాంకులు ఇవ్వాల్సిన 20 శాతం నిధులను ఇవ్వకుండా లబ్ధిదారులను నెలల తరబడి తిప్పుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో స్వయం ఉపాధి పథకాల అమలులో నిర్దేశించిన లక్ష్యానికి చేరుకోకపోవడానికి బ్యాంకర్లే ప్రధాన కారణమని అధికార యంత్రాంగం గుర్తించింది. అటు బ్యాంకర్లను, ఇటు లబ్ధిదారులతో పాటు జిల్లాలలో కార్పొరేషన్ అధికారులతో సమన్వయం చేసి.. రుణాల విడుదలలో స్పీడ్ పెంచాలని, అందుకు ప్రత్యేక విభాగం ఉంటేనే సాధ్యమనే అభిప్రాయంతో కార్పొరేషన్ అధికారులు ఉన్నారు. ప్రత్యేక విభాగం కోసం ప్రభుత్వానికి లేఖ రాశామని, అక్కడి నుంచి అనుమతి రాగానే తదుపరి చర్యలు ఉంటాయని ఎస్సీ కార్పొరేషన్ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో కూడా బ్యాంకర్లతో సమావేశం నిర్వహించాలని, ఆ తర్వాత జిల్లాల వారిగా కొనసాగించాలని కార్పొరేషన్ భావిస్తున్నది.

ఇదిలా ఉంటే కార్పొరేషన్ రుణాల కోసం లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నాక బ్యాంకులు, అధికారులు నిర్వహించిన ఇంటర్వ్యూల సమయంలోనే రుణాల జారీపై స్పష్టత ఇవ్వాలనే ఆలోచనతో ఉన్నారు. ఈ విషయంపై జిల్లాల అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. అయితే 2016-17 ఆర్థిక సంవత్సరానికి 26,731 మందికి రూ. 322.11 కోట్లను ప్రభుత్వం మంజూరు చేయగా కేవలం 9,455 మంది లబ్ధిదారులకు రూ. 111.69 కోట్లను మాత్రమే విడుదల చేసింది. దీంతో 60 శాతం పైగా నిధులు వెనక్కి వెళ్లాయి. నిధులు వెనక్కి వెళ్లడానికి అనేక కారణాలు చెబుతున్నప్పటికి.. అధికారుల నిర్లక్ష్యమే కారణమని పలు దళిత సంఘాలు ఆరోపిస్తున్నాయి. గతేడాది తప్పులు పునరావృతం కాకుండా ఈ ఆర్థిక సంవత్సరం అనుకున్న లక్ష్యాలకు చేరుకోవాలని కార్పొరేషన్ పట్టుదలతో ఉన్నది. నిర్దేశించిన లక్ష్యానికి చేరుకోవాలంటే ప్రత్యేక విభాగం తప్పనిసరని, లోటుపాట్లు తెలుసుకోవాడిని కూడా అవకాశం ఉంటుందని కార్పొరేషన్ అధికారులు భావిస్తున్నారు. ఇదే విషయంపై చర్చించేందుకు సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు.

ఎయిర్‌పోర్టులో సెల్ఫ్-చెక్ మెషిన్స్

● శంషాబాద్‌లో డొమెస్టిక్ టెర్మినల్స్ క్యూలైన్ తగ్గించే ప్రయత్నం: సీఐఎస్ఎఫ్ డీజీ ఓపీ సింగ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: దేశీయ విమాన ప్రయాణీకులు బోర్డింగ్ పాస్, హ్యాండ్ బ్యాగేజ్ స్కానింగ్ చేయించుకునేందుకు ఇకపై క్యూలైన్‌లో నిల్చునే సమస్య తగ్గనుంది. ప్రయాణీకులు నేరుగా విమాన ఈ-టికెట్‌తో బోర్డింగ్ పాస్ తీసుకోవడం, క్యాబిన్ బ్యాగేజ్ తమకు తాముగా స్కానింగ్ చేసుకునేందుకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఫాస్ట్‌ట్రాక్ ఎక్స్‌ప్రెస్ సెక్యూరిటీ చెక్ సదుపాయాన్ని కల్పించారు. ఈ స్కానింగ్ మిషిన్ నుంచి నేరుగా సెక్యూరిటీ చెక్‌కు వెళ్ళేందుకు అవకాశాన్ని కల్పించారు. ఆధునిక టెక్నాలజీతో రూపొందించిన సెల్ఫ్-చెక్ మిషిన్‌ను కేంద్ర పారిశ్రామిక భద్రతా దళాల (సిఐఎస్ఎఫ్) డైరెక్టర్ జనరల్ ఓపి సింగ్ శుక్రవారం ఆవిష్కరించారు. డొమెస్టిక్ టర్మినల్ బయట 10 సెల్ఫ్-చెక్ మిషిన్లను ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ఓపి సింగ్ మాట్లాడుతూ, ఈ తరహా సెల్ఫ్-చెక్ మిషిన్ ఏర్పాటు దేశంలోనే ఇది మొదటిదని, త్వరలో మరో ఆరు ఎయిర్‌పోర్టులలో ఏర్పాటు చేస్తామన్నారు. రద్దీ సీజన్‌లో ప్రయాణీకులు గంటల తరబడి క్యూలైన్లలో నిలబడకుండా సెల్ఫ్-చెక్ మిషిన్ ద్వారా కేవలం నిముషాల్లోనే నేరుగా సెక్యూరిటీ చెక్ వద్దకు చేరుకునేలా ఈ సదుపాయం దోహద పడుతుందని ఆయన చెప్పారు. దేశంలోనే 69 ఎయిర్‌పోర్టులకు తమ సంస్థ సెక్యూరిటీ కల్పిస్తుందని, అరాచక శక్తులను అడ్డుకునేలా అత్యాధునిక పరికరాలు అమర్చామని చెప్పారు. ఫాస్ట్‌ట్రాక్ సిస్టమ్ ద్వారా ప్రయాణీకులకే కాక విమానయాన సంస్థలు, తమ సిబ్బందికి కూడా విధి నిర్వహణలో సౌకర్యంగా ఉంటుందని సింగ్ అన్నారు.

ఫాస్ట్‌ట్రాక్ సెల్ఫ్-చెక్ మిషిన్ ద్వారా ఎలాంటి స్టాపింగ్ లేకుండానే బోర్డింగ్ పాస్ పొందవచ్చునని, అలాగే ఈ-హ్యాండిల్ బ్యాగేజ్ చేసుకునే సదుపాయం కలుగుతుందని జిఎంఆర్ ఎయిర్‌పోర్టు సీఈవో ఎస్‌జీకే కిషోర్ అన్నారు. జిఎంఆర్ ఎయిర్‌పోర్టు నుంచి గతంలో కోటి మంది ప్రయాణీకులు రాకపోకలు సాగించగా, ఈ ఏడాది డిసెంబర్ నాటికి కోటి 80 లక్షల మందికి చేరుకోనుందని చెప్పారు. విమాన యాన రంగం గత మూడేళ్ళలో 54 శాతం వృద్ధి చెందిందన్నారు.

కరాటే పోటీల్లో తెలంగాణ విద్యార్థులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీకి చెందిన పాఠశాల క్రీడాకారులు జాతీయ స్థాయి క్రీడల్లో అద్భుత ప్రతిభ కనబర్చారు. గత నెల 29 నుంచి 30వరకు శషింకై షీటర్యూ ఇంటర్‌నేషనల్ సంస్థ కొల్‌కత్తాలోని నేతాజీ ఇండోర్ స్టేడియంలో 3వ ఓపెన్ ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్‌షిప్‌ను నిర్వహించింది. ఈ క్రీడల్లో తెలంగాణకు చెందిన క్రీడాకారులు నాలుగు గోల్డ్ మెడల్స్, రెండు రజత పథకాలను సాధించారు. కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆహ్వానం మేరకు తెలంగాణ స్కూల్ విద్యార్థులు సైక్లింగ్ వెల్టూమ్ విభాగంలో ప్రీతమ్ గౌడ్, సుధీత్, కల్పన, గణేష్‌లు బంగారు పతకాలను సాధించి ప్రథమ స్థానాల్లో నిలిచారు. శరణ్, మౌనికలు రజత పథకాలు సాధించారు. వీరంతా శుక్రవారం సచివాలయంలో క్రీడా శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశంను కలిశారు.

కత్తులతో దాడి ఒకరి హత్య

బెల్లంపల్లి టౌన్, కెఎన్ఎన్ : భూతగాదాల నేపథ్యంలో అన్నదమ్ములపై కత్తులతో సమీప బంధువులు దాడి చేయడంతో ఓ వ్యక్తి హత్యకు గురైన సంఘటన గురువారం అర్ధ రాత్రి బెల్లంపల్లి మండలం చిన్న బూద గ్రామంలో జరిగింది. చిన్న బూద గ్రామానికి చెందిన మద్దెసాని దశరథం (42), మద్దెసాని కోటేష్‌లపై అదే గ్రామానికి చెందిన వారి చిన్నాన్న మద్దెసాని బాపు అతని భార్య లక్ష్మి, కొడుకు సంజీవ్ గురువారం రాత్రి కత్తులతో దాడి చేశారు.

మొదటగా దశరథం ఇంటికి వెళ్లి దాడులకు పాల్పడ్డారు. అతని సోదరుడు వచ్చి అడ్డుకునేందుకు ప్రయత్నించగా అతనిపై కూడా దాడి చేశారు. తీవ్ర గాయాలైన దశరథం బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రికి వెళ్లలోపే మృతి చెందాడు. కోటేష్‌ను మంచిర్యాల ఆసుపత్రికి తరలించి, అక్కడి నుంచి గోదావరిఖనికి తరలించారు. ఈ సంఘటనపై కుటుంబ సభ్యులు శుక్రవారం బెల్లంపల్లి ఏసీపీ కార్యాలయం ముందు దశరథం హత్యకు కారకులైన టీఆర్ఎస్ నాయకులు కొమ్మెర లక్ష్మణ్‌ను హత్య చేసిన సంజీవ్, బాపు, లక్ష్మిలను వెంటనే అరెస్ట్ చేసి తమకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ రెండు గంటల పాటు ఆందోళన చేపట్టారు. బెల్లంపల్లి రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్, మందమర్రి సీఐ రాంచందర్, తాండూర్ సీఐ జనార్దన్‌రెడ్డిలు పరిస్థితిని సద్దుమణిగేలా చేశారు.

జ్యోతి సురేఖకు ప్రధాని అభినందన

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఆర్చరీలో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ భారతదేశానికి అనేక పతకాలు తెచ్చి పెట్టిన క్రీడాకారిణి జ్యోతి సురేఖ (21) శుక్రవారం పార్లమెంటులో ప్రధాని నరేంద్ర మోడీని కలిశారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి, ఎంపీ గోకరాజు గంగరాజు, మచిలీపట్నం ఎంపీ కొనకళ్ల నారాయణ తదితరులు ఆమెను వెంటబెట్టుకుని ప్రధానిని కలిశారు. ఆర్చరీలో ఆమె సాధించిన విజయాలు, పతకాల గురించి ప్రధానికి వివరించారు. ఈ ఏడాది అర్జున అవార్డు కోసం ఆమె పేరును నామినేట్ చేసిన విషయాన్ని కూడా గుర్తుచేశారు. 21 ఏళ్ల వయస్సులోనే 17 అంతర్జాతీయ పతకాలు సాధించగా, అందులో 7 బంగారు పతకాలు, 6 రజత పతకాలు, 4 కాంస్య పతకాలున్నాయి. ఆర్చరీ బృందం, వ్యక్తిగత ప్రదర్శనలోనూ ఆమె అద్వితీయమైన ప్రతిభ కనబర్చారు. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది అర్జున అవార్డు కోసం ఆమె పేరును సిఫార్సు చేసినట్టు తెలుస్తోంది.

విజయవాడకు చెందిన జ్యోతి సురేఖ చిన్నతనం నుంచే అద్భుత విన్యాసాలు చేసి పలువురిని ఆకట్టుకుంది. అందుకే ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ తరపున తాము ప్రోత్సహించామని ఎంపీ గంగరాజు తెలిపారు. అమెరికా పంపించి మరీ శిక్షణ ఇప్పించినట్టు ఆయన వెల్లడించారు. ప్రధానిని కలిసిన అనంతరం పార్లమెంటులో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ క్రికెట్‌తో పాటు ఇతర క్రీడల్లో ప్రతిభ కనబర్చే క్రీడాకారులకు ప్రోత్సాహం ఇస్తుందని అన్నారు.

హైదరాబాద్‌లో 5 కేజీల గ్యాస్ సిలిండర్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఐదు కేజీల వంట గ్యాస్ సిలిండర్ శనివారం నుండి అందుబాటులోకి రానుంది. ఇండియన్ ఆయిల్ కంపెనీ హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో ఈ సిలిండర్‌ను మార్కెట్‌లోకి విడుదల చేయనుంది. ముఖ్యంగా ఐటి ఉద్యోగులు, వలస కార్మికులు, బ్యాచిలర్లు, పర్యాటకులకు ఈ సిలిండర్ ఎంతగానో ఉపయోగకరమని ఇండియన్ ఆయిల్ చమురు సంస్థ పేర్కొంది. ఈ ఐదు కేజీల వంటగ్యాస్ సిలిండర్ రాకతో హైదరాబాద్ మార్కెట్‌లో చాలా మార్పులు రానున్నాయని వెల్లడించింది. ఈ సిలిండర్‌ను వారం రోజుల్లో ఏ సమయంలోనైనా ఆర్డర్ చేసి పొందవచ్చన్నారు. ఐదు కేజీల వ్యాపార రహిత వంటగ్యాస్ సిలిండర్ వల్ల కలిగే ప్రయోజనాలను కూడా కంపెనీ వివరించింది. సిలిండర్‌ను పొందడానికి ఎలాంటి డాక్యుమెంటేషన్ అవసరం లేదు. గుర్తింపు కార్డు ఉంటే సరిపోతుంది. రోజంతా ఈ సిలిండర్‌ను బుక్ చేసుకొనే వెసులుబాటు ఉంది. ఎలాంటి ఆంక్షలు, సమయం లేకుండా ఎప్పు డైనా బుక్ చేసుకొనే అవకాశం ఉంది. తక్కువ బరువు ఉండటం ఈ సిలిండర్ ప్రత్యేకత. దేశంలో ఎక్కడైనా రీఫిల్ చేసుకొనే సదుపాయం, సిలిండర్ విలువకు సమానమైన నగదు వాపసు సౌకర్యం ఉందని కంపెనీ తెలిపింది.

ఏఈ, వీఏఎస్ రాతపరీక్షలు వాయిదా

హైదరాబాద్,ఆంధ్రప్రభ: అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జియన్స్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ బాయిలర్స్‌లకు సంబంధించిన రాత పరీక్షలను వాయిదా వేస్తున్నట్టు పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యదర్శి వాణి ప్రసాద్ తెలిపారు. ఈ పరీక్షలను ఆగస్టు 12, 13 తేదిల్లో నిర్వహించాలని ముందుగానే నిర్ణయించారు. అయితే అవే తేదీల్లో స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సి) పరీక్షలు ఉన్నందున వాటిని ఆగస్టు 27, 28 తేదీలకు మార్చినట్టు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అడిగిన వెంటనే పట్టా పాస్‌బుక్

● ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రంలోని రైతులకు ఇకపై పట్టాదారు పాస్ పుస్తకాలను కేవలం 15 నిమిషాల్లోనే జారీ చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. శుక్రవారం వెలగపూడి సచివాలయంలో ఎన్ఐసీ పనితీరుపై సిఎం సమీక్ష నిర్వమించారు. ఈ సందర్భంగా 'జాతీయ సమాచార కేంద్రం' రాష్ట్రస్థాయి కార్యాలయానికి విజయవాడలో నూతనంగా నిర్మిస్తున్న రోడ్లు భవనాల సముదాయంలో స్థలం కేటాయిస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. రాష్ట్రంలో చురకైన కార్య బృందాలను అందించి రియల్‌టైమ్ గవర్నెన్స్ ద్వారా ప్రజలకు నాణ్యమైన సేవలు అందిచాలన్న తమ లక్ష్యానికి తోడ్పాటునదించాలని సిఎం ఎన్ఐసీ సంస్థను కోరారు. రెవెన్యూశాఖ ప్రవేశపెడుతున్న ఐటి ఆధారిత నూతన సేవలను శుక్రవారం మధ్యాహ్నం సిఎం తన కార్యాలయంలో పరిశీలించారు. తనను కలిసేందుకు వచ్చిన ఎన్ఐసి డైరెక్టర్ జనరల్ నీతా వర్మతో కలిసి సిఎం ఈ సమావేశంలో ఎలక్ట్రానిక్ పట్టాదర్ పాస్‌పుస్తకాన్ని ప్రారంభించారు. 'మీభూమి' వెబ్‌పోర్టల్‌పై అధికారులు ఇచ్చిన ప్రజెంటేషన్ విని పలు సూచనలు చేశారు. ప్రభుత్వం శాఖల డిజిటలైజేషన్, ఆన్‌లైన్ సేవలు, ఇ-ప్రగతి వంటి కార్యక్రమాలను అమలుచేసి దేశంలోని మిగిలిన రాష్ట్రాలకు ఎపి రోల్‌మోడల్‌గా నిలిచిందని చంద్రబాబు ఎన్ఐసి డైరెక్టర్ జనరల్‌కు వివరించారు. ప్రభుత్వ కార్యాలయాలంటే ఇనుప బీరువాల్లో దుమ్ము పేరుకుపోయి కట్టలుకట్టలుగా పడి ఉండే ఫైళ్లే గుర్తుకు వస్తాయని, అటువంటి పరిస్థితి నుండి చేతిలో ఉండే సెల్‌ఫోన్ ద్వారానే ఫైల్ క్లియర్ చేసే సంస్కరణలు తీసుకు వచ్చామని చంద్రబాబు వెల్లడించారు. అవినీతి, అవకతవకలకు చోటు లేని అత్యంత వేగంగా పనులు జరిగే (జీరో కరప్షన్, జీరో ఎర్రర్, జీరో డిలే) విధానాలతో పూర్తి పారదర్శక పాలన అందించాలన్న లక్ష్యంతోనే సాంకేతికంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న అత్యుత్తమ పద్ధతులను అనుసరిస్తున్నామని అన్నారు. ప్రపంచంలో వేగంగా చోటు చేసుకుంటున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా ఇ-ఆఫీస్ 2.0 వెర్షన్‌లో కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలు తీసుకురావాలని సిఎం సూచించారు. సాంకేతికంగా మీ చురకుదనం గమనించి స్ఫూర్తి పొందుతుంటామని, ఆంధ్రప్రదేశ్‌కు ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా అందించేందుకు సిద్ధంగా ఎన్ఐసీ ఉందని నీతావర్మ ముఖ్యమంత్రికి తెలిపారు. 30కిపైగా అంశాలతో ఎపి ముందంజలో ఉన్నట్లు ఎన్ఐసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డీపీ మిశ్రా వెల్లడించారు. మీసేవ కేంద్రాల ద్వారా, మీ భూమి పోర్టర్‌ద్వారా భూమి హక్కు పత్రం, పట్టాదార్ పాస్‌పుస్తకం ముద్రణను కేవలం 15 నిమిషాల్లోనే పొందే వినూత్న సదుపాయం గురించి సీసీఎల్ఏ నిల్ చంద్ర పునీటా సిఎంకు వివరించారు. పాతపద్దతిలో పట్టాదార్ పాస్‌పుస్తకం పొందాలంటే నెల రోజులు సమయం పట్టేదని, ఇప్పుడు కేవలం రూ.25 ఖర్చుతో పావుగంటలోనే పాస్‌పుస్తకం పొందే వెసలుబాటు కల్పించామన్నారు.

ఆయేషా మీరా హత్య కేసు పునర్విచారణ

● డీఐజీ నేతృత్వంలో సిట్ ఏర్పాటు

● విజయవాడ సీపీ పర్యవేక్షణ

అమరావతి, ఆంధ్రప్రభ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం కలిగించిన ఆయేషా మీరా హత్య కేసు పునర్విచారణకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా డీఐజీ స్థాయి అధికారి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సిట్ పర్యవేక్షణ బాధ్యతలను విజయవాడ పోలీసు కమిషనర్ దామోదర్ గౌతం సవాంగ్‌కు అప్పగించింది. 2007 డిసెంబర్ 26వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత పశ్చిమ ఇబ్రహీంపట్నంలోని శ్రీ దుర్గా హాస్టల్‌లో బీఫార్మసీ విద్యార్థిని ఆయేషా మీరా దారుణ హత్యకు గురైంది. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన ఆయేషా మీరా(19) దుర్గా హాస్టల్‌లో ఉంటూ నిమ్రా కాలేజీలో బీఫార్మసీ చదివేది. సెలవులకు ఇంటికి వెళ్లి వచ్చిన రోజు రాత్రే ఆమె దారుణ హత్యకు గురైంది. నిందితులు ఆమెపై అత్యాచారం చేసి అతి కిరాతకంగా హత్య చేశారు. ఇబ్రహీంపట్నం పోలీసులు హత్య, అత్యాచారం కింద కేసు నమోదు చేశారు. ఈ కేసు అప్పట్లో రాష్ట్రవాప్తంగా సంచలనం సృష్టించింది. అప్పటి రాష్ట్రమంత్రి కోనేరు రంగారావు బంధువులపై ఆరోపణలు రావడంతో కేసు విచారణ రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. మహిళా, మైనారిటీ కమిషన్లతో పాటు విపక్ష పార్టీలు ఆయేషా మీరా హత్యపై పలు ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించాయి. అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ఆయేషా మీరా హత్యను తీవ్రంగా ఖండించారు. అప్పట్లో తెలుగు మహిళా అధ్యక్షురాలిగా ఉన్న వైసీపీ ఎమ్మెల్యే ఆర్కే రోజా విజయవాడకు పలుమార్లు వచ్చి నిందితుల అరెస్టుకు ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించారు. రాజకీయ ప్రాధాన్యత సంతరించుకున్న కేసు కావడంతో పోలీసులు అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు చేపట్టారు. ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్)ను ఏర్పాటు చేసి అనేక మందిని విచారించారు. ఒక విధంగా చెప్పాలంటే ఆయేషా మీరా హత్య కేసు నిందితుల కోసం పశ్చిమ కృష్ణాను ప్రత్యేక దర్యాప్తు బృందం జల్లెడపట్టింది.

ఇబ్రహీంపట్నంలోని యువకులను రోజుల తరబడి విచారణ చేయడంతో పాటు పాత నేరస్తులను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేశారు. పాతికేళ్ల లోపు యువకులు పోలీసు విచారణకు భయపడి ఇబ్రహీంపట్నం వదిలేసి పొరుగు జిల్లాల్లో తలదాచుకున్నారంటే అప్పట్లో పరిస్థితి ఏ విధంగా ఉండేదో అర్థం చేసుకోవచ్చు. ఆయేషా మీరా హత్యకు సంబంధించి ఘటనా స్థలంలో లభ్యమైన ఫుట్‌ప్రింట్ ఆధారంగా తొలుత పాత నేరస్తుడు గుర్వీందర్‌సింగ్ అలియాస్ లడ్డూను అదుపులోకి తీసుకోవడం విమర్శనాత్మకమైంది. తదుపరి దర్యాప్తులో భాగంగా 2008లో కృష్ణాజిల్లా నందిగామ మండలంలోని అనాసాగరం గ్రామానికి చెందిన పిడతల సత్యంబాబును నిందితునిగా పేర్కొంటూ అరెస్టు చేశారు. పోలీసులు నిందితునిగా పేర్కొన్న సత్యంబాబుకు విజయవాడ మహిళా సెషన్స్ కోర్టు జీవిత ఖైదు విధించింది. దీనిపై సత్యంబాబు తరుపు న్యాయవాదులు హైకోర్టును ఆశ్రయించగా వాదోపవాదాలు విన్న మీదట 2017 మార్చి 31వ తేదీన హైకోర్టు సత్యంబాబును నిర్ధోషిగా పేర్కొంటూ విడుదలకు ఆదేశాలు జారీ చేసింది. అమాయకుణ్ణి జైలులో ఉంచడంపై ఆగ్రహించిన హైకోర్టు రూ.లక్ష ప్రభుత్వపరంగా పరిహారం ఇవ్వడంతో పాటు ఎపెక్స్ కమిటీ ఏర్పాటు చేసి విచారణ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులు వెలువరించింది. ఈ క్రమంలోనే ఆయేషా మీరా తల్లిదండ్రులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కలిసి కేసు విచారణ బాధ్యతలను సిబిఐకి అప్పగించాలని కోరారు.

ఢిల్లీలో మంత్రి కామినేనిని వైద్యవిద్యార్థుల ఘెరావ్

● న్యాయం చేయాలని ఫాతిమా కళాశాల విద్యార్థుల వేడుకోలు

● సమస్య పరిష్కారానికి మంత్రి హామీ

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : తమ సమస్య పరిష్కారమయ్యే వరకు ఢిల్లీ నుంచి కదిలేది లేదని భీష్మించుకు కూర్చున్న ఫాతిమా కళాశాల వైద్య విద్యార్థులు, ఏపీ భవన్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస రావును ముట్టడించారు. ఆయన ఢిల్లీ వస్తున్న సమాచారం తెలుసుకున్న విద్యార్థులంతా ముందే ఏపీ భవన్ చేరుకుని ఎదురు చూశారు. ఆయన రాగానే అందరూ చుట్టుముట్టి న్యాయం చేయాల్సిందిగా ఆందోళన చేశారు. విద్యార్థుల్లో కొందరు కామినేని కాళ్లపై పడ్డారు. యాజమాన్యం చేసిన తప్పులకు తమను శిక్షించవద్దని బతిమిలాడుకున్నారు. ఫాతిమా కాలేజి వ్యవహారంతో ఇప్పటికే విమర్శలు ఎదుర్కొంటున్న మంత్రి, తక్షణమే అధికారులను పిలిపించి విద్యార్థుల సమక్షంలో సమావేశం నిర్వహించారు. సరైన ప్రమాణాలు పాటించనందున ఫాతిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కళాశాలకు మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అనుమతులు రద్దు చేసింది. అయితే ఈ పాపంలో విద్యార్థుల తప్పేమీ లేకపోయినా, అకారణంగా శిక్ష అనుభవిస్తున్నారు. కళాశాల అనుమతి రద్దవడంతో తమ విద్యాభ్యాసం ఆగిపోయింది. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నిర్వహించిన కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్లు పొందిన విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. తొలుత విద్యార్థులంతా న్యాయ పోరాటానికి సిద్ధమైనప్పటికీ, యాజమాన్యం కూడా పిటిషనర్‌గా ఉన్నందున న్యాయం లభించలేదు. దీంతో విద్యార్థులంతా రాష్ట్ర ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకుని ఎదురుచూశారు. కానీ చివరకు రాష్ట్ర మంత్రి కామినేని ఒక దశలో చేతులెత్తేసి ''కట్టిన ఫీజులు వెనక్కి ఇచ్చేస్తాం, వెళ్లిపోండి'' అనడంతో విద్యార్థుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ భవనాల పైకెక్కి ఆందోళన చేయడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా రంగంలోకి దిగాల్సి వచ్చింది. ఆయన జోక్యంతో విద్యార్థులను తీసుకుని తెలుగుదేశం పార్టీ నేతలు ఢిల్లీకి వచ్చారు. అనంతరం కేంద్ర వైద్యారోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డాతోనూ భేటీ అయ్యారు.

సుప్రీం కోర్టు తీర్పే అడ్డంకి

విద్యార్థుల సమస్యను తెలుసుకున్న కేంద్ర మంత్రి వెంటనే అధికారులతో సమావేశమయ్యారు. అయితే ఈ విద్యార్థుల్ని ఇతర వైద్య కళాశాలల్లో చేర్చాలంటే గతంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఒకటి అడ్డంకిగా నిలిచింది. దీంతో వైద్యారోగ్య శాఖ ఈ వ్యవహారంపై కేంద్ర న్యాయశాఖ అభిప్రాయం కోరింది. భవిష్యత్తులోనూ న్యాయపరమైన చిక్కులు ఎదురవకుండా ఈ అంశాన్ని కోర్టు ద్వారానే పరిష్కరించాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి, విద్యార్థులకు వివరించి చెప్పింది. వచ్చే వారం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసి విద్యార్థులకు న్యాయం చేసేందుకు రంగం సిద్ధం చేసింది.

కోర్టు ద్వారానే పరిష్కారం: కామినేని


ఫాతిమా కాలేజి వైద్య విద్యార్థుల సమస్యకు కోర్టు ద్వారానే పరిష్కారం రాబడతామని ఆంధ్రప్రదేశ్ వైద్యారోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాసరావు అన్నారు. ఏపీ భవన్లో తనను ముట్టడించిన వైద్య విద్యార్థులను బుజ్జగించిన ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ సమస్య తన దృష్టికి వచ్చిన వెంటనే తాను 3 సార్లు ఢిల్లీ వచ్చి కేంద్ర మంత్రి జేపీ నడ్డాను కలిశానని, సమస్య పరిష్కారం కోసం కృషి చేశానని చెప్పుకొచ్చారు. ఇందులో కేవలం ఫాతిమా కళాశాల యాజమాన్యం తప్పిదాలు మినహాయిస్తే విద్యార్థుల తప్పిదమేమీ లేదని స్పష్టం చేశారు. తప్పులు చేసి వైద్య విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న యాజమాన్యంపై చర్యలెందుకు తీసు కోవడం లేదని ప్రశ్నించగా, కళాశాల యాజమాన్యంపై చర్య తీసుకుంటే, ప్రస్తుతం చదువుకుంటున్న విద్యార్థులు కూడా నష్టపోతారని బదులిచ్చారు. కోర్టుల్లో న్యాయం జరగకుండా ప్రభుత్వాలేమీ చేయలేవని సమాధానం చెప్పారు.

Andhraprabha business 2017

బిజినెస్
BUSINESS

రక్షణరంగానికి చెందిన కంపెనీల ఐపీవో- 25 శాతం వాటాల విక్రయం

న్యూఢిల్లీ : రక్షణ రంగానికి చెందిన పీఎస్‌యు కంపెనీల్లో ప్రభుత్వం 25 శాతం వాటాలను ఐపీవో ద్వారా విక్రయించాలనే ఆలోచనలో ఉంది. వాటిలో భారత్ డైనమిక్స్, గార్డెన్ రీచ్‌షిప్ బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్, మజేగావ్ డాక్‌షిప్ బిల్డర్స్, మిశ్రథాతునిగమ్ లిమిటెడ్‌లున్నాయి. కేంద్రకేబినెట్ ఈ ఏడాది ఏప్రిల్‌లో రక్షణ రంగానికిచెందిన నాలుగు పీఎస్‌యు కంపెనీల్లో వాటాలు విక్రయించడానికి ఆమోదం తెలిపింది. అటు నుంచి డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్ (దీపం) మర్చంట్ బ్యాంకర్లను, న్యాయసలహాదార్లతో సంప్రతింపులు జరిపి రక్షణ రంగానికి చెందిన పీఎస్‌యు కంపెనీల్లో వాటాలు విక్రయించడం గురించి చర్చిస్తాయి. కాగా ప్రభుత్వం ఇప్పటికే ప్రభుత్వ రంగానికి చెందిన ఆరు కంపెనీల నుంచి పెట్టుబడులు ఉపసంహరించి రూ.8,800 కోట్లు సేకరించింది. వాటిలో ఎల్అండ్‌టిని స్పెసిఫైడ్ అండర్ టేకింగ్ ఆఫ్ యూనిట్ ట్రస్టు ఆఫ్ ఇండియా (సూతి) ద్వారా విక్రయించింది. ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరం పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా రూ.72,500 కోట్లు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది.




రూ.20 లక్షల కోట్లు @20

• మన జీడీపీలో 10 శాతం • ఏడు నెలల్లో పెరిగిన సంపద 50 బిలియన్ డాలర్ల

న్యూఢిల్లీ : దేశంలోని సంపన్నుల సంపద రోజు రోజుకు పెరిగిపోతోంది. తాజాగా ఈ ఏడాది మొదటి ఏడు నెలల కాలంలో టాప్ 20 పారిశ్రామికవేత్తల సంపద ఏకంగా 5000 కోట్ల డాలర్లు పెరిగింది. ప్రస్తుతం వీరి సంపద ఎంతంటే దేశ ఆర్థిక వ్యవస్థ రెండు ట్రిలియన్ డాలర్లు అనుకుంటే దాంట్లో సుమారు పది శాతం లేదా 20,000 కోట్ల డాలర్లకు ఎగబాకింది.


బ్లూమ్‌బర్గ్ బిలియనీర్ ఇండెక్స్ గణాంకాలను బట్టిచూస్తే .. ఈ సంవత్సరం మొదటి ఏడు నెలల కాలంలో టాప్ 18 మంది బిలియనీర్ల సంపద డాలర్ మారకంతో రూపాయి విలువను పరిగణనలోకి తీసుకుంటే బిలియన్ డాలర్లు లేదా రూ.6,400 కోట్లు పెరిగిందని తెలిపింది. సన్‌ఫార్మాకు చెందిన దిలీప్ సాంఘ్వీ తప్పించి మిగిలిన పారిశ్రామికవేత్తలు పెద్దమొత్తంలో సంపద సమకూర్చిపెట్టుకున్నారు.



ముఖేష్ అంబానీ : రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన ముఖేష్ అంబానీనే తీసుకుంటే ఆయన సంపద ఏకంగా 1300 కోట్ల డాలర్లకు ఎగబాకగా.. అదానీ గ్రూపునకు చెందిన గౌతమ్ అదనీ, విప్రో అజీమ్ ప్రేమ్‌జీ, ఆర్ కె దమాని ఇటీవలే డీమార్ట్ ఐపీవోకు వచ్చి హల్‌చల్ చేసిన విషయం తెలిసిందే. వీరి సంపద పరిగణనలోకి తీసుకుంటే తక్కువలో తక్కువగా 300 కోట్ల నుంచి 400 కోట్ల డాలర్ల వరకు ఈ కేలండర్ సంవత్సరంలో ఆర్జించారు. ముఖేష్‌కు చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ టెలికంరంగంలో ఎంట్రీ ఇచ్చి పోటీ కంపెనీలకు దడపుట్టిస్తున్నారు. అదే సమయంలో దాని షేరు పట్టపగ్గాల్లేకుండా దూసుకుపోతోంది. దీంతో రిల్ మార్కెట్ క్యాప్ రూ.5,25,000 కోట్లకు ఎగబాకింది.



అజీమ్‌ప్రేమ్‌జీ : విప్రో ప్రమోటర్ విషయానికి వస్తే ఆయన ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో 4 శాతం వాటాలు కొనుగోలు చేశారు. ఆయనకే చెందిన అజీమ్ ప్రేమ్‌జీట్రస్టు ఎన్‌సీసీలో స్వల్ప వాటా 2.47 శాతం, జుబిలెట్ ఫుడ్‌వర్క్స్‌లో 2.32 శాతం, షిన్‌డేర్ ఎలక్ట్రిక్‌లో 2.01 శాతం క్రాంప్టన్ గ్రీవ్స్ కన్స్యూమర్ ఎలక్ట్రికల్స్‌లో 1.53 శాతం, జెఎం ఫైనాన్షియల్‌లో 2.40 శాతం పెట్టుబడులున్నాయి. కాగా ఆయన సంపద 380 కోట్ల డాలర్లు పెరిగి 1600 కోట్ల డాలర్లకు చేరింది.




గౌతమ్ అదానీ : ఈ ఏడాది జూన్‌లో గౌతమ్ అదాని కంపెనీ బోర్డు ఆస్ట్రేలియాలోని కార్మైచల్ కోల్ ప్రాజెక్టులో 16,500 కోట్ల డార్లు పెట్టుబడులు పెట్టడానికి ఆమోదం తెలిపింది.



రాధాకృష్ణదమాని : ఆయనకు చెందిన అవెన్యూ సూపర్‌మార్కెట్స్ షేరు స్టాక్ మార్కెట్లో ఈ ఏడాది మార్చిలో ఏకంగా 205 శాతం పెరిగింది. దీంతో ఆయన సంపద 346 కోట్ల డాలర్ల నుంచి 536 కోట్లడాలర్లకు చేరింది.



ఉదయ్‌కొటక్ : కొటక్ మహీంద్రా బ్యాంకు ప్రమోటర్ ఆయన సంపద 322 కోట్ల డాలర్ల నుంచి 1030 కోట్ల డాలర్లకు ఎగబాకాయి. కాగా యాక్సిస్ బ్యాంకుతో కొటక్‌ను విలీనం చేస్తారన్న పుకార్లు కూడా వచ్చాయి. తర్వాత రెండు పార్టీలు వీటిని ఖండించాయి. వ్యాపారాన్ని విస్తరించుకోవడానికి కొటక్ బ్యాంకు వాటాదారులు రూ.65వేల కోట్లు సేకరించుకోడానికి అనుమతించారు.



కుమారమంగళంబిర్లా : ఆదిత్యబిర్లాకు గ్రూపునకు చెందిన కుమారమంగళంబిర్లా సంపద 313 కోట్ల డాలర్ల నుంచి 916 కోట్ల డాలర్లకు చేరింది. ఐడియా సెల్యూలార్‌ను వోడాఫోన్‌తో విలీనం చేస్తున్నట్లు ప్రకటించారు.



వీరితో పాటు దేశంలోని బడా బిలియనీర్లు జైడస్ క్యాడిలాకు చెందిన పంకజ్ పటేల్, ఐచర్ మోటార్స్‌కు చెందిన విక్రంలాల్, ఆర్సెలర్ మిట్టలకు చెందిన లక్ష్మిమిట్టల్, డీఎల్ఎఫ్ కు చెందిన కెపీ సింగ్, పిరామల్ గ్రూపునకు చెందిన అజయ్ పిరామల్, షాపూర్‌జీ పల్లోంజీ గ్రూపునకు చెందిన పల్లోంజీ మిస్త్రీలతో పాటు ఇతర బిలియనీర్లు సంపదకు అదనంగా 200 కోట్ల డాలర్ల వరకు ఈ ఏడాది మొదటి ఏడు నెలల కాలంలో జత చేశారు. మన దేశంలోని సంపన్నుల సంపద ఎంత అంటే.. దేశం మొత్తం సంపదలో ఒక శాతం సంపన్నుల వద్ద 58 శాతం సంపద ఉంది. గ్లోబల్ సరాసరి 50 శాతంతో పోల్చుకుంటే మన దేశంలోనే సంపన్నుల వద్ద ఎక్కువ సంపద ఉన్నట్లు లెక్క.



హెచ్‌పీసీఎల్ లాభంతో 56% ఆవిరి

• భారీగా పెరిగిన నిల్వల నష్టం

న్యూఢిల్లీ : ప్రభుత్వరంగానికి చెందిన హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ (హెచ్‌పీసీఎల్) జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరలాభంలో 56 శాతం క్షీణించి రూ.924.75 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.2,098.38 కోట్ల నమోదు చేసింది. అయితే రెవెన్యూ మాత్రం 13 శాతం పెరిగి రూ.59,891.27 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.51,599.52 కోట్లు నమోదు చేసింది. కంపెనీ నష్టాలకు ప్రధాన కారణం సుమారు రూ.1,595 కోట్లు ముడి చమురు నిల్వలేనని తెలిపింది. క్రితం ఏడాది ఇదే నిల్వలపై రూ.1,935 కోట్ల వరకు ఆదాయం చవిచూసిందని కంపెనీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎం కె సురానా చెప్పారు. ముడిచమురు ధరలు జూన్ త్రైమాసికంలో పీపా 4.56 డాలర్లు తగ్గగా.. అంతకు ముందు ఏడాది ఇదే త్రైమాసికంలో 10.89 డాలర్లని ఆయన పర్కొన్నారు. ఇక్కడే చమురు నిల్వలపై రూ.960 కోట్ల నష్టం వచ్చిందన్నారు. రిఫైనరీ నష్టంరూ.636 కోట్లుగా ఉంది. రిఫైనింగ్ మార్జిన్ చమురుశుద్ధిపై పీపాకు 5.86 డాలర్లు ఆర్జించగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో 6.83 డాలర్లు ఆర్జించామని సురానా తెలిపారు. ముడిచమురు నిల్వల నష్టాన్ని సర్దుబాటు చేసిన తర్వాత జూన్ త్రైమాసికానికి పీపా చమురుశుద్ధిపై 8.81 డాలర్లు ఆర్జించినట్లు తెలిపారు. కాగా జూన్ చివరి నాటికి కంపెనీలు అప్పులు సగానికి సగం రూ.12,200 కోట్లకు దిగి రాగా.. మార్చి 31, 2017 నాడు రూ.21,250 కోట్లని వివరించారు.

22శాతం తగ్గిన అరవింద్ లాభాలు

ARVIND
WEAR THE FUTURE

న్యూఢిల్లీ: టెక్స్‌టైల్స్, దుస్తుల తయారీ దిగ్గజం అరవింద్ లిమిటెడ్ జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో ఏకీకృత నికరలాభం రూ.56.75 కోట్లు ఆర్జించింది.క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.73.28 కోట్లను నమోదు చేసింది. అయితే మొత్తం ఆదాయం 17.47 శాతం పెరిగి రూ.2,491.32 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.2,120.76 కోట్లని అరవింద్ లిమిటెడ్ బీఎస్ఈకి సమాచారం అందించింది. క్యూ1లో జీఎస్టీప్రభావంతో లాభాలు దెబ్బతిన్నాయని కంపెనీ డైరెక్టర్, సీఎఫ్ఓ జయేశ్ షా చెప్పారు. బీఎస్ఈలో దీని షేరు 0.55 శాతంపెరిగి రూ.364.55 వద్ద ముగిసింది.



మొండిబకాయిలు పెరిగినా..

14 శాతం పెరిగిన ఆంధ్రాబ్యాంకు లాభాలు

హైదరాబాద్: ప్రభుత్వ రంగానికి చెందిన ఆంధ్రాబ్యాంకు జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరలాభంలో 14 శాతం వృద్ధితో రూ.40.42 కోట్లు ఆర్జించింది. అదే సమయంలో మొండిబకాయిలు కూడా పెరిగాయి. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నికరలాభం రూ.31.09 కోట్లు నమోదు చేసింది. క్యూ1లో ఆదాయం కాస్తా పెరిగి రూ.5,155.21 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.4,855.50 కోట్లని బ్యాంకు బీస్ఈకి సమాచారం అందించింది. ఇక బ్యాంకు గరిష్ట మొండికబాయిల విషయానికి వస్తే జూన్ చివరి నాటికి 13.22 శాతానికి ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే కాలంలో10.30 శాతం.. నికర ఎన్‌పీఏ 8.09 శాతం కాగా ఏడాది క్రితం 6.21 శాతంగా నమోదయ్యాయి. అదేసమయంలో మొండిబకాయిల కోసం రూ.1,301.11 కోట్లు కేటాయించగా.. క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.943.77 కోట్లని తెలిపింది. బీఎస్ఈలో దీని షేరు 2.27 శాతం పెరిగి రూ.56.25 వద్ద ముగిసింది.

ఎంఅండ్ఎంకు జీఎస్టి సెగ

• క్యూ1 నికరలాభంలో 20 శాతం గండి

Mahindra

ముంబై : దేశీయ ఆటో దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో స్టాండ్ ఎలోన్ ప్రాతిపదికన 17.79 శాతం క్షీణించి రూ.765.96 కోట్లు ఆర్జించింది. కొత్తగా జీఎస్టి అమల్లోకి వస్తున్న నేపథ్యంలో అమ్మకాలు తగ్గాయని ప్రకటనలో వెల్లడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో పన్నులు చెల్లించిన తర్వాత రూ.954.95 కోట్లు నమోదు చేసింది. రెవెన్యూ విషయానికి వస్తే 3.29 శాతం పెరిగి రూ.12,33556 కోట్లు ఆర్జించగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.11,942 కోట్లు ఆర్జించిందని కంపెనీ బీఎస్ఈకి సమాచారం అందించింది.

జులై 1, 2017 నుంచి కొత్తగా వస్తు సేవల పన్ను (జీఎస్టి) అమల్లోకి వస్తున్న నేపథ్యంలో దాని ప్రభావం ఆటోమెటివ్ రంగం చూపించిందని తెలిపింది. కొత్త పన్నువ్యవస్థ అమల్లోకి రానున్న నేపథ్యంలో ధరలు తగ్గుతాయన్న అంచనాతో అమ్మకాల వృద్ధి కేవలం 4.4 శాతం మాత్రమే పెరిగిందని తెలిపింది.

కొనుగోళ్ల జోరు.. లాభాల్లో మార్కెట్లు

• రెండు రోజుల నష్టాలకు బ్రేక్

ముంబై: స్టాక్ మార్కెట్లు వరుసగా రెండు రోజుల పాటు నష్టాలతో ముగిసినా.. మార్కెట్లకు చివరి ట్రేడింగ్ రోజైన శుక్రవారం మాత్రం మదుపరులు కన్స్యూమర్ డ్యూరబుల్స్, మెటల్, ప్రభుత్వరంగానికి చెందిన కంపెనీల షేర్లను పెద్దెత్తున కొనుగోలు చేయడంతో మార్కెట్లు జోరందుకున్నాయి. ఎన్ఎస్ఈ 52.75 పాయింట్ల లాభంతో 10,066.40 వద్ద, బీఎస్ఈ 87.53 పాయింట్లతో 32,325.41 వద్ద ముగిశాయి. బీఎస్ఈలో అత్యధికంగా లాభాలను ఆర్జించిన సూచిలు ఈ విధంగా ఉన్నాయి. కన్స్యూమర్ డ్యూరబుల్స్ 4.21 శాతం, చమురు సహజవాయువు 2.63 శాతం, లోహ 2.5 శాతం, పీఎస్‌యు 2.45 శాతం, హెల్త్‌కేర్ సూచి మాత్రం 0.94 శాతం కుంగింది.

హెల్త్‌కేర్ రంగానికి చెందిన షేర్లు నష్టపోవడానికి ప్రధాన కారణం. అమెరికా ఔషధ నియంత్రణాసంస్థ (యుఎస్ఎఫ్‌డీఏ) బయోకాన్ లిమిటెడ్ నాణ్యత ప్రమాణాలను పాటించడంలేదని గుర్తించింది. దీంతో ఈ రంగానికి చెందిన షేర్లు తిరోగమనబాటపట్టాయి.

ఇక బీఎస్ఈలో అత్యధికంగా లాభపడిన షేర్లు ఇలా ఉన్నాయి. హీరోమోటోకార్ప్ 3.11 శాతం, కోల్‌ఇండియా 3.04 శాతం, టాటాస్టీల్ 2.85 శాతం, ఎన్‌టీపీసీ 2.78 శాతం, హెచ్‌యూఎల్ 1.91 శాతం, అత్యధికంగా నష్టపోయిన షేర్లు ఇలా ఉన్నాయి. డాక్టర్ రెడ్డీస్ 3.76 శాతం, సన్‌ఫార్మా 1.85 శాతం, రిలయన్స్ 1.76 శాతం, భారతి ఎయిర్‌టెల్ 0.78 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ 0.27 శాతంవరకు నష్టపోయాయి.

యూఎస్ఎఫ్‌డీఏ బయోకాన్ నాణ్యతా ప్రమాణాలు పాటించడంతో విఫలమైందని గుర్తించడంతో ఫార్మా రంగానికి చెందిన షేర్లు భారీగా నష్టపోయాయని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇంట్రాడేలో



బయోకాన్ అత్యధికంగా 7.6 శాతం వరకు క్షీణించింది. దీంతో పాటు ఫార్మా సూచి కూడా 2.5 శాతం క్షీణించింది. సన్‌ఫార్మాస్యూటికల్స్ 4.5 శాతం డాక్టర్ రెడ్డీస్ 3 శాతం వరకు నష్టపోయాయి.

ఇక రిలయన్స్ ఇండస్ట్రీస్ విషయానిక వస్తే గత రెండు రోజుల నుంచి లాభాలను ఆర్జించగా.. శుక్రవారం నాడు ఏకంగా 2.1 శాతం క్షీణించింది. కాగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అంచనా కంటే మెరుగైన ఫలితాలు సాధించినందుకు 5.1 శాతం లాభపడింది. ఆసియా మార్కెట్లు లాభాలతో ట్రేడ్ అయ్యాయి.

హ్యుందాయ్ ఫిఫ్త్ జెన్ వెర్నా

• నెలాఖరు నుంచి బుకింగ్‌లు • దీపావళి నాటికి 10వేల డెలివరీలు • కంపెనీ సీఈవో

చెన్నై : హ్యుందాయ్ మోటార్ ఇండియా శుక్రవారం నాడు కొత్త వెర్షన్ మిడ్‌సైజ్ సెడాన్ వెర్నాను ఆవిష్కరించింది. ఈ నెలాఖరుకు మార్కెట్లో విడుదల చేస్తుంది. కాగా ఫిఫ్త్ జనరేషన్ వెర్నాను కొత్తగా కె2 ప్లాట్‌ఫాంపై అభివృద్ధి చేశారు. దీనిపై కంపెనీ రూ.1,040 కోట్లు పెట్టుబడులు పెట్టింది. కాగా ముందస్తు బుకింగ్‌లు ఈ నెల 22 నుంచి మొదలుపెడుతుంది. దీపావళి నాటికి 10వేల కార్ల డెలివరీని లక్ష్యంగా పెట్టుకున్నామని హ్యుందాయ్ మోటార్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో వై కో కూ ఇక్కడ మీడియాతో చెప్పారు. కొత్త జనరేషన్ వెర్నా మార్కెట్లో సంచలనం సృష్టిస్తుందని ఆయన భరోసాతో చెప్పారు. ఫీచర్ల విషయానికి వస్తే 1.6 లీటర్ పెట్రోల్, డిజిల్ ఇంజిన్‌తో పాటు మాన్యువల్, ఆటోమెటిక్ ట్రాన్స్‌మిషన్‌లలో అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. 2006లో దేశంలో మొట్టమొదటిసారి విడుదల చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు 3.17 లక్షల యూనిట్లు విక్రయించినట్లు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా సుమారు 88 లక్షల యూనిట్లు ఇప్పటి వరకు విక్రయించింది. రాబోయే కొత్త వెర్నా ధర రూ.7.65 లక్షల నుంచి రూ.13.43 లక్షల వరకు ఉంటుంది. మార్కెట్లో మారుతి సుజుకి సియాజ్, హోండా సిటి సెడాన్‌లకు పోటీ ఇస్తుందని కూ చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరం లో దేశీయ మార్కెట్లో 14.5 వాటాను దక్కించుకున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు 3,72,982 యూనిట్లు విక్రయించింది.



కార్తీ చిదంబరంకు వ్యతిరేకంగా లుక్‌ఔట్ నోటీసు

• మద్రాసు హైకోర్టు ఆశ్రయించిన కార్తీ

చెన్నై : మాజీ ఆర్థికమంత్రి పీ చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరంకు వ్యతిరేకంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)లు లుక్‌ఔట్ నోటీసులుజారీ చేశాయి. దీంతో కార్తీ చిదంబరం మద్రాసు హైకోర్టు నుంచి ఆశ్రయించినట్లు శుక్రవారం ఉదయం మీడియాలో పెద్దెత్తున వార్తలు వచ్చాయి. కాగా కార్తీ పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు స్వీకరించి విచారణను సోమవారానికి వాయిదా వేసింది. ఇదిలా ఉండగా లుక్‌ఔట్ నోటీసు జారీ చేయడానికి ప్రధాన కారణం కార్తీకి కొన్ని రోజుల క్రితం ఐఎంఎక్స్ కేసుకు సంబంధించి తమ ముందు హాజరు కావాలని రెండు దర్యాప్తు సంస్థలు కోరినా ఆయన పట్టించుకోకపోవడంతో లుక్‌నోటీసు జారీ చేయాల్సి వచ్చిందని జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి. ఈ కేసుకు సంబంధించి మద్రాసు హైకోర్టులో విచారణకు రావడంతో ఈ విషయం వెలుగు చూసింది. ఈ కేసుకు సంబంధించి ఆయన కూడా హైకోర్టును ఆశ్రయించారు. ఈ అంశాన్ని కార్తీ ధ్రువీకరించలేదు.. అలానే ఖండించనూలేదు. ఇక జూనియర్ చిదంబరానికి కష్టాలు మొదలు కావడానికి ప్రధాన కారణం సీబీఐ అధికారులు ఈ ఏడాది మే 16న ఎఫ్‌పీపీబీ క్లియరెన్స్ ఇచ్చిన కంపెనీలపై తమిళనాడుతో పాటు ఇతర రాష్ట్రాల్లో సోదాలు జరిపింది. అధికార వర్గాల సమాచారం ప్రకారం సీబీఐ ముంబై, ఢిల్లీ, చెన్నై, గురుగావ్‌లలో సోదాలు జరిపిందని, ఎఫ్ఐపీబీ (విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు) 2007లో ఐఎన్ఎక్స్ మీడియా.. ఈ కంపెనీని ఇంద్రాణీ ముఖర్జీ, పీటర్ ముఖర్జీలు నిర్వహిస్తున్నారు. ఈ కంపెనీకి చిదంబరం ఆర్థికమంత్రిగా ఉన్నప్పుడు కొన్ని ప్రయోజనాలు చేకూర్చారనేది ఆరోపణ. మోసపూరితంగా, కుట్రపూరితంగా వీరువురు ప్రభుత్వ సేవకుడిపై ఒత్తిడి చేసి ఆమోదాలు పొందారని సీబీఐ ఆరోపణ. కార్తీ ప్రమేయంతో ఐఎన్ఎక్స్‌కు ఆమోదాలు లభించాయనేది ఆరోపణ. కాగా కార్తీకూడా ఎయిర్‌సెల్ - మాక్సిస్ కేసుకు సంబంధించి మనీలాండరింగ్ కేసును ఎదుర్కొంటున్నారు. ఆయన కార్యాలయాన్ని కూడా సీబీఐ గతంలో సోదాలు నిర్వహించింది.



అర్థరాత్రి వరకు ఐటి కార్యాలయాలు పనిచేస్తాయి

న్యూఢిల్లీ : ఆదాయపు పన్ను శాఖ కార్యాలయాలు శనివారం అర్ధరాత్రి వరకు పనిచేస్తాయి. సీనియర్ సిటిజన్లు రూ.5 లక్షల కంటే తక్కువ ఆదాయం కలిగిన వారు 2016-17 ఆర్థికసంవత్సరానికి టాక్స్ రిటర్న్స్‌ఫైల్ చేయడాని కోసం కార్యాలయాలు తెరిచే ఉంచుతారు. వాస్తవానికి ఐటిఆర్ ఫైల్ చేయడానికి చివరి తేదీ జులై 31 కాగా.. పన్ను చెల్లింపుదారులు కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నందుకు గాను ఆగస్టు 5వ తేదీ వరకు పొడిగించారు. మాన్యువల్ ఫైలింగ్ రిటర్న్స్‌కు శనివారం చివరి తేదీ కావడంతో సెంట్రల్‌బోర్డు ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్ (సీబీడీటి) దేశంలోని అన్ని ఆదాయపు పన్ను కార్యాలయాలు అర్ధరాత్రి వరకు తెరిచి ఉంచాలని, కావాల్సిన అన్నీ ఏర్పాట్లు చేసుకోవాలని కోరినట్లు ఆర్థికమంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఏడాదికి రూ.5 లక్షల ఆదాయం సంపాదించే వారికి. ఐటిఆర్ - ఈ ఫైలింగ్ తప్పనిసరి. 80 ఏళ్ల కంటే తక్కువ వయసు కలిగిన వారు తప్పకుండా ఈ ఫైలింగ్ చేయాల్సి ఉంటుంది.

రెడ్ హ్యాట్‌తో తెలంగాణ స్కిల్ అకాడమీ అవగాహన ఒప్పందం

హైదరాబాద్ : తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) రెడ్ హ్యాట్ ఐఎన్‌సీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. రెడ్ హాట్ విషయానికి వస్తే ఒపెన్‌సోర్స్‌సొల్యూషన్స్‌ప్రొవైడర్. ఒప్పందంలో భాగం టాస్క్ రాష్ట్రంలోని ఇంజినీరింగ్ విద్యార్థులకు శిక్షణతో పాటు సర్టిఫికేషన్ ప్రోగ్రాంలను నిర్వహి స్తుంది. టాస్క్‌తో కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా రెడ్ హ్యాట్..టాక్స్ భాగస్వామ్య కాలేజీల్లో రెడ్‌హ్యాట్ ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన లైనెక్స్‌ను ఆయా కాలేజీ ల్యాబ్‌లలో సబ్సిడీ ధరకు అందు బాటులో ఉంచుతుందని టాస్క్ ఒక ప్రకటనలో వెల్లడించింది. రాజేష్‌రేగే ఎండీ, రెడ్ హ్యాట్ మాట్లా డుతూ..టాస్క్‌తో కుదుర్చుకున్న ఒప్పందం వల్ల విద్యార్థులకు భవిత్తును తీర్చుదిద్దగలమన్నారు. టాస్క్ సీఈవో సుజివీ నాయర్ మాట్లాడుతూ..వచ్చే రెండేళ్ల కాలంలో 1500 విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, విద్యార్థులకు ఒపెన్ స్కిల్స్‌తో పాటు కొత్త టెక్నాలజీస్ ఉదాహరణకు డెవలెప్ ఆపరేషన్స్, క్లౌడ్, ఐటి ఆటోమెషినతో పాటు మరిన్ని రంగాల్లో స్కిల్ మరియు సర్టిఫికేషన్స్ కోర్సులందిస్తామన్నారు.

ముగ్గురు తెలుగు వారికి క్యాస్ట్రాల్ సూపర్ మెకానిక్ ఆలిండియా ఫైనల్‌కు అర్హత

హైదరాబాద్, ఆంధ్రప్రభ : క్యాస్ట్రాల్ సూపర్ మెకానిక్ ప్రాంతీయ రౌండ్ పోటీల్లో విశాఖపట్నంకు చెందిన బి.మాధవరావు, బి.సందీప్ (వరంగల్), ఎస్.శంకరాచారి (నల్గొండ)లు విజేతలుగా నిలిచారు. సెప్టెంబర్‌లో ముంబైలో జరగనున్న ఆల్ ఇండియా ఫైనల్స్‌కు ఈ ముగ్గురు అర్హత పొందారు. ముంబైలో జరగనున్న క్యాస్ట్రాల్ సూపర్ మెకానిక్ పోటీ జాతీయ ఫైనల్స్‌లో వీరు దక్షిణాది ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించనున్నారు.

భారత్‌లోని ప్రముఖ లూబ్రికంట్ బ్రాండ్‌లలో ఒకటైన ఇటీవల ఒక సృజనాత్మకమైన, ఉత్తేజకరమైన క్యాస్ట్రాల్ సూపర్ మెకానిక్ పోటీ ప్రారంభించింది. తద్వారా స్వతంత్రంగా పనిచేసే ద్విచక్ర వాహన మెకానిక్‌లు తమ ప్రతిభను, నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు ఒక బహిరంగ వేదికను అందించింది. ఈ ఏడాది మే నెలలో ప్రారంభమైన ఈ విశిష్ట పోటీలో పాల్గొనడానికి దేశవ్యాప్తంగా వేలాది మంది ద్విచక్ర వాహన మెకానిక్‌లు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ తర్వాత పోటీదారులు ఎనిమిది నగరాలలో జరిగే ప్రాంతీయ రౌండ్లలో అర్హత పొందడానికి నిర్వహించిన ప్రాథమిక రౌండ్‌లో పాల్గొన్నారు. బెంగళూరులో శుక్రవారం జరిగిన ఈ పోటీలో 250 మందికిపైగా మెకానిక్‌లు పాల్గొన్నారు. ఈ పోటీలో ఒక క్విజ్‌రౌండ్, రెండు ప్రాక్టికల్ రౌండ్లు ఉన్నాయి. ప్రాక్టికల్ రౌండ్లలో ఒకటి డయాగ్నస్టిక్, రెండోది అసెంబ్లీ రౌండ్. ఈ పోటీ చాలా ఉత్కంఠభరితంగా సాగింది. ఇందులో పార్టిసిపెంట్లు ప్రదర్శించిన నైపుణ్యాలు, పరిజ్ఞానం అత్యున్నత ప్రమాణాలు కలిగి ఉన్నాయి. పోటీతో పాటు ఇందులో పాల్గొన్న మెకానిక్‌లు ద్విచక్ర వాహన టెక్నాలజీపై సాంకేతిక శిక్షణ పొందారు.

ఫోర్టిస్ లాభంలో 10 శాతం క్షీణత

న్యూఢిల్లీ : ఫోర్టిస్ హెల్త్‌కేర్ మొదటి త్రైమాసికంలో ఏకీకృత నికరలాభం 10 శాతం క్షీణించి రూ.22.61 కోట్లకు దిగివచ్చింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.25.26 కోట్లు ఆర్జించింది.

అయితే ఆదాయం విషయానికి వస్తే 5 శాతం పెరిగి రూ.1,214.22 కోట్లకు ఎగబాకిందని కంపెనీ సీఈవో భావ్‌దీప్‌సింగ్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

'స్త్రీ నిధి' సేవలు మరింత విస్తృతం

- •3 నెలల్లోనే రూ.333 కోట్ల రుణం మంజూరు
- •1.26 లక్షల సభ్యులకు లబ్ధి
- •13.5 శాతం నుంచి 13 శాతానికి తగ్గింపు
- •రూ.15 శాతం వడ్డీ నిధులు తిరిగి చెల్లింపు
- • బ్యాంకు సేవల్లో మహిళా సంఘాలకు అవకాశం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్రంలో స్త్రీ నిధి బ్యాంకు సేవలను సమర్ధవంతంగా జరుగుతున్నాయి. రుణా ప్రణాళికకు అనుగుణంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు రుణాలను అందిస్తున్నది. గత మూడు నెలల్లోనే రికార్డుస్థాయిలో సభ్యులకు రుణాలను మంజూరు చేసినట్లు అధికారులు ఇచ్చిన లెక్కల ప్రకారం తెలుస్తోంది. ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకూ రూ.333కోట్ల రుణాలను సభ్యులకు అందించింది. దీనివల్ల 1,26,643 మంది సభ్యులకు లబ్ధి చేకూరింది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరంలో రుణాల టార్గెట్‌ను సులభంగా అధిగమించే అవకాశాలున్నాయి. ఈ ఏడాది రూ.1800కోట్ల రుణాప్రణాళికను స్త్రీ నిధి బ్యాంకు సర్వసభ్య సమావేశంలో విడుదల చేసిన విషయం తెలిసిందే. మరో రూ.1467కోట్ల రుణాలను మంజూరు చేసేందుకు సన్నద్ధమౌతున్నట్లు తెలిసింది. దీంతో స్త్రీ నిధి బ్యాంకు సేవలు మహిళా సంఘాల సభ్యులు బాగా ఉపయోగపడనున్నట్లు తెలుస్తోంది. స్త్రీ నిధి బ్యాంకు ద్వారా రుణం తీసుకున్న సభ్యులకు వడ్డీరేటు కూడా చాలా తక్కువగా ఉంది. ఈ ఏడాది స్త్రీ నిధి బ్యాంకు వడ్డీ రేట్లను తగ్గించింది. 13.5శాతం ఉన్న వడ్డీరేట్లను 13శాతానికి తగ్గించింది. ఈ వడ్డీరేట్లు ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల (ఆర్‌ఆర్‌బీ) కంటే కూడా తక్కువని అధికారులు చెబుతున్నారు. ఆర్‌ఆర్‌బీల వడ్డీరేట్లు 14శాతం ఉన్న విషయం తెలిసిందే. అంతేకాకుండా సభ్యుల నుంచి వసూలు చేస్తున్న 13శాతంలో 1,5శాతం డబ్బులను సభ్యులకు స్త్రీ నిధిబ్యాంకు తిరిగి చెల్లిస్తుంది. దీన్నిబట్టి 11.5శాతమే రుణాలకు వడ్డీలను సభ్యుల నుంచి వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో మహిళా సంఘాలకు రుణభారం తగ్గనున్నది. .ఇదిలా ఉండగా స్త్రీ నిధి బ్యాంకు సేవలను విస్తరించేందుకు అధికారులు ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బందిని పెంచాలని యోచిస్తున్నట్లు తెలిసింది. స్త్రీ నిధి బ్యాంకు సేవల్లో మహిళా సంఘాలను భాగస్వామ్యం చేయనున్నారు. స్వయం సహాయక సంఘాల్లో ఉండి చదువుకున్న మహిళలకు స్త్రీ నిధి బ్యాంకులో ఉపాధి కల్పించాలని భావిస్తుంది. రాబోయే మూడేళ్లల్లో స్త్రీ నిధి బ్యాంకుకు సూమారు 700మంది సిబ్బందిని నియమించనున్నారు. అంతేకాకుండా గతేడాదిలాగా టార్గెట్ కంటే ఎక్కువ రుణాలను ఇవ్వాలని స్త్రీ నిధి బ్యాంకు బోర్డు యాజమాన్యం యోచిస్తుంది. గత ఆర్థిక సంవత్సరం (2016-17)లో రూ. 1500కోట్ల మేరకు రుణాల టార్గెట్ కంటే రూ.100కోట్లు ఎక్కువగా రుణాలను ఇచ్చింది. తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో పనిచేస్తున్న స్త్రీ నిధి బ్యాంకు మహిళా సంఘాలకు ఆర్థిక స్వాలంభన కల్పించేందుకు ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తున్నట్లు తెలిసిందే. దీంట్లో భాగంగానే స్త్రీ నిధి బ్యాంకు నుంచి నేరుగా స్వయం సహాయక సం ఘాల సభ్యులకు రుణాలను ఇస్తున్నది. ఈ రుణాల నుంచి మహిళలు జీవ నోపాధులకు వినియోగించుకునే విధంగా స్త్రీ నిధిబ్యాంకు చర్యలు తీసుకుంటున్నది.

హరితహారంపై సింగరేణి చైర్మన్ సమీక్ష

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆకుపచ్చ తెలంగాణ కోసం హరితహారం కార్యక్రమాన్ని చేపట్టిన ముఖ్యమంత్రి కెసిఆర్ సంకల్పానికి మద్దతునిస్తూ సింగరేణి యాజమాన్యం కంపెనీ వ్యాప్తంగా కోటి మొక్కలు నాటాలని ఈ ఏడాది నిర్ణయం తీసుకోగా, ఇప్పటికే 50లక్షల మొక్కలు నాటారు. శుక్రవారం సింగరేణి చైర్మన్ శ్రీధర్ దీనిపై సమీక్షించారు. ప్రతిరోజూ ఏరియాలలో హరితహారం కార్యక్రమ తీరును ప్రత్యేకంగా సమీక్షిస్తున్న ఆయన కోటిమొక్కల లక్ష్యాన్ని సాధించాలని, నాటిన మొక్కలను సంరక్షించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఉన్న 20శాతం అడవులను 33శాతంకు పెంచేందుకు సిఎం చేస్తున్న కృషికి సింగరేణీయులుగా అందరం సహకరిద్దామన్నారు.



సింగరేణి వ్యాప్తంగా ప్రాంతాల వారీగా నాటిన మొక్కల వివరాలు ఇలా ఉన్నాయి.

జిల్లా పేరు	ఏరియా	నాటిన మొక్కలసంఖ్య
ఖమ్మం	సత్తుపల్లి	1,98,250
భద్రాద్రి	కార్పోరేట్	1,53,327
	కొత్తగూడెం	2,97,454
	ఇల్లందు	2,70,250
	మణుగూరు	2,59,000
పెద్దపల్లి	రామగుండం	-1 2,11,000
	రామగుండం	-2 2,49,000
	రామగుండం	-3 1,85,000
భూపాలపల్లి	భూపాలపల్లి	4,87,000
మంచిర్యాల	శ్రీరాంపూర్	2,45,833
	మందమర్రి	2,19,000
కొమరంభీం	బెల్లంపల్లి	3,69,500
ఉచితపంపిణీ		**19,40,000**
మొత్తం		**50,79,214**

ఎంబీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి

హైదరాబాద్,ఆంధ్రప్రభ : విద్య, న్యాయ పరిపాలన శాఖలో ఎంబీసీలకు జానాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని ఎంబీసీ జాతీయ సంక్షేమ సంఘం అధ్యక్షులు కేసీ కాలప్ప పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీసీ రిజర్వేషన్లలో ఏబీసీడీ వర్గాలుగా రిజర్వేషన్ అమలు చేయాలని ఆయన కోరారు. శుక్రవారం బీసీ కమిషన్ కార్యాలయంలో ఎంబీసీ సమావేశం కాలప్ప అధ్యక్షతన జరిగింది. బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, కమిషన్ సభ్యులు అంజనేయగౌడ్, జూలూరి గౌరి శంకర్‌తో పాటు ఎంబీసీ కులాల నాయకులు ప్రేమ్‌లాల్, మల్లిఖర్జున్, సంగం సూర్యారావు, శంకర్‌జీ, ధనరాజ్, కొత్త బాల్‌రాజు హాజరయ్యారు.

బీసీ స్టడీ సర్కిల్ ద్వారా సివిల్స్‌కు ఉచిత కోచింగ్

సివిల్ పరీక్షలకు ప్రిపేరయ్యే బీసీ విద్యార్థులు బీసీ స్టడి సర్కిల్ ద్వారా అందించే ఉచిత శిక్షణకు దర ఖాస్తులు చేసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ శుక్రవా రం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ నెల 28 వరకు ఆన్‌లైన్ (tsbcstudycircles.cgg.gov.in) ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, వచ్చే నెల 6న ఆన్‌లైన్ పరీక్ష ఉంటుందని తెలిపారు.

మొక్కల రక్షణకు పటిష్ఠ చర్యలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: హరితహరంలో భాగంగా పట్టణ ప్రాంతాల్లో సుందరమైన పార్కులను ఏర్పాటు చేయడానికి ప్రాధాన్యత ఇవ్వాలని అటవీ సంరక్షణ ప్రధానాధికారి మనోరంజన్ భాంజా అధికారులను ఆదేశించారు. వర్షాలు వచ్చే లోగా హరితహరంలో ప్రత్యామ్నాయ పనులపై దృష్టి పెట్టాలని సూచించారు. నాటిన మొక్కల రక్షణ, నీటి సౌకర్యం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. హరితహరం పురోగతి, అర్బన్ పార్కుల అభివృద్ధి, ఎవెన్యూ ప్లాంటేషన్ పై సచివాలయం నుండి ఆయన అటవీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మనోరంజన్ భాంజా మాట్లాడారు. మూడవ విడత హరిత హరంలో ఇప్పటి వరకు 17 కోట్లకు పైగా మొక్కలు నాటడం జరిగిం దన్నారు. నాటిన ప్రతి మొక్కను పరిరక్షించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ట్రీ గార్డులను ఏర్పాటు చేయడం, నీటి సౌకర్యం కల్పించడం, చనిపోయిన మొక్కల స్థానంలో కొత్తగా మొక్కలు నాటడం తదితర అంశాల పైన ప్రత్యేక దృష్టి కేంద్రీకరించవలసి ఉంటుం దన్నారు.

నేడు టీటా జాబ్‌మేళా

హైదరాబాద్, ఆంధ్రప్రభ : డిగ్రీ అభ్యర్థులకు చేవెళ్ళ ప్రోగ్రెసివ్ యూత్, కమ్యూనిటీ క్లబ్ సంయుక్తంగా జాబ్‌మేళా నిర్వహించనున్నాయి. ఐటి, దాని అనుబంధ రంగంలోని ఆకర్షణీయ ఉద్యోగాల భర్తీకి చేవెళ్ళ ప్రగతి భవన్‌లో శనివారం ఈ జాబ్‌మేళాను నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ జాబ్‌మేళాకు డిగ్రీ ఉత్తీర్ణులైన వారు హాజరు కావచ్చునని టీటా తెలిపింది. ఈ జాబ్‌మేళాను చేవెళ్ళ పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వరరెడ్డి పర్యవేక్షణలో సాగనుంది. ఈ సందర్భంగా విశ్వేశ్వరరెడ్డి మాట్లా డుతూ, చేవెళ్ళ నియోజకవర్గంలోని యువతకు ఉపాధి కల్పన కోసం టీటా సహకారంతో చేస్తున్న ఈ జాబ్‌మేళా ఉపయుక్తంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. టీటా స్వయంగా ముందుకువచ్చి పలు ఐటి కంపెనీలతో జాబ్‌మేళా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కాగ్నిజెంట్, టీ-వాలెట్ వంటివి ఇందులో ఉంటాయన్నారు. ఈ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు అర్హతలకు తగిన ఉద్యోగాన్ని ఎంచుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించేందుకు టీ-వాలెట్‌ను రూపొందించిన సంగతి తెలిసిందే.

ఐటి ఉద్యోగాలకు అవకాశం : సందీప్ కుమార్

టీటా గ్లోబల్ ప్రెసిడెంట్ సందీప్ కుమార్ మక్తాల మాట్లాడుతూ, ఈ జాబ్‌మేళాలో అక్కడికక్కడే ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఐటి పరిశ్రమలో కొలువులు ఆశిస్తున్న యువతకు చక్కని ఉద్యోగం పొందేందుకు ఇది సరైన అవకాశమని అన్నారు. యువతకు ఉపాధి కల్పించే విష యంలో ఎంపీ విశ్వే శ్వరరెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంపట్ల మక్తాల కృతజ్ఞతలు తెలి పారు. చేవెళ్ళలోని డిజిటల్ లీడర్లు ఈ జాబ్‌మేళాలో పాల్గొని టీ-వాలెట్ రిక్రూ ట్‌మెంట్‌లో భాగంగా కొత్తవారికి, అనుభవం ఉన్నవారికి అవకాశం కల్పించాలని కోరారు.

బిక్కి కృష్ణకు మల్ల జగన్నాథం సాహితీ పురస్కారం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రముఖ కవి, సాహితీ విమర్శకులు బిక్కి కృష్ణకు విశాఖకు చెందిన భువన్ సాహితీ సంస్థ మల్ల జగన్నాథం సాహిత్య ప్రతిభా పురస్కారం ప్రకటించింది. వేదగిరి రాంబాబు అధ్యక్షతన ఈ నెల 12 న విశాఖ ఆంధ్ర యూనివర్శిటీలో అవార్డుల ప్రదానోత్సవసభ జరుగుతుందని సంస్థ అధ్యక్షులు భువనేశ్వర్ రావ్ శుక్రవారం ప్రకటించారు. బిక్కి కృష్ణతో పాటు మధురాంతకం నరేంద్ర, అట్టాడ అప్పలనాయుడు, జగద్ధాత్రి తదితులకు ప్రతిభాపురస్కారాలు అందజేస్తారు. కేంద్ర సాహిత్య అకాడమి ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావ్, పత్తిపాక మోహన్ తదితరులు అతిథులుగా పాల్గొంటారు.

ఇసుక మాఫియాలో కేసీఆర్ కుటుంబం

- •నిరూపించకుంటే జైలుకు పంపండి: రేవంత్

నేరెళ్ల బాధితులను పరామర్శించిన టీటీడీపీ నేతలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఇసుక క్వారీల వ్యాపారమంతా ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు కుటుంబీకులు, బంధువులేనని ఈ ఆరోపణ తప్పని తేలితే తనను జైలుకు పంపాలని, లేకపోతే తన ఆరోపణ వాస్తవమేనని ఒప్పుకోవాలని తెలుగుదేశం పార్టీ తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. తాను చేసిన ఆరోపణ నిజమో, కాదో తేల్చేందుకు ముఖ్యమంత్రికి 48 గంటల గడు వు ఇస్తున్నానని ప్రకటించారు. తప్పుడు ఆరోపణలు చేస్తే జైలుకు పంపుతానని బెదిరించే కేసీఆర్‌కు దమ్ముంటే తన సవాల్‌ను స్వీకరిం చాలని ఆయన డిమాండ్ చేశారు.సిరిసిల్ల జిల్లా నేరెళ్ళ బాధితులకు సంఘీ భావంగా శుక్రవారం బస్సుయాత్రను చేపట్టారు. ఈ సందర్భంగా నేరెళ్ళ గ్రామంలో జరిగిన సభలో రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కేసీర్, ఆయన తనయుడు మంత్రి కేటీఆర్‌లపై నిప్పులు చెరిగారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇసుక క్వారీలు కేసీఆర్ బంధువులైన రాజేందర్‌రావు, ప్రవీణ్‌రావు, నడింపల్లి రంగారావు, సంతోష్‌రావులవేనని ఆరోపించారు.


కేసీఆర్ తోడల్లుడి కుమారుడైన సంతోష్‌రావు కేసీఆర్‌కు తలలో నాలుకల వ్యవహరిస్తుంటారని, ఆయనకు వందల కోట్లు సంపాదించుకోవాలన్న దురాశ కలిగితే దానికోసమే కేసీఆర్ ఇసుక వ్యాపారాన్ని కానుకగా ఇచ్చారని రేవంత్ ఆరోపించారు. ఇసుక క్వారీలు పొందిన గోల్డ్‌మైన్ మినరల్స్ సంస్థలో సంతోష్‌రావు, ప్రవీణ్‌రావు, ఆయన బావమరిది శ్రీనివాసరావు డైరెక్టర్లుగా ఉన్నారని వెల్లడించారు. టిఎస్ఎంసిడి ద్వారా ఈ సంస్థకు ఇసుక క్వారీలను కట్టబెట్టి వందలకోట్లు దోచిపెడుతున్నారని ఆరోపించారు. తాను ఈ ఆరోపణ అధికారికంగా చేస్తున్నానని, తన ఆరోపణ తప్పయితే తనను జైలుకు పంపాలని, లేదంటే ఈ ఇసుక దోపిడీలో నీ కుటుంబం, నీ బంధువులు, నీ సడ్డకులు ఉన్నారని ఒప్పుకున్నట్లేనని కేసీఆర్‌ను ఉద్దేశించి రేవంత్ ధ్వజమెత్తారు.దళితులపై దాడి చేసిన పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని, సిరిసిల్ల జిల్లా ఎస్పీని సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నేరెళ్ళ ఘటనకు ప్రభుత్వానిదే బాధ్యత అని ఆయన ఆరోపించారు. ఇసుక వ్యాపారం ద్వారా ప్రభుత్వానికి రూ.1000 కోట్ల ఆదాయం వస్తుంటే, ఇసుక మాఫియా దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి రూ.10 లక్షలు, పోలీసుల చేతిలో దెబ్బలు తిన్నవారికి రూ.5 లక్షలు ఇచ్చేందుకు అభ్యంతరం ఏంటని ఆయన ప్రశ్నించారు. ఈనెల 15వ తేదీలోగా నేరెళ్ళ బాధితులను ఆదుకోకపోతే నేరెళ్ళ ముట్టడి కార్యక్రమం చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రమణ, కేంద్ర కమిటీ నేతలు మోత్కుపల్లి నరసింహులు, ఇ.పెద్దిరెడ్డి, కరీంనగర్ ఉమ్మడి జిల్లా టిడిపి అధ్యక్షుడు విజయరమణారావు, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు నర్సింగ్‌రావు, కరీంనగర్, సిరిసిల్ల కన్వీనర్లు డాక్టర్ సత్యం, సుభాష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 21న స్కూల్ డైరెక్టరేట్ ముట్టడి



హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సమస్యలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 21న పాఠశాల విద్యా శాఖ సంచాలకుల కార్యాలయాన్ని ముట్టడించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నిర్ణయించింది. అలాగే ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులపై ఉన్నతాధికారుల వేధింపులు ఆపాలని సంఘం రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేసింది. సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం శుక్రవారం రాష్ట్ర అధ్యక్షులు బానోతు కిషన్ నాయక్ అధ్యక్షతన హైదరాబాద్‌లో జరిగింది. సమావేశంలో ప్రధాన కార్యదర్శి శాగ కైలాసం, నాయకులు సంతోష్ నాయక్, హరిలాల్, సంజీవరావు, విజయ్ కుమార్‌తోపాటు జిల్లాల నాయకులు పాల్గొన్నారు. సుదీర్ఘ కాలంగా పరిష్కారానికి నోచుకోని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు బానోతు కిషన్ నాయక్ డిమాండ్ చేశారు. విద్యా శాఖలో అవినీతి పాల్పడుతున్న అగ్రవర్ణ ఉన్నతాధికారులను కాపాడుతూ, అమాయక ఎస్సీ, ఎస్టీ బీసీలకు చెందిన చిన్న స్థాయి అధికారులను బదిలీ చేయడం ఆపాలని డిమాండ్ చేశారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ వచ్చినందున ఎస్సీ, ఎస్టీలకు లబ్ధి చేకూర్చేందుకు జీవో నంబర్ 342కు అనుబంధంగా ఉన్న మోమో నంబర్ 26559 వెంటనే రద్దు చేయాలన్నారు. 2003 డీఎస్సీ అభ్యర్థులకు సీపీఎస్- జిపిఎఫ్ ఏరియర్స్ పొందేందుకు స్పష్టమైన ఆదేశాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రాహుల్‌పై దాడిని ఖండించిన పీసీసీ



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : గుజరాత్‌లో రాహుల్ గాంధీపై జరిగిన దాడిని టీపీసీసీ తీవ్రంగా ఖండించింది. రోజురోజుకు పెరుగుతున్న రాహుల్ ఇమేజీకి దిక్కుతోచని పరిస్థితిలో భాజపా సర్కార్ దాడులకు తెగిస్తోందని మండిపడింది. ప్రజాస్వామ్యం దేశంలో మాట్లాడే హక్కు అందరికీ ఉందని, రాజ్యాంగం కల్పించిన హక్కులను ఎన్డీఏ ప్రభుత్వం కాలరాస్తోందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రోత్సాహంతోనే దేశవ్యాప్తంగా దళిత, గిరిజనులు, మైనారిటీలతో పాటు రాజకీయనాయకులపై కూడా దాడులు పెరిగిపోతున్నాయని, అందులో భాగంగానే రాహుల్‌పై దాడి అని విమర్శించింది. గుజరాత్‌లోని బనాస్‌కంట నియోజకవర్గంలోని ధనేరా గ్రామంలో రాహుల్ గాంధీపై దాడి ఘటనపై పీసీసీ అధ్యక్షుడు ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క, సీఎల్పీ నాయకుడు కె జానారెడ్డి, ఎమ్మెల్యే డీకే అరుణ, ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకరరెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నేరెళ్ల శారద స్పందించారు. రాహుల్‌పై బీజేపీ గూండాలు దాడి చేయడం ప్రధానమంత్రి నరేంద్రమోడీ అప్రజాస్వామిక పాలనకు పరాకాష్టగా ఉత్తమ్‌కుమార్ రెడ్డి అభివర్ణించారు. గుజరాత్, రాజస్తాన్ రాష్ట్రా లలో తీవ్రమైన వరదలు, భారీవర్షాలతో ప్రజలు నానా కష్టాలు పడుతుంటే ఆ ప్రాంతాలను సందర్శించి బాధితులను పరామర్శించారని తెలిపారు. అందులోభాగంగా బనాస్కంతలో పర్యటిస్తుండగా ఆయన ప్రయాణిస్తున్న బుల్లెట్ ప్రూఫ్ కారుపై ఇటుకలు, రాళ్లతో దాడి చేశారని పేర్కొన్నారు. జాతీయ పార్టీ ఉపాధ్యక్షుడిపై దాడి చేయడం ద్వారా తమలోని రాక్షసత్వాన్ని బీజేపీ బయటపెట్టుకుందని ఆరోపించారు. ప్రపంచానికి అహింసను ప్రబోధించిన మహాత్మాగాంధీ పుట్టిన గుజరాత్‌లో దాడులు జరగడం దురదృష్టకరమన్నారు.

కేసీఆర్ నిరంకుశ పాలనకు చరమగీతం



- సీపీఐ(ఎం) కార్యదర్శి తమ్మినేని
- తాళ్లపల్లి గ్రామంలో అరెస్టు చేసిన వారిని బేషరతుగా విడుదల చేయాలి: విరసం

నల్లకుంట, కెఎన్ఎన్ : కేసీఆర్ నిరంకుశ పాలనకు ప్రజలు చరమ గీతం పాడే రోజు దగ్గరలోనే ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, విరసంనేత వరవరరావు అన్నారు. దుబ్బాక నియోజక వర్గం తాళ్ళపల్లి గ్రామంలో పోలీసులు అరెస్టు చేసిన అరుణోదయ నాయకుడు యాదగిరి, రైతు కూలీ సంఘం నాయకుడు శ్రీనివాస్ రెడ్డితో పాటు మరో ఇద్దరిని వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వం అన్ని రకాల మాఫియాలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని ఇసుక, మైనింగ్, హెల్త్, ఎడ్యుకేషన్ మాఫియాలు రాష్ట్రాన్ని దోచుకుంటున్నాయని, వారికి ప్రభుత్వ అండదండలు ఉన్నాయని ఆరోపించారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అరుణోదయ విమలక్క, ప్రొఫెసర్ పీ.ఎల్.విశ్వేశ్వర్ రావు, పౌర హక్కుల సంఘం నాయకులు ప్రొఫెసర్ లక్ష్మణ్ తదితరులతో కలిసి వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం వస్తే మన పాలన మనం చేసుకుని తమ సమస్యలు పరిష్కరించుకోవచ్చని భావించి ప్రజలు ఉద్యమంలో త్యాగాలుచేసి రాష్ట్రం సాధించుకున్నారని, వచ్చిన తెలంగాణ కేసీఆర్ నిరంకుశ, నియంతృత్వ పాలనలో మగ్గిపోతుందని, రాబోయే రోజుల్లో మరో పోరాటానికి ప్రజలు సన్నద్ధమవుతున్నారని హెచ్చరించారు. నేరెళ్ళ ఘటనలో ఇసుక మాఫియాను ప్రశ్నించినందుకు దళితులను చిత్రహింసలు పెట్టి ఎస్పీ విశ్వజిత్ థర్డ్ డిగ్రీ ప్రయోగించారని ఆరోపించారు. ప్రభుత్వ దోపిడీ విధానాలను ప్రశ్నించే వారందరిని అక్రమ కేసులు బనాయించి హింసించి జైళ్లలో పెడుతున్నారని ధ్వజమెత్తారు. దుబ్బాక నియోజక వర్గం తాళ్ళపల్లి గ్రామంలో ఉమ్మడితోట కొందరు ఆక్రమించుకున్నారని, ఈ విషయమై ప్రశ్నించినందుకు గ్రామంలో సమావేశం నిర్వహించుకుని మాట్లాడుతున్న రైతు కూలీ సంఘం నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, అరుణోదయ నాయకుడు యాదగిరి వారితో పాటు మరో ఇద్దరిని మఫ్టీలో వచ్చిన పోలీసులు తీసుకెళ్లారని ఇంతవరకు వారి ఆచూకీ దొరకడంలేదని వారిని కూడా చిత్రహింసలకు గురిచేసి ఎన్‌కౌంటర్ చేస్తారేమోనని బాధిత కుటుంబాలు ఆందోళనకు గురవుతున్నాయన్నారు. నిబంధనల ప్రకారం అరెస్ట్‌చేసిన వారిని 24 గంటల్లో కోర్టులో హాజరుపరచాలని కానీ, వారు కోర్టుకు కూడా తీసుకెళ్లకుండా ఆచూకీ చెప్పకుండా వ్యవహరిస్తున్నారని వివరించారు. వారిని వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రజాస్వామిక హక్కులను ప్రభుత్వం కాలరాస్తుందని ఇదేమిటని ప్రశ్నిస్తే నిరంకుశంగా అణచివేస్తున్నారని అన్నారు. ఈ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పే రోజు దగ్గరలోనే ఉందన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ నాయకుడు బాలమల్లేష్, అరుణోదయ మోహన్, మాజీ మంత్రి రవీందర్‌నాయక్, టీపీఎఫ్ అధ్యక్షుడు నలమాస కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జగన్ వ్యాఖ్యలపై మండిపడ్డ టీడీపీ ఎంపీలు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : నంద్యాల ఉప ఎన్నికల సందర్భంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తెలుగుదేశం పార్టీ ఎంపీలు మండిపడ్డారు. పార్లమెంటులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మరీ జగన్‌పై విరుచుకుపడ్డారు. ఆ పార్టీ లోక్‌సభాపక్ష నేత తోట నరసింహం, సీనియర్ ఎంపీ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ జగన్ తీరును తీవ్రంగా తప్పుబట్టారు. జగన్ తీరు ఫ్యాక్షనిస్టులను తలపిస్తోందంటూ, ఫ్యాక్షన్ రాజకీయాలకు ఎప్పుడో కాలం చెల్లిపోయిందని వ్యాఖ్యానించారు. ఫ్యాక్షనిస్టులా ప్రవర్తిస్తానంటే ప్రజలు ఇప్పుడు సహించే పరిస్థితి లేదని, ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెబుతారని తోట నరసింహం అన్నారు. జగన్ అంటే ఎవరికైనా అవినీతి కేసుల నేర చరిత్రే గుర్తొస్తుందని, అలాంటి వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై అనుచితంగా మాట్లాడారని తోట అన్నారు. ప్రజాస్వామ్య దేశంలో నరికి చంపినా తప్పులేదు అన్నారంటే కచ్చితంగా చట్ట ప్రకారం చర్య తీసుకోదగిన నేరమే అవుతుందని ఆయన వ్యాఖ్యానించారు. తమ పార్టీ తరపున జగన్ వ్యాఖ్యలపై న్యాయపరంగా చర్యలు తీసుకుంటామని తోట నరసింహం హెచ్చరించారు. అనంతరం మాట్లాడిన కొనకళ్ల నారాయణ, ''అవినీతిపరులను కొన్ని నియంతృత్వ దేశాల్లో అక్కడి చట్టాల ప్రకారం కాల్చి చంపుతారు. ఆ లెక్కన జగనే గనుక ఆ దేశంలో ఉంటే ముందు ఆయన్నే కాల్చి చంపేవారు. కానీ మనది ప్రజాస్వామ్య దేశం కాబట్టి బతికిపోయాడు'' అని తీవ్ర ఆగ్రహంతో వ్యాఖ్యానించారు. జగన్ తమ ముఖ్యమంత్రిని చంపినా తప్పులేదని చేసిన వ్యాఖ్యలపై కేసులు పెడతామని కొనకళ్ల అన్నారు. హత్యా రాజకీయాల్లోనే పుట్టి పెరిగిన జగన్ నుంచి ఇంతకంటే గొప్పగా ఏమీ ఆశించలేమని ఆయన ఎద్దేవా చేశారు. ఈ మీడియా సమావేశంలో ఎంపీలు తోట సీతారామలక్ష్మి, కేశినేని నాని, శివ ప్రసాద్ తదితరులు కూడా పాల్గొన్నారు.

మీడియా భవన్ నిర్మాణానికి రూ.15కోట్లు విడుదల

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.15కోట్ల నిధులను విడుదల చేసిందని ఛైర్మన్ అల్లం నారాయణ తెలిపారు. ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు 2015 సంవత్సరంలో ప్రెస్ అకాడమీ నిర్వహించిన తొలి పాలక మండలి సమావేశానికి హాజరైనారు. ప్రస్తుతమున్న భవనాన్ని భవనాన్ని పరిశీలించి తగు సూచనలు చేసి అకాడమీ నూతన బహుళ భవనం అవసరమని అభిప్రాయపడ్డారు. సీఎం నిర్ణయం మేరకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపడం జరిగింది. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వం స్పందించి ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌కు అల్లంనారాయణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

కేసీఆర్ క్షమాపణ చెప్పాలి



సిద్దిపేటటౌన్, కెఎన్ఎన్ : తెలంగాణ ప్రభుత్వం దళితులపై జరుగుతున్న దాడులను ఆపాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు రమణ అన్నారు. శుక్రవారం మోత్కుపల్లి నర్సింలు, రేవంత్‌రెడ్డి, పెద్దిరెడ్డిల ఆధ్వర్యంలో ఛలో నేరెళ్ల బస్సు యాత్రలో భాగంగా సిద్దిపేట జిల్లా కేంద్రంలోని రంగధాంపల్లిలోని అమరవీరుల స్థూపానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం వస్తే బడుగు, బలహీన వర్గాలు బాగుపడుతాయని అనుకుంటే దానికి విరుద్ధంగా దళితులను అణిచి వేస్తున్నారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇసుక అక్రమ రవాణాను చేస్తూ ధన దోపిడీ చేస్తుందన్నారు. కేటీఆర్ ఎమ్మెల్యేగా ఉన్న నియోజక వర్గంలో ఇలాంటి దుర్ఘటన జరుగడం శోచనీయమన్నారు. కేసీఆర్ కుటుంబం ఇసుక మాఫీయాను ప్రోత్సహిస్తూ అడ్డు వచ్చిన దళితులపై అక్రమ కేసులు బనాయించి నరకయాతన పెడుతున్నారన్నారు. సిరిసిల్లా జిల్లాలోని పోలీసులు ప్రభుత్వానికి తొత్తులుగా మారి దళితులను హింసిస్తున్నారన్నారు. పోలీసులు మామూళ్ల మత్తులో మునిగి ప్రజలను హింసించడం సరికాదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం సిరిసిల్లా ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దరిపల్లి చంద్రం, పట్టణ అధ్యక్షులు దరిపల్లి శ్రీను, జిల్లా బీసీ నాయకులు కొమ్ము ఉమేష్, తాటికొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గుల్బర్గా ఉర్సుకు ప్రత్యేక రైళ్ళు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : గుల్బర్గలో జరిగే ఉర్సు కోసం ఈ నెల 7,10 తేదీల్లో హైదరాబాద్ నుండి ప్రత్యేక రైళ్లను నడిపించబోతున్నామని దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. తిరుగు ప్రయాణంలో ఈ ప్రత్యేక రైళ్లు గుల్బర్గా నుండి 8, 11 తేదీల్లో బయలుదేరుతాయన్నారు. మార్గమధ్యలోని అన్ని ప్రధాన స్టేషన్‌లలో ఆగుతాయన్నారు. ఉర్సు కోసం గుల్బర్గాకు వెళ్లే ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.

6న ఒంగోలు - గూడూరు రైలు రద్దు

విజయవాడ - గూడూరు సెక్షన్‌లోని టంగుటూరు - సింగరాయ కొండ మధ్యన రైలు బ్రిడ్జీ పునరుద్ధరణ పనులు జరుగుతున్నందున ఈ నెల 6వ తేదీన ఒంగోలు - గూడూరు ప్యాసింజర్ రైలును రద్దు చేయడం జరిగిందని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. గూడూరు - విజయవాడ ప్యాసింజర్ రైలును గూడూరు - ఒంగోలు మధ్యన పాక్షికంగా రద్దు చేయడమైందని పేర్కొన్నారు.

ట్రాఫిక్ ఉల్లంఘన: 1065 కేసులు

- పెనాల్టి పాయింట్ల విధానం సక్సెస్!



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో పెనాల్టీ పాయింట్ల విధానం ఆగస్టు 1వ తేదీ నుంచి అమలుపరుస్తున్న సంగతి విదితమే. మొత్తంగా 12 పాయింట్లు పెనాల్టీ వచ్చిందంటే డ్రైవింగ్ లైసెన్స్ రద్దవుతుంది. ఈ విధానం అమలులోకి వచ్చిన తొలిరోజు ఆగస్టు 1న ఒక్క హైదరాబాద్‌లోనే 1065 కేసులు నమోదయ్యాయి. మోటార్ వెహికల్ యాక్ట్ 1988 ప్రకారం ఈ పెనాల్టీ పాయింట్లను ఖరారు చేశారు. త్రై కమిషనరేట్ల(హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ) పరిధిలో ఈ పాయింట్ల విధానాన్ని ముందుగా అమలుపరుస్తున్నారు. నేషనల్ క్రైమ్స్ రికార్డ్ బ్యూరో 2015 ప్రకారం ఇప్పటివరకు రోడ్డు యాక్సిడెంట్ల ద్వారా దేశంలో చనిపోయిన 1,48,707 మరణాల్లో 22,400 మరణాలు రాష్ట్రంలోనే సంభవించడం గమనార్హం.

ఆటోలో డ్రైవర్ పక్కన మరో ప్యాసింజర్‌ను కూర్చోబెట్టుకుంటే ఒక పాయింట్, నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణికులను వాహనాల్లో తరలిస్తే రెండు పాయింట్లు, సీట్‌బెల్ట్/హెల్మెట్ పెట్టుకోని పక్షంలో ఒక పాయింట్, రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేస్తే రెండు పాయింట్లు, ఓవర్‌స్పీడ్ గంటకు 40కిలోమీటర్ల లోపు ఉండి, 40 కిలోమీటర్లకు పైగా వెళ్తే రెండు పాయింట్లు, గంటకు 40 కిలోమీటర్ల వేగం ఉండి, దానికంటే మించి వేగంగా వెళ్తే మూడు పాయింట్లు, ద్విచక్రవాహనాలు నడుపుతూ డ్రంక్ అండ్ డ్రైవింగ్ చేస్తే మూడు పాయింట్లు, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో కార్లు, లారీలు, భారీ వాహణాలు నడుపుతూ పట్టుబడిన పక్షంలో నాలుగు పాయింట్లు, పబ్లిక్ సర్వీసు వాహనాలు, బస్సులు, క్యాబ్, ఆటోలు నడుపుతూ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే ఐదు పాయింట్లు, రోడ్డు సేఫ్టీ నిబంధనలు పాటించని వారు వాయు, శబ్ద కాలుష్యం వెదజల్లే వాహణాదారులు, అడ్డదిడ్డమైన పార్కింగ్‌లుచేసి రోడ్డుపై వెళ్లే వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తే రెండు పాయింట్లు, వాహనానికి సరైన ధృవీకరణ పత్రాలు లేకుండా నడిపిన ఎడల రెండు పాయింట్లు, రోడ్డు ప్రమాదానికి గురైనప్పుడు బాధితుడికి గాయాలైతే రెండు పాయింట్లు, రోడ్డు ప్రమాదంలో బాధితులు మరణించిన ఎడల ఐదు పాయింట్లు, స్నాచింగ్, దోపిడీలకు వాహనాలను వినియోగిస్తే ఐదు పాయింట్లు విధిస్తారు. వాహన చోదకులు తస్మాత్ జాగ్రత్త...!

గ్లకోమాకు అత్యాధునిక ఆపరేషన్




హైదరాబాద్,ఆంధ్రప్రభ: గ్లకోమాతో చూపు కోల్పోయే వారికి అత్యాధునిక ఆపరేషన్ ద్వారా డాక్టర్ అగర్ వాల్స్ వైద్యులు చూపు తెప్పించారు. గ్లకోమాతో బాధపడుతున్న 55 సంవత్సరాల వృద్ధురాలికి సింగిల్ పాస్ ఫోర్ త్రో ప్యుపిల్లోప్లాస్టీ(ఎస్ఎఫ్ఐటీ) ఆపరేషన్ చేసి చూపు తెచ్చినట్టు అగర్ వాల్స్ కంటి ఆసుపత్రి మెడికల్ సర్వీస్ డైరక్టర్ డాక్టర్ వంశీధర్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన వృద్ధురాలితో కలిసి శుక్రవారం మీడియాకు వివరించారు.

కంటిలో చేరిన నీరు తిరిగి బయటికి పోకుండా కంటిలోనే నిల్వ ఉండటంతో గ్లకోమాగా మారుతుందని డాక్టర్ తెలిపారు. కంటిలో చేరిన నీటిని ఎస్ఎఫ్‌టీ ద్వారా తొలగించిన వృద్ధురాలికి చూపు తెప్పించినట్టు తెలిపారు. ఇప్పటికే ఇటువంటి ఆపరేషన్లను తమ సంస్థ వైద్యులు తమిళనాడు, కర్నాటక, కోల్‌కత్తా ప్రాంతాల్లో నిర్వహించినట్టు తెలిపారు. తొలిసారిగా తెలంగాణ ప్రాంతంలోని హైదరాబాద్‌లో ఆపరేషన్ చేసినట్టు తెలిపారు. దీని ద్వారా శాశ్వత చూపు కోల్పోయే ప్రమాదం ఉన్న గ్లకోమా రోగులు దీనిని ఉపయోగించుకోవాలని సూచించారు. కేవలం రూ. 15,000 నుంచి రూ. 20,000 వరకు మాత్రమే ఖర్చు అవుతుందని తెలిపారు.


అధికారికంగా భార్గవ అంత్యక్రియలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రముఖ శాస్త్రవేత్త, పద్మభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ పీఎం భార్గవ అంత్యక్రియలను అధికారికంగా నిర్వహించారు. ప్రభుత్వం తరపున ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ హాజరై పుష్పగుచ్ఛంతో నివాళులర్పించారు. సీసీఎంబీని నెలకొల్పడంతో పాటు జీవకణ శాస్త్రంలో భార్గవ చేసిన కృషి మరిచిపోలేనిదని కొనియాడారు.





రిజర్వేషన్లు సాధించేవరకు పోరాటం ఆగదు



హైదరాబాద్,ఆంధ్రప్రభ: వెనుకబడిన తరగతుల(బీసీ) వారికి చట్టసభల్లో రిజర్వేషన్లు సాధించేవరకు పోరాటం ఆగదని బీసీ సంక్షేమ సంఘం నేతలు స్పష్టం చేశారు. చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం తలపెట్టిన చలో ఢిల్లీకి సంఘం నేతలు, కార్యకర్తలు శుక్రవారం రైళ్లలో బయలుదేరి వెళ్లారు. శనివారం పార్లమెంటు ముందు భారీ ప్రదర్శన నిర్వహించనున్నట్టు జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య తెలిపారు. ఐదు రోజులపాటు ఢిల్లీలోనే ఉండి బీసీ బిల్లు పార్లమెంటులో పెట్టాలని డిమాండ్ చేస్తూ ధర్నాలు, ఆందోళనలు చేపట్టనున్నట్టు ఆయన స్పష్టం చేశారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లల్లో రిజర్వేషన్లు కల్పించాలని, బీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ బీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించేలా అన్ని రాజకీయ పార్టీలు నిర్ణయం చేయాలన్నారు. పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టేలా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరనున్నారు. పార్లమెంటులో ప్రాతినిధ్యం ఉన్న 32 పార్టీల నేతలను కలవనున్నట్టు చెప్పారు. అలాగే బీసీ బిల్లుకు సహకరించాలని ప్రతిపక్ష పార్టీల అధ్యక్షులను కలవనున్నారు.

ఇఎస్ఐకి సిబ్బందిని నియమించండి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఏపీలో కేంద్రకార్మిక రాజ్యభీమా సంస్థ(ఈఎస్ఐ)కు తగినంతమంది సిబ్బందిని నియమించాలని అఖిలభారత పంచాయతీ పరిషత్ అధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో శుక్రవారం కేంద్ర కార్మిక రాజ్యభీమా సంస్థ డైరెక్టర్ జనరల్ శాజ్‌కుమార్‌ను కలిసిన వీరాంజనేయులు ఏపీ సమస్యలపై వినతిపత్రం అందచేశారు. హైదరాబాద్‌లో ఉన్న ఈఎస్ఐ సిబ్బందిని వెంటనే అమరావతికి బదిలీ చేయాలని కోరారు. గత రెండేళ్ల కేంద్ర వాటా పదిశాతం నిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు. గుంటూరులో నిర్మించబోతున్న వందపడకల ఆస్పత్రిని మూడు వందల పడకల స్థాయికి పెంచాలని డీజికి ఈ మేరకు వినతి పత్రం అందచేశారు.

8న యోగా వర్క్‌షాప్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పారిశ్రామిక ఆర్థిక, వాణిజ్య మండళ్ళ సమాఖ్య (ఎఫ్ట్యాప్సీ), బోధి హోలిస్టిక్ వెల్నెస్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో 'స్ట్రెస్ ఫ్రీ మేనేజెంట్' అంశంపై ఈనెల 8న ఉచిత యోగా వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు బోధి హోలిస్టిక్ నెస్స్ ఇన్‌స్టిట్యూట్ వ్యవస్థాపకులు అశోక్ వెంకినేని, ఒత్తిడి, మానసిక ఆందోళన, హైపర్ టెన్షన్, అంగ్జైటి, నిద్దుర లేమి, ఒబెసిటీ, డయాబెటిస్, వెన్నునొప్పితో బాధపడే వారికోసం నిర్వహిస్తున్న ఈ ఉచిత వర్క్‌షాప్‌లో ఎవరైనా పాల్గొనవచ్చునని తెలిపారు. ముఖ్యంగా దైనందిన జీవితంలో ఎదురయ్యే అనేక సమస్యల నివృత్తి కోసం మెడికల్ షాపులను ఆశ్రయించకుండా, అతి సులభమైన సాధారణ యోగాతో మన మానసిక, శారీరక బాధల నుంచి ఉపశమనం కలిగించుకోవచ్చునని ఈ ఉచిత వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నట్లు అశోక్ వెంకినేని పేర్కొన్నారు.

ఉప రాష్ట్రపతి ఎవరో తేలేది నేడే

•రోజంతా ఓటింగ్..ఫలితం సాయంత్రమే •మాజీ మంత్రి వర్సెస్ మాజీ గవర్నర్ •వార్ వన్‌సైడే!

న్యూ ఢిల్లీ: భారత ఉప రాష్ట్రపతి పదవికి శనివారం ఎన్నిక జరగనుంది. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే అభ్యర్థిగా మాజీ కేంద్ర మంత్రి ముప్పవరపు వెంకయ్యానాయుడు బరిలో నిలవగా ఆయనకు పోటీగా కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ అభ్యర్థి మాజీ గవర్నర్ గోపాలకృష్ణ గాంధీ పోటీలో ఉన్నారు. అయితే, ఈ ఎన్నిక నామమాత్రమేనని, ఎన్నికల్లో ఎన్డీయే పక్షాలు బలపరిచిన వెంకయ్యానాయుడే విజయం సాధిస్తారని పలు రాజకీయ విశ్లేషణలు వ్యాఖ్యానిస్తున్నాయి. పోలింగ్‌లో పాల్గొంటున్నది కేవలం లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు మాత్రమే కాబట్టి వార్ వన్‌సైడే ఉంటుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం ఎన్డీయేకు లోక్‌సభ 340, రాజ్యసభ 86... యూపీఏకు లోక్‌సభ 49, రాజ్యసభ 63 మంది సభ్యులున్నారు. రెండు సభల్లో ఎన్డీయేకు మెజారిటీ ఉండటం, దాంతోపాటు పలు ఎన్డీయేతర పక్షాలు కూడా వెంకయ్యకు మద్దతునివ్వడంతో ఆయన గెలుపు నల్లేరు మీద నడకగా కనిపిస్తోంది.

శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటలకు వరకు పార్లమెంట్ సెంట్రల్ హాలులో ఉప రాష్ట్రపతి ఎన్నిక పోలింగ్ జరుగుతుందని ఎన్నికల సంఘం పేర్కొంది. అదే రోజు ఓట్ల లెక్కింపు కూడా జరిపి గెలిచిన అభ్యర్థిని సాయంత్రం ఐదు గంటల తర్వాత ప్రకటించనుంది. సాయంత్రానికి భారత దేశానికి 15వ ఉప రాష్ట్రపతి ఎవరో తెలిసిపోతుంది.

మాజీ మంత్రి వర్సెస్ మాజీ గవర్నర్

సీట్లవారీగా చూసుకుంటే అభ్యర్థి గెలుపు ముందే తెలిసిపోయినప్పటికీ, కాంగ్రెస్ విపక్షాల సాయంతో పశ్చిమ బెంగాల్ గవర్నర్ గోపాలకృష్ణగాంధీని బరిలోకి దింపింది. ఆయనకు మాజీ ఐఏఎస్ అధికారిగా అనుభవం ఉంది. శ్రీలంక, దక్షిణాఫ్రికా తదితర దేశాల్లో భారత హై కమిషనర్‌గా పని చేశారు. దాంతోపాటు దౌత్యపరమైన, పరిపాలనకు సంబంధించిన పలు పదవులను కూడా అలంకరించారు. 2002-09 వరకు పశ్చిమ బెంగాల్‌కు గవర్నర్‌గా క ూడా సేవలందించారు. ఇక ఎన్డీయే ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించబడిన వెంకయ్యానాయుడు కేంద్ర మంత్రిగా పలుమార్లు దేశానికి సేవలందించారు. 2002-04 వరకు బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఉన్నారు. అంతకు ముందు మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి ప్రభుత్వంలో గ్రామీణాభివృద్ధి మంత్రిగా కూడా పని చేశారు.

గాంధీ... రాజాజీ మనవడే గోపాలకృష్ణ

కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ఇతర వామపక్షాల మద్దతుతో పోటీలో నిలిచిన గోపాలకృష్ణ గాంధీ అందరికీ భారత జాతిపిత మహాత్మా గాంధీ మనవడిగా మాత్రమే తెలుసు. కానీ ఆయన మరో కీలక స్వాతంత్ర్య సమరయోధుడికి కూడా మనవడే. భారత్‌కు మొట్ట మొదటి గవర్నర్ జనరల్‌గా పని చేసిన రాజగోపాలచారికి మనవడు. రాజాజీ కూతురి కుమారుడే గోపాలకృష్ణగాంధీ.

సుప్రీం కోర్టులో 11న రామజన్మభూమి కేసు విచారణ

న్యూఢిల్లీ: అయోధ్యలోని రామ జన్మభూమి భూవివాదంపై ఈ నెల 11న సుప్రీం కోర్టు విచారణ జరపనుంది. అలహాబాద్ హైకోర్టు తీర్పు తరువాత ఈ కేసు సుప్రీంకు చేరింది. ఈ విచారణలో బాబ్రీ మసీదు ఏక్షన్ కమిటీ, శ్రీరామ జన్మ భూమి న్యాస్, నిర్మోహి అఖాడాలు కక్షిదారులుగా ఉన్నాయి. శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు సుప్రీం ధర్మాసనం ఈ మూడు పక్షాల వాదనలు వింటుంది.

గతంలో ఈ విషయమై తీర్పు ఇచ్చిన అలహాబాద్ హైకోర్టు భూమిని మూడు పక్షాలకూ పంచింది. అయితే.. బాబ్రీ మసీదు ఏక్షన్ కమిటీ తీర్పును ఆమోదించలేదు. అక్కడ మందిరాన్ని నిర్మించే అవకాశం ఎవరికీ ఇవ్వరాదంటూ భూమి యాజమాన్య వివాదంపై సుప్రీం కోర్టుకు వెళ్లింది.

నేడు జీఎస్టీ కౌన్సిల్ సమావేశం

ఆర్థిక మంత్రి బదులుగా హాజరవుతున్న కేటీఆర్

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: నేడు ఢిల్లీలో జరగనున్న జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో పాల్గొనేందుకు తెలంగాణ రాష్ట్ర మంత్రి కే.టీ. రామారావు ఢిల్లీ చేరుకున్నారు. జీఎస్టీ కౌన్సిల్‌లో అన్ని రాష్ట్రాల ఆర్థిక మంత్రులు సభ్యులైనప్పటికీ, ఈ సారి ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ బదులు నేరుగా కేటీఆర్ రంగంలోకి దిగారు. శుక్రవారమే ఢిల్లీ చేరుకున్న కే.టీ. రామారావు అరుణ్ జైట్లీని కలిసి జీఎస్టీ సమస్యలను ప్రస్తావించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రాజెక్టులకు జీఎస్టీ గుదిబండగా తయారవుతోందని చెప్పారు. ప్రస్తుతం కొనసాగుతున్న పథకాలు, ప్రాజెక్టులను 5 శాతం పన్ను పరిధిలోకి తీసుకురావాలని కోరారు. దీంతో పాటు ఇతర జీఎస్టీ సమస్యలపై నేడు జరిగే కౌన్సిల్ సమావేశంలో చర్చించనున్నారు. చేనేత, వస్త్ర, గ్రానైట్ రంగాలతో పాటు బీడీ పరిశ్రమపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్న జీఎస్టీ పన్ను రేట్ల గురించి చర్చించనున్నారు. కౌన్సిల్‌లో తీసుకునే నిర్ణయం ఆధారంగానే పన్ను రేట్లను తగ్గించే అవకాశముంది. అందుకే ఈసారి కేటీఆర్ స్వయంగా కౌన్సిల్ సమావేశానికి హాజరై పన్ను రేట్లపై పట్టుబట్టాలని నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది.

ప్రాజెక్టులకు పన్ను మినహాయింపునివ్వండి:జితేందర్ రెడ్డి

ప్రభుత్వ కార్యక్రమాలకే జీఎస్టీ అడ్డంకిగా మారిందని తెలంగాణ రాష్ట్రసమితి ఆరోపించింది. తొలుత ఈ అంశంపై చర్చకు పట్టుబడుతూ టీఆర్ఎస్ లోక్‌సభాపక్ష నేత జితేందర్ రెడ్డి వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని తిరస్కరించిన లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్, జీరో అవర్లో మాట్లాడేందుకు అవకాశమిచ్చారు. జీఎస్టీ కారణంగా తెలంగాణ రాష్ట్రానికి రూ. 19,200 కోట్లు అదనపు భారం పడుతోందని జితేందర్ రెడ్డి అన్నారు. జీఎస్టీ ద్వారా రాష్ట్ర పథకాలపై 18 శాతం పన్ను విధించడం సరికాదని పేర్కొన్నారు. ప్రజల కోసం చేస్తున్న పథకాలపై జీఎస్టీ పన్ను విధించకుండా మినహాయింపునివ్వాలని టీఆర్ఎస్ లోక్‌సభాపక్ష నేత సభ ద్వారా కేంద్ర ఆర్థిక మంత్రిని కోరారు.

పార్లమెంట్‌లో పదనిసలు

ముదుపుల ఆరోపణలతో.. దద్దరిల్లిన లోక్‌సభ



న్యూఢిల్లీ: ముడుపుల ఆరోపణలతో లోక్‌సభ దద్దరిల్లింది. శుక్రవారం సభలో ప్రజా సమస్యలపై చర్చ జరుగుతుండగా బీజేపీ ఎంపీ కిరిత్ సోమయ్య కాంగ్రెస్‌పై అవినీతి ఆరోపణలు చేశారు. సుమారు రూ.4 కోట్ల నగదు హవాలా మార్గంలో కాంగ్రెస్‌కు అందాయని ఆయన ప్రస్తావించారు. దీంతో సభలో ఒక్కసారిగా గందరగోళం నెలకొంది. కొందరు కాంగ్రెస్ సభ్యులు దీన్ని ఖండించేందుకు ప్రయత్నించగా బీజేపీ ఎంపీలు నినాదాలు చేశారు. సభ ఎంతకు అదుపులోకి రాకపోవడంతో స్పీకర్ సుమిత్రా మహాజన్ సభా కార్యక్రమాలను ఆగస్ట్ 8కి వాయిదా వేశారు.

పునరుత్పత్తి శక్తి వనరులపై దృష్టిపెట్టండి

పునరుత్పత్తి శక్తి వనరులపై దృష్టిపెట్టాలని విపక్ష ఎంపీలు కేంద్రానికి సూచించారు. శిలజ ఇంధనాలపై ఆధారపటాన్ని తగ్గించాల్సిన పరిస్థితి నెలకొందని, ప్రపంచ దేశాలు బయో ఇంధనాలు, పునరుత్పాదక వనరులవైపు మొగ్గుతున్నాయని, భారత్ కూడా వాటిని అనుసరించాల్సి ఉందని ఎంపీలు అభిప్రాయపడ్డారు.

ఐదు ఎరువుల కర్మాగారాల పునరుద్దరణ

ఐదు ఎరువుల కర్మాగారాలను ప్రభుత్వం పునరుద్దరిస్తోందని కేంద్ర రసాయన, ఎరువుల, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత్‌కుమార్ శుక్రవారం రాజ్యసభకు తెలిపారు. సింద్రీ, తాల్చర్, బారౌనీ, రామగుండం, గోరఖ్పూర్ ప్లాంట్ల పునరుద్దరణతో 65 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులోకి వస్తుందని ఆయన వివరించారు. ఈ ఏడాది చివరికి రామగుండం, 2020 నాటికి సింద్రీతో పాటు మిగతావి అందుబాటులోకి వస్తాయని వివరించారు. హిందూస్థాన్ ఎరువులు రసాయనాల లిమిటెడ్ ఈ పునరుద్దరణ పనులను పర్యవేక్షిస్తోందని సభకు తెలిపారు.

జలియన్‌వాలా బాగ్‌లో ఠాగూర్ విగ్రహం ఏర్పాటు చేయండి

పంజాబ్ రాష్ట్రం అమృత్‌సర్‌లోని జలియన్‌వాలా బాగ్‌లో నోబెల్ గ్రహిత రవీంద్ర నాథ్ ఠాగూర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎం) సభ్యుడు రిటాబ్రతా బెనర్జీ శుక్రవారం రాజ్యసభలో డిమాండ్ చేశారు. 1919లో అక్కడ బ్రిటీష్ సైన్యం పాల్పడిన నరమేథంలో సుమారు వెయ్యి మంది చనిపోయారని, దీనికి నిరసనగా బ్రిటన్ రాణి సత్కరించిన గౌరవ నైట్‌హుడ్ బిరుదును ఠాగూర్ వెనక్కి ఇచ్చేశారని ఆయన గుర్తు చేశారు. అలాంటి వ్యక్తికి జలియన్‌వాలా బాగ్‌లో చోటు, గౌరవం దక్కక పోవడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

సెలక్ట్ కమిటీకి మోటార్ వెహికల్ బిల్లు

మోటార్ వెహికల్ బిల్లును రాజ్యసభ సెలక్ట్ కమిటీకి పంపాలని అన్ని పార్టీల నేతలు నిర్ణయించినట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. డిప్యూటీ ఛైర్మన్ కురియన్ అధ్యక్షతన శుక్రవారం దీనిపై అఖిల పక్ష సమావేశం జరిగింది. 1988 మోటార్ వాహన చట్ట సవరణ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందగా రాజ్యసభలో పెండింగ్‌లో ఉంది. పలు సంస్కరణకు నాంది పలికే ఈ బిల్లును పూర్తిగా అధ్యయనం చేయాల్సి ఉందని, దీనికి మరింత సమయం కావాలని విపక్ష నేతలు అభిప్రాయపడ్డారు. దీంతో శీతాకాల సమావేశం ప్రారంభం నాటికి నివేదిక సమర్పించేందుకు శుక్రవారం ఓ సెలక్ట్ కమిటీని ఏర్పాటు చేసినట్లు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు.

చేనేత రంగానికి రూ.6000 కోట్ల సబ్సిడీ

చేనేత రంగానికి ప్రభుత్వం రూ.6000 కోట్ల సబ్సిడీని కేటాయించినట్లు కేంద్ర జౌళిశాఖ సహాయ మంత్రి అజయ్ తమ్టా శుక్రవారం రాజ్యసభలో ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు. చేనేత రంగం జీఎస్టీ పరిధిలో లేనందున కార్మికులను ఆదుకునేందుకు కేంద్రం ఈమేరకు సబ్సిడీ ఇస్తున్నట్లు ఆయన వివరించారు. సౌరశక్తి చేనేత యూనిట్ల ఏర్పాటుకు ఎస్టీలకు 90 శాతం, ఎస్సీలకు 75 శాతం, ఇతరులకు 50 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు సభకు ఆయన తెలిపారు

సిజేరియన్ డెలివరీలు పెరుగుదలపై ఆందోళన

భారత్‌లో ఇటీవల సిజేరియన్ డెలివరీలు పెరగడంపై కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేడీ నడ్డా ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ప్రశ్నోత్తర సమయంలో ఈ అంశాన్ని ఆయన ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య సేవా సంస్థల సమాచారం ప్రకారం 31,296 కాన్పులు జరగ్గా ఇందులో 17,450 అనగా 55.75 శాతం సిజేరియన్లని ఆయన పేర్కొన్నారు.

ఏపీలో పెట్రోవర్శిటీ బిల్లుకు ఆమోదం



ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయనున్న భారత పెట్రోలియం అండ్ ఎనర్జీ సంస్థ బిల్లు 2017కు లోక్‌సభ శుక్రవారం ఆమోదం తెలిపింది. ఏపీ పునర్విభజన సందర్భంగా ఇచ్చిన హామీలో భాగంగా విశాఖపట్నం జిల్లా సబ్బవరం మండలంలోని 200 ఎకరాల్లో సుమారు రూ.650 కోట్ల కేంద్ర వ్యయంతో పెట్రోలియం యూనివర్శిటీ ఏర్పాటు చేయనున్నారు. దీనికి సంబంధించిన భారత పెట్రోలియం అండ్ ఎనర్జీ సంస్థ బిల్లు 2017పై శుక్రవారం లోక్‌సభలో చర్చ జరిగింది. దీని ఏర్పాటుతో ఆంధ్రప్రదేశ్‌కేగాక దేశ, విదేశాల్లోని యువతకు లబ్ధి చేకూరుతుందని కేంద్ర పెట్రోలియం, సహజవాయు మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. చైనా, జపాన్, అమెరికాతో కలిసి హైడ్రేట్స్‌పై భారత్ పరిశోధనలు చేస్తోందని ఆయన వివరించారు. కేజీ బేసిన్ వందేళ్ల వరకు భారత్ అవసరాలు తీరుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. దీని పరిధిలోని విశాఖ, రాజమండ్రి, కాకినాడ ప్రాంతాలు అమెరికాలోని హూస్టన్ మాదిరిగా అభివృద్ధి చెందుతాయని ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. ఐఐటీ ఖరగ్‌పూర్ ఆధ్వర్యంలో ఏర్పాటయ్యే ఐఐపీఈని తాత్కాలికంగా ఆంధ్రాయూనివర్శిటీ క్యాంపస్‌లో ఏర్పాటు చేశారు. 2016-17 విద్యాసంవత్సరం నుంచి పెట్రోలియం, రసాయన ఇంజనీరింగ్ కోర్సుల్లో బ్యాచ్‌కు 50 మంది చొప్పున విదేశీ ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య అందించనున్నారు.

చనుబాలు బ్యాంకుల విస్తరణకు ప్రభుత్వం కృషి

చనుబాలు బ్యాంకుల విస్తరణకు ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా శుక్రవారం లోక్‌సభలో ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు. ఢిల్లీలోని లేడీ హార్డింగ్ మెడికల్ కాలేజీలో ఏర్పాటు చేసిన మానవ పాల బ్యాంకు కేంద్రం తల్లుల నుంచి చనుబాలు సేకరించి అవసరమయ్యే శిశువులకు అందిస్తుందని ఆయన వివరించారు. రోగుల తాకిడి తట్టుకునేందుకు ఢిల్లీ ఎయిమ్స్‌లో 1563 అదనపు బెడ్స్ ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.

ఎంపీలు.. మహిళా, పిల్లల సంక్షేమ కేంద్రాలను సందర్శించండి

ఎంపీలు తమ పరిధిలోని మహిళా, పిల్లల సంక్షేమ కేంద్రాలను సందర్శించి వాటి పనితీరుపై నివేదిక ఇవ్వాలని కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి మేనకా గాంధీ కోరారు. ఈమేరకు వారికి లేఖలు రాయనున్నట్లు శుక్రవారం లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఓ అనుబంధ ప్రశ్నకు ఆమె బదులిచ్చారు.

ఉగ్రవాదుల చొరబాట్లను పాక్ ప్రోత్సహిస్తోంది: జైట్లీ

సరిహద్దుల ద్వారా జమ్మూకశ్మీర్‌లోకి ఉగ్రవాదుల చొరబాట్లను పాకిస్థాన్ ప్రోత్సహిస్తోందని కేంద్ర రక్షణ మంత్రి అరుణ్ జైట్లీ ఆరోపించారు. అయితే భారత బలగాలు సమర్థవంతంగా తిప్పికొడుతున్నాయని, ఉగ్రవాదులకు భారీగా నష్టం కలుగుతోందని శుక్రవారం లోక్‌సభకు ఆయన తెలిపారు.

పీవోకేలో డ్యాములు నిర్మిస్తున్న పాక్

పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఇండస్ నదిపై పాకిస్థాన్ చైనా సహకారంతో ఆరు ఆనకట్టలను నిర్మిస్తోందని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌కు తెలిపింది. భారత సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతను ఉల్లంఘించేలా పాకిస్థాన్ ఈ నిర్మాణాలు చేపడుతోందని కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి వీకే సింగ్ శుక్రవారం రాజ్యసభకు వివరించారు. పాకిస్థాన్‌తో పాటు చైనాకు దీనిపై అభ్యంతరం వ్యక్తం చేశామని, అక్రమ ఆనకట్టల నిర్మాణాలను అడ్డుకునేందుకు ఆ రెండు దేశాలతో సంప్రదింపులు కొనసాగిస్తామని సభకు ఆయన తెలిపారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు

నిరుపేదల ఆత్మగౌరవం

•పిట్టలు పట్టేవాళ్లకూ రెండు పడకల గదుల ఇళ్లు •మందపల్లిలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు ప్రారంభోత్సవంలో మంత్రి హరీష్ రావు

సిద్దిపేట, కెఎన్ఎన్ బ్యూరో : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్లు దేశానికే ఆదర్శంగా నిలిచాయని భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీష్‌రావు అన్నారు. శుక్రవారం గృహనిర్మాణశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వివేక్, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు ఫారుఖ్ హుస్సేన్, పాతూరి సుధాకర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, మాజీ మంత్రి వినోద్, హౌజింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ మడుపు భూంరెడ్డి, మహిళా శిశు సంక్షేమశాఖ రీజనల్ డైరెక్టర్ బూర విజయ, జిల్లా కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డిలతో కలిసి సిద్దిపేట జిల్లాలోని మందపల్లి గ్రామంలోని పిట్టల వాడలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల గృహ ప్రవేశాలు, సిద్దిపేట పట్టణంలోని మినీ స్టేడియంలో ఇండోర్ స్టేడియం, ఆఫీసర్స్ క్లబ్‌ల ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం సంతోషిమాత దేవాలయ వార్షికోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ పిట్టల వారు ఇలాంటి ఇండ్లలలో నివసిస్తామని కలలో కూడా ఊహించి ఉండరని వాటి కలలను సాకారం చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. 20 డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించి గృహప్రవేశం చేయడంతో పాటు అందమైన రోడ్లు, 24 గంటల పాటు తాగునీటిని అందించి రాష్ట్రంలోనే అన్ని రంగాలలో అభివృద్ధిలో ముందున్న సిద్దిపేట పేదల ఇండ్ల నిర్మాణంలో ముందుందనడానికి పిట్టల వాడనే నిదర్శనం అన్నారు. ఈ సందర్భంగా పిట్టల కులస్థులు తమ పిల్లలను కుల వృత్తిలో విలీనం చేయకుండా బడికి పంపించాలని వారికి సూచించారు. మీకు చదివించే స్థోమత లేకపోతే మాకు అప్పగించండి రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదివిస్తాం కాని పిల్లల చదువులను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. కేంద్ర ప్రభుత్వం దేశం మొత్తం ఇండ్ల నిర్మాణాకు 25 వేల కోట్ల రూపాయలు కేటాయిస్తే తెలంగాణలో పేదల ఇండ్ల నిర్మాణాలకు 25 వేల కోట్ల రూపాయలు కేటాయించి ప్రతీ నియోజకవర్గానికి 1400 ఇండ్ల నిర్మాణం చేపట్టిందన్నారు. నియోజకవర్గానికి మరో 1000 ఇండ్లను కేటాయించేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందన్నారు. రాష్ట్రంలో 2 లక్షల 70 వేల ఇండ్లు నిర్మాణంలో ఉండగా హైదరాబాద్‌లో 70 వేల ఇండ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని సిద్దిపేట నియోజకవర్గంలో దసరా వరకు ప్రతీ గ్రామంలో డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం పూర్తి చేసి గృహ ప్రవేశాలు జరుగుతాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నుంచి పోచంపాడుకు 90 టీఎంసిల నీటిని నింపడానికి ఈ నెల 10న సీఎం కేసీఆర్ ప్రారంభోత్సవం చేయనున్నారన్నారు. భారతదేశంలోనే తెలంగాణ రాష్ట్రం సంక్షేమ



పథకాల అమలులో ముందుందన్నారు. సిద్దిపేట క్రీడా మైదానం లాగా తెలంగాణలోని అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేయాలని హెచ్‌సీఎ అధ్యక్షుడు వివేక్‌ను మాజీ ఎంపీ వినోద్ కోరారు. మంత్రి హరీష్‌రావు సిద్దిపేట స్టేడియం అభివృద్ది కోసం రోజు తనకు గుర్తు చేస్తాడని ఇలాంటి నాయకులు ప్రతీ నియోజకవర్గంలో ఉంటే ఎంతో అభివృద్ధి జరుగుతుందన్నారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ ఏది చూడాలన్నా తామందరం సిద్దిపేటకు వచ్చి నేర్చుకోవాల్సిందేనని సిద్దిపేటను రాష్ట్రానికే ఆదర్శంగా తీర్చిదిద్దిన ఘనత మంత్రి హరీష్‌రావుదే అన్నారు. ఈ సందర్భంగా సిద్దిపేట మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన 16 రకాల క్రీడలను మంత్రి హరీష్‌రావు ప్రజా ప్రతినిధులు, క్రీడాకారులు, విద్యార్థులతో కలిసి వివిధ క్రీడలు ఆడి ప్రారంభించి పలువురిని ఉత్తేజపరిచారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ భూంరెడ్డి, శాసన మండలి చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాజీ మంత్రి వినోద్, శాసన మండలి సభ్యులు భూపాల్‌రెడ్డి, ఫారుఖ్‌హుస్సేన్, ఎంపీపీలు కూర మాణిక్యరెడ్డి, జాప శ్రీకాంత్‌రెడ్డి, ఎర్ర యాదయ్య, జెడ్పీటీసీ నమూండ్ల కమల-రాంచంద్రం, మహిళా శిశు సంక్షేమశాఖ రీజినల్ డైరెక్టర్ బూర విజయ-మల్లేశం, సిద్దిపేట మున్సిపల్ ఛైర్మెన్ రాజనర్సు, జేసి పద్మాకర్, ఆత్మకమిటి ఛైర్మెన్ సత్యనారాయణరెడ్డి, మార్కెట్ కమిటి ఛైర్మెన్‌లు కుంట వెంకట్‌రెడ్డి, వేముల వెంకట్‌రెడ్డి, సర్పంచ్ ఈశ్వరమ్మ-బాల్‌నర్సయ్య, ఎంపీటీసీ బొల్లం భాగ్యలక్ష్మీ-చంద్రం, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఈనెల 7న చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని హ్యాండిక్రాఫ్ట్ మేనేజింగ్ డైరెక్టర్ శైలజారామయ్యార్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని చేనేత, జౌళిశాఖ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందని తెలిపారు. దీంట్లో భాగంగానే దసరా పండుగకు చేనేత చీరలను పంపిణీ చేయనున్నట్లు ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు ప్రకటించారని గుర్తు చేశారు.

చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. అంతేకాకుండా ప్రతి సోమవారం సచి వాలయ ఉద్యోగులతో పాటు, చేనేతశాఖ ఉద్యోగులు తప్ప నిసరిగా చేనేత వస్త్రాలను దరించాలని గతంలోనే ప్రకటిం చిందన్నారు.

భారీ పరిశ్రమగా మత్స్యరంగం

మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : మత్స్యరంగాన్ని భారీ పరిశ్రమగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ వెల్లడించారు. శుక్రవారం సచివాలయంలోని ఫైనాన్స్ కాన్ఫరెన్స్ హాల్‌లో మంత్రి అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మత్స్య వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారుల కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధిని సాధించాలనే ఆలోచనతోనే గత ఏడాది రిజర్వాయర్లు, చెరువులలో 27 కోట్ల చేపపిల్లలను విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ ఏడాది 77 రిజర్వాయర్లు, 19,465 గ్రామ పంచాయితీ చెరువులు, 4,465 ప్రభుత్వ చెరువులలో సుమారు 70 కోట్ల చేపపిల్లలను వేయడం జరుగుతుందని మంత్రి తెలిపారు. ఇప్పటికే జిల్లాస్థాయిలో కలెక్టర్ల ఆధ్వర్యంలో టెండర్లను పిలవడం జరిగిందని, వచ్చే నెలలో చేపపిల్లలను విడుదల చేసే కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. చేపపిల్లల విడుదల కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకుగానూ జిల్లాలోని రిజర్వాయర్ల వద్ద అవగాహన సదస్సులను నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించినట్లు తెలిపారు. ఈ సదస్సులకు జిల్లా మంత్రి, పార్లమెంట్ సభ్యుడు, ఎమ్మెల్యే, ఎంపీ, జిల్లా పరిషత్ ఛైర్మన్, మత్స్య సొసైటీ సభ్యులు, చేపపిల్లల సరఫరా కాంట్రాక్టర్‌ను ఆహ్వానించాలని కలెక్టర్లకు సూచించినట్లు చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లేని చేపపిల్లలను ఖచ్చితంగా తిరస్కరించాలని, చేపపిల్లల విడుదల సమయంలో ఆయా మత్స్య సొసైటీల సభ్యులు ఉండేలా చూడాలన్నారు. చేపపిల్లల విడుదలను ఖచ్చితంగా వీడియో చిత్రీకరణ చేయాలని, ఉదయం 6 నుంచి 11 గంటల మధ్యలోనే చేపపిల్లలను విడుదల చేసేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించినట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంత్రులు ఈటెల రాజేందర్, పోచారం శ్రీనివాసరెడ్డి, జగదీష్‌రెడ్డి, జోగు రామన్న, ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, గొర్రెల అభివృద్ధి సమాఖ్య ఛైర్మన్ కన్నెబోయిన రాజయ్య యాదవ్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేష్ చందా, మత్స్యశాఖ కమిషనర్ సువర్ణ, పశు సంవర్ధకశాఖ డైరెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మరో నైజీరియన్ మోసం

•క్యాన్సర్ మందు పేరుతో దగా •నాలుగు లక్షలు స్వాహా.. •ఇద్దరు వ్యక్తుల అరెస్టు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : క్యాన్సర్ తగ్గేందుకు మందులు సరఫరా చేస్తామంటూ మోసం చేసి హైదరాబాద్ వాసి నుంచి రూ.4 లక్షలు వసూలు చేసిన ఇద్దరు నైజీరియన్లు, ఇద్దరు ఢిల్లీకి చెందిన వ్యక్తులను హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. గిఫ్టులు, మ్యాట్రిమోనియల్ పేరిట మోసాలకు పాల్పడిన మరో ముగ్గురు నైజీరియన్లను అరెస్టు చేసినట్లు సీసీఎస్ డీసీపీ అవినాష్ మహంతి శుక్రవారం మీడియాకు వివరించారు. ఆన్‌లైన్ మోసాలకు వారే విధంగా పాల్పడి మోసానికి పాల్పడ్డ తీరును అవినాష్ మహంతి తెలియ జేశారు. చైనాలో తన ఫ్రెండ్‌కు అత్యవసరంగా క్యాన్సర్ మందు అవసరమైంది. అక్కడ దొరకడం లేదని అర్జంట్‌గా కావాలని సందీప్ అనే వ్యక్తి ఇండి యామార్ట్.కామ్ వెబ్‌సైట్‌ని వీక్షించి అందులోని జెబీ కెమికల్స్ అండ్ ఫార్మా స్యూటికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ, ముంబై కాంటాక్ట్ నెంబర్‌ని పొందాడు. అనం తరం పరిణామాలు యధావిధిగా జరిగిపోవడం, ముఠా సభ్యులైన ఇద్దరు నైజీ రియన్లు, ఇద్దరు ఇండియన్లు కలిసి ఇండియన్‌మార్ట్.కామ్ వెబ్‌సైట్‌లో జెబీ కెమి కల్స్ పేరిట ముఠా సభ్యులు నకిలీది క్రియేట్ చేసినట్లు తాను వారి చేతిలో పడి మోసపోయినట్లు బాధితుడు గ్రహించి హైదరాబాద్ సీసీఎస్ పోలీసులను ఆశ్రయించాడు. కాగా, బాధితుడి కోరిన క్యాన్సర్ మందు టాబ్లెట్ ఒక్కొక్కటి రూ.40,000 నుంచి రూ.50,000 వరకు ఖరీదు చేస్తుందని పోలీసులు తెలిపారు. నైజీరియన్ల ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారని తెలిసినా అమాయక ప్రజలు వారి ఉచ్చులో పడి సర్వం పోగొట్టుకుంటూనే ఉన్నారని పోలీసులు తెలిపారు. ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు కోరుతున్నారు. అరెస్టయిన నలుగురిలో నాసోకి అమోస్ విలియమ్స్, ఇబ్రహీం ఇదుతిలు నైజీరియన్లు కాగా, ఢిల్లీకి చెందిన పరస్ గ్రోవర్, కరణ్‌కుమార్ ఝాలు ఉన్నారు. ట్రాన్సిట్ వారెంట్‌పై వారిని ఢిల్లీనుంచి హైదరాబాద్‌కు పోలీసులు తరలించారు. వీరిని పట్టుకోవడంలో ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, శంకర్‌రాజులు కృషి చేశారన్నారు. అరెస్టయిన నిందితుల వద్దనుంచి రెండు ల్యాప్‌టాప్‌లు, 22 సెల్‌ఫోన్లు, పాస్‌పోర్టులు, క్రెడిట్ కార్డ్సను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ల్యాప్‌టాప్,



సెల్‌ఫోన్‌లలోని డేటాను విశ్లేషించి ఇంకా ఎంతమంది బాధితులు వీరి వలలో చిక్కారన్న దానిపై దర్యాప్తు సాగిస్తామని సీసీఎస్ డీసీపీ అవినాష్ మహంతి తెలిపారు. ఏదీ ఏమైనా ఇటువంటి ఆన్‌లైన్ మోసాల పట్ల తగు జాగ్రత్త వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో 25 కిలోల గంజాయి స్వాధీనం

ఖమ్మం క్రైం, కెఎన్ఎన్ : శుక్రవారం అదే కోణార్క్ రైలులో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో విశాఖపట్టణానికి చెందిన హైదర్ నిరంజన్ అలీ అనే వ్యక్తి సుమారు 25 కిలోల గంజాయిని తరలిస్తూ పట్టుబడ్డాని తెలిపారు. ఇతను గంజాయి ప్యాకెట్లను ఖరీదైన సూట్‌కేసులలో పెట్టి ముంబయి వంటి మహా నగరాల్లో అమ్మకానికి తీసుకువెళ్తున్నాడని తెలిపారు. వీటి విలువ బహిరంగ మార్కెట్‌లో సుమారు 30 లక్షల మేరకు ఉంటుందన్నారు. విజయవాడ నుంచి తెలంగాణ రైల్వే పోలీసులు తనిఖీలు చేస్తుండగా ఎస్ 3లో రెండు సూట్ కేసులను గుర్తించటం జరిగిందన్నారు. వీటిని తీసుకువచ్చే వ్యక్తి అలీ మాత్రం రెండు బోగీల తరువాత ఎస్ 5లో కూర్చున్నాడని ప్రతి ఒక్కరిని విచారిస్తుండగా అతని అనుమానాస్పద ప్రవర్తన వల్ల అతని సూట్ కేసుల యజమానిగా గుర్తించామన్నారు.

కొత్త జిల్లాల్లో ఈఎస్ఐ ఆస్పత్రులు

ఎంపీ కవిత విజ్ఞప్తికి దత్తాత్రేయ హామీ

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ ప్రతి జిల్లాలోనూ ఈఎస్ఐ ఆస్పత్రులను ఏర్పాటు చేసేందుకు కేంద్ర కార్మిక మరియు ఉపాధి కల్పన శాఖ మంత్రి బండారు దత్తాత్రేయ అన్నారు. కొత్త జిల్లాల్లో కూడా కార్మిక బీమా ఆస్పత్రులు నిర్మించాలన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిపై ఆయన సానుకూలంగా స్పందించారు. నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత శుక్రవారం ఆయన్ను కలిసి ఈఎస్ఐ ఆస్పత్రుల గురించి చర్చించారు. కవిత తన నియోజకవర్గం పరిధిలో నిజామాబాద్ ఇఎస్ఐ డయాగ్నొస్టిక్ సెంటర్‌తో పాటు నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం పరిధిలో ఉన్న డిస్పెన్సరీని బలోపేతం చేయాల్సిందిగా కేంద్ర మంత్రిని కోరారు. అలాగే జగిత్యాల, కోరుట్ల పట్టణాల్లో నూతనంగా ఇఎస్ఐ ఆసుపత్రులు ఏర్పాటు చేయాలని కూడా ఆమె విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన దత్తాత్రేయ నిజమాబాద్ ఇఎస్ఐ డయాగ్నొస్టిక్ సెంటర్‌కు అవసరమైన పరికరాలను త్వరలోనే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

అమరావతికి ఈఎస్ఐ సిబ్బందిని పంపండి

రాష్ట్ర విభజన జరిగి మూడేళ్లు దాటినా ఇంకా చాలా కార్యాలయాలు హైదరాబాద్‌లోనే ఉండడం వల్ల ఆంధ్రప్రదేశ్ వాసులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని అఖిల భారత పంచాయితీ పరిషత్ జాతీయ కార్యదర్శి జాస్తి వీరాంజనేయులు అన్నారు. ఢిల్లీలో ఈ మధ్యనే బాధ్యతలు చేపట్టిన కేంద్ర కార్మిక రాజ్య బీమా సంస్థ డైరెక్టర్ జనరల్ రాజ్ కుమార్‌ను కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు.

చిన్నారుల కంటిపాపల రక్షణకు మైక్రోసాఫ్ట్‌తో ఒప్పందం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా ప్రభుత్వం మరో కీలక ముందుడుగు వేసింది. చిన్నారుల కంటిపాపలకు మరింత రక్షణ కల్పించేందుకు సిద్ధమైంది. ప్రపంచ ప్రఖ్యాత మైక్రోసాఫ్ట్‌తో జట్టుకట్టి క్లౌడ్, అనలటిక్స్ డాటా సేవలను ఉపయోగించుకొని చిన్నారులకు మెరుగైన వైద్యాన్ని అందించాలని నిర్ణయించింది. జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా రాష్ట్రీయ బాల్‌స్వాస్థ్య కార్యక్రమం కింద మైక్రోసాఫ్ట్ ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్ ఫర్ ఐ కేర్‌తో కృత్రిక మేధస్సు ఆధారంగా రూపొందించిన సాంకేతికతతో చిన్నారుల్లో అంధత్వాన్ని అరికట్టేందుకు సన్నద్ధమైంది. తద్వారా ఈ సాంకేతికతతో పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకున్న మొదటి రాష్ట్రంగా నిలిచింది. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ, సామాన్యుల జీవితాల్లో మార్పులు తెచ్చేందుకు టెక్నాలజీ ఉపయోగడటం అనేతి తమ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమన్నారు. ఇందులో భాగంగా తాజా కృత్రిక మేధస్సు పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని వైద్యసేవలకు ముందుకు సాగ డం హర్షణీయమన్నారు. మైన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకున్న మొట్టమొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తుందని ఆయన అన్నారు. ఈ పరిజ్ఞానంతో ముందుకు సాగడం ద్వారా భవిష్యత్తులో మన యువతలో కండ్ల వ్యాధులను నివారించేందుకు అత్యుత్తమ అవకాశం దొరుకుతుందని మంత్రి అన్నారు. టెక్నాలజీ విషయంలో తెలంగాణ ప్రభుత్వంతో జతకట్టడం సంతోషంగా ఉందని, ఆరోగ్యపరమైన అంశాల్లో సాంకేతికతను సామాన్యుల జీవితంలో చేర్చడంపై తెలంగాణ ప్రభుత్వం ముందుకు రావడం ప్రశంసనీయమని అన్నారు.

రజాకార్లను మించిన కేసీఆర్

• అప్రజాస్వామి విధానాలపై కోర్టుల్లో కేసులు వేస్తాం



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : రాష్ట్ర ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలకు వ్యతిరేకంగా బాధితులు కోర్టులకు వెళ్లటం తప్పేమీ కాదని, అదేదో తప్పనే విధంగా సీఎం కేసీఆర్ మాట్లాడడం సరికాదని మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. ప్రాజెక్టుల కింద భూములు కోల్పోయిన రైతులు భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని కోరడంలో తప్పేమీ లేదని, మీరు ఇవ్వకపోతే కోర్టును ఆశ్రయించకతప్పదన్నారు. కేసీఆర్ 198 కేసులన్నారని, అంతకన్న ఎక్కువ కేసులు కోర్టుల్లో పడతాయని, కేసులు పడకూడదనుకుంటే ప్రజావ్యతిరేక విధానాలను మార్చుకోవడం ఒక్కటే పరిష్కారమన్నారు. నేరెళ్లలో దళితులు, బీసీలను చిత్రహింసలు పెట్టిన తీరు అమానుషమని, అందుకు బాధ్యులైన పోలీసులను సమర్థించడం ద్వారా తాను రజాకార్లను మించిన వ్యక్తిగా కేసీఆర్ నిరూపించుకున్నారని ఆరోపించారు. కమీషన్ల కోసమే ఇప్పుడున్న సచివాలయాన్ని బైసన్ పోలో మైదానానికి మార్చాలని కేసీఆర్ నిర్ణయించుకున్నారని విమర్శించారు. సచివాలయానికి అన్ని హంగులుండగా కొత్త సచివాలయం ఎందుకని, అదే విధంగా అసెంబ్లీ భవనాన్ని కూడా వేరే చోట కడతామని చెప్పడంలో ఆంతర్యమేమిటని శశిధర్ రెడ్డి ప్రశ్నించారు. కొత్త సచివాలయాన్ని అడ్డుకుంటామని, అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

పేదవాడు పీఎస్ వెళ్ళే పరిస్థితి లేదు

• పీసీసీ అధికార ప్రతినిధి ప్యాట రమేష్

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్రం వస్తే అన్ని వ్యవస్థలు ప్రజలవద్దకు చేరువవుతాయని భావించిన ప్రజలు, ప్రస్తుత పరిస్థితి చూసి భయం భయంగా బతుకుతున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి ప్యాటరమేష్ ఆరోపించారు. సామాన్య ప్రజలు పోలీస్ స్టేషన్లకు వెళ్లలేని పరిస్థితులు ఉన్నాయని ఆందోళనవ్యక్తం చేశారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. నిన్న నేరెళ్లలో దళితులు, బీసీలపై పోలీస్ దాడులు, నిన్న సీఎం క్యాంపు కార్యాలయం వద్ద జర్నలిస్టులపై పోలీస్ అరాచకం వ్యవస్థను ఎటువైపు మళ్లిస్తున్నారని మండి పడ్డారు. రాష్ట్రంలో అరాచక పరిస్థితులను ప్రభుత్వం సృష్టిస్తోందని రమేష్ ఆరోపించారు.

సీఎం ఎక్కడికి వెళితే..అక్కడికిపోతా



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : కేసీఆర్ నిజస్వరూపాన్ని తెలిపేందుకు తాను ప్రజల్లోకి వెళతానని పీసీసీ మాజీ అధ్యక్షుడు వి హనుమంతరావు చెప్పారు. విపక్షాల భండారాన్ని బయటపెట్టేందుకు జనంలోకి వెళతానని ప్రకటించిన కేసీఆర్ వెనకే తాను కూడా వెళతానని, ఆయన ఎక్కడికి వెళితే తాను కూడా అక్కడికి వెళ్లి ఆయన గుట్టు విప్పుతానని తెలిపారు. శుక్రవారం గాంధీ భవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రమంతా తిరిగి ప్రతిపక్షాల భండారం బయటపెడతానని కేసీఆర్ అంటే ప్రజలు నవ్వుకుంటున్నారని చెప్పారు. ప్రాజెక్టుల రీడిజైన్‌తో కమీషన్లు పెరుగుతాయని ప్రజలకు తెలిసిపోయిందని, ప్రభుత్వం అనాలోచితంగా తీసుకుంటున్న నిర్ణయాలతో ప్రజలకు సంబంధించిన వేలకోట్ల రూపాయలు వృధా అవుతున్నాయని, అవన్నీ కాంట్రాక్టర్లు, కేసీఆర్ కుటుంబం చేతుల్లోకి వెళుతున్నాయని ఆరోపించారు. సీఎం కేసీఆర్ నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని, టీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల ఆగడాలకు అడ్డూ అదుపులేకుండా పోయిందని విహెచ్ ఆరోపించారు.

వెనుకబడిన వర్గాలపై కాంగ్రెస్ దృష్టి

• నేడు దక్షిణాది రాష్ట్రాల నేతలతో రాహుల్ భేటీ

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : వచ్చే ఎన్నికల్లో పార్టీకి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ సమాయత్తమవుతోంది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలు, మతతత్వ ఎజెండాకు వ్యతిరేకంగా కార్యక్రమాలు చేపడుతున్న కాంగ్రెస్ అధిష్టానం తాజాగా వెనుకబడిన వర్గాలపై ప్రత్యేక దృష్టిసారించింది. ఈ వర్గాలకు కేంద్రంలోని ఎన్డీఏ సర్కార్ సైతం పట్టించుకోనందున ఈ వర్గాలను ఆకర్శించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు పోతోంది. ఈ వర్గాలకు ఏం చేస్తే బాగుంటుంది..,వారి సమస్యలేంటి ? ఎలాంటి వారికి నాయకత్వం అప్పగించాలి.., పార్టీ పరంగా తీసుకోవాల్సిన చర్యలేంటి ? గతంలో అధికారంలో ఉన్నప్పుడు యూపీఏ సర్కార్ వైఫల్యాలేంటి ? దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పార్టీ పరిస్థితేంటి ? పార్టీ పటిష్టతకై తీసుకోవాల్సిన చర్యలేంటి ?అనే అంశాలను నేరుగా బీసీ నేతలతో తెలుసుకునేందుకు శనివారం ఢిల్లీలో ప్రత్యేక సమావేశాన్ని ఏఐసీసీ ఏర్పాటు చేసింది .ఈ సమావేశానికి ఏఐసీసీ ఉపాధ్యక్షులు రాహుల్ గాంధీ హాజరవుతారు. పార్టీ సీనియర్ ఓబీసీ నేతలు కూడా పాల్గొంటారు. 2019 ఎన్నికల్లో గెలిచేందుకు రెండేళ్ల ముందునుంచే కార్యాచరణకు దిగిన అధిష్టానం ఇప్పటికే ఎస్సీ,ఎస్టీ సెల్ సమావేశాలను ఏర్పాటు చేసి రిజర్వుడు నియోజకవర్గాల్లో కార్యక్రమాలను చేపడుతున్న విషయం తెలిసిందే.

నేటినుంచి పొన్నం ఆమరణదీక్ష

కరీంనగర్, కెఎన్ఎన్ బ్యూరో : రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఆగస్టు 5, 2014న కరీంనగర్‌లో ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వ వైద్య కళాశాలను ఏర్పాటు చేయాలని ఇందుకు వెంటనే ఎన్‌వోసీ జారీ చేయాలనే డిమాండ్‌తో సీఎం ప్రకటనకు మూడు సంవత్సరాలు అయిన సందర్భంగా ఇదే ఆగస్టు 5న కరీంనగర్ ఇందిరాచౌక్‌లో ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించాలని మాజీ ఎంపీ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు పొన్నం ప్రభాకర్ నిర్ణయించారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావడానికి సిద్ధమవుతున్న తరుణంలో దీక్ష వలన శాంతి భద్రతలు తలత్తే అవకాశం ఉన్నందున అనుమతి నిరాకరిస్తున్నట్లు కరీంనగర్ పోలీస్ కమీషనర్ కమాలస్ రెడ్డి ప్రకటించడంతో ఏ క్షణం ఏమి జరుగుతుందోనన్న ఉద్రిక్తత వాతావరణం కరీంనగర్‌లో నెలకొంది. అనుమతి లేని కార్యక్రమాలకు విద్యార్థులను తరలించే పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలపై జువైనల్ జస్టిస్ సెక్షన్ 75,83 ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అనుమతిలేని కార్యక్రమాలకు యువత హాజరైతే పాస్‌పోర్టుతోపాటు ఉద్యోగ అర్హత కొల్పోతారని చేసిన ప్రకటనను కాంగ్రెస్ నేతలు ఖండిస్తూ వారి ఏర్పాట్లలో వారు ఉన్నారు.



ప్రభుత్వ తీరును ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కటకం మృత్యుంజయం, జగిత్యాల ఎమ్మెల్యే టీ. జీవన్ రెడ్డిలు ఖండించారు. జిల్లా కాంగ్రెస్ కార్యకర్తలను, నాయకులను తరలిరావాలని పిలుపునిచ్చింది. మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ శుక్రవారం కొండగట్టు అంజనేయస్వామి దేవాలయంలో, వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి శనివారం నుంచి ఆమరణ దీక్షకు సిద్ధమైనారు. ఇందిరాచౌక్ వద్ద అనుమతిని పోలీసులు నిరాకరించడంతో ఇంటి వద్దకు శనివారం ఉదయం తొమ్మిదగంటలలోపు పెద్ద ఎత్తున తరలిరావాలాని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పోలీసులు ఏ క్షణంలోనైనా ఇంటివద్దే అరెస్టు చేసే అవకాశం ఉండటంతో కరీంనగర్‌లో ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. శుక్రవారం కరీంనగర్‌లో పర్యటించిన ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్ దీక్ష ఆనాడు ఉమ్మడి రాష్ట్రంలో ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటారని, మొదటి దశలో మహబూబ్‌నగర్, సిద్దిపేట లకు ఇచ్చారని, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో ఎక్కడైనా ఇస్తామని, ఫీజుబులిటీ ఆదారంగా ప్రకటన చేస్తామని తెలిపారు. నిన్నటివరకు నేరెళ్ల సంఘటన అంశం రాజకీయాన్ని వేడెక్కించగా, నేటి నుంచి పొన్నం ప్రభాకర్ చేస్తున్న ఆమరణ దీక్ష కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో రాజకీయం మరింత వేడెక్కనుంది.

ఆ పిటిషన్లు గాంధీభవన్‌కు పంపుతా

• అవి చదివి జవాబివ్వండి • కాంగ్రెస్ నేతలకు హరీష్ సూచన • సీఎం ఆవేదనను అర్థం చేసుకోని ప్రతిపక్షాలు • కేసులు వేసి అభివృద్ధిని అడ్డుకుంటున్నారనే సీఎం ఆవేదన: మంత్రి హరీష్‌రావు



సిద్దిపేట, కెఎన్ఎన్ : పదవులను త్యాగం చేసి 14 యేండ్లు పోరాడి చావు నోట్లో తలపెట్టి సాధించుకున్న తెలంగాణను అద్భుతంగా తీర్చిదిద్ది పేదల సంక్షేమం కోసం అనేక ప్రణాళికలు రచించి అమలు చేస్తుంటే ప్రతిపక్షాలు కోర్టు కేసుల నేపంతో అభివృద్ధికి అడ్డుపడుతున్నారని ముఖ్యమంత్రి కేసీఅర్ బాధ, ఆవేదన ప్రతిపక్షాలకు అహంకారంగా కన్పించడం వారి అవగాహన రహిత్యానికి నిదర్శనం అని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని అర్అండ్‌బి అతిథి గృహంలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్‌లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలోఆయన మాట్లాడుతూ 60 యేండ్ల సమైక్య పాలనలో నలిగిన తెలంగాణ రాష్ట్రానికి మేలు చేస్తామంటే కోర్టులో కేసులు వేసి ముందటి కాళ్ళకు బంధం వేస్తున్నారని ముఖ్యమంత్రి ఆవేధన వెళ్లిబుచ్చితే, దానిని ప్రతిపక్షాలు ఉన్న మాట అంటే ఉరుకు ఎక్కువ అన్న సమేతను బుజువు చేశాయన్నారు. మూడు సంవత్సరాల్లో టీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలతో సీఎం కేసీఆర్‌కు ఎక్కడ మంచి పేరు వస్తుందో అన్న రాజకీయ దురుద్దేశంతోనే ప్రతిపక్షాలు ప్రజలకు అన్యాయం చేస్తున్నారని ప్రతిపక్షాల ప్రవర్తనను ముఖ్యమంత్రి ప్రజల ముందు ఉంచారన్నారు. ముఖ్యమంత్రి ప్రజల కోసం చేపడతున్న పనులకు అడ్డుపడుతున్నారన్న దు:ఖాన్ని ప్రతిపక్షాలు అర్థం చేసుకోకపోవడం దురదృష్టకరమన్నారు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయానికి కారణం కాంగ్రెస్ అని, కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి అడ్డుపడుతున్నారని ముఖ్యమంత్రి అన్న మాటలు నిజం కావా కాంగ్రెస్ నాయకులు కేసులు వేయడం లేదా పేర్లతో సహ వివరాలు మావద్ద ఉన్నాయన్నారు. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన ఐదుగురు కాంగ్రెస్ నాయకులు వారి పేరినే కోర్టులో కేసులు వేసింది నిజం కాదా అన్నారు. నీటి పారుదల ప్రాజెక్టులను అడ్డుకోవడానికి కోర్టులో కేసులు వేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో కళాభారతి అంబేద్కర్ విగ్రహం, అమరుల స్థూపం కట్టవద్దని, రోడ్ల వెడల్పు చేయవద్దని, హుస్సేన్ సాగర్ ప్రక్షాళన చేయవద్దని కేసులు వేసింది కాంగ్రెస్ నాయకులు కాదా అని ప్రశ్నించారు. పిటిషన్‌ల వివరాలు గాంధీ భవన్‌కు పంపిస్తాం.. జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు చదివి సమాధానం ఇవ్వండి. సమీక్ష సమావేశం ఏర్పాటు చేసుకుంటే మీ పార్టీ నాయకులు అభివృద్ధి కార్యక్రమాలపై ఎన్ని కేసులు వేశారో మీకే తెలుస్తుందన్నారు.

మీరు అధికారంలో ఉండి చేయలేని పనులు మేము చేస్తున్నామని అది చూసి ఓర్వలేకనే మీరు అడ్డుపడుతున్నారన్నారు. తెలంగాణకు ద్రోహం చేస్తున్నారన్న విషయాన్ని బయటపెడితే ఉలిక్కి పడి నోరు పారేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వాస్తవాలు చెబితే జీర్ణించుకోలేని కాంగ్రెస్ నాయకులు ఒకరి తర్వాత ఒకరు స్పందించి బాగా రోశానికి వస్తున్నారని ఈ స్పందన, ఈ రోశం అధికారంలో ఉన్నప్పుడు వస్తే తెలంగాణకు ఎంతో మేలు జరిగేదన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం పోరాటం చేస్తున్న ఉద్యమకారులను చిత్రహింసలకు గురి చేస్తే మీ రోశం ఎక్కడ పోయిందని, తెలంగాణ ప్రాజెక్టులు, విద్యుత్ ప్రాజెక్టులు ఆంధ్రాకు తీసుకెళ్లినప్పుడు మీ నోర్లు ఎందుకు మూగబోయాయని రాజశేఖర్‌రెడ్డి నిండు సభలో తెలంగాణలో అవమానించినప్పుడు స్పందించని మీరు తెలంగాణను అభివృద్ధి చేస్తుంటే సీఎం కేసీఆర్ పై మాట్లాడటం హస్యాస్పందంగా ఉందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో రాష్ట్రహౌజింగ్‌కార్పొరేషన్ చైర్మెన్ భూంరెడ్డి, మున్సిపల్ చైర్మెన్ కడవేర్గు రాజనర్సు, మున్సిపల్ వైస్ చైర్మెన్ అక్తర్ పటేల్, కౌన్సిలర్లు బర్ల మల్లిఖార్జున్, గ్యాదరి రవింధర్, చిప్ప ప్రభాకర్, బండారి నర్సింలు నాయకులు సాకి ఆనంద్, మల్లిఖార్జున్ లు పాల్గొన్నారు.

మజ్లిస్ ఒత్తిడివల్లే 'విమోచన'కు దూరం

• సెప్టెంబర్ 17న పెద్ద బహిరంగ సభ నిర్వహిస్తాం



హైదరాబాద్,ఆంధ్రప్రభ : సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించేందుకు టీఆర్ఎస్ ప్రభుత్వం ముందుకు రాకపోవడం శోచనీయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ మండిపడ్డారు. తెలంగాణ విమోచన దినోత్సవంపై పల్లె నుంచి పట్నం వరకు ప్రజల్లో చైతన్యం తెస్తామని ఆయన తెలిపారు. 2019 ఎన్నికల్లో బీజేపీ ప్రధానంగా ఎజెండా చేర్చి.. అధికారంలో వచ్చాక అధికారికంగా నిర్వహిస్తామని ఆయన తెలిపారు. సెప్టెంబర్ 17న హైదరాబాద్‌లో పెద్ద సభను నిర్వహిస్తామని లక్ష్మణ్ పేర్కొన్నారు. శుక్రవారం పార్టీ నేతలతో సభ నిర్వహణపై చర్చించారు. అనంతరం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ విమోచన దినోత్సవ సభపై ప్రజలను భాగస్వామ్యులను చేస్తామన్నారు. ఉద్యమం రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. తెలంగాణ ఉద్యమం సమయంలో సీఎం చంద్రశేఖర్‌రావు అప్పటి ప్రభుత్వాలపై తీవ్ర విమర్శలు చేశారని, తెలంగాణ వచ్చాక విమోచన దినోత్సవం ప్రభుత్వమే అధికారికంగా నిర్వహిస్తుందని చెప్పిన విషయాన్ని లక్ష్మణ్ గుర్తు చేశారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని కర్ణాటక, మహారాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహిస్తున్నాయని, అదే తెలంగాణ ప్రభుత్వం ఎందుకు నిర్వహించడం లేదని ఆయన ప్రశ్నించారు. మజ్లిస్ పార్టీతో ఒత్తిడితోనే టీఆర్ఎస్ ప్రభుత్వం ముందుకు రావడంలేదని ఆయన నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు చేసిన పాపాలను కేసీఆర్ కొనసాగిస్తున్నారని ఆయన విమర్శించారు. రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం పోరాటం చేసిన యోధుల చరిత్ర భావితరాలకు తెలియాలంటే.. పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం పనితీరుపై రోజు రోజుకు ప్రజల్లో వ్యతిరేకిత పెరుగుతోందని, దీంతో కేసీఆర్‌కు కూడా అసహనం పెరిగిపోతున్నదని ఆయన విమర్శించారు. అభద్రతా భావంతోనే ప్రజలు, విపక్షాలపై కేసీఆర్ విమర్శలు చేస్తున్నారని లక్ష్మణ్ ఆరోపించారు. మతపరమైన రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకమని తమ పార్టీ ఎప్పుడో స్పష్టం చేసిందన్నారు. ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లకు ప్రధానమంత్రి నరేంద్రమోడి ఒప్పుకున్నారని సీఎం చెప్పడం సత్యదూరమన్నారు. ప్రధానమంత్రి ఎప్పుడు కూడా ముస్లింలకు రిజర్వేషన్లపై సానుకూలంగా మాట్లాడలేదని లక్ష్మణ్ చెప్పారు. సిరిసిల్ల జిల్లాలో దళితులపై థర్డ్ డిగ్రీ చేపట్టిన పోలీసులను సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కడుపు మండికాదు..కండ్లు మండే కుట్రలు

• ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ధ్వజం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నేతలు కేసులు వేస్తున్నది కడుపుమండి కాదని, కండ్లు మండి అని ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. టిఆర్ఎస్ ఎల్పీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేఖరుల సమావేశంలో ప్రభుత్వ విప్ బోడకుంటి వెంకటేశ్వర్లుతో ఆయన మాట్లాడారు. అభివృద్ధిని అడ్డుకుంటూ దొంగమాటలు చెబుతున్న కాంగ్రెస్ నాయకులు కోర్టుల్లో తప్పుడు కేసులు వేస్తున్నందుకు సిగ్గుపడాలన్నారు. మూడేళ్ళుగా ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తుంటే ఓర్వలేక ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. తమకు కోర్టులపై అపరిమితమైన గౌరవం ఉందని, కాంగ్రెస్ నాయకులు స్వార్థం రాజకీయాల కోసం కోర్టులను పక్కదారి పట్టిస్తున్నారన్నారు. ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టుపైనే 119కేసులు, మొత్తం ప్రాజెక్టులపై 164కేసులు వేశారన్నారు. కోర్టుల్లో కేసులు వేసిన మర్రి శశిధర్ రెడ్డి కాంగ్రెస్ నాయకుడు కాదా అని ఆయన ప్రశ్నించారు. ఇన్ని కేసులు వేసినందుకు జానారెడ్డితో సహ కాంగ్రెస్ నాయకులు ముక్కు నేలకు రాయాలన్నారు. మీరు అజ్ఞానంతో మాట్లాడుతూ తమను అహంకారమనడం శోచనీయమన్నారు. సిరిసిల్ల ఎస్పీ విశ్వజిత్, మంత్రి కెటిఆర్‌లను చంపుతామంటూ కాంగ్రెస్‌కు చెందిన ఒక అధికార ప్రతినిధి అనడాన్ని జానారెడ్డి సమర్థిస్తారా అని ప్రశ్నించారు. పెద్దమనిషిగా రాజకీయాల్లో కొనసాగదల్చుకుంటే వారి నోళ్ళు మూయించాలన్నారు. భయానికే మీనింగ్ తెలియని నాయకుడు కెసిఆర్ అన్నారు.

టిఆర్ఎస్ నిప్పు..తప్పు చేయదు: ప్రభుత్వ విప్ బోడకుంటి

టిఆర్ఎస్ పార్టీ నిప్పు అని, ఎన్నడూ తప్పుచేయదని ప్రభుత్వ విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు అన్నారు. రెండు నెలలుగా కాంగ్రెస్ నాయకులు తప్పుడు కూతలు కూస్తున్నా కెసిఆర్ మాట్లాడలేదన్నారు. ఇంకా మౌనంగా ఉంటే ఏదో తప్పుచేసినట్లు కాంగ్రెస్ నాయకులు అవాకులు, చవాకులు పేలతారని అన్ని అంశాలపై వివరించి చెప్పారన్నారు. ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్న కెసిఆర్, హరీష్‌రావు, కెటిఆర్, కవితలను విమర్శించడం దారుణమన్నారు. కోర్టు కేసులతో అభివృద్ధిని అడ్డుకోలేరన్నారు.



పునరుజ్జీవ సభను విజయవంతం చేయాలి



కరీంనగర్, కెఎన్ఎన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఈనెల 10న నిజామాబాద్‌లో నిర్వహించనున్న పునరుజ్జీవ సభను సమష్టి కృషితో విజయవంతం చేయాలని రాష్ట్ర ఆర్థిక, పౌరసరఫరాల శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. కరీంనగర్ పద్మనాయక కళ్యాణ మండపంలో శుక్రవారం కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల టిఆర్ఎస్ ప్రజాప్రతినిధుల, ముఖ్య కార్యకర్తల సమావేశం లో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా పోచంపాడు వద్ద చేపట్టే బృహత్తర కార్యక్రమం వల్ల 7 జిల్లాలలోని పంట పొలాలు సస్యశ్యామలవవుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సాగునీరు, తాగునీరుకి అధిక ప్రాధాన్యతనిస్తుందని, ఈ కారణంగానే పోచంపాడు వద్ద చేపట్టే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి ఈటల రాజేందర్ శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరివాహక పరిధిలోని జిల్లాల నుంచి రైతులను పెద్ద ఎత్తున సమీకరించేందుకు ఆయా జిల్లాల వారిగా ఇన్‌చార్జ్‌లను నియమిస్తూ శుక్రవారం కరీంనగర్‌లో ప్రకటించారు. కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలకు మంత్రి ఈటల రాజేందర్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తారు, రాజన్న సిరిసిల్ల జిల్లాకు మంత్రి కే.తారకరామారావు, జగిత్యాల జిల్లాకు నిజామాబాద్ ఎంపీ కవిత, వరంగల్ ఉమ్మడి జిల్లాకు ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, నిజామాబాద్‌కు కొత్త ప్రశాంత్ రెడ్డి, కామారెడ్డి జిల్లాకు మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌లు ఇన్‌చార్జీలుగా వ్యవహరిస్తారు. మంత్రి ఈటల తాను ఇన్‌చార్జ్‌గా ఉన్న కరీంనగర్, పెద్దపల్లి ముఖ్యనేతలు, కార్యకర్తల సమావేశాన్ని పద్మనాయక కళ్యాణ మండలంలో ఏర్పాటు చేసి దిశానిర్దేశనం చేశారు. ఆర్టీసీ చైర్మెన్ రామగుండం ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ, తెలంగాణ సంస్కృతికి సారథి , మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, కరీంనగర్, పెద్దపల్లి ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, దాసరి మనోహర్ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ తోపాటు ముఖ్యనేతలు హాజరైనారు. తమతమ నియోజకవర్గాల పరిధి నుంచి రైతులను పెద్ద సంఖ్యలో సమీకరించాలని కోరారు. ముఖ్యంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరివాహక ప్రాంతాల నుంచి ఎక్కువ మొత్తంలో కార్యకర్తలు, రైతులు తరలివచ్చే విధంగా చూడాలని ఎమ్మెల్యేలకు, పార్టీ ముఖ్య నాయకులకు ఈటల రజేందర్ సూచించారు.

శ్రీవారి వెండివాకిలి వద్ద ఇనుప మెట్లు ఏర్పాటు




తిరుమల కెఎన్ఎన్ : తిరుమల శ్రీవారి ఆలయంలో రద్దీని తట్టుకునేందుకే వెండి వాకిలి వద్ద అత్యవసర ఇనుప మెట్లను ఏర్పాటు చేస్తున్నట్లు టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. వెండి వాకిలి వద్ద ఇనుప నిచ్చెన ఏర్పాటు చేసి, దాని పై భక్తులను తరలించే పనులకు టీటీడీ శ్రీకారం చుట్టింది. స్వామివారిని దర్శిం చుకున్న అనంతరం వెలుపలకు వచ్చేందుకు భక్తులకు ఇబ్బందుల దృష్ట్యా, భక్తుల మద్య తోపులాటలు అరికట్టేందుకు టీటీడీ అధికారులు దీనిపై దృష్టిసారించారు. ఇందులో భాగంగా ఆగమ సలహామండలి నిర్ణయం మేరకు వెండి వాకిలి ద్వారం ప్రక్కనే ఇనుప నిచ్చెన ఏర్పాటు చేసింది. నిరంతరం కాకుండా ఆలయంలో రద్దీని దృష్టిలో ఉంచుకుని అత్యవసర పరిస్థితులలో ఈ మెట్లను ఉపయోగించేందుకు వీలుంటుందని ఈవో తెలిపారు. ఆగమ దారుల సలహా లేకుండా శ్రీవారి ఆలయంలో ఏ విధమైన నిర్మాణాలను టీటీడీ చేపట్టదని ఈ సందర్భంగా ఈవో తెలిపారు.

ఈ తహసీల్దార్ మహాముదురు!



• భూమిని మింగిన 'భూ రక్షకుడు'
• సర్కార్ నేలపై పచ్చనోట్ల పంట
• సర్టిఫికెట్ల నుంచి ఇసుక వరకు
• ఆధారాలతో సహా 15 పేజీల నివేదిక
• సస్పెన్షన్‌కు కలెక్టర్ సిఫారసు
• అయినా సరే ఎవరిదో ఒకరి అండ

రామగుండం, కెఎన్ఎన్ : కంచే చేను మేస్తే... రక్షకుడే భక్షకుడైతే... అధికారాన్ని అమ్ముకుంటే? ప్రభుత్వ భూములను కంటికి రెప్పలా కాపాడాల్సిన రక్షకుడే వాటిని అడ్డంగా దోచేసి నోట్ల పంట పండించుకున్నాడు. ప్రజలకు సేవ చేయాలని అప్పగించిన ప్రతి అధికారాన్ని పైసలకు అమ్ముకున్నాడు. ధ్రువీకరణ పత్రాల జారీ నుండి ఇసుక రవాణా వరకు ఒక తహసీల్దార్ చేయాల్సిన ప్రతి పనిలోనూ పైసలు తప్ప సేవను చూడలేదు. మొత్తం మీద ఈ తహసీల్దార్ తన చేతివాటం చూపించి అందినంత దోచుకొని అందల మెక్కాడు. లోతుగా విచారించిన ఉన్నతాధికారులకు దొరికిన ఆధారాలు కళ్లు బైర్లుకమ్మేలా చేశాయి. లభించిన ఆధారాలు కాగితంపై పెట్టేందుకు 15 పేజీల నివేదిక అవసరమైంది. ఇలాంటి అక్రమార్కుడిని అర్జెంట్‌గా విధుల నుండి తొలగించాలని జిల్లా కలెక్టర్ సీసీఎల్ఏకు సిఫారసు చేశారు. అయినా సరే ఓ అదృశ్య హస్తం అతడిని వెనుకనుండి కాపాడుతోంది. సస్పెన్షన్ అటుంచితే అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడిన చోటే మళ్లీ అధికారిగా కొనసాగించేందుకు ప్రయత్నాలు జరుగుతు న్నాయి. ఇంతకు మించిన దురదృష్ట పరిస్థితులు ఏముంటా యని జిల్లాలో జోరుగా చర్చ జరుగుతోంది. వివరాల్లోకి వెళితే... మూడేళ్ల క్రితం రామగుండం తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన గూడూరి శ్రీనివాసరావు అడుగడుగునా అవినీతికి పాల్పడ్డాడు. మండలంలో ఉన్న ప్రతి భూమిని అన్యాక్రాంతం చేశాడు. అంతర్గాం మండలం గోలివాడలో సర్వేనం.255/1,255/2,273లలో అంతర్గాం పేపర్‌మిల్‌కు చెందిన వందల ఎకరాల ప్రభుత్వ భూమిని అందినకాడికి దోచుకొని పరులకు పట్టా చేయడంతోపాటు మరికొంత మందిని రికార్డుల్లో అనుభవ దారులుగా చేర్చాడు. నిరుపయో గంగా ఉన్న ప్రభుత్వభూమిని అసైన్డ్ మెంట్ కమిటీ ఆమోదంతో లబ్ధిదారులకు అందించాలనే నిబంధనలు ఉన్నా ఎలాంటి రికార్డులు లేకుండా పరులపాలు చేశాడు. ఎల్కలపల్లిలో రైల్వే కోసం కోట్లాది రూపాయలు వెచ్చించి భూ సేకరణ ప్రక్రియ ద్వారా సేకరించిన భూమిని సైతం సర్వే నం.66/బిలో ప్రైవేట్ వ్యక్తులకు మోటెషన్ చేశాడు. ఎన్టీపీసీకి చెందిన భూమిని కొంతమంది వ్యక్తుల పేరిట రికార్డుల్లో చేర్చాడు. బ్రాహ్మణపల్లిలోని సర్వే నం.233/1లోని 59.20 ఎకరాల ప్రభుత్వ భూమిని 33మంది పేరిట కొంత పట్టా చేసి మరికొంత రికార్డుల్లో కబ్జాదారుల జాబితాలో చేర్చారు. ఈ వ్యవహారంపై కార్యాలయంలో ఎలాంటి రికార్డులు లేకపోవడం గమనార్హం. కుందనపల్లిలో రాజీవ్ రహదారిని ఆనుకొని ఉన్న సర్వే నం. 280లో కోట్లాది రూపాయల ప్రభుత్వ భూమిని జీఓ నం.59ని అడ్డం పెట్టుకొని ఇద్దరి పేట రెగ్యూలరైజేషన్ కోసం సిఫారసు చేశాడు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా గోలివాడలో పంప్‌హౌజ్ నిర్మాణం కోసం జరిపిన భూ సేకరణలో సైతం అవినీతికి పాల్పడ్డారు. సర్వే నం.437, 438, 439లలో 58.33 ఎకరాల భూముల్లో నిర్మాణాలు ఉన్నాయని, వాటికి కొంతమంది అనుభవదారులుగా రికార్డులు సృష్టించి పరిహారం కోసం సిఫారసు చేశారు. పెద్దపల్లి ఆర్డీఓ అశోక్‌కుమార్ అప్రమత్తం కావడంతో రూ.2కోట్ల ప్రభుత్వ ధనం నిరుపయోగం కాకుండా మిగిలిపోయింది. వ్యవసాయ భూములను మాత్రమే మోటేషన్ చేయాలని ఆర్ఓఆర్ 1971 చట్టం చెబుతుండగా వ్యవసాయేతర భూములు సైతం మోటేషన్ చేయడం ఆయనకే చెల్లింది. మండలంలోని ఇసుక రవాణా కోసం అందించిన వేబిల్లులు తహసీల్దార్ మార్చి మార్చి సంతకాలు చేసి ప్రభుత్వ ఖజానాకు గండికొట్టారు. ఎన్టీపీసీ శివారులో పెద్ద ఎత్తున ఇసుక నిలువ చేశారని పెద్దపల్లి ఆర్డీఓ ఆదేశాలతో 300 ట్రాక్టర్ల ఇసుక డంప్‌ను సీజ్ చేసి రాత్రికిరాత్రే మాయం చేశాడనే ఆరోపణలున్నాయి. డిపెండెంట్ సర్టిఫికెట్ల జారీ కోసం ఒక్కొక్కరి వద్ద రూ.50వేలు తీసుకున్నా డని అధికారుల విచారణలో బహిర్గతమైనట్లు సమాచారం. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం రూ.10వేలు తీసుకున్నాడని సమాచారం. సదరు తహసీల్దార్ అవినీతిపై సీసీఎల్ఏకు పెద్ద సంఖ్యలో ఫిర్యాదు అందడంతో శ్రీనివాసరావుపై విచారణ చేసి నివేదిక అందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు పెద్దపల్లి ఆర్డీఓ అశోక్‌కుమార్ విచారణ చేపట్టగా అవినీతి తహసీల్దార్ అక్రమాలు బహిర్గతమయ్యాయి. 10అంశాలపై జరిపిన విచారణను 15పేజీల నివేదికగా తయారు చేసి జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. సదరు తహసీల్దార్‌ను రామగుండం నుండి ఓదెలకు బదిలీ చేయడంతోపాటు సస్పెన్షన్ కోసం జిల్లా కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి జులై 28న సీసీఎల్ఏకు సిఫారసు చేశారు. అయితే అక్రమ తహసీల్దార్‌కు రాష్ట్రస్థాయి పదవిలో ఉన్న ప్రజాప్రతినిధి అండగా నిలిచారు. తనకు సమాచారం అందించకుండా తహసీల్దార్‌ను ఎలా బదిలీ చేశారని ఉన్నతాధికారులపై మండిపడ్డట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. తహసీల్దార్ బదిలీని నిలిపివేయాలని జిల్లా ఉన్నతాధికారులకు లిఖితపూర్వకంగా తెలియజేసినా బదిలీ నిలిపివేత జరగకపోవడంతో సదరు ప్రజాప్రతినిధిఏకంగా జిల్లా కలెక్టర్‌ను బదిలీ చేయాలని, తహసీల్దార్ శ్రీనివాసరావును రామగుండంలోనే కొనసాగించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ అందించినట్లు సమాచారం. జులై 2న మరోసారి తహసీల్దార్ శ్రీనివాసరావుపై సస్పెన్షన్‌వేటు వేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి లేఖ రాశారు. అవినీతి అధికారిని కాపాడే ప్రయత్నం చేస్తున్న ప్రజాప్రతినిధి చర్యలపై జిల్లాలో పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అవినీతి రహిత తెలంగాణ నిర్మాణమే ధ్యేయమని చెబుతున్న ప్రభుత్వం అక్రమ తహసీల్దార్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



GOVERNMENT OF TELANGANA
REVENUE DEPARTMENT

No.A/01/2017 — Office of the Revenue Divisional Officer, Peddapalli,dt:28-07-2017.

To
The District Collector,
Peddapalli

Sir,

Sub:- Public Servants- Peddapalli District - Complaints against Sri Guduri Srinivas Rao,Tahsildar, Ramagundam - Enquiry conducted - Report - Submitted - Reg.

Ref:- 1) Memo No.3413/Vig.III (1)/2017-1 dt:17-2-2017 of Secretary to Government Revenue (Vig.III) Department
2) CCLA's Ref.No. VS I (3)/192/2017
3) The Joint Collector, Peddapalli Lr.No.A1/03/2016 dt:10-3-2017

RECOMMENDATION:

In view of the seriousness of the implications on account of his misdeeds and illegal acts are very grave and alarming warrants

(i) immediate deterrent disciplinary action against the officers Sri Guduri Srinivasa Rao, Tahsildar, Ramagundam and Sri M.Arun Kumar, Senior Assistant to arrest further deterioration of the system in the interest of administration.

(ii) Constitution of an enquiry team preferable Vigilance or any other reputed agency forthwith to conduct a detailed enquiry and to elicit out stark realities for rectifying the mistakes occurred.


Yours faithfully,

Revenue Divisional Officer,
Peddapalli.

తహసీల్దార్ అక్రమాలపై ఆర్డీఓ నివేదిక

ఐఎన్ఎస్ కల్వరి

చైనాతో నానాటికీ వివాదం పెరుగుతున్న నేపథ్యంలో భారత నేవీకి జలాంతర్గాముల అవసరం పెరిగింది. ఇప్పటికే ఫ్రాన్స్ కంపెనీ డీసీఎన్ఎస్‌కు భారత్ ఆరు స్కార్పీన్ తరహా జలాంతర్గాములను ఆర్డర్ ఇచ్చింది. వాటిలో మొదటిది ఐఎన్ఎస్ కల్వరి పేరుతో ఇప్పటికే దీని నిర్మాణం పూర్తయింది.. సెప్టెంబర్‌లో ఇది భారత నావికా దళంలో చేరుతుంది. హిందూ మహాసముద్రంలో కాపు వేసుకుని కూర్చుని ఉన్న చైనా జలాంతర్గామిని అవసరమైతే అడ్డుకోవాల్సిన ఐఎన్ఎస్ కల్వరి వివరాలివి.



స్కార్పీన్ సబ్ మెరైన్ అంటే ఏమిటి?

డీజెల్‌తోపాటు విద్యుచ్ఛక్తితోనూ నడుస్తుంది. డీజిల్‌ను ఆదా చేసుకోవడానికి సెల్ఫ్ ప్రొపల్షన్ సిస్టంతో విద్యుత్‌ను ఉత్పత్తి చేసి నడుస్తుంది. శత్రువుకు తెలియకుండా దొంగచాటుగా కచ్చితంగా దాడి చేయగల సామర్థ్యం. టోర్పెడోలు, క్షిపణులతో నౌకల మీద, జలాంతర్గాముల మీద దాడి చేయగలదు.

ఇండియన్‌వెర్షన్‌లో ఏమిటి?

ఫ్రెంచ్‌కంపెనీ డీసీఎన్ఎస్ టెక్నాలజీ బదిలీ పద్ధతిన ఐఎన్ఎస్ కల్వరి మనకు అందు తోం ది. కల్వరి అంటే టైగర్ షార్క్ అని అర్థం. తాజాగా నావల్ టాన్క్ ఫోర్స్ పని చేయ డానికివీలుగా కల్వరిని డిజైన్ చేస్తున్నారు.

ఎలా పని చేస్తుంది?


బహుళ విధాలుగా ఇది యుద్ధం చేస్తుంది. నౌకలు, విమానాలు, జలాంతర్గాములపై దాడి చేయగలదు. నిఘాకు, గూఢచర్యా నికి కూడా ఉపయోగపడుతుంది.

దీని ప్రత్యేకత ఏమిటి?

ప్రత్యేకమైన ఉక్కుతో తయారు చేసిన ఈ జలాంతర్గామి నీటి అడుగున ఎక్కువ లోతుల కు వెళ్లగలదు. ఎక్కువ నీటి ఒత్తిడిని తట్టుకోగలదు. దగ్గరలోని నౌకాశ్రయాల్లో ఆయుధాలను లోడ్ చేసుకోగలదు కూడా.


డెత్ సర్టిఫికేట్‌కూ ఆధార్

అక్టోబర్ 1నుంచి అమల్లోకి...



న్యూ ఢిల్లీ: ఆధార్ నెంబర్ ఇక నుంచి అన్నింటికీ అవసరం కానుంది. నిన్నటి దాకా పాన్‌కార్డుకు జత చేయాలని చెప్పిన కేంద్రం తాజాగా డెత్ సర్టిఫికేట్‌కు తప్పనిసరి అంటూ ప్రకటించింది. అక్టోబర్ ఒకటవ తేదీ నుంచి డెత్ సర్టిఫికేట్‌కు ఆధార్ కార్డు కచ్చితమని రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (ఆర్‌జీఐ) పేర్కొంది. హోంశాఖ ఆధ్వర్యంలో కార్యకలాపాలు నిర్వహించే ఆర్‌జీఐ ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. చనిపోయిన వారి ఐడెంటిటీని మరోకరు ఉపయోగించకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. దాంతోపాటు ప్రభుత్వ పథకాల్లో నకిలీ లబ్ధిదారులును సులభంగా గుర్తించవచ్చని అభిప్రాయపడింది. దీంతో అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చని చెప్పింది. మృతుల వివరాలు నమోదు చేయడానికి కూడా ఉపయోగపడుతుందని ఆర్‌జీఐ అధికారులు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన అన్ని శాఖల అధికారులు మరణ గణాంకాలు నమోదు చేయాలన్నారు. అక్టోబర్ 1వ తేదీ నుంచి కచ్చితంగా అమల్లోకి వస్తుందని, ప్రజలంతా ఇప్పటికైనా ఆధార్ నమోదు చేసుకోవాలన్నారు. ఇప్పటికే అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు ఇందుకు సంబంధించిన సమాచారం అందజేసినట్లు వెల్లడించారు.

యోగాతో నిస్పృహ దూరం



వాషింగ్టన్: యోగాసనాలు వేస్తే, సూర్య నమస్కారాలు చేస్తే ఎన్నో ఉపయోగాలున్నాయని మనం నమ్ముతున్నాం. భారత్‌లోనే ఇందుకు వ్యతిరేకత ఉంది. కానీ అమెరికాలో యోగాకు శాస్త్రజ్ఞుల మద్దతు లభిస్తోంది. సాన్‌ఫ్రాన్సిస్కో వెటరన్స్ అఫైర్స్ మెడికల్ సెంటర్‌కు చెందిన లిండ్సే హాప్కిన్స్ నేతృత్వంలో హఠయోగంపై ఒక బృందం పరిశోధన జరిపింది. శారీరక వ్యాయమంతో పాటు ధ్యానాన్ని సాధన చేయడమే హఠయోగం. ఈ రెంటినీ సమన్వయ పరిచే ఆసనాలు హఠయోగంలో ఉంటాయి. హఠయోగాన్ని పద్ధతి ప్రకారం సాధన చేస్తే మానసిక శారీరక రుగ్మతలు చాలా వరకూ దూరమవుతాయని పరిశోధక బృందం తేల్చింది. మానసిక సమస్యలు ఉన్న వారికి కూడా యోగా మంచి మేలు చేస్తుందని కనుగొన్నారు. ఈ అధ్యయనంలో 23 మందికి ఎనిమిది వారాల పాటు వారానికి రెండు రోజుల పాటు యోగా క్లాసులు ఇచ్చారు. యోగా క్లాసులకు ముందు పాల్గొన్న వారి నిస్పృహ (డిప్రెషన్) స్కోరును నమోదు చేసారు. ఎనిమిది వారాల తరువాత చూస్తే.. వారి శారీరక ఆరోగ్యం మెరుగవడమే కాక నిస్పృహ కూడా చాలా వరకూ తగ్గినట్లు గమనించారు. హఠయోగంలో విక్రం యోగా అని ఒక పద్ధతి ఉంది. ఈ విక్రం యోగాను 25-45 ఏళ్ల వయసున్న 52 మంది మహిళల చేత అభ్యాసం చేయిస్తే వీరిలోనూ నిస్పృహ స్థాయి తగ్గిపోయింది. ఈ 52 మందిలో సగం మందికి విక్రం యోగాను నేర్పించారు. మరో సగం మందికి సైకాలజీలో సంప్రదాయిక పద్ధతుల్లో థెరపీ ఇచ్చారు. కానీ విక్రం యోగాను సాధన చేసిన వారిలోనే మంచి ఫలితం కనిపించింది. వీరే కాదు మసాచుసెట్స్ జనరల్ హాస్పటల్ వారు కూడా 29 వయోజనుల మీద ఒక అధ్యయనం చేసారు. వీరి చేత విక్రం యోగా సాధన చేయించారు. వారి జీవన విధానం మెరుగవడంతో పాటు వారిలో ఆశావహ దృక్పథం పెరగడాన్ని గమనించారు. ఆలోచనలూ మెరుగుపడ్డాయట. శారీరకంగానూ బాగా చురుకుగా తయారయినట్లు డాక్టర్లు గమనించారు. వీరిలో ఎవరు ఎక్కువ సార్లు యోగా క్లాసులకు హాజరయితే వారికి అంతగా నిస్పృహ తగ్గిపోయినట్లు గమనించారు.

ఆర్ణవ్ గోస్వామికి ఢిల్లీ హైకోర్టు నోటీసు

న్యూఢిల్లీ: సునంద పుష్కర్ హత్య కేసులో అర్నాబ్ గోస్వామికి ఢిల్లీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తన భార్య మరణానికి సంబంధించిన వార్తలను ప్రచారం చేసేటప్పుడు గోస్వామి చేసిన ఆరోపణలపై రూ. 2 కోట్ల నష్ట పరిహారం శశిథరూర్ దావా వేశారు. మే 29 న కోర్టులో ఇచ్చిన హామీ ఇచ్చినప్పటికి ఈ కేసును తప్పుదోవ పట్టిస్తున్నారని శశిథరూర్ న్యాయవాది ద్వారా తాను కోర్టులో పిటిషన్ దాఖలు చేయడంపై గోస్వామి, రిపబ్లిక్ ఛానల్‌కు జస్టిస్ మన్మోహన్ నోటీసులు జారీ చేశారు. ఈ విషయంలో ఏవిధమైన వ్యాఖ్యలు చేయకూడదని కోర్టు తెలిపింది. పుష్కర హత్య అనే పదమును ఎక్కడా చెప్పలేదని గోస్వామి తరపు సీనియర్ న్యాయవాది సందీప్ సేథీ తెలిపారు. రిపబ్లిక్ ఛానల్‌లో ప్రసారమైన వార్తల్లో ఎక్కడా శశిథరూర్ హంతకుడని ఎక్కడా చెప్పలేని సేథీ చెప్పారు. ఆ వార్తలకు సంబందించిన పేపర్లను తీసుకోలేదని, హామీ ఇచ్చిన న్యాయవాదిని మాత్రమే అడిగారని శశిథరూర్ న్యాయవాది కోర్టుకు తెలిపారు. న్యాయవాది సేథీ మాట్లాడుతూ నా క్లయింట్ నాకు భరోసా ఇచ్చాడన్నారు. తదుపరి విచారణ ఆగస్టు 16కు వాయిదా వేశారు. 2014 జనవరి 17 న రాత్రి ఢిల్లీలోని ఐదు నక్షత్రాల హోటల్లో సునంద పుష్కర్ చనిపోయింది. ఇంకా ఈ కేసు దర్యాప్తులో ఉంది.

మొగల్ సరాయ్‌కు దీన్‌దయాళ్ పేరు



న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని మొఘల్ సరాయ్ రైల్వే స్టేషన్ పేరును దీన్‌దయాళ్ ఉపాధ్యాయ స్టేషన్‌గా మార్చాలని కేంద్రం నిర్ణయించింది. ఈ ప్రతిపాదనను యూపీ కేబినెట్ కేంద్రానికి పంపగా ఆమోదం లభించింది. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గొప్పదనం ప్రజలకు తెలియడానికి ఇది ఉపయోగపడుతుందని యూపీ ప్రభుత్వ భావన. ఇటీవల చాలా స్టేషన్ల పేర్లు మార్చారు. ఛత్రపతి శివాజీ టెర్మినల్‌కు 'మహరాజ్' అని కలిపారు. అయితే.. మొగల్ సరాయ్ స్టేషన్ పేరు మార్చడం యూపీలో వివాదమై కూర్చుంది. బీజేపీ ప్రభుత్వం మైనారిటీల మనోభావాలను దెబ్బతీస్తోందని ఎస్పీ, కాంగ్రెస్‌లు విమర్శిస్తున్నాయి.

భద్రతామండలిలో భారత్‌కు ...

న్యూఢిల్లీ: ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం విషయాన్ని అమెరికా మరోసారి లేవనెత్తనుంది. ఐరాసలో అమెరికా రాయబారి నికీ హేలీ ఈ నెలలోనే భారత్ విషయాన్ని ప్రస్తావిస్తారని ఆ దేశ విదేశాంగ శాఖ ప్రతినిధి హీతర్ నాయెర్ట్ గురువారం చెప్పారు. ఐరాస భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం భారత్ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. తాత్కాలిక సభ్యుల సంఖ్యను పెంచాలని కూడా భారత్ కోరుతోంది. ఈ ఏడాది జూన్‌లో ప్రధాని నరేంద్ర మోడీ అమెరికా పర్యటించినప్పుడు మన ప్రయత్నాలకు మద్దతు లభించింది. భారత్‌కు శాశ్వత సభ్యత్వం కోసం అమెరికా మద్దతు ప్రకటించింది. ఆ సమయంలో మోడీ, ట్రంప్‌లు ఉమ్మడిగా ప్రకటన ఇచ్చారు కూడా. భద్రతా మండలి సభ్యత్వంతో పాటు భారత్ ను న్యూక్లియర్ సప్లయిర్స్ గ్రూప్ (ఎన్ఎస్‌జీ)లోకి తీసుకురావడానికి కూడా అమెరికా తీవ్రంగా ప్రయత్నిస్తోంది. భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం కోసం రష్యా కూడా మద్దతిస్తోంది కేవలం చైనా మాత్రం ఎన్ఎస్‌జీలో భారత్ చేరకుండా అడ్డుకుంటోంది. ఎన్‌పీటీ మీద భారత్ సంతకం చేయలేదన్న కారణంతో ఎన్ఎస్‌జీలో చైనా అడ్డుపుల్ల వేస్తోంది.

ఉల్లి ఎందుకు ఏడిపిస్తదంటే!



వాషింగ్టన్: 'ఉల్లి చేసే మేలు... కన్న తల్లి కూడా చేయదంటారు' మన పెద్దలు. ఎందుకంటే సగటు మనిషి తినే ప్రతి వంటకంలో ఉల్లి ఉండటమే అందుకు ప్రధాన కారణమని చెప్పవచ్చు. ప్రతి మనిషికి ఆహారంగా మారి సత్తువ నిస్తున్న ఉల్లి... తరిగేటప్పుడు మాత్రం కంటతడి పెట్టాల్సిందే. ఆ క్రూర అనుభవానికి మీరూ బాధితులయ్యే ఉంటారు. కానీ ఉల్లిని కోస్తుంటే ఎందుకు కంటతడి పెడతామన్న విషయం మాత్రం నేటికీ సంశయంగా మిగిలిన అంశం. తాజాగా, ఆ సంశయాన్ని నివృత్తి చేశారు వాషింగ్టన్‌కు చెందిన శాస్త్రవేత్తలు. సాధారణంగా ఉల్లిగడ్డను తరుగుతున్నప్పుడు అది రెండు ముక్కలవుతుంది. అటువంటి సందర్భాల్లో ఆ ఉల్లిగడ్డలో ఉన్నటువంటి ఎల్ఎఫ్(లాక్రీమేటరీ ఫ్యాక్టర్) అనే ఎంజైమ్ విడుదల చేస్తుందని తెలిపారు. సంఘటితంగా ఉన్న ఎల్ఎఫ్ ఎంజైమ్ రెండు ముక్కలయ్యే సమయంలో దానిలో రసాయన చర్య జరుగుతుందన్నారు. దాని ప్రభావంతో కండ్లలో మంటలు రేకెత్తుతాయన్నారు. ఆ మంటల కారణంగా కన్నీళ్ళు వస్తాయని వెల్లడించారు. కార్‌నెల్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు చేసిన ఈ అధ్యయన బృందంలో సుర్జీత్ బెనర్జీ అనే ఓ భారత సైంటిస్ట్ కూడ ఉన్నారు. కాగా, కన్నీళ్ళు పెట్టించని ఉల్లిగడ్డలు కూడా జపాన్ దొరుకుతాయన్న విషయం మనకు తెలిసిందే.

డొక్లామ్‌పై డబుల్ గేమ్

- ప్రాదేశిక భూభాగ విస్తరణకు చైనా ఎత్తులు
- భారత సైన్యం వెనక్కి మళ్లితేనే చర్చలని మెలిక
- ముందు చర్చలకు రండి.. ఆ తర్వాత ఆలోచిస్తాం: భారత్



డొక్లామ్ దగ్గరలోని టిబెట్ ప్రాంతంలో చైనా సైన్యం విన్యాసాలు

న్యూఢిల్లీ: సిక్కిం సరిహద్దులోని డోక్లామ్ వద్ద రోడ్డు నిర్మాణానికి పూనుకుని కయ్యానికి కాలు దూసిన చైనా వైఖరిలో ఏమాత్రం మార్పు కనిపించడం లేదు. నిర్మాణ పనులను వెంటనే అడ్డుకున్న భారత్‌పై ఇంకా డ్రాగన్ రుసరుసలాడుతూనే ఉంది. డోక్లామ్ నుంచి భారత సైన్యం వెనక్కి మళ్లితే తప్పా చర్చలు జరపబోమని చైనా తేల్చి చెప్పింది. పొరుగు దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలు తమకెంతో ముఖ్యమంటూనే వెనక్కి తగ్గేందుకు ససేమిరా అంటోంది. వివాదం పెద్దదైతే తమకు ఆర్థికంగా నష్టమని తెలిసినా ఉడత బెదిరింపులకు దిగుతోంది.డోక్లామ్ వివాదంపై చర్చలు జరిగిన తర్వాతే భారత సేనలు వెనక్కి వస్తాయని విదేశాంగ శాఖ ప్రకటించడంతో.ముందు భారత సేనలు వెనక్కివెళ్తేగాని చర్చలు జరిపే ప్రసక్తే లేదని చైనా స్పష్టం చేసింది.భారత్, చైనా, భూటన్ ట్రై జంక్షన్‌లోని డోకలాం వద్ద చైనా రోడ్డు నిర్మాణం చేపట్టడాన్ని మొదటి నుంచీ వ్యతిరేకించిన భారత్, ఈ విషయంలో భూటాన్‌తోనూ చర్చలు జరుపుతోంది. డోక్లామ్‌సమస్య పరిష్కా రానికి దౌత్యపరమైన చర్యలు కొనసాగిస్తున్నా మని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి గోపాల్ బాగ్లే స్పష్టం చేశారు. డోక్లామ్‌లోని 400మంది భారత సైన్యంలో 370 మంది వెనక్కి మళ్లినట్లు చైనా చేసిన వ్యాఖ్యలపై స్పందించలేదు.

ఉమ్మడి పోరుకు చైనా కలిసి రావాలి:భారత్

జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థ చీఫ్, పఠాన్ కోట్ ఉగ్రదాడి సూత్రదారిమసూద్ అజార్ ను అంతర్జా తీయ ఉగ్రవాదిగా గుర్తించాలని ఐక్యరాజ్య సమితిలో భారత్ ప్రతిపాదనను చైనా మరోసారి అడ్డుకునే ప్రయత్నం చేయడంపై భారత్ స్పందించింది. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించేందుకు భారత్ విశ్వసించే దేశాలన్నీ కలిసిరావాలని కోరింది. ఉగ్రవాదాన్ని పెంచిపోషి స్తున్న పాకిస్థాన్‌కు మద్దతుగా నిలవడంలో భాగంగానే చైనా మసూద్ అజర్‌ను అంతర్జాతీయ ఉగ్రవాదిగా గుర్తించకుండా అడ్డుకునే తీసుకుందన్న విమర్శలు వస్తున్నాయి. డోక్లామ్ విషయంలో భారత్ ఎక్కడికక్కడ నిలువరించడం కూడా చైనా అసహనంగా ఉంది. సరిహద్దులోని సమస్య పరిష్కారమయ్యే వరకు ఐక్యరాజ్యసమితిలో భారత్ ప్రతిపాదనకు ఓకే చెప్పకూడదన్న భావనలో చైనా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

చైనా దుర్బుద్ధిని ఎండగట్టిన ఆ దేశ మేధావి

భారత్‌లోని అరుణాచల్ ప్రదేశ్ విషయంలో చైనా తీరును ఆదేశ మేధావి వాంగ్ టవో ఎద్దేవా చేశారు. అరుణాచల్ ప్రదేశ్ కోడిదుమ్ములాంటిదవి, అది తినడానికి పనికిరాదని..అలాగని దాన్ని పారేడానికి కూడా వీల్లేదని స్పష్టం చేశారు. అరుణా చల్ ప్రదేశ్ విషయంలో భారత్-చైనా మధ్య ఎన్నో ఏళ్లుగా వివాదం ఉందని వాంగ్ టవో అన్నారు. రెండు దేశాల మధ్య వివాదాల కారణంగా అరుణాచల్ ప్రదేశ్ అభివృద్ధికి నోచుకోవడం లేదని ఆవేదన చెందారు. అరుణాచల్ ప్రదేశ్‌ను చైనా దక్షిణటిబెట్ అని అనడంపై స్పదించిన ఆయన..ఒక వేళ చైనా అలా పట్టుబడితే, మిగిలిన టిబెట్‌పై ప్రతికూల ప్రభావంప డుతుందని దాంతో వేర్పాటువాద శక్తులు బలపడే అవకాశంఉందన్నారు. చైనా వాదనను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిరణ్ రిజిజు ఖండించారు. బౌద్ధ గురువు దలైలామా అరుణాచల్ ప్రదేశ్ రావడంతోనే అరుణాచల్ ప్రదేశ్ భారత్‌లో అంతర్భాగమైందని మరోసారి రుజువైందని గుర్తు చేశారు. డోక్లామ్‌లో నెలన్నర రోజులకు పైగా ప్రతిష్టంభన కొనసాగడానికి చైనా అసలు ఉద్దేశం వేరే అని అర్థమౌతోంది. తన ప్రాదేశిక సరిహద్దును విస్తరించడమే చైనా లక్ష్యంగా కనిపిస్తోంది. భారత్‌తో తమ సరిహద్దులున్న అన్ని ప్రాంతాల్లోనూ చైనా ముందుకు వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తోంది. సరిహద్దుల్లోని పాడైపోయిన రోడ్లను మరమ్మత్తు చేయించడమంటే తమ భూభాగాన్ని పెంచుకోవడమే అని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో.. సరిహద్దుల్లో వివాదాల పరిష్కారానికి భారత్ శాంతి మార్గాలనే అన్వేషిస్తుంది అనే మాటలను ఆచరణలో చేసి చూపించాలని చైనా డిమాండ్ చేసింది.

మా సహనాన్ని పరీక్షించొద్దు: చైనా



భారత్‌తో స్నేహ సంబంధాలు కొనసాగించేందుకు ఇన్నాళ్లు..వేచి చూశామని...తమ సహనాన్ని పరీక్షించవద్దని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రెన్ జువాజింగ్ పరోక్షంగా హెచ్చరించారు. తాము భారత్‌తో వివాదాన్ని కోరుకోవడం లేదన్న రెన్.. తమ దేశ సౌభ్రాతృత్వం,భద్రతను కాపాడటం కోసం పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ అన్నివేళలా సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. డోకలాం వద్ద రోడ్డు నిర్మిస్తే భారత్‌లోని ఈశాన్య రాష్ట్రాల నుంచి చైనాకు లింక్ కట్ అవుతుందనే భయం పట్టుకుం దని విమర్శించారు. డోక్లామ్‌లో యథాతథ స్థితి కోసం భారత్ సరైన మార్గాన్ని అనుసరించడం లేదని ఆరోపించారు. వివాదం మొదలైనప్పటి నుంచి యథాతథ స్థితి కోసం చైనా దౌత్యపరమైన ప్రయత్నాలు చేస్తూనే ఉందని.. సరిహద్దుల్లోని తమ సైన్యం కూడా ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు దెబ్బతీయకుండా వేచిచూసే ధోరణిని అనుసరిస్తున్నాయని రెన్ జువాజింగ్ స్పష్టం చేశారు.

ఏచీర అయితే బాగుంటుందో చెప్పరూ!



భారత్‌లో అమెరికా రాయబారి సహాయకురాలు (చార్జ్ డీ అఫైర్స్) మేరీ కే లాస్ కార్ల్సన్‌కు ఒక సమస్య వచ్చి పడింది. ఆగస్టు 15న జరిగే భారత స్వాతంత్ర్యోత్సవాలకు ఆమెకు ఆహ్వానం ఉంది. ఆ సందర్భంగా చీర కట్టుకుని కార్యక్రమానికి హాజరు కావాలని ఆమె కోరుకున్నారు . ఎన్నో చీరలను వడపోసి నాలుగు చీరెలను ఎంపిక చేసారు. ఆ నాలుగు చీరల్లో దేన్ని ఆ రోజు కట్టుకోవాలో తనకు సలహా ఇమ్మంటూ #SareeSearch పేరిట తన ట్విటర్ హ్యాండిల్ MaryKay Loss Carlson @USAmbindiasతో ట్విటర్‌లో పోస్టు పెట్టారు. మీరూ ఆమెకు సాయం చేయొచ్చు.



రాహుల్ కాన్వాయ్‌పై రాళ్ల దాడి

ధనేరా (గుజరాత్): కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ కాన్వాయ్‌పై దాడి జరిగింది. గుజరాత్‌లో వరద బాధిత ప్రాంతాల పర్యటనలో ఉన్న ఆయన కాన్వాయ్‌ను శుక్రవారం ధనేరా పట్టణంలో కొందరు నల్ల జెండాలతో అడ్డగించారు. ఒకరు కారుపై రాళ్లు విసిరాడు. ఈ ఘటనలో రాహుల్ గాంధీకేమీ కాలేదని, ఆయన ఒక కారు వెనక అద్దం మాత్రం పగిలింది. ఆ తరువాత రాహుల్, తాను రాళ్లకు, జై మోడీ నినాదాలకు వెరవనని చెప్పారు.

హిజ్బుల్ ఉగ్రవాది హతం

- తప్పించుకున్న మరో ఇద్దరు తీవ్రవాదులు
- జమ్మూ పోలీసులు, సీఆర్‌పీఎఫ్. సైన్యం జాయింట్ ఆపరేషన్
- కాల్పుల్లో ఒక స్థానికుడి మృతి



శ్రీనగర్: జమ్మూ కశ్మీర్‌లోని అనంత్‌నాగ్‌లో గురువారం రాత్రి పొద్దుపోయాక జరిగిన ఎన్‌కౌంటర్‌లో హిజ్బుల్ ముజాహిద్దీన్‌కు చెందిన ఓ ఉగ్రవాది హతమైనట్లు భద్రతా బలగాలు వెల్లడించాయి. మరో ఇద్దరు ఉగ్రవాదులు తప్పించుకున్నారని పేర్కొన్నాయి. తప్పించుకున్న వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు తెలిపాయి. సరిహద్దు రేఖకు సమీపంలోని అనంతనాగ్ జిల్లాల్లోని బిజ్బెహరా ప్రాంతంలో ఉగ్రవాదులు దాగి ఉన్నారన్న నిఘా వర్గాల సమాచారంతో... గురువారం రాత్రి నుంచి జమ్మూ పోలీసులు, సీఆర్‌పీఎఫ్, భారత సైన్యం సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాయి. ముష్కరులు ఓ ఇంటిలో దాగి ఉన్నారన్న విషయాన్ని గ్రహించిన భద్రతా బలగాలు ఆ ఇంటిని చుట్టుమట్టాయి. అయితే ఉగ్రవాదులు ఒక్కసారిగా కాల్పులకు తెగబడటంతో భద్రతా సిబ్బంది కూడా ఎదురు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఓ ఉగ్రవాదితో పాటు సాధారణ పౌరుడు కూడా ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. పౌరుడి మృతికి నిరసనగా స్థానికులు ఆందోళనకు దిగారు. మృతి చెందిన తీవ్రవాది అనంత్‌నాగ్‌కు చెందిన యావర్‌గా పోలీసులు గుర్తించారు. కశ్మీర్ లోయలో భద్రతా సిబ్బందిపైకి రాళ్ళు విసిరిన ఆందోళనకారుల్లో ఒక్కడైన యావర్... ఇటీవలే హిజ్బుల్ ముజాహిద్దీన్ ఉగ్రవాద సంస్థలో చేరినట్లు సైన్యం ప్రకటించింది. కశ్మీర్ నియంత్రణ రేఖ వెంబడి చొరబాట్లను నివారించడానికి సరిహద్దుల్లో నిరోధక వ్యవస్థను సైన్యం ఏర్పాటు చేస్తోందన్నారు. సరిహద్దు వెంట థర్మల్ ఇమేజింగ్ పరికరాలను, రాడార్లు, సెన్సార్లు అమర్చి తీవ్రవాదుల చొరబాట్లను అడ్డుకుంటామన్నారు.

గిలానీ అల్లుడి కస్టడీ పొడిగింపు

కశ్మీరీ వేర్పాటువాది, హురియత్ నాయకుడు సయ్యద్ అలీ షా గిలానీ అల్లుడు అహ్మద్ షాతో పాటు మరో ముగ్గురి కస్టడీ పొడిగించినట్లు ఢిల్లీ న్యాయస్థానం ప్రకటించింది. ఎన్ఐఏ విజ్ఞప్తి మేరకు అనుమతి మంజూరు చేస్తున్నట్లు వెల్లడించింది. వారంతా తీవ్రవాద కార్యకలాపాలకు ఆర్థిక సాయం అందిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వారిపై ఆ మేరకు అభియోగాలు మోపినట్లు శుక్రవారం పోలీసులు తెలిపారు. కోర్టు నుంచి 10 రోజుల విచారణ అనుమతి లభించినట్లు చెప్పారు. ఎన్ఐఏ రూపొందించిన అభియోగ పత్రంలో పాక్ కేంద్రంగా దాడులకు వ్యూహం రచించిన హఫీజ్ సయీద్ పేరు చేర్చినట్లు చేర్చినట్లు వెల్లడించారు. కాగా, న్యాయస్థానం విచారణకు అనుమతించిన వారిని కస్టడీలోకి తీసుకునే సమయంలో రూ. రెండు కోట్లు, ఇతర పుస్తకాలు, కీలక సమాచారం అందుకున్నట్లు పేర్కొన్నారు.



కటక్‌లో టీ20 డౌటే?

న్యూఢిల్లీ : ఇటీవల హోంసీజన్‌కు భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు భారత జట్టు మ్యాచ్‌లను ఖరారు చేసింది. సెప్టెంబర్ నుంచి డిసెంబర్ చివర వరకు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, శ్రీలంకతో స్వదేశంలో భారత జట్టు మొత్తం 23 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడుతోంది. వేదికలు ఇప్పటికే ఖరారు చేసినా, ఇంకా తేదీలు మాత్రం ఫైనల్ కాలేదు. ఇదిలా ఉంటే ఒరిసాలోని కటక్‌కు భారత, న్యూజిలాండ్ మధ్య జరిగే ఒక టీ 20 మ్యాచ్‌ను కేటాయించారు. దీన్ని నవంబర్ 4న నిర్వహించనున్నారు. అయితే అదేరోజు బాలీ యాత్ర జరుగుతుంది. ఈ యాత్రలో పెద్ద ఎత్తున జనం పాల్గొనడంతో ఆ రోజు మ్యాచ్ జరగడం సాధ్యమా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.అదేరోజు మ్యాచ్ నిర్వహించడ చాలా కష్టమని ఒడిశా క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు బీసీసీఐకి ఓ లేఖ రాస్తూ ఈ విషయం తెలిపారు. ఇందుకు బదులు అక్టోబర్ చివర్లో లేదంటే నవంబర్ 20 తర్వాత ఏ అంతర్జాతీయ మ్యాచ్‌నైనా నిర్వహిస్తామని అది తమకు కేటాయించాలని కోరారు. దీంతో నవంబర్ 4న నిర్వహించేటీ 20 అసలు కటక్‌లో నిర్వహిస్తారా? లేక వేదిక మరోచోటకు మారుస్తారా? అనేది తెలియవల్సి ఉంది. బీసీసీఐ పర్యటన ప్రణాళిక కమిటీ కేటాయించిన 23 అంతర్జాతీయ మ్యాచ్‌లకు సంబంధించి హైదరాబాద్‌లో ఆస్ట్రేలియాతో టీ 20, శ్రీలంకతో వన్డే వైజాగ్ ఉన్నాయి.

మాకు జీతాలు పెంచండి

● బీసీసీఐని కోరిన సెలక్టర్లు



న్యూఢిల్లీ : క్రికెటర్లకేనా పారితోషికాలు పెంచేది..మాకు పెంచండి అంటూ భారత క్రికెట్ జట్టు సెలక్టర్లు బీసీసీఐని కోరుతున్నారు. ఇప్పటివరకు ఉన్న వేతన విధానాన్ని మార్పు చేయాలని వారు ఇప్పటికే విజ్ఞప్తి చేశారని తెలుస్తోంది. ప్రస్తుతం సీనియర్ సెలక్షన్ సభ్యులకు ఒక్కొక్కరికి సీజన్‌కు 60 లక్షలు చెల్లిస్తుండగా జూనియర్ విభాగం లో 40 లక్షలు అందిస్తున్నారు. ఇఇ 2012 నుంచి కొనసాగుతోంది. సెలక్టర్లకు బాధ్యత ఎక్కువ ఉంటుంది కాబట్టి వారి పారితోషికాన్ని పెంచాల్సి ఉందని, భావిస్తున్నారు. దీనిపై బీసీసీఐ 30 నుంచి 35 శాతం వరకు పెంచాలన్న అభిప్రాయం తో ఉన్నట్లు తెలుస్తోంది.

క్వార్టర్స్‌లో బాంబ్రి



వాషింగ్టన్ : సిటీ ఓపెన్ ఏటీపి టెన్నిస్ టోర్నమెంట్‌లో భారత యువ ఆటగాడు యుకి బాంబ్రి క్వార్టర్‌ఫైనల్‌లోకి అడుగుబెట్టాడు. క్రితం రోజు 22వ ర్యాంక్ మోన్‌ఫిల్స్‌కు షాకిచ్చిన బాంబ్రి ప్రీ క్వార్టర్స్‌లో ప్రపంచ 100 వర్యాంక్ అర్జెంటీనా ఆటగాడు గైడోపెల్లాను 6-7, 6-3, 6-1 తో గంటా 55 నిమిషాల్లో చిత్తుచేశాడు. క్వార్టర్స్‌లో అతడు ప్రపంచ 45వ దక్షిణాఫ్రికా ఆటగాడు అండర్సన్‌తో తలపడతాడు.

అదే జోరు

● రెండో రోజు చెలరేగిన లోయర్ ఆర్డర్ ● అశ్విన్, సాహా, జడేజా అర్ధశతకాలు ● మరోసారి 600 దాటిన భారత స్కోరు ● కష్టాల్లో లంక ... 50/2




జడేజా 70*

కొలంబో టెస్టులో రెండో రోజు కూడా భారత బ్యాట్స్‌మెన్ జోరు కొనసాగింది. లంక బౌలింగ్ బలహీనతలను సొమ్ము చేసుకుంటూ దిగువ వరుస బ్యాట్స్‌మెన్ చెలరేగి పోయారు. అశ్విన్ (54), సాహా (67), జడేజా (70 నాటౌట్) అర్ధశతకాలు సాధించారు. తొలి రోజు సెంచరీ వీరులు పుజారా (133), రహానే (132) త్వరగా ఔట్ అయినా తక్కిన బ్యాట్స్‌మెన్ వెరవలేదు. పైపెచ్చు టాప్ ఆర్డర్ జోరును కొనసాగించారు. జడేజా, అశ్విన్, సాహా ఫోర్లు, సిక్స్‌లతో ఆకాశమే హద్దుగా చెలరేగి పోయారు. జడేజా 3 సిక్స్‌లతో పండగ చేసుకన్నాడు. సాహా కూడా నిలకడగా ఆడి అర్ధసెంచరీ సాధించగా... పాండ్య 20 బంతుల్లో 20 పరుగులు చేశాడు. ఫలితంగా భారత్ తన తొలి ఇన్నింగ్స్‌లో మరోసారి 600 మార్కును దాటింది. కెప్టెన్ కోహ్లి తొలి ఇన్నింగ్స్‌ను 622/9 వద్ద డిక్లేర్ చేశాడు. వెంటనే ఇన్నింగ్స్ ఆరంభించిన లంకను ఆదిలోనే అశ్విన్ దెబ్బతీశాడు. అతని విజృంభణతో లంక 50 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడి ఎదురీదుతోంది. లంక స్పిన్నర్లు సద్వినియోగం చేసుకోలేకపోయిన పిచ్‌పై అశ్విన్.. ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌కు కొరకరాని కొయ్యగా మారాడు. ఆదిలోనే టాప్ ఆర్డర్‌ను పడగొట్టి కోలుకోలేని దెబ్బతీశాడు. ఇంకా 572 పరుగులు వెనుకబడ్డ లంక మూడో రోజు ఎలా నెగ్గుకొస్తుందో చూడాలి.

కొలంబో: భారత జట్టు ఓవర్ నైట్ స్కోరు 344-3తో శుక్రవారం ఉదయం తొలి ఇన్నింగ్స్ కొనసాగించింది. గాలెలో ఆరు వికెట్లు తీసిన జట్టులోని ఏకైక పేస్ బౌలర్ నువాన్ ప్రదీప్ లేకుండానే లంక తమ బౌలింగ్ దాడిని ఆరంభించింది. ప్రదీప్ గురువారం తొడకండరం గాయంతో మైదానం నుంచి తప్పుకున్నాడు. ఐతే భారత్‌కు ఆదిలోనే ఎదురు దెబ్బ తగిలింది. తొలిరోజు సెంచరీ వీరుడు పుజారా (133, 232 బంతుల్లో, 11ఫోర్లు, 1 సిక్స్) తన ఓవర్ నైట్ స్కోరుకు ఐదు పరుగులు మాత్రమే జోడించి రెండో ఓవర్లోనే కరుణరత్నే బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. తర్వాత క్రీజులోకి వచ్చిన అశ్విన్ (54, 92 బంతుల్లో, 5 ఫోర్లు, 1 సిక్స్)... రహానే (132, 222 బంతుల్లో, 14 ఫోర్లు)తో కలిసి ఇన్నింగ్స్ నడిపాడు. వీరిద్దరు అడపాదడపా బౌండరీలు సాధిస్తూ జట్టు బ్యాటింగ్ జోరు తగ్గకుండా జాగ్రత్త పడ్డారు. పేస్ బౌలర్ లేకపోవడంతో కొత్త బంతిని లంక స్పిన్నర్లు సద్వినియోగం చేసుకోలేకపోయారు. లంచ్‌కు ముందు పుష్పకుమార విసిరిన బంతిని రహానే ముందుకు వచ్చి ఆడబోయి స్టంప్ ఔట్ అయ్యాడు. ఇది తొలి టెస్టు వికెట్ కావడంతో పుష్పకుమార ఆనందానికి అవధులు లేవు. రహానే, అశ్విన్ కలిసి ఐదో వికెట్‌కు 63 పరుగులు జోడించారు. రహానే ఔట్‌తో లంక బౌలర్లు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. ఐతే తర్వాత సాహా(67, 134 బంతుల్లో, 4 ఫోర్లు, 1 సిక్స్) నిదానంగా ఆడుతూ అశ్విన్‌కు తోడ్పాటునందించాడు. లంచ్‌కు ముందు వికెట్ పడకుండా వీరు జాగ్రత్తపడ్డారు. ఐతే లంచ్ తర్వాత రెండో ఓవర్లోనే హెరాత్ బౌలింగ్‌లో అశ్విన్ బౌల్డ్ అయి పెవిలియన్ దారి పట్టాడు. వీరిద్దరు కలిసి ఆరో వికెట్‌కు 38 పరుగులు జోడించారు. క్రీజులోకి వచ్చిన ఆల్‌రౌండర్ పాండ్య (20, 20 బంతుల్లో, 3 ఫోర్లు) ఆదిలో ఆచితూచి ఆడాడు. మూడు బౌండరీల సాయంతో 20 పరుగులు చేసి కొత్త కుర్రాడు పుష్పకుమారకు రెండో వికెట్ సమర్పించుకున్నాడు. అప్పటికి భారత్ స్కోరు 496/7. తర్వాత క్రీజులోకి వచ్చిన జడేజా తనదైన శైలిలో ఆడి 85 బంతుల్లోనే 3 సిక్స్‌లు, 4 ఫోర్ల సాయంతో 70 పరుగులు సాధించాడు. స్కోరు 553/7తో భారత్ టీ విరామానికి వెళ్లింది. టీ తర్వాత సాహా.. హెరాత్ బౌలింగ్‌లో అదుపుతప్పి స్టంప్ ఔట్ అయి వెనుదిరిగాడు. సాహా, జడేజా కలిసి 8వ వికెట్‌కు అమూల్యమైన 72 పరుగులు జోడించారు. షమి (19, 8 బంతుల్లో, 1 ఫోరు, 2 సిక్స్) క్రీజులోకి వచ్చాక మ్యాచ్ స్వరూపమే మారిపోయింది. జడేజా కూడా టాప్ గేర్ వేశాడు. జడేజా, షమి కలిసి ఫోర్లు, సిక్స్‌లు దంచేశారు. హెరాత్ బౌలింగ్‌లో షమి రెండు కళ్లు చెదిరే సిక్స్‌లు కొట్టాడు. వీరిద్దరు 9వ వికెట్‌కు 30 పరుగులు జోడించారు. అనంతరం జడేజా, యాదవ్ కలిసి స్కోరును 600 దాటించారు. స్కోరు 622/9 వద్ద కోహ్లి తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేశాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన లంకకు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. స్కోరుబోర్డుపై పరుగులేమి చేరకుండానే ఓపెనర్ తరంగ వెన ుదిరిగాడు. లంక స్కోరు 50/2 వద్ద ఆట ముగిసింది.

అశ్విన్ @ 2000

భారత్ స్పిన్నర్ అశ్విన్ తొలి ఇన్నింగ్స్‌లో 50 రన్స్ చేయగానే టెస్టుల్లో 2 వేల పరుగులు మైలురాయిని అందుకున్నాడు. టెస్టుల్లో అత్యంత వేగంగా 2 వేల పరుగులు, 200 వికెట్లు తీసిన రెండో భారత ఆల్‌రౌండర్‌గా అరుదైన రికార్డులకెక్కాడు. ఇతనికంటే ముందు కపిల్ ఆ ఘనత సాధించాడు. అశ్విన్ 51 టెస్టుల్లో ఈ ఫీట్ సాధించగా.. కపిల్ 50 మ్యాచ్‌ల్లోనే పూర్తి చేశాడు.



అశ్విన్ 54 2/38

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: ధావన్ (ఎల్బీడబ్ల్యూ) పెరెరా 35: రాహుల్ రనౌట్ 57: పుజారా (ఎల్బీడబ్ల్యూ) కరుణరత్నే 133: కోహ్లి (సి) మాథ్యూస్ (బి) హెరాత్ 13: రహానే స్టంప్ డిక్‌వెల్ల (బి) పుష్పకుమార 132: అశ్విన్ (బి) హెరాత్ 54: సాహా స్టంప్ డిక్‌వెల్ల (బి) హెరాత్ 67: పాండ్య (సి) మాథ్యూస్ (బి) పుష్పకుమార 20: జడేజా నాటౌట్ 70: షమి (సి) తరంగ (బి) హెరాత్ 19: యాదవ్ నాటౌట్ 8: ఎక్స్‌ట్రాలు 14:

మొత్తం (158 ఓవర్లలో 9 వికెట్లకు డిక్లేర్డ్) **622**, **వికెట్ల పతనం:** 1-56 (ధావన్), 2-109 (రాహుల్), 3-133 (కోహ్లి), 4-350 (పుజారా), 5-413 (రహానే) 6-451 (అశ్విన్), 7-496 (పాండ్య), 8-568 (సాహా), 9-598 (షమి)

బౌలింగ్: ప్రదీప్ 17.4-2-63-0, హెరాత్ 42-7-154-4, కరుణరత్నే 8-0-31-1, పెరెరా 40-3-147-1, పుష్పకుమార 38.2-2-156-2, డిసిల్వ 12-0-59-0

శ్రీలంక తొలి ఇన్నింగ్స్: కరుణరత్నే (సి) రహానే (బి) అశ్విన్ 25: తరంగ (సి) రాహుల్ (బి) అశ్విన్ 0: మెండిస్ బ్యాటింగ్ 16: చండిమాల్ బ్యాటింగ్ 8: ఎక్స్‌ట్రాలు 1: మొత్తం (20 ఓవర్లలో 2 వికెట్లకు) 50: వికెట్ల పతనం: 1-0 (తరంగ), 2-33 (కరుణరత్నే),

బౌలింగ్: షమి 3-1-7-0, అశ్విన్ 10-2-38-2, జడేజా 7-4-4-0.0

బెంగళూరు బుల్స్ గెలుపు

ప్రొ కబడ్డీ లీగ్ పోరు

నాగపూర్ : శుక్రవారంనాడు ఉత్కంఠగా సాగిన ప్రొకబడ్డీ పోరులో బెంగళూరు బుల్స్ కేవలం ఒక పాయింట్ తేడాతో తమిళ్ తలైవాస్‌ను చిత్తుచేసింది. మాంకాపూర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ పోటీలో బెంగళూరు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి చివరకు 32-31 తేడాతో గెలిచి లీగ్‌లో రెండో విజయాన్ని అందుకుంది. బుల్స్ గెలుపులో మహేందర్ సింగ్ 5 టాకిల్స్‌తో కీలకపాత్ర పోషించాడు. అలాగే టాప్ రైడర్ బుల్స్ కెప్టెన్ రోహిత్‌కుమార్ 10 పాయింట్లు అందించాడు.

లీగ్‌లోకి ఈ సంవత్సరమే ప్రవేశించినప్పటికీ తమిళ్ జట్టు ఈ మ్యాచ్‌లో మాత్రం అద్వితీయంగా రాణించింది. ఆఖరి నిమిషం వరకు నువ్వా? నేనా అన్న రీతిలో పోరు సాగేలా ఆ జట్టు ఆడడం విశేషం. ఆరంభంలో 2-2 తో కొనసాగగా బుల్స్ చివరకు డూ ఆర్ డై రైడ్‌లో ఒక పాయింట్ సాధించడం ద్వారా ఆధిక్యం అందుకుంది. ఇక ఇక్కడి నుంచి బుల్స్ తన జోరును కొనసాగించి వరుసగా పాయింట్లు కొల్లగొట్టింది. ఓ ఆలౌట్‌తో 9-3 ఆధిక్యంలోకి దూసుకుని వెళ్లిన ఆ జట్టు ప్రథమార్థం ముగిసేసరికి 23-8 తేడాతో పైచేయిలో ఉంది. కానీ ద్వితీయార్థంలో తమిళ్ జట్టు అమోఘంగా పుంజుకుని బుల్స్‌ను నిలువరించగలిగింది. ఒకవైపు తాము విజయవంతమైన రైడ్స్‌తో పాయింట్లు సాధించుకున్న తమిళ్‌జట్టు ఆట మరో 3 నిమిషాల్లో ముగుస్తుందనగా 31-28 స్కోరుకు రావడం గమనార్హం. చివర వరకు అదే ఊపును కొనసాగించినప్పటికీ ఫలితం దక్కలేదు. తమిళ జట్టులో ప్రపంజన్ 6 పాయింట్లు అత్యధికంగా సాధించాడు.

పునేరి పల్టాన్ గెలుపు

రెండో మ్యాచ్‌లో పునేరి పల్టాన్ 5 పాయింట్ల తేడాతో దబాంగ్ ఢిల్లీని ఓడించింది. ఆరంభం నుంచి పైచేయిలో ఉన్న పల్టాన్ చివరకు 26-21 తేడాతో విజయాన్ని అందుకోవడంలో రాజేశ్ మోండల్ 8 పాయింట్లతో కీలక భూమిక పోషించాడు. ప్రథమార్థం ముగిసేసరికి పల్టాన్ 11-7 తేడాతో ఉంది. ద్వితీయార్థంలోసైతం అదే రీతిలో ఆడి 15 పాయింట్లు అందుకోగలిగింది.



ప్రొ కబడ్డీలో నేడు

తొలి మ్యాచ్
యు ముంబా - దబాంగ్ ఢిల్లీ
(మంకాపూర్ ఇండోర్‌స్టేడియం, నాగపూర్
రా 8గం నుంచి)

రెండో మ్యాచ్
బెంగళూరు బుల్స్ -యుపి యోధ
(మంకాపూర్ ఇండోర్‌స్టేడియం, నాగపూర్
రా 9గం నుంచి)

లంక పేసర్ నువాన్ ప్రదీప్ ఔట్



కొలంబో : శ్రీలంకకు గట్టి దెబ్బ తగిలింది. పేసర్ నువాన్ ప్రదీప్ గాయపడి తప్పుకున్నాడు. తొలిటెస్టులో ఆరు వికెట్లు సాధించిన ప్రదీప్ కండరాల గాయం కారణంగా మరో రెండునెలల పాటు ఆడే అవకాశం లేదు. దీంతో లంక ఇక రెండో టెస్టులో కేవలం ఒక పేసర్‌తో ఆడవల్సిన పరిస్థితి ఏర్పడింది.

మంజుకుమారికి కాంస్యం

న్యూఢిల్లీ : భారత్‌కు చెందిన మంజుకుమారి ఫిన్‌లాండ్‌లో జరుగుతున్న ప్రపంచ జూనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం అందుకుంది. 59 కిలోల కాంస్యం ప్లే ఆఫ్‌లో ఆమె 2-0 తేడాతో ఉక్రేయిన్‌కు చెందిన ప్రొకోపెవ్‌నియుక్‌ను ఓడించింది. అంతకుముందు ఆమె 5-1 తేడాతో బల్గేరియాకు చెందిన నికోలావాపై విజయాన్ని అందుకుంది. దీనికి ముందు జపాన్ యుజురు కుమానో క్వార్టర్ ఫైనల్‌రౌండ్‌లో 0-10 తేడాతో మంజును ఓడించగలిగింది. అయితే జపానీస్ రెజ్లర్ ఫైనల్ చేరడంతో మంజుకు రెపెచేజ్ అవకాశం లభించింది. రెపేచేజ్‌లో ఆమె కెనడాకు చెందిన టియానా గ్రేస్‌ను 4-0 తో ఓడించగలిగింది.

అమిత్‌కు స్వర్ణం

ప్రపంచ జూనియర్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్

న్యూఢిల్లీ : పంజాబ్‌కు చెందిన అమిత్‌కుమార్ స్విట్జర్లాండ్‌లో జరుగుతున్న ప్రపంచ జూనియర్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం గెలుచుకున్నాడు. 18 ఏళ్ల అమిత్ తండ్రి ..పంజాబ్‌లోని గోబింద్‌ఘర్ మండిలో ఓ కూలీ. కాగా శుక్రవారంనాడు అమిత్ 200 మీటర్ల స్ప్రింట్‌లో (టీ 42 నుంచి టీ 47 వరకు) అతడు లక్ష్యాన్ని 23.23 సెకండ్లలో పూర్తిచేశాడు

క్వార్టర్స్‌లో ప్రణయ్, సౌరభ్ ఓటమి

అక్‌లాండ్ : న్యూజిలాండ్ ఓపెన్ గ్రాండ్ ప్రి గోల్డ్ ఈవెంట్‌లో భారత్ పోటీ ముగిసింది. భారత బ్యాడ్మింటన్ ఆటగాళ్లు హెచ్‌ఎస్ ప్రణయ్, సౌరభ్ వర్మ క్వార్టర్ ఫైనల్‌లో పరాజయం పాలయ్యారు. నాలుగోసీడ్ ప్రణయ్ పోరాడి చైనీస్‌తైపేకు చెందిన 11వ సీడ్ లిన్ యూ సియన్‌పై క్వార్టర్ ఫైనల్‌లో 10-21, 22-20, 21-23 తేడాతో గంటా ఆరునిమిషాల్లో పరాజయం పాలయ్యాడు. అలాగే ఏడోసీడ్ వర్మ అన్‌సీడెడ్ లీ చియుక్ (హాంకాంగ్)పై 19-21, 16-21 తేడాతో కేవలం 42 నిమిషాల్లోనే చిత్తయ్యాడు.

రిటైర్మెంట్ తర్వాత ఉద్యోగం



లండన్ : జమైకా పరుగుల చిరుత ఉసేన్‌బోల్ట్ రిటైర్మెంట్ అనంతరం బ్రాండ్ అంబాసిడర్‌గా ప్యూమా కంపెనీలో ఉద్యోగిగా చేరనున్నాడు. బోల్ట్ 15 సంవత్సరాల వయసు నుంచి ప్యూమా ప్రచార కర్తగా ఉన్నాడని, ఈ మేటి అథ్లెట్ పరుగుకు విశ్రాంతి తీసుకున్న అనంతరం మా సంస్థలో పనిచేస్తాడని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. అతడి ద్వారా మా ఉత్పత్తులు మరింత పెరుగుతాయి. ఇకపై కరేబియన్ దీవుల్లో ప్యూమాకు సంబంధించి వ్యాపార వ్యవహారాలను బోల్ట్‌నే చూసుకుంటాడని వివరించారు. ఈ బాధ్యతలను అతడు సమర్థవంతంగా నిర్వహిస్తాడన్నారు.



మరో నాకౌట్ పోరుపై విజేందర్ దృష్టి

● నేడు చైనా బాక్సర్ మైమైతియాలితో పోరు

ముంబై : ప్రొఫెషనల్ బాక్సర్ విజేందర్ సింగ్ మరో భారీపోరుకు సిద్ధమవు తున్నాడు. ప్రొఫెషనల్‌గా మారిన తర్వాత గత 8 బౌట్లలో ఒక్క అపజయం లేకుండా ప్రత్యర్థులను సునాయాసంగా చిత్తుచేసిన విజేందర్ స్వదేశంలో రెండోపోరుకు పక్కా ప్రణాళికతో సిద్ధమవుతున్నాడు. శనివారంనాడిక్కడ తలపడుతున్న విజేందర్‌కు అతడి ప్రత్యర్థి చైనాకు చెందిన జుల్ఫికర్ మైమైతియాలి. 31 ఏళ్ల ఒలింపిక్ కాంస్య విజేత అయిన విజేందర్‌కు ఇది తొమ్మిదవ ప్రొఫెషనల్ పోరు. విజేందర్ డబ్ల్యూబీవో ఆసియా ఫసిఫిక్ సూపర్ మిడిల్ వెయిట్ చాంపియన్ కాగా మైమైతియాలి సైతం అజేయ రికార్డు ఉండడంతోపాటు డబ్ల్యూబీవో ఓరియంటల్ సూపర్ మిడిల్ వెయిట్ టైటిల్ గ్రహీత. ఈ బౌట్‌లో గెలిచిన బాక్సర్‌కు ఏకకాలంలో రెండు టైటిల్స్ లభిస్తాయి. అందువల్ల ఈ క్రమంలో వీరిద్దరి పోటీ ఉత్కంఠగా సాగనుంది. ఇప్పటివరకు విజేందర్ తలపడిన బాక్సర్లు ఒక ఎత్తయితే..చైనా బాక్సర్ మరో ఎత్తు. అందవల్ల తన రికార్డును అజేయంగా కొనసాగించేందుకు వీలుగా విజేందర్ మాంచెస్టర్‌వెళ్లి లీ బియర్డ్ వద్ద తీవ్రంగా శిక్షణ పొందివచ్చాడు. చైనా ప్రత్యర్థిని ఓడించేందుకు విజేందర్ పట్టుదలతో ఉన్నాడు. ఇది ఇండియా వర్సెస్ చైనా పోరు. భారత్ యావత్తూ నావెంట ఉంది. అందువల్ల నా సత్తా ఏమిటో చూపిస్తానని విజేందర్ తెలిపాడు. ప్రస్తుతం నా వెయిట్ 76 కిలోలుగా ఉంది. అందువల్ల ఇకపై ఏమీ తినదల్చుకోలేదని,,ముఖ్యంగా డైట్‌పైనే దృష్టి పెట్టినట్లు చెప్పాడు. అతడు ఎదుర్కొనే దాన్ని బట్టే నా వ్యూహం ఉంటుందన్నాడు. అతడికి అనుగుణంగానే నా వ్యూహం రూపొందించుకుంటానని విజేందర్ వివరించాడు. టెక్నిక్ పరంగా నేను చాలా మార్చుకున్నాను. దానికి అనుగుణంగానే పోరాడతానన్నాడు. నేను అనుభవజ్ఞుడైన బాక్సర్‌ను. అతడిని నేను అనుభవజ్ఞుడైన బాక్సర్‌గా భావించడం లేదు. అతడు యువకుడు..దానికి అనుగుణంగానే నా పోరు ఉంటుందని, మరో నాకౌట్ సాధించగలనన్న ధీమాను వ్యక్తం చేశాడు.

పారిస్ క్లబ్‌లో చేరిన నేమార్

పారిస్ : ప్రముఖ బ్రెజిల్ ఫుట్‌బాల్ స్టార్ నేమార్ ఇప్పటివరకు తాను ఆడిన బార్సిలోనా క్లబ్‌ను వదిలిపెట్టి పారిస్ సెయింట్ జర్మైన్ తరపున ఆడేందుకు చేరిపోయాడు. క్రీడాకారుడు తప్పకుండా సవాళ్లు ఎదుర్కోవాలి. ఇందుకు మా తండ్రి సలహాను కూడా నేను పాటించలేదంటూ ..బార్సిలోనాను ఎందుకు వదిలేశారు? అన్న ప్రశ్నకు సమాధానంగా బదులిచ్చాడు. పారిస్ జట్టు తరపున అతడు ఐదేళ్లకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ క్రమంలో పారిస్ క్లబ్ సంవత్సరానికి అతడికి రికార్డుగా 45 మిలియన్ యూరోలు చెల్లించనుంది. అంతకముందు బార్సిలోనా తరపున ఆడుతున్న నేమార్‌కు లభించేసొమ్ముకంటే చాలా ఎక్కువ. విశేషమేమిటంటే బార్సిలోనా జట్టు పలు మేజర్ టైటిల్స్ గెలుచుకోగా, పారిస్ క్లబ్ మాత్రం ఫ్రాన్స్ బయట ఇంతవరకు ఓ మేజర్ టైటిల్ అందుకోలేదు.



Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

పునర్జన్మలు ఉన్నాయా...ఇంతకుముందు జన్మలో మనమెవరం...మన తాలూకూ బంధువులు ఎవరు...మన ఆర్థిక స్థితి ఏమిటి, ఆ జన్మలో ఏ వయసులో ఎలా మరణించాము....ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకోవాలనే ఆసక్తి అందరికీ ఉంటుంది. నమ్మకం అపనమ్మకాల సంగతి పక్కనపెడితే ఇంతకంటే ఆసక్తికరమైన విషయం మరొకటి లేదు. నిజంగా ఈ వివరాలను యదార్థంగా అందించేవారు ఉంటే...అందరూ వాటి గురించి తెలుసుకోవాలనే అనుకుంటారు. ఈ మధ్యకాలంలో గత జన్మలపై కుతూహలం మరింతగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రముఖ ఆస్ట్రో సైకాలజిస్ట్ డాక్టర్ ఎస్ వి నాగనాథ్ ఇదే విషయంపై అనేక ఆసక్తికరమైన అంశాలను ఆంధ్రప్రభతో పంచుకున్నారు. ఆయన గత జన్మలపై వివరణ ఇస్తూ యూ ట్యూబ్ ఛానల్ లో ప్రసారం చేస్తున్న 'హు యామ్ ఐ' కార్యక్రమం గురించి కూడా పలువిశేషాలు పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే-



గత జన్మలో నేనెవర్ని?!

పెరుగుతున్న గత జన్మల ఆసక్తి
యువతలో మరింత ఆత్రుత
జ్యోతిషంతో...పునర్జన్మల బంధం

జ్యోతిషాన్ని ఒక శాస్త్రంగా భావిస్తున్నా..దానిపట్ల సమాజంలో రకరకాల అభిప్రాయాలు ఉన్నాయి. నాస్తికులు దీన్ని నాన్సెన్స్ అనవచ్చు. సెలబ్రిటీలు, రాజకీయ నాయకులు తమ భవిష్యత్తు గురించి తెలుసుకోవడానికి ఆసక్తి చూపుతుంటారు. మేధావులు ఇందులో ఉన్న మర్మమేమిటో తెలుసుకోవాలని అనుకుంటారు. అయితే జ్యోతిషశాస్త్రానికి ఉన్న లోతులకు ఒక పరిధి లేదు. ఒక మనిషి గురించి ఎంత తెలుసుకోవచ్చు ...అనే విషయంలో దీని పరిధి విస్తృతం. అంతేకాదు...మనిషి ఆలోచనలు ప్రవర్తనలను సైతం చెబుతుండటంతో...ఈ శాస్త్రం మరింతగా మనిషిని గురించి అద్దంలో చూపినట్టుగా చెబుతోంది. జ్యోతిషం మనిషి పుట్టిన తేదీ, సమయం ఆధారంగా రాశిచక్రం, పుట్టినప్పుడు సూర్యుడు ఏ రాశిలోఉన్నాడు...అనే వివరాల ను తెలుసుకుని...ఆ జాతక చక్రం ప్రకారం గ్రహాలు ఏ స్థానంలో ఉన్నాయో తెలుసుకుంటూ...వాటి ఆధారంగా వ్యక్తి ప్రవర్తన, పనులు , భావోద్వేగాలు వీటన్నింటి గురించి చెప్పటం జరుగుతుంది. ప్రస్తుత జాతకచక్రం ప్రకారం... ఈ జన్మలో గ్రహాల గమనం ఎలా ఉంది...వ్యక్తి జీవితానికి సంబంధించిన 12 భావాలను అవి ఎలా ప్రభావితం చేస్తున్నాయి...అనే విషయాలను తెలుసుకుంటుంది. దీన్ని బట్టి అతని ప్రస్తుత, భవిష్యత్తు జీవితాలను చెప్పటం జరుగుతుంది. అయితే వీటి ఆధారంగానే వ్యక్తి తాలూకూ గత జన్మల వివరాలను సైతం తెలుసుకునే వీలుంది. ఈ 12 భావాల్లో 9వ భావం పూర్వపుణ్యస్థానానిది. ఇది పూర్తిగా గత జన్మలను గురించి చెబుతుంది. అలాగే ఒక వ్యక్తి గత జన్మతాలూకూ వివరాలన్నింటినీ ఇస్తుంది. గత జన్మలను గురించి మనకు చాలా ఆసక్తి ఉంటుంది. కిందటి జన్మకు ఈ జన్మకు మధ్య ఏదైనా అనుబంధం ఉందా..ఆ జన్మలోని వారు ఎవరైనా మనతో ఈ జన్మలో కూడా ప్రయాణం చేస్తున్నారా..అనే ప్రశ్నలు వెంటాడుతుంటాయి. జ్యోతిష శాస్త్రం కూడా అదే చెబుతుంది. ప్రస్తుత జన్మకు గత జన్మకు సంబంధం ఉందని.



అన్‌కాన్షస్ (జాగృతం కాని దశ) స్థితిలో ఉన్నపుడు అతనిలోని భావోద్వేగాలు ప్రవర్తనలకు సంబంధించిన అంశాలను సైతం జ్యోతిషం పట్టుకుంటుంది. జ్యోతిషం మనిషి కాన్షస్, అన్‌కాన్షస్ రెండు స్థితులను అధ్యయనం చేస్తుంది.

మానసిక శాస్త్రం పనిని...చేస్తున్న జ్యోతిషం

దాదాపు వందేళ్ల క్రితమే జ్యోతిషం... మానసిక శాస్త్ర అధ్యయన ఫలితాల్లో తన ప్రభావాన్ని చూపటం మొదలుపెట్టింది. ఒక మనిషి పుట్టిన తేదీ సమయాన్ని బట్టి జ్యోతిషం అతని వ్యక్తిత్వాన్ని చెప్పటం ...మానసిక నిపుణులకు ఉపయోగకరంగా మారింది. జ్యోతిషం కేవలం..భవిష్యత్తులో ఏం జరుగబోతోంది అనే అంశాలనే కాక..మరింత విడమరచి ... ఆ వ్యక్తి

పూర్వజన్మల గురించి తెలుసుకోవాలని ఉవ్విళ్లూరుతున్న యువత

గత జన్మల గురించి వివరించే నా ప్రోగ్రామ్ 'హు యామ్ ఐ' ని చూస్తున్నవారిలో నాలుగింటా మూడొంతుల మంది యువతరమే. మిగిలిన ఒక వంతు మధ్య వయస్కులు. గత జన్మ గురించి తెలుసుకోవడాన్ని యువత ఒక అద్భుతంగా భావిస్తోంది. అందులో ఏముందో తెలుసుకోవాలన్న కుతూహలం, సాహస మనస్తత్వంతో ఈ కార్యక్రత మం పట్ల ఆసక్తిని కనబరుస్తున్నారు. యూట్యూబ్‌లో దీన్ని చూస్తున్నవారంతా తమ గత జన్మ ఏమిటి...అనే ఆసక్తితో పాటు..గత జన్మలో తాము ఎలా మరణించాము... అని తెలుసుకునేందుకు మరింతగా ఉత్సుకతని కనబరుస్తున్నారు. తమకున్న ఆశయాలు కలలు ఇలాంటివాటికి గతజన్మతో ఎలాంటి అనుబంధం ఉంది..అనే ఆసక్తి కూడా వారిలో ఉంటోంది. ఆ ఆసక్తితోనూ వారు హుయామ్ఐ కార్యక్రమాన్ని చూస్తున్నారు. మగధీర లాంటి సినిమాలు సైతం ఇలాంటి ఆసక్తులను పెంచుతున్నాయి. పవన్‌కల్యాణ్, జూనియర్ ఎన్‌టిఆర్, రాజమౌళి లాంటివారి గతజన్మలను వెల్లడించిన కార్యక్రమాలు సైతం యువతకి గతజన్మల పట్ల ఆసక్తిని పెంచుతున్నాయి.

ఇవీ...వారి మనసులోని ప్రశ్నలు

గత జన్మల విషయంలో యూట్యూబ్ కార్యక్రమ వీక్షకులు చాలా తరచుగా అడుగుతున్న ప్రశ్న...గత జన్మలో నేనెలా మరణించాను అనే. తరువాత ప్రశ్నలు...ఏ వయసులో చనిపోయాను, నా భార్య ఎవరు?, నా ఆర్థిక పరిస్థితి ఏమిటి? అ విషయాలు ఈ జన్మకు ఎలా వర్తిస్తాయి...అన్ కాన్షస్ మైండ్ అంటే ఏమిటి...దానికి గతజన్మకు ఉన్న సంబంధం ఏమిటి? నిజంగా అన్‌కాన్షస్ మైండ్ ఈ జన్మలో మన ఆలోచనలు పనులను ప్రభావితం చేస్తుందా...ఇలాంటి ప్రశ్నలు ఉంటున్నాయి


పునర్జన్మ ద్వారా...ప్రస్తుత వ్యక్తిత్వం తెలుసుకోవాలని....

మన సమాజంలో సైకియాట్రిస్ట్ వద్దకు వెళ్లాలంటే చాలామంది ఇష్టపడరు. అలాంటివారు సైతం పూర్వజన్మల వివరాల ద్వారా తమ సైకాలజీని తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతో జ్యోతిషం పట్ల ఆసక్తిని చూపుతున్నారు. నిజానికి సైకాలజీకి సంబంధించిన అనేక అంశాలను ఆస్ట్రాలజీ ద్వారా తెలుసుకునే వీలుంది. మనిషి భావోద్వేగాలు, ప్రవర్తనలు, జ్ఞాపకశక్తి, తెలివితేటలు...ఇవన్నీ మానసిక శాస్త్రానికి సంబంధించిన విషయాలే. కానీ మనిషిలోని అన్‌కాన్షస్ మైండ్‌లో దాగున్న ఈ విషయాలను మానసిక శాస్త్రంకంటే జ్యోతిషశాస్త్రం మరింత బాగా చెప్పగలుగుతుంది. అంటే...ఒక మనిషి సైకాలజీని...సైకాలజీ కంటే ఎక్కువగా జ్యోతిషశాస్త్రం పట్టుకుంటుంది. మనిషిలోని బలాలు, బలహీనతలు, అభిప్రాయాలు, ఆసక్తులు, ఇష్టాయిష్టాలు, కోపతాపాలు, భయాలు, ఆధ్యాత్మిక కోణాలు..వీటన్నింటినీ జ్యోతిషం చెబుతుంది. మానసిక నిపుణులను కలిసి ఈ వివరాలు తెలుసుకునేందుకు ఇష్టపడనివారు సైతం ...ఇప్పుడు తమ పునర్జన్మల వివరాలు తెలుసుకుని తద్వారా తమ గురించి తాము తెలుసుకోవాలని జ్యోతిషాన్ని ఆశ్రయిస్తున్నారు. పునర్జన్మ వివరాలు అందిస్తున్న 'హు యామ్ ఐ' కార్యక్రమం ద్వారా తమ కాన్షస్ మైండ్, అన్‌కాన్షస్ మైండ్‌లను గురించి తెలుసుకోవాలని అనుకుంటున్నారు. తమ ప్రస్తుత ప్రవర్తనని బట్టి...తన అన్‌కాన్షస్ మైండ్‌లో ఏముంది...ఆ అన్‌కాన్షస్ మైండ్ చెప్పే తన పూర్వజన్మ ఏమిటి...అనే విషయాలను తెలుసుకునేందుకు ఆసక్తిని కనబరుస్తున్నారు.

అసలు...వారికి ఏంకావాలి?

హుయామ్ఐ కార్యక్రమాన్ని చూస్తున్నవారు తెలుసుకోవాలనుకుంటున్న ముఖ్యమైన విషయం...ఇప్పుడు తమ వ్యక్తిత్వం ఏమిటి...అనేది. దీన్ని గత జన్మస్పృహ ద్వారా, లేదా ఈ జన్మలోని అన్ కాన్షస్‌మైండ్‌ని బట్టి...ఈ వివరాలు తెలుసుకోవాలని ఆశపడుతున్నారు. ఈ కార్యక్రమం చూసి ప్రభావితులైన వీక్షకులు తమ ప్రవర్తనని పరిశీలించుకుంటున్నారు. తమ అలవాట్లు, తమలోని సహజ ప్రవృత్తులను వారు గమనిస్తున్నారు.

తమకు తెలియకుండానే చేసే చిన్నపెద్దా పనులను అన్నింటినీ...ఈ కార్యక్రమ ప్రభావంతో అర్థం చేసుకుంటున్నారు. ఈ కార్యక్రమాన్ని రూపొందించినది జ్యోతిషశాస్త్ర పునాదితో అయినా...ఇది మానసిక శాస్త్రాన్ని ముందుకు తీసుకురావటం విశేషం.




డాక్టర్ ఎస్ వి నాగనాథ్
ఆస్ట్రో సైకాలజిస్ట్



యోగా టైమ్

గాయత్రి
యోగా ట్రైనర్

భుజాలకెంతో మేలు!



సమకోణాసనం

రెండుకాళ్లు దగ్గరగా ఉంచి నిటారుగా నిలబడాలి. శ్వాస తీసుకుంటూ రెండు చేతులను పైకి ఎత్తాలి. శ్వాస వదులుతూ శరీరాన్ని ముందుకు వంచి అలాగే ఉండాలి. మోకాళ్లను వంచ కూడదు. తల మెడ వీపు చేతులు...అన్నీ ఒకేలైన్‌లో ఉంచాలి. ఇలా సాధారణ శ్వాసలో 10 సెకన్లపాటు ఉండాలి. తరువాత పైకి లేవాలి. ఈ విధంగా నాలుగు నుండి ఐదుసార్లు చేయాలి.

ఉపయోగాలు

ఈ రెండు ఆసనాలు భుజాలకు శక్తినిస్తాయి. వీపు నడుము భాగాలకు చక్కని వ్యాయామం అవుతుంది. కాళ్లు సాగుతాయి. కంప్యూటర్‌తోనూ, కూర్చుని ఒకేపనిని పదేపదే చేసేవారికి భుజాలకు సంబంధించిన నొప్పులు రాకుండా ఉంటాయి. శరీర ఆకృతి తీరుగా మారుతుంది.పెరిగే పిల్లలకు ఇవి మంచి ఫలితాన్ని ఇస్తాయి.



ద్వికోణాసనం

నిటారుగా నిలబడి రెండు కాళ్లను 30 సెంటీమీటర్ల దూరంలో ఉంచి నిలబడాలి. చేతులను వెనక్కు తీసుకుని వేళ్లను కలిపి పట్టుకోవాలి. శ్వాస వదులుతూ నడుము వంచుతూ ముందుకు వంగాలి. ఇప్పుడు చేతులు తలపైకి వస్తాయి. ఒత్తిడి లేకుండా చేతులను మరింతగా పైకి ఎత్తాలి. చేతులపై ఒత్తిడి పడకుండా ఎంతవరకు వీలయితే అంతవరకే ఎత్తాలి. అలా పది సెకన్లపాటు ఉండి తరువాత శ్వాస తీసుకుంటూ పైకి లేవాలి. ఇలా నాలుగయిదుసార్లు చేయాలి.

మోడల్: కె. స్నేహిత

గమనిక

సయాటికా, నడుము నొప్పులు ఉన్నవారు వీటిని సాధన చేయరాదు.



కాళ్ళకింద క్రియేటివిటి!

మన అభిరుచిని వెల్లడించే ఫ్యాషన్లలో పాదరక్షలకు కూడా ప్రత్యేక స్థానం ఉంది. దుస్తుల అందానికి అదనపు హంగు ఇవి. కానీ ఇక్కడ కనబడుతున్న చెప్పులు మాత్రం కాళ్లకు ధరించేవిలా అనిపించడం లేదు. చక్కగా ఇంట్లో ముందుగదిలో షోకేస్‌లో పెట్టుకునే కళాకృతుల్లా ఉన్నాయివి. వీటి తయారీలో ఎంతో సృజనాత్మకత కనబడుతోంది. కొన్ని అందంగా ఉంటే..కొన్ని విడ్డూరంగా, మరికొన్ని విభిన్నంగా...మొత్తానికి అడుగడుగునా కొత్తదనమే అన్నట్టుగా ఉన్నాయి.

చింతన

సత్యబద్ధం కానిది ధర్మమూ కాదు

"అసత్యాన్ని పలికిన రాజు బంధితుడై ఆకలి బాధను అనుభవిస్తూ శత్రువుల సంతోషాన్ని చూడవలసిన పరిస్థితిలో పడతాడు. గోవు కోసం, పరువు, గుర్రాలు, మనుష్యుల కోసం అసత్యమాడే వాడు వేయి తరాల వరకు నరకంలో ఉంటాడు. బంగారం కోసం బొంకేవాడు భూత భవిష్యత్ఫలాలను వదులుకుంటాడు. స్త్రీ కోసం, భూమికోసం అబద్ధమాడేవాడు సర్వనాశనమవుతాడు"



"సత్పురుషుల సాంగత్యం వలన గుణసంపదలు లభిస్తాయి. తపస్సు, యజ్ఞం, దానం చేసే గుణం, అధ్యయనం, సజ్జన సాంగత్యం వల్లనే లభిస్తాయి. సజ్జనులు సత్య వ్రతంతో, మృదువైన స్వభావంతో, కోమలమైన హృదయంతో, ఇంద్రియ నిగ్రహంతో ఉంటారు. దయ, ఓర్పు, లోభాన్ని జయించడం, సత్యం మున్నగువాటిని ఉత్తములు పాటిస్తారు. వృద్ధులూ, గురువులు లేనిది సభ కాదు. ధర్మము చెప్పలేనివాడు గురుడూ, వృద్ధుడూ కాలేడు. సత్యబద్ధం కానిది ధర్మం కాదు. కపటమైనది సత్యము కాజాలదు'.

పై హితవచనాలు సుధన్వుడు - విరోచనుల ఉపాఖ్యానంలోనిది. ధృతరాష్ట్రుడికి విదురుడు దీనిని బోధించాడు. ఇది మహాభారతంలోని ఒక ఉపాఖ్యానం.

సుధన్వుడు విరోచనుల ఉపాఖ్యానంలో ఏమి ఉంది? ఆ ఉదంతాన్ని ధృతరాష్ట్ర నకు విదురుడెందుకు చెప్పాడు? తెలుసుకుందాం.

కేసిని అనే అందమైన స్త్రీ అందరికన్నా ఉత్తముడైన వాడిని భర్తగా చేసుకోవాలని తలచి స్వయంవరాన్ని ప్రకటించింది. అందరు రాజులతో పాటు విరోచనుడు అనే రాకుమారుడు కూడా వచ్చాడు. అతనిని చూసి కేసిని "దైత్యులలో శ్రేష్ఠుడెవరు?" అని ప్రశ్నించింది. అప్పుడు విరోచనుడు విప్రుడు శ్రేష్ఠుడంటాడు. భూసురుడైన సుధన్వుడు నన్ను వివాహం చేసుకోవడానికి అర్హుడు కాడా అని అంటుంది కేసిని. "కేసినీ! ప్రజాపతి సంతానమందు మేము గొప్పవారం. మా ముందు దేవతలే తీసిపోయిన వారైతే భూసురులైన బ్రాహ్మణుల విషయం విడిగా చెప్పవలసి ఉందా?" అంటాడు విరోచనుడు. అహంకారంగా. సుధన్వుడు కూడా వస్తున్నాడు. అతను వచ్చిన తరువాత నిర్ణయం తీసుకుందాం అంది కేసిని.

సుధన్వుడు రాగానే కేసిని సాదరంగా అతనిని ఆహ్వానించి ఆసనం చూపింది కూర్చోమని. అప్పుడు సుధన్వుడు విరోచనునితో "నేను ఈ అందమైన బంగారు సింహాసనాన్ని తాకుతున్నాను. కాని దానిపై కూర్చోను ఎందుకంటే నేనూ మీలాగ సింహాసనం మీద కూర్చుంటే మీతో సమానుడనవుతాను".

దానికి విరోచనుడు "ఓ బ్రాహ్మణా! నీకు కొయ్యపీట, దర్భాసనం యోగ్యమైనవి. సింహాసనం మీద మావంటి గొప్ప వారికే అధికారం ఉంది" అని ఎగతాళి చేశాడు. ఇక నేను గొప్పంటే నేను గొప్ప అంటూ వారిద్దరి మధ్య మాట మాట పెరిగింది.

"సుధన్వా! మా నగరంలోని ధనాన్ని, బంగారాన్ని, గోవులను, గుర్రాలని పణంగా పెడుతున్నాను. మన ఇద్దరిలో ఎవరు గొప్పో నిశ్చయించుకుందాము" అన్నాడు విరోచనుడు. "వాటి మాటకేల? ప్రాణాలనే పణంగా పెడదాము. అయితే ఈ నిర్ణయం ఒక్క జ్ఞాని వల్లనే జరగాలి" అన్నాడు సుధన్వుడు. విరోచనుడు అందుకు అంగీకరించి "అయితే నేను దేవతల వద్దకు రాను. మనుష్యుల నిర్ణయం నాకు నచ్చదు" అని షరతు పెట్టాడు. చివరకు విరోచనుడు తండ్రి రాజు అయిన ప్రహ్లాదుడిని ఇద్దరూ న్యాయనిర్ణేతగా అంగీకరిస్తారు. ప్రహ్లాదుడు రాజు, ఎట్టి పరిస్థితులలోను అసత్యం పలకడు అన్న నమ్మకం సుధన్వుడికి ఉంది. అయితే తన తండ్రే న్యాయ నిర్ణేత అని విరోచనుడు సంతోషించాడు. కొడుకు ప్రాణం మీద తండ్రికి అభిమానం ఉండదా?

వారిద్దరు కలసి వచ్చినపుడు ప్రహ్లాదుడు ముందు ఆశ్చర్యపోయాడు. వారి మధ్య వివాదం గురించి విన్నాడు. అతడు ధర్మసంకటంలో పడ్డాడు. తన కొడుకు పక్షంలో తీర్పునిస్తే పుత్రపక్షపాతి అనే నిందను భరించాలి. ఒక సద్బ్రాహ్మణ యువకుని ప్రాణాన్ని హరించినవాడన్న అపకీర్తి వస్తుంది. అలా కాక సుధన్వుడు గొప్పవాడని అంగీకరిస్తే ఒక్కగానొక్క కొడుకును కోల్పోతాడు. అందువల్ల తీర్పు చెప్పే భారం నా మీద వేయకండి అని వారితో అన్నాడు. సుధన్వుడు పట్టువిడువలేదు. "ఈ వివాదంలో సత్యమైన నిర్ణయం చేయండి"అన్నాడు.

"సుధన్వా! సత్యాన్ని పలుకకుండా అనృతం పలికితే వచ్చే స్థితి ఏమిటి?" అని ప్రహ్లాదుడు అడిగాడు. "రాజా! అన్యాయ పూరిత నిర్ణయాలు చేసే వారికి వచ్చే స్థితి, సవతులు గల స్త్రీ అవస్థ, ద్యూతమందోడిన వాని స్థితి, దినమంతా బరువులు మోసేవానికి రాత్రి కలుగు స్థితియే" అన్నాడు సుధన్వుడు.

ఆ తరువాత మరింత వివరంగా ఇలా చెప్పాడు "అసత్యాన్ని పలికిన రాజు బంధితుడై ఆకలి బాధను అనుభవిస్తూ శత్రువుల సంతోషాన్ని చూడవలసిన పరిస్థితిలో పడతాడు. గోవు కోసం, పరువు, గుర్రాలు, మనుష్యుల కోసం అసత్యమాడే వాడు వేయి తరాల వరకు నరకంలో ఉంటాడు. బంగారం కోసం బొంకేవాడు భూత భవిష్యత్ఫలాలను వదులుకుంటాడు. స్త్రీ కోసం, భూమికోసం అబద్ధమాడేవాడు సర్వనాశనమవుతాడు".

అప్పుడు ప్రహ్లాదుడు తన తనయుని చూసి "నాయనా! ఈ సుధన్వుని తండ్రి అంగీరసుడు నాకన్నా గొప్పవాడు, ఇతని తల్లి నీ తల్లి కన్నా గొప్పది. కావున ఈ సుధన్వుడు నీకన్నా గొప్పవాడు" అంటూ తీర్పునిచ్చాడు. సభలో హర్షధ్వానాల మధ్య ప్రహ్లాదుడు సుధన్వునితో ఇలాగన్నాడు. "విప్రోత్తమా! నీవు అనుగ్రహించావంటే నాకు నా పుత్రుడు దక్కుతాడు" అన్నడు. సుధన్వుడు దొడ్డమనసుతో "రాజా! నీవు సత్యం పలికేవు కాబట్టి నీ కుమారుడిని నీకిస్తున్నాను" అన్నాడు.

ఈ వృత్తాంతాన్ని విదురుడు చెప్పి అధర్మవర్తనతో మెలిగేవారిని బ్రహ్మహత్యాసములుగా చూడాలని, సత్యబద్ధం కానిది ధర్మం కాదని, కపటమైనది సత్యం కాజాలదని అంటాడు. **వినాశకాలే విపరీత బుద్ధిః** అన్నట్లు పుత్రప్రేమతో నిండా మునిగి ధర్మాధర్మాలను పట్టించుకోని ధృతరాష్ట్రుడు దుర్గతి పాలైన విషయం అందరికీ తెలిసినదే.

- గుమ్మా ప్రసాదరావు
09755110398

శ్రీ కృష్ణస్తుతి

క్షేత్రయ పదములు నీవే!
క్షేత్రము నీవే! బీజము నీవే! మా
మిత్రము నీవే! నీ కృప
పాత్రము నేనై మనవలె పవిత్రా కృష్ణా॥

భారత భాగ్యవిధాతా!
భారత రచనా కర్తా! భారత వీరా!
భారత సారథి నీవే!
భారత భారతి! భావుక కృష్ణా॥

పంచాగ్నులు నీవేనయ
పంచారామము నీవే పంచాత్మవురా!
పంచేంద్రియములు నీవే!
పంచతురంగము! నదపంచకమూ కృష్ణా॥



భాగవతోత్తముడివే!
భాగవతపురుషుడవీవు! భగవద్భోక్తా!
భూభారకుడవు నీవే!
భగవద్గీతా పురుషా, భగవత్ కృష్ణా॥

త్యాగయ కీర్తనవో భవ
సాగరమీదే సంకీర్తనవో? ఏ
భోగములాశించని ఆ
భగవద్భక్తుల బ్రోచే భారక కృష్ణా॥

పోతనవో! శ్రీనాథుడ
వో! తమి మీరగ రసమ్ములూరే కవితా
గీతాల్పాడిన కవుల
న్నుతియించు భాగ్యము కలిగెను గదా కృష్ణా॥

- ఊటుకూరి సుహాసిని

భగవద్గీత



అధ్యాయం 4

శ్లోకం 20:

త్యక్త్వా కర్మఫలాసంగం
నిత్యతృప్తో నిరాశ్రయః।
కర్మణ్యభిప్రవృత్తోపి
నైవ కించిత్ కరోతి సః॥

తాత్పర్యం


కర్మ ఫలములందు ఆసక్తిని విడిచి ఎల్లప్పుడూ తృప్తిగా ఉండేవాడు, నిరాశ్రయుడు అయినవాడు అన్నిరకములైన కర్మలు చేస్తున్నప్పటికీ కామ్య కర్మలు చేయనివాడే అవుతాడు.

భాష్యం

కృష్ణుని కోసం ప్రతిది చేయుట అనే భావన కర్మ బంధం నుండి విడుదలకు అవకాశం ఇస్తుంది. కృష్ణ భక్తుడు, కృష్ణుణ్ని ప్రేమిస్తాడు కనుక కర్మఫలములందు ఆసక్తిని కలిగి ఉండడు. అతడు కృష్ణునిపైననే ఆధారపడి ఉండటం వల్ల స్వీయ పోషణ గురించి చింతించడు సరికదా లేనివి పొందవలెనని గాని, ఉన్న వానిని రక్షించుకొనవలెనని గాని అతడు ఆత్రుతపడడు. అట్లని అతడు సోమరిపోతని భావింపరాదు. కృష్ణుడు నిర్దేశించిన ధర్మాన్ని తన శాయశక్తులా చేసి ఫలితాన్ని కృష్ణునికి వదిలివేస్తాడు. కృష్ణుని పట్ల ప్రేమ లేనిదే బంధ విముక్తి అనేది సాధ్యం కాదు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీ శ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యధాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

కల్కి పలుకు



We are like magnets which attract everything. we become as them and attract every-thing.


మనం అయస్కాంతాల వంటివారం. మనం వాటిలా మారిపోయి దేనిని పడితే దానిని ఆకర్షించాలని ప్రయత్నిస్తాం.

Sri Amma Bhagavan

వివరణ : కూనపురెడ్డి అరుణ్ కుమార్

విశిష్టాద్వైత దీప్తి యామునాచార్యులు

యామునాచార్యులు ద్వైత, అద్వైత వాదాలు, స్తోత్రాలపైనా దృష్టి సారించారు. ఆయన తమిళ అళ్వారుల రచనల్ని క్రోడీకరించారు. అయితే ఆయన రచనలన్నీ సంస్కృతంలో ఉన్నాయి. ఆయన చేసినవిగా చెబుతున్న రచనలు చతుశ్లోకి, స్తోత్ర రత్నలతో బాటు సిద్ధిత్రయం, ఆగమ ప్రామాణ్య, మహాపురుష నిర్ణయం, గీతార్థ సంగ్రహం, మాయావాద ఖండనం.



యామునాచార్యులు తమిళనాడుకు చెందిన ప్రసిద్ధ విశిష్టాద్వైత వేదాంతి. ఆయన తమిళనాడులోని శ్రీరంగానికి చెందిన వారు. ఆయనను అలవందర్‌గా కూడా పిలిచేవారు. ఆయన క్రీస్తు శకం 916 ప్రాంతానికి చెందినవారు. ఆయన ఈశ్వర భట్టు అనే శ్రోత్రియుని కుమారుడు, నాథముని అనే పేరున్న యోగితుల్యుని మనుమడు. నాథముని తమిళ అళ్వార్ల రచనలన్నిటినీ సేకరించిన మహానుభావుడు. యామునాచార్యులు మనక్కల్ నంబిగా ప్రఖ్యాతులైన రామ మిశ్రుని వద్ద వేదాలు అభ్యసించారు. ఆయన ఎంత ప్రతిభావంతుడంటే చిన్న వయసులోనే అప్పటి ఆ ప్రాంత రాజు ఆస్థానంలోని అక్కియల్వన్ అనే ఉద్దండ పండితుని వాదంలో జయించాడు. దానికి కారణం ఉంది. అక్కియల్వన్ రాజ్యంలోని విద్వాంసులందరూ తనకు కప్పం కట్టాలని లేని పక్షంలో తనతో వాదనలో గెలవాలని హుకుం జారీ చేశాడు. అతనితో వాదించలేక, అతనికి రాజు అండదండలుండడంతో అందరూ అతనికి భయపడి కప్పం కట్టేవారు. ఆ సమయంలో యామునాచార్యులు మహాభాష్య భట్టు అనే గురువు వద్ద విద్యనభ్యసిస్తూ ఉండేవాడు. ఒక ఏడాది మహాభాష్య భట్టుకు కూడా ఆ విధంగా కప్పం కట్టమని ఆదేశం వచ్చింది. ఆ సమయంలో ఆయన వద్ద డబ్బు లేనందున ఆయ విచారంగా కనిపించారు. యామునాచార్యుడు ఆయన విచార వదనం చూసి దానికి కారణం కనుగొని అక్కెల్వాన్‌కు కప్పం కట్టబోమని సందేశం పంపాడు. దానితో రాజు యామునాచార్యుని తన ఆస్థానానికి తక్షణం రావలసిందిగా ఆజ్ఞాపించాడు . అందుకు యామునాచార్యుడు నిరాకరించాడు. దీనితో రాజుకు ఈ వ్యక్తి సామాన్యుడు కాదని అర్థమైంది. ఆయన మందీ మార్బలంతో ఒక పల్లకీని ఏర్పాటు చేసి యామునాచార్యుని గౌరవంగా తన ఆస్థానానికి తీసుకురావాలని కోరారు.


యామునాచార్యుడు ఆ విధంగా ఆ రాజు ఆస్థానానికి వచ్చాడు. వాదానికి ముందు అక్కడి అక్కెల్వాన్ యామునాచార్యుని చూసి వ్యంగ్యంగా అలవందరా! (నన్ను పాలించడానికి వచ్చావా) అన్నారని చెబుతారు. ఆ వాదంలో యామునాచార్యులు అక్కెల్వాన్‌ను తర్క శాస్త్ర యుక్తులతో ఓడించారు. ఆయన వాదనా పటిమ, తర్కశాస్త్ర యుక్తులు చూసి ముగ్ధులైన రాజు అతనికి అర్ధరాజ్యం ఇచ్చాడని చెబుతారు. (రాజదంపతులు అలవందర్‌ను దత్తత తీసుకున్నారని కూడా ఒక కథనం ఉంది). ఆ సందర్భంగా రాణి యామునాచార్యుని అలవందార్ (రక్షకుడు)గా అభివర్ణించిందని చెబుతారు. అప్పటి నుంచి అయనకు అలవందార్ అనే పేరు స్థిరపడిపోయిందని చెబుతారు.

ఇదిలా ఉండగా అర్ధరాజ్యం పొందిన యామునాచార్యులు కొంత కాలం రాజుగా బాధ్యతలు నిర్వహించిన అనంతరం మనక్కల్ నంబి ఆయనను ఒక ఉత్సవానికి రంగనాథ ఆలయానికి పిలిపించారు. ఆ సందర్భంగా యామునాచార్యులు పాలనా బాధ్యతలు ఇతరులకు అప్పగించి సన్యాసం తీసుకుని శరణాగతి పొందారని తెలుస్తోంది. అక్కడికక్కడే ఆయన 'చతుశ్లోకి', 'స్తోత్ర రత్న' అనే రచనలు చేశారని చెబుతారు. ఆ తర్వాత మనక్కల్ నంబి తాను సేకరించిన దివ్య ప్రబంధంతో సహా నాథ సంప్రదాయ మత అధిపత్యాన్ని కూడా యామునాచార్యులకిచ్చారు. ఆయనే అలవందర్‌కు యామున ముని, యామునా చార్య అని నామకరణం చేశారు.


యామునా చార్యులు కూడా ద్వైత, అద్వైత వాదాలు, స్తోత్రా లపైనా దృష్టిసారించారు. ఆయన తమిళ అళ్వా రుల రచనల్ని క్రోడీకరించారు. అయితే ఆయన రచనలన్నీ సంస్కృతంలో ఉన్నాయి. ఆయన చేసినవిగా చెబుతున్న రచనలు చతుశ్లోకి, స్తోత్ర రత్నలతో బాటు సిద్ధిత్రయం, ఆగమ ప్రామాణ్య, మహాపురుష నిర్ణయం, గీతార్థ సంగ్రహం, మాయావాద ఖండనం ఉన్నాయి. ఆయన 1041లో స్వర్గస్థులయ్యారని భావిస్తున్నారు.

ధర్మం-మర్మం

ఆచమనం ఎలా చేయాలి, దాని అంతరార్థం ఏమిటి?




బాహ్యశుద్ధి, అంతరశుద్ధి, పరిపూర్ణ ఆరోగ్యం, సకల రోగ నివారణ, మనశ్శుద్ధిల పంచ ప్రయోజనం ఆచమనం. తర్జన (చూపుడువేలు), మధ్యమ (మధ్యవేలు), అనామిక (ఉంగరంవేలు) ఈ అంగుళ్ళను తమ వైపు ఉంచుకుని వాటికి ఆధారముగా అంగుష్టము నుంచి కనిష్టక (చిటికెనవేలు) వెనకకు వంచినపుడు అరచేతిలో ఏర్పడే లోతైన ప్రాంతాన్ని 'మాషము' అంటారు. అందులో పోసుకున్న జలం నారాయణుడు ఆ జలాన్ని పెదవులకు తాకకుండా నోటిలో పోసుకోవాలి. కేశవాయ స్వాహా, నారాయణా స్వాహా, మాధవాయ స్వాహా, అని లేదా అచ్యుతాయనమః, అనంతాయనమః, గోవిందాయనమః అంటూ ఆచమనం చేయాలి. అసలు శాస్త్ర ప్రక్రియలో అచ్యుత, అనంత, గోవింద అనే నామత్రయం సకల రోగనివారకము.



- డా॥ కందాడై రామానుజాచార్య

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

జపతపాలు



శ్రీ రమణాశ్రమం
3-6-46

నిన్న నొక పెద్దమనిషి వచ్చాడిక్కడికి, సద్బ్రాహ్మణుడు. ఆయన మాటల వల్లా, మెళ్లో వున్న రుద్రాక్షమాల వల్లా, మంత్ర జపపరాయణుడని తెలుస్తున్నది. భగవాన్ విరూపాక్ష గుహలో ఉండగా ఒకసారి దర్శించానని చెప్పాడు. ఈ మధ్యాహ్నం శ్రీవారిని సమీపించి "స్వామీ! పంచాక్షరి గాని తారకం గాని, ఏదో ఒక మంత్రం జపిస్తూ వుంటే సురాపానాది దోషాలన్నీ హరింపగలవా?" అని ప్రశ్నించాడు. "అంటే యేమిటి మీ ఉద్దేశ్యం" అన్నారు భగవాన్, 'పైన చెప్పిన మంత్రాలు జపిస్తూ వున్నవారు జారత్వ చోరత్వ సురాపానాదులు చేసినా, ఆ మంత్రజపం వల్ల ఈ దోషాలు హరింపబడగలవా? ఆ పాపము వారిని అంటకుండునా?" అని మళ్లీ తర్కించి అడిగాడా విప్రుడు.

"నేను జపిస్తున్నాననే భావం లేకుంటే, వీటివల్ల కలిగే దోషం వారికంటదు. నేను జపిస్తున్నాననే భావం ఉన్నప్పుడు దురభ్యాసాల వల్ల కలిగే పాపం మాత్రం ఎందుకంటదు?" అన్నారు భగవాన్. "ఈ పుణ్యం ఆ పాపాన్ని హరింపదా?" అన్నాడా బ్రాహ్మణుడు. "నేను చేస్తున్నాననే అహంభావమున్నంతవరకు దేనికది అనుభవింప వలసిందే. ఒకదానితో వేరొకదాన్ని కప్పిపుచ్చటం ఎట్లా పొసగుతుంది? నేను చేస్తున్నాననే భావన పోయినప్పుడు తనకేదీ అంటదు. తానెవరో తెలుసుకుంటే గాని నేను చేస్తున్నాననే భావన పోదు. తన్నుదా నర సినవానికి జపమేది? తపమేది? ప్రారబ్ధవశంగా శరీరయాత్ర సాగుతుండే గాని వాడొక్కదానిని ఇచ్ఛింపడు. ప్రారబ్ధం అనేది ఇచ్ఛా ప్రారబ్ధం, అనిచ్ఛా ప్రారబ్ధం, పరేచ్ఛా ప్రారబ్ధం అని మూడువిధాలు గదా? తన్నుదా నెరిగిన తత్త్వజ్ఞునకు ఇచ్ఛా ప్రారబ్ధం లేనేలేదు. అనిచ్ఛా, పరేచ్ఛా రేండే వుంటవి. వారు ఏది చేసినా పరులకొఱకే. ప్రారబ్ధాను సారం చేయవలసిన పనులుంటే చేస్తారు గాని తత్ఫలితం వారి నంటదు. అటువంటి వారు ఏది చేసినా పుణ్యాపాపములు లేవు. అయితే వారు ఎప్పుడు లోకాన్ననుసరించే నడుస్తారు గాని అవకతవక పనులు చేయరు" అని యుక్తియుక్తముగా సెలవిచ్చారు భగవాన్.

"తన్నుతా నెఱిగినవానికి ఇచ్ఛాప్రారబ్ధం లేనే లేదు. అనిచ్ఛా, పరేచ్ఛా రెండే వుంట"వని ఆ పృచ్ఛకులకు సమాధానంగా భగవాన్ చెప్పారే గాని వారి యధార్థ సిద్ధాంతం 'ఉన్నది నలుబది' అనుబంధ మందు ఎట్లా విశదీకరించారో చూడు.

33. జ్ఞానికి సంచిత ఆగమములు కలుగవు; ప్రారబ్ధము మిగులు ననుట పరుల ప్రశ్నకు బలుకుమాట, భర్త పోయిన తర్వాత వైధవ్య మును బొందని భార్య మిగులుకున్నట్లు, కర్తపోయిన కర్మత్రయము మిగులదని కనుము.

- సూరినాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/



సుమతి శతకము

ఉత్తమ గుణముల నీచున
కెత్తు రగున గలుగ నేర్చు నెయ్యెడలన్ దా
నెత్తిచ్చి కరగి పోసిన
నిత్తడి బంగార మగునె యిలలో సుమతీ!

తాత్పర్యం: అల్పబుద్ధి గలవానికి ఏ విధంగా సాయం చేసినా మంచి బుద్ధి రాదు, ఇత్తడికి సమానంగా బంగారాన్ని తీసుకుని ఎంత కరిగించి పోసినా అది బంగారానికి సాటిరాదు. అలాగే నీచుడు కూడా.

బాలప్రభ

పొడుపు కథ

పచ్చని మేడ తెల్లని గదులు
నల్లని దొరలు

జవాబు : సీతాఫలం



దుబారా ఖర్చు

షావుకారు చలమయ్య వద్ద శివరాం పదేండ్లు పైబడి బంగారు దుకాణంలో పనిచేస్తున్నాడు. శివరాం నిజాయితీ గల వ్యక్తి. యజమాని పట్ల ఎక్కువ భక్తి శ్రద్ధలు చూపేవాడు. అందువల్ల చలమయ్య మామూలు జీతం కంటే కొంచెం ఎక్కువ ఇచ్చేవాడు. అందుకు బలమైన కారణాలు లేకపోలేదు. శివరాంకు తాత ముత్తాతల నుండి సంక్రమించిన ఇల్లు తప్ప పంట భూమి లేదు. భార్య మెడలో పది తులాల బంగారం మాత్రమే ఉంది. అయితే పెండ్లి ఈడుకు వచ్చిన కూతురు. కాలేజి చదువుకు ఎదిగిన కొడుకు ఉన్నారు. శివరాం పిల్లలపై ఉన్న ఎక్కువ ప్రేమానురాగాల వల్ల తలకు మించి ఖర్చులు చేసి అప్పులపాలయ్యాడు. షావుకారు దుబారా ఖర్చులు చేయవద్దని శివరాంను తరచుగా మందలించేవాడు. శివరాం యథాప్రకారంగా తల ఊపి ఖర్చులు మాత్రం తగ్గించేవాడు కాదు. శివరాం కూతురు వైష్ణవికి పెళ్లి సంబంధాలు వెతకడం ప్రారంభించాడు. చివరకు వారి ప్రయత్నాలు ఫలించి కూతురుకు తగ్గ వరుడు లభించాడు. పెండ్లి ఖర్చులకు చాలా డబ్బు కావాల్సి వచ్చింది. భార్య సలహాను పాటించి శివరాం షావుకారిని కలుసుకుని పెండ్లి వివరాలు చెప్పి అప్పు ఇవ్వమని బ్రతిమాలాడు. చలమయ్య అవసరాలకు సహాయం చేసే స్వభావం కలవాడు. ముఖ్యంగా శివరాం అంటే కాదని అనలేడు. చలమయ్య కాస్త ఆలోచించి శివరాం! నీ కూతురు పెండ్లికి నేను సహాయ పడకపోతే మరెవ్వరు సహాయపడతారు. అయితే ప్రస్తుతం నా దగ్గర డబ్బులేదు. నా మాట కాదనుకుంటే ఒక సలహా ఇస్తాను. నీ ఇంటిపై తాకట్టు పెట్టి కావలసిన డబ్బు తెచ్చుకో. నీ ఇంటిపై పైకం ఇవ్వగలవారి పేర్లు నేను చెబుతాను. ఏమంటావు? అని అడిగాడు.

అప్పు ఇవ్వమంటే ఇల్లు తాకట్టు పెట్టమని చెప్పాడని శివరాంకు షావుకారు పై పట్టరాని అగ్రహం వచ్చింది. కాని యజమానిని ఎదిరించలేక శివరాం అంగీకరించాడు. శివరాం షావుకారు చెప్పిన వ్యక్తి వద్ద అప్పు తెచ్చి కూతురు పెళ్లి ఘనంగా చేశాడు. కూతురు వైష్ణవిని కాపురానికి పంపాడు. కాని శివరాం సమస్య అంతటితో తీరలేదు. కొడుకు ప్రతాప్ హైస్కూల్ చదువు విజయవంతంగా ముగించి కాలేజి సీటు దరఖాస్తు పెట్టుకున్నాడు. సీటు రానే వచ్చింది. కాలేజిలో చేరేందుకు పుస్తకాలకు ఎక్కువ డబ్బు అవసరమైంది. మరలా శివరాం అప్పు చేయాల్సిన అగత్యం ఏర్పడింది. శివరాంకు గత్యంతరం తోచలేదు. తిరిగి షావుకారును అడగడానికి మనసు తోచలేదు. భార్యతో ఆలోచనలో పడ్డాడు. షావుకారును అడగమని భార్య సలహా ఇచ్చింది. ''ఏమే కూతురు పెళ్లికి అడిగి

లేదనిపించుకున్నాను. తిరిగి ఏ మొహం పెట్టుకుని అడగమంటావు? అలాకాదండీ. షావుకారు మంచి వారని మీరే కదా చెపుతుంటారు. మొదటిసారి కాదన్నాడు. అతనికి ఇంకా డబ్బు రాకుండా వుంటుందా? ఇప్పుడు తప్పకుండా షావుకారును కలుసుకొని కొడుకు కాలేజి చదువుకు అప్పు ఇవ్వమని అడిగండి. భార్య చెప్పినట్టుగానే షావుకారు చలమయ్యని అడిగాడు. ఇందుకు షావుకారు స్పందిస్తూ ''శివరాం కూతురు పెండ్లికని ఇల్లుపైఅప్పు తెచ్చావు. ఇది ఇంకా తీర్చలేదు. నా వద్ద ఇంకా డబ్బు జమ కాలేదు. నీ వద్ద ఇప్పుడున్నది బంగారం మాత్రమే. నా మిత్రుడు రామిశెట్టి వద్ద కుదువ పెట్టి అప్పు తీసుకో. రామిశెట్టికి కబురు చేస్తాను అన్నాడు. శివరాంకు షావుకారు సహాయం చేయడని అర్థమైపోయింది. భార్య బంగారు నగలను రామిశెట్టి వద్ద పెట్టి డబ్బు తెచ్చి ప్రతాప్‌ను కాలేజిలో చేర్చాడు. శివరాం ఉన్న ఇల్లు, నగలు తాకట్టు పెట్టి మరింత బీదవాడయ్యాడు. రోజులు గడవడం మరింత దుర్లభమయ్యింది. అంతలో చివరకు వ్యాధి గ్రస్తుడయ్యాడు. మనో రోగానికి మందులు వంటబట్టలేదు. షావుకారు చలమయ్య ఓ రోజు శివరాం ఇంటికి వచ్చి, శివరాం! ఉన్నవి పోయాయని దిగులు పడకు. అవి ఎక్కడికి పోలేదు. నీకు దుబారా ఖర్చులు చేసే గుణం ఉంది. కాబట్టి నా దగ్గర డబ్బు వున్నా నీకు అప్పు ఇవ్వలేదు. అయితే నీ ఇంటిపైనా నగలపైన నీకు పైకం ఇచ్చింది నేనే కానీ నా మిత్రులు కాదు. మిత్రుల ద్వారా నీ వస్తువులపై అప్పు ఇప్పిస్తే నువ్వు అనవసరమైన ఖర్చులు చేయవని అలా నాటకం ఆడాను. ఇవిగో నీ సొమ్ములు. ఇంటి పత్రం ఇక నుంచైనా దుబారా ఖర్చులు తగ్గించి జాగ్రత్తపడు అన్నాడు.

శివరాంకు లేచిపోయిన ప్రాణం తిరిగి వచ్చినట్టయ్యింది. భార్యతో సహా తన కృతజ్ఞతలు తెలిపాడు. అతని ఆరోగ్యం బాగా కుదుటపడింది. అతడు చేసే వృథా ఖర్చులను పూర్తిగా మానుకున్నాడు.

- ఉలాపు బాలకేశవులు



పనినే దైవంగా భావిస్తే అద్భుత ఫలితం

ఫ్రెండ్స్! ఏం చేస్తున్నారు. ఈ వారం మనం ప్రతి ఏటా జరుపుకునే రాఖీ పండుగ వచ్చేస్తుంది. మరి మీరంతా ఏం చేస్తారు. ఆడపిల్లలైతే అన్నయ్యల కోసం రాఖీల కొనుగోళ్లు, మగపిల్లలైతే చెల్లాయికి, అక్కయ్యకు ఇష్టమైన బహుమతుల కోసం ప్రయత్నాలు, ఔనా.. మరి మీరు ఈ సందడిలో ఉంటారనుకుంటున్నాను. సరే.. మీకు ఈ వారం ఒక ముఖ్యమైన అంశాన్ని చెప్పాలనుకుంటున్నాను. మీరు ఎంత తీరికలేని ఒత్తిడిలో ఉన్నా, మీరు చేయాల్సిన పనిని మాత్రం చేయకుండా వదిలి పెట్టవద్దు. నిరంతరం మీ ధ్యాస అంతా మీరు చేయాల్సిన పనిపైనే ఉండాలి. అప్పుడే మీరు అనుకున్నది సాధించే అవకాశం వస్తుంది. నిరంతరం పని..పని.. పని అని తపిస్తూ ఉండాలి. కలలో కూడా పని గుర్తుకు రావాలి అంతేకాదు అబ్దుల్ కలాం ఏమంటాడంటే పని మీకు నిద్రలేకుండా చేయాలి. నిరంతరం పనిపైనే దృష్టి పెట్టాలి. ఉదాహరణకు మనం ఇష్టపడే పళ్లు కూరగాయలు ఊరకే రావు. అవితినాలంటే ముందు నారు పోయాలి. నీరుపోయాలి. ఒక పాపాయిలా కాపాడాలి. అప్పుడు మొక్కలు పెరిగి పెద్దయి మనకు పళ్లు, కూరగాయలు ఇస్తాయి ఔనా. అదే విధంగా మీరు ఏం చేయాలనుకుంటున్నారో, మీరు ఏం కావాలనుకుంటున్నారో ముందు ఒక ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. అంతేకాదు ఇప్పటి నుంచే ఒక క్రమ పద్ధతిలో కష్టపడుతూ పోవాలి. అంటే అదేపనిలో ఉండాలి. మీరు ఆ పనిపై ఇష్టాన్ని పెంచుకోవాలి. ఇతరుల కోసం మీరు ఏ పనీ చేయవద్దు. మీ కోసం పనిచేయడం అలవాటు చేయాలి. మీకు ఇష్టమైన పనిచేయడం ప్రారంభిస్తే ఇక అందులో చికాకు, విసుగు రాకుండా ఉంటుంది. పనిలో సుఖం ఉన్నప్పుడు జీవితం కూడా ఆనందమయమవుతుంది. ఆపని ఇష్టం లేకుంటే అన్నీ వదిలిపెట్టి పారిపోవాలనిపిస్తుంటుంది. అందుకే మీరేం చేసినా మీకు నచ్చిన, ఇష్టమైన పనిని ఎంచుకోవాలి. అప్పుడు అది ఎంత కష్టమైనా ఆనందంగానే స్వీకరిస్తుంటారు. మన వద్ద ఉండే తెలివితేటలను మనం ఎంచుకున్న పని మెరుగు పరుస్తుంది. మన మేధస్సుకు పదునుపెడుతుంది. దాంతో మరింత ప్రకాశవంతమవుతుంది. మనం సాధించాలనుకున్నది త్వరగా, సునాయాసంగా మన వద్దకు వస్తుంది. అదే ఇష్టం లేని పనిచేసినప్పుడు మీకు ఫలితం ఉండదు. ఎప్పుడూ చికాకు అనిపిస్తుంది. విసుగు వస్తుంది. మన ఆలోచనలు మన స్వాధీనంలో ఉండవు. దీనివల్ల చెడు ఫలితాలు వస్తాయి. వీటన్నింటి వల్ల మన ఆరోగ్యం దెబ్బతింటుంది. ఇతరులు కూడా మీ విషయంలో చిన్న చూపు చూస్తారు. లేకుంటే మీకు తగిన ఫలితం లభిస్తే అందరూ మిమ్మల్ని గౌరవిస్తారు. ప్రేమిస్తారు. జీవితంలో అదృష్టం కంటే ఎక్కువగా ఫలితం ఇచ్చేది కేవలం పని మాత్రమే.

గాలిలో దీపం పెట్టి దేవుడా కాపాడు అంటే అది ఎలా సాధ్యమవుతుంది. అదే విధంగా మీరు తగినట్టుగా పనిచేసి ఫలితం కోసం నిరీక్షిస్తే అంతా మంచే జరుగుతుంది. ఒక ముక్క బంగారం కావాలంటే కొన్న కిలోల ఖనిజాన్ని శుద్ధి చేయాల్సి వస్తుంది. అదే విధంగా ఒక మంచి ఫలితం రావాలంటే ఏళ్ల తరబడి నిరంతరం ఏకాగ్రతగా పని చేయాల్సి వస్తుంది. ఈ విషయాన్ని మీరు దృష్టిలో పెట్టుకుని మీరు అనుకున్నది సాధించాలి. పనినే దైవంగా భావించాలి.

- టి. వేదాంతసూరి

బాల సాహిత్యంలో కఠిన పదాలు ఉండాలి

బాలసాహితీ బంధువులు-17



చిరునామా
శారదా అశోక వర్ధన్
701, అమర్‌చంద్ శర్మ కాంప్లెక్స్
సర్దార్‌పటేల్ రోడ్,
సికింద్రాబాద్- 500003
సెల్ : 9866021570

ఒకవైపు బాధ్యతాయుతమైన ప్రభుత్వ రంగ కొలువు చేస్తూ బాలసాహిత్యంలో విశేష కృషి చేసిన అమ్మమ్మ శారదా అశోక్ వర్ధన్. హైదరాబాద్‌లో 28 జులై 1938న పుట్టారు. అమ్మ వెంకటలక్ష్మి నరసమ్మ, నాన్న నూకల అప్పారావు. విద్యాభ్యాసం అంతా హైదరాబాద్‌లోనే జరిగింది. ఎంఎ సోషయాలజీ చదివారు. వృత్తిరీత్యా ఆకాశవాణి ఫీల్డ్ ఆఫీసర్‌గా, జవహర్ బాలభవన్ డైరెక్టరుగా, సమాచార పౌరసంబంధాల శాఖ అదనపు సంచాలకులుగా ఉద్యోగం చేసి పదవీ విరమణ చేశారు.

శారదా అశోక వర్ధన్ అమ్మమ్మ బాలల కోసం కథలు, కవితలు, గేయాలు, పాటలు, నాటికలు అనేకం రాసారు. అందులో కొన్నిటిని 6 పుస్తకాలుగా ప్రచురించారు. జంతువుల మహాసభ అనే పిల్లల కథ(20 పేజీల కథ) విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ప్రచురించింది. ఈ కథ పిల్లల్ని విశేషంగా ఆకర్షిస్తుంది. జంతువులన్నీ కలిసి మృగరాజు సింహానికి కష్టాలు చెప్పుకుంటాయి. మనుషులు అడవి మీద పడి చెట్లు నరికేస్తున్నారు. అడవి జంతువులని హింసిస్తున్నారు. చంపేస్తున్నారు. తల్లినీ, పిల్లనీ విడదీసి ఆడుకుంటున్నారు. నిలువనీడలేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తాయి. మృగరాజు చివరగా ఒక నిర్ణయం తీసుకుంటాడు. మనలో ఉన్న నీతి, న్యాయం, ధర్మం మనుషుల్లో కొంచెం కూడా లేవు. కలుషితమైన వారిమీద మనపై ఏ కొంచెం పడినా మనలో మంచితనం, జంతుతత్వం, ఐక్యత హరించుకుపోతాయి. వారి ఛాయ కూడా మన మీద పడకుండా ఎంతో దూరంగా దండకారణ్యంలోకి వెళ్లిపోదామంటాడు మృగరాజు.

వీరు రాసిన కనిపించే దేవుళ్లు పుస్తకంలో 20 గేయాలు, 2 నృత్యరూపకాలున్నాయి. చిన్న చిన్న మాటలతో కొన్ని కొత్త పాటలు రాశారు. బుడి బుడి నడకల బుజ్జి చిన్నారులకోసం.. అంటే ఐదారేళ్లలోపు పిల్లల కోసం జాబిలి మామ.. వచ్చావా? వానావానా వచ్చావా.. శానా వానా తెచ్చావా? చిట్టి చేమంతి లాంటి పిల్లలు, ఆరు నుంచి పన్నెండు పదమూడు సంవత్సరాల వయసు పిల్లల కోసం దేశభక్తి గేయం, సంప్రదాయ పండుగ పాటలు ఆడుతూ, పాడుతూ ఉండటానికి వీలుగా రాశారు. వీరు రాసిన అనగనగా ఒక చిట్టడవి. గులాబి బాలలు, నృత్య నాటికలు హైదరాబాద్ జవహర్ బాలభవన్‌లో అనేకమార్లు ప్రదర్శించారు. ఇంకా 12 కథలతో ''కాకినీతి'', 100 కథలతో ''కిలకిల నవ్వుల పిల్లల్లారా'' బాలల కథల సంపుటాలు ప్రచురించారు. ''పిల్లల కథలు చదివేటప్పుడు రచయిత పూర్తి సరళంగా రాస్తే కఠిన పదాలకు ఇక జీవితంలో అర్థం తెలుసుకునే ఆలోచన చేయరు'' అంటారు శారదా అశోక వర్ధన్ అమ్మమ్మ.



నిర్వహణ: పైడిమర్రి రామకృష్ణ
సెల్ : 9247564699



బూడిద రంగులు

ఏదైనా పదార్థాన్ని ఆక్సిజన్ వాయువుతో మండించినప్పుడు ఆ పదార్థం నాశనమై బూడిద మిగులుతుంది. ఇది చాలా సర్వసాధారణమైన విషయం. అయితే ఇంటిలోని వంటగ్యాస్ మండినప్పుడు బూడిద ఎందుకు రాదు? బూడిద ఒక్కోసారి నల్లగా, ఒక్కోసారి తెల్లగా ఉండటానికి కారణం ఏమిటి? దీనికి కారణం కర్ర, బట్ట, ఎండు గడ్డి, కాగితం మున్నగు పదార్థాలు గాలిలో మండించినప్పుడు నల్లగా మారుతాయి. వీటిలోని ప్రధాన పదార్థాలైన కార్బన్ హైడ్రోజన్, ఆక్సిజన్‌లు మండినప్పుడు కార్బన్, ఆక్సిజన్ కలిసి కార్బన్ డై ఆక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్‌గా మారతాయి. ఆక్సిజన్ కలిసి నీటి ఆవిరిగా మారుతాయి. ఇలా మండుతున్నప్పుడు వెలువడే వాయువులు కాబట్టి అవి గాలిలో పైకి పోతాయి. అయితే పదార్థంలోని కార్బన్ పూర్తిగా మండినప్పుడు నల్లటి బూడిద మిగులుతుంది. అదే ఇంటిలోని వంటగ్యాస్‌లో ఉన్న కార్బన్, హైడ్రోజన్‌లు ఆక్సిజన్ కలిసి పూర్తిగా మండినప్పుడు అధిక వేడిమి లభించి బూడిద మిగలకుండా పోతుంది. కొన్ని రకాల వృక్షాలు, పశువుల పేడ వంటి వాటిలో సోడియం, పొటాషియం, ఐరన్, కాల్షియం వంటి పదార్థాలు స్వల్ప పరిమాణంలో ఉండటం వల్ల అవి మండినప్పుడు లోహపు ఆక్సైడ్‌లుగా మారతాయి. ఇవి తెల్లగా ఉంటాయి. అందువల్ల పిడకలు మండించినప్పుడు నలుపు, తెలుపు మిశ్రమం కల్సి బూడిదవర్ణం ఏర్పడుతుంది.

మీకు తెలుసా?

పక్షి అరుపు


ఒక్కో పక్షి ఒక్కో విధంగా అరుస్తుంది. ఒకే జాతి పక్షి సందర్భాన్ని బట్టి అరిచే తీరు మారుతుంది. ఆహారం గురించి, శత్రువు గురించి చెప్పాల్సి వచ్చినప్పుడు, బాధకలిగినప్పుడు పక్షులు అరుస్తుంటాయి. ఇవి ఆయా సమయాల్లో అందుకు అనుగుణంగా అరుస్తుంటాయి. ముఖ్యంగా మగపక్షుల అరుపులు విచిత్రంగా ఉంటాయి. అదే ఆడపక్షులు తమ ఆచూకీ తెలుసుకునేందుకు మగ పక్షులను ఆకర్షించేందుకు ప్రత్యేకంగా అరుస్తాయి. అదేవిధంగా గుడ్లు పెట్టేందుకు అనువైన కాలంలో ఈ పక్షులు అరుపులు భిన్నంగా.. పోటీ పడి అరవడం కనిపిస్తుంది.



ప క ప క


నువ్వు తాగేశావ్

భర్త పెప్సీ బాటిల్ ఎదురుగా పెట్టుకుని చాలా ఉదాసీనంగా కూర్చున్నాడు
భార్య హడావిడిగా వచ్చి, పెప్సీ తాగేసి ఎందుకలా డల్‌గా కూర్చున్నారు? అని ప్రశ్నించింది.
భర్త: ఫ్చ్, ఏమిటో ఈ రోజేమి బాగోలేదు
భార్య: ఏమైందీ?
భర్త: ఉదయం నీతో గొడవైంది. ఆఫీసుకు లేటుగా వెళ్లా. బాసు నన్ను ఉద్యోగం నుంచి పీకేశాడు. ఆ బాధతో పెప్సీలో విషం కలిపి పెట్టుకున్నా. అది కూడా నువ్వు తాగేశావ్



ఫాస్ట్‌గా మాట్లాడతాడు

కాంతం: నా కొడుకు ఇంగ్లీష్ చాలా ఫాస్ట్‌గా మాట్లాడుతాడు. తెలుసా?
శాంతం: ఓ అలాగా! బాబూ ఒక్కసారి మాట్లాడమ్మా...
చింటూ: ఇంగ్లీష్. ఇంగ్లీష్. ఇంగ్లీష్... ఇంగ్లీష్



ఏం చేద్దాం?

అమాయకరావ్, తింగరప్ప షికారుకు బయలేర్దారు. వారికి రోడ్డుపై రూ 2వేల నోటు దొరికింది
అమాయక రావ్: ఇప్పుడు దీన్ని ఏం చేద్దాం?
తింగరప్ప: 50:50 చేసుకుందాం.
అమాయకరావ్: మరి, మిగతా రూ 1900 ఏం చేద్దాం?




తెలిసింది లేవయ్యా !

కానిస్టేబుల్: సార్ సార్... పక్క రోడ్డులో ఎవరో పూటుగా తాగి కత్తి పట్టుకుని నానా అల్లరి చేస్తున్నారట...
సబ్ ఇన్‌స్పెక్టర్: తెలిసింది లేవయ్యా.. అందుకే వేరే రోడ్డు మీది నుంచి ఇంటికి వెళ్తున్నా..



ఆపేయడం బెటర్


అప్పు: సుబ్బూ.. ఇవాళ మనం ఫుల్లుగా తాగేయాలి. ఎంతగా తాగాలంటే.. ఆ మూడు చెట్లను చూస్తే మైకం కమ్మి ఆరు చెట్లులా కనిపించాలి.
సుబ్బు: అయితే మనమింకా తాగడం ఆపేయడం బెటర్....
అప్పు: అదేమిరా?
సుబ్బు: అక్కడ ఉన్నది ఒకటే చెట్టు. ఇంకా తాగితే ఆరు చెట్లు కాదు.. పెద్ద అడవే కనిపిస్తుంది.



బంగారు పలుకు

బంగారు పలుకు
మన జననం ఓ సాధారణమైనది కావచ్చు. కానీ మరణం మాత్రం చరిత్ర సృష్టించేదిగా ఉండాలి

- అబ్దుల్ కలాం



పూనే టూ హైదరాబాద్



జూ.ఎన్టీఆర్ తాజా చిత్రం జై లవకుశ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఎన్టీఆర్ మొదటిసారి ఇందులో త్రిపాత్రాభినయం చేస్తుండటం ఓ విశేషం. లోగడ తాను ద్విపాత్రాభినయం చేసిన చిత్రాలలో ఒక పాత్రకు, వేరొక పాత్రకు మధ్య ఎంతో వ్యత్యాసం చూపిన ఎన్టీఆర్ ఈ చిత్రంలో కూడా తనదైన త్రిపాత్రాభినయంలో కూడా ప్రత్యేకతను చాటేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా ఎన్టీఆర్ కనబరుస్తున్న నటన దర్శకుడు బాబిని ఎంతగానో ముగ్ధుడ్ని చేస్తోందట. అంతేకాదు మొదట్నుంచి డ్యాన్స్‌ల పరంగా కూడా అందరి దృష్టిని ఆకర్షించిన ఎన్టీఆర్ ఈ చిత్రం కోసం చేస్తున్న డ్యాన్స్ కూడా దర్శకుడితో పాటు చిత్రబృందాన్ని అలరిస్తోందని అంటున్నారు. ఇప్పటికే ఈ చిత్రం షూటింగ్ చాలాభాగం పూర్తికాగా ఇటీవలనే పూనేలో కొంత టాకీని చిత్రీకరించుకుని యూనిట్ హైదరాబాద్ చేరుకుంది. తిరిగి హైదరాబాద్‌లోనే షూటింగ్ జరపనున్నారు. ఈ నెలాఖరుకు పాటలతో సహా షూటింగ్ పార్ట్ మొత్తం పూర్తికానుంది.

ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకంపై కల్యాణ్‌రామ్ నందమూరి నిర్మిస్తున్న ఈ చిత్రంలో రాశిఖన్నా, నివేదాథామస్ కథానాయికలుగా నటిస్తున్నారు. సెప్టెంబర్ 21న సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకుని రావాలన్నదే దర్శక, నిర్మాతల సంకల్పం. ఈ చిత్రానికి సి.కె.మురళీధరన్ ఛాయాగ్రహణాన్ని అందిస్తుండగా, దేవిశ్రీప్రసాద్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు.

పెళ్లికళ!



నాగచైతన్య, సమంతల ప్రేమ పెళ్ళిగా మారుతున్న విషయం తెలిసిందే. ఇద్దరు తమ తమ సినిమాలతో బిజీగా ఉన్నారు. ఈ ప్రేమజంటతో ఓ చిత్రాన్ని తెరకెక్కించడానికి దర్శకుడు మారుతి సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం. పెళ్లికళ పేరుతో వచ్చే ఏడాది సినిమా రూపొందించనున్నట్టు తెలిసింది. ఈ కొత్త చిత్రానికి సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

బిజినెస్ ఉమెన్ సమంత

అక్కినేని ఇంట కోడలుగా త్వరలో అడుగుపెట్టబోతున్న నటి సమంత రంగస్థలం చిత్రంలో నాయికగా నటిస్తోంది. మరోవైపు తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిన వొవెన్‌కు అంబాసిడర్‌గా ఉంది. చేనేత వస్త్రాల ప్రచారం చేస్తోంది. ఇంత బిజీగా ఉన్న సమంత వ్యాపారరంగంలో కూడా అడుగుపెడుతున్నట్టు తెలిసింది.

టాలీవుడ్ స్టార్స్ చాలా మంది ఇప్పటికే రకరకాల వ్యాపారాలు చేస్తున్నారు. ఎక్కువగా రెస్టారెంట్స్ నెలకొల్పడానికి హీరోయిన్లు మొగ్గుచూపుతున్నారు. మరికొందరు డ్రస్ మెటీరియల్ లేదా బ్యూటీకి సంబంధించిన బిజినెస్ చేస్తున్నారు. సినీ కెరీర్ అనేది భద్రత లేనిది. ఈ రోజు ఉండే సంపాదన భవిష్యత్తులో ఉండకపోవచ్చు. అందుకే ఈ పాటి ముందుజాగ్రత్త తీసుకోవడం అభినందనీయమే. అయితే బిజినెస్ ఆలోచన సమంతకు కూడా రావడం ఆశ్చర్యం కలిగి స్తోంది. ఇతరు లతో పోలిస్తే సమంతకు భవి ష్యత్తు పరం గా కూడా ఎలాంటి ఆందోళన లేదనేది అందరూ అంగీకరిస్తారు. అయి తే కేవలం ఆసక్తి కోసం ఆమె ఎస్.వి.ఎస్. పార్టనర్స్ ఎల్ఎల్‌పి పేరుతో ఓ కంపెటీ నెలకొల్పినట్టు సమా చారం. ఇందులో ఆమె మిత్రులు ఇందులో పార్టనర్స్‌గా ఉన్నా రట. అయితే ఈ కంపెనీ ద్వారా నిర్వహించే వ్యాపా రం ఏమిటనే దానిపై స్ప ష్టత లేదు. సమంత న టి నుండి బిజినెస్ ఉమెన్‌గా మారుతోం దన్నమాట.

చైత్రగా ఆకట్టుకుంటా

- మేఘాఆకాష్



తెలుగులో లై వంటి రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ కథాచిత్రం ద్వారా పరిచయమవుతున్నందుకు ఆనందంగా ఉంది. ఈ తొలి చిత్రమే టాలీవుడ్‌ను తన కెరీర్ మలుపు తిప్పుతుందన్న నమ్మకం ఉంది అని కథానాయిక మేఘాఆకాష్ చెప్పుకొచ్చారు. నితిన్, మేఘాఆకాష్ జంటగా హను రాఘవపూడి దర్శకత్వంలో 14 రీల్స్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై రూపొందిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని సంస్థ కార్యాలయంలో మేఘాఆకాష్ పాత్రికేయులతో కొద్దిసేపు ముచ్చటించారు. ఆ వివరాలేమిటో ఆమె మాటల్లో... చెన్నైలోపుట్టి పెరిగిన నేను విజువల్ కమ్యూనికేషన్స్‌లో డిగ్రీ పూర్తిచేశాను. నటనపట్ల ఉన్న ఆసక్తితోనే సినీరంగంలోకి వచ్చాను. మా నాన్న ఆకాష్‌రాజా తెలుగువారే. అడ్వర్టైజ్ ఏజెన్సీని నిర్వహిస్తున్నారు. మా అమ్మ బిందుఆకాష్ యాడ్ ఫిలిం డైరెక్టర్‌గా ఉన్నారు. తొలుత తమిళ సినీరంగంలోకి అడుగుపెట్టిన నేను నటించిన తొలి చిత్రం విడుదలకు సిద్ధమవుతుండగా, ధనుష్ కథానాయకుడిగా గౌతమ్‌మీనన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం నిర్మాణంలో ఉంది. ఇందులో ధనుష్ సరసన నాయికగా నటిస్తున్నాను. ఈ రెండు చిత్రాలు అక్కడ నాకెంతో పేరు తెచ్చిపెట్టేవే. ఇక తెలుగులో నితిన్ సరసన నటిస్తున్న ఈ తొలి చిత్రంలో చైత్ర పాత్రలో మెరవబోతున్నాను. అప్పుడే కాలేజీ విద్యాభ్యాసం పూర్తిచేసిన అమ్మాయిగా కనిపిస్తాను. గ్లామర్‌కు గ్లామర్, నటనకు నటన రెండూ ఈ పాత్రలో ఉన్నాయి. నితిన్ ఎంతో స్నేహపూర్వకంగా ఉంటారు. ఇక దర్శకుడు హను రాఘవపూడి లోగడ తీసిన అందాల రాక్షసి, కృష్ణగాడి వీరప్రేమగాథ ప్రేక్షకులను ఎంతగానో అలరించిన విషయం తెలియంది కాదు. ఈ చిత్రాన్ని కూడా ఆయనెంతో అద్భుతంగా మలిచారు. ఈ చిత్రం కోసం అమెరికాలో 75 రోజుల పాటు భారీ షెడ్యూల్ జరిగింది. 14 రీల్స్ ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్ నిర్మాణ విలువలు కూడా ఎంతో బావున్నాయి. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది కలగకుండా వారు ఎంతోబాగా చూసుకున్నారు. మా నాన్న తెలుగువారు కావడం చేత తెలుగు భాషను అర్థం చేసుకోగలను. త్వరలోనే పూర్తిస్థాయిలో మాట్లాడేందుకు ప్రయత్నిస్తాను. తమిళ, తెలుగు సినీరంగాల మధ్య వ్యత్యాసం ఏమీలేదు. ఇక్కడి వాతావరణం, అక్కడి వాతావరణం దాదాపుగా ఒకటే. కాకపోతే భాష ఒక్కటే తేడా. రెండు భాషల సినిమాలకు సమాన ప్రాధాన్యమిస్తాను. ఇక డేట్స్‌ను సర్దుబాటు చేసే అవకాశం లేకనే రామ్ సినిమాలో నటించలేకపోయా. త్రిష నటన అంటే నాకెంతో ఇష్టం. అలాగే బాలీవుడ్ బాద్‌షా షారుక్‌ఖాన్ అంటే కూడా ఎనలేని అభిమానం.

కిడ్నాప్ డ్రామా ఆడింది ఎవరూ?



పోసాని కృష్ణమురళి, అదితి సింగ్

మధురం మూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న చిత్రం నేను కిడ్నాప్ అయ్యాను. దగ్గుబాటి వరుణ్ సమర్పణలో మాధవి అద్దంకి నిర్మిస్తున్న ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలు పూర్తిచేసుకుంది. ఈ నెలలోనే విడుదల చేస్తారు. కిడ్నాప్ డ్రామా నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రానికి శ్రీకర్ బాబు దర్శకత్వం వహించారు. నిర్మాత మాట్లాడుతూ బ్రహ్మానందం, పోసాని కృష్ణమురళి, తాగుబోతు రమేష్ మధ్య కామెడీ. రఘుబాబు, కృష్ణభగవాన్ మధ్య సన్నివేశాలు చాలా బాగా వచ్చాయి. హీరోయిన్ అదితి సింగ్ అభినయం అలరిస్తుంది. ప్రేక్షకులను ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉంది అన్నారు.

దర్శకుడు మాట్లాడుతూ సినిమా సంతృప్తికరంగా వచ్చింది. నిర్మాత కాంప్రమైజ్ అవకుండా ఖర్చు పెట్టారు. యూనిట్ సభ్యుల సహకారంతో సకాలంలో షూటింగ్ పూర్తిచేశాం అని చెప్పారు.

బంగారు విజయ్

తెరపై హీరోయిజం ప్రదర్శించే నటుల్లో చాలా మంది నిజజీవితంలో మాత్రం పూర్తి భిన్నంగా కనిపిస్తారు. రాబిన్‌హుడ్ తరహా పాత్రల్లో మెప్పించినా, రియల్‌లైఫ్‌లో మాత్రం ఎవరికీ సహాయం చేయరు. ఇలాంటి భిన్న మనస్తత్వం ఉన్న సినీరంగంలో యూనిట్ సభ్యులందరికీ ఊహించని బహుమతిలు ఇచ్చి ఆశ్చర్యపరిచారు కోలీవుడ్ నటుడు విజయ్.

తమిళ సినీరంగంలో రజనీకాంత్ తర్వాత సూపర్‌స్టార్ ఇమేజ్ సొంతం చేసుకున్న విజయ్ సినిమాలకు కమర్షియల్‌గా చాలా పెద్ద మార్కెట్ ఉంది. ఆయన ప్రతి సినిమా వంద కోట్ల బడ్జెట్‌తో



తెరకెక్కుతుందని అంటారు. విజయ్ తెలుగు ప్రేక్షకులకు స్నేహితులు, తుపాకి చిత్రాల ద్వారా పరిచితుడే.

విజయ్ నటిస్తున్న తాజా చిత్రం మెర్సల్ షూటింగ్ జరుగుతోంది. అట్లే దర్శకత్వం వహిస్తున్నారు. భారీ అంచనాలున్న ఈ చిత్రం కోసం సుమారు 200 మంది యూనిట్ సభ్యులు పనిచేస్తున్నారు. వీరందరికీ హీరో విజయ్ బంగారు నాణేలు బహుమతిగా అందజేశారు. సభ్యుల హోదాతో సంబంధం లేకుండా అందరికీ అందజేశారు. హీరో అందించిన కానుకలు చూసుకుని యూనిట్ సభ్యులు మురిసిపోయారు. గతంలో అంటే భైరవ షూటింగ్ సమయంలో కూడా విజయ్ ఈ విధంగానే యూనిట్ అందరికీ బంగారు గొలుసులు ప్రధానం చేశారు.

తరచుగా విజయ్ యూనిట్ సభ్యులకు బహుమతులు అందజేస్తుంటారని తెలిసింది. సినిమా మేకింగ్‌లో 24 విభాగాల భాగస్వామ్యం ఉంటుందనే విషయం తెలిసిందే. సహజంగా సినిమా భారీ విజయం పొందితే గిఫ్టులు ఇస్తుంటారు. కానీ దీనికి భిన్నంగా షూటింగ్ సమయంలోనే విజయ్ కానుకలు ఇచ్చి తన ఉదారత చాటుకున్నారు.

విజయ్ తాజా చిత్రం మెర్సల్‌లో కాజల్, సమంత, నిత్యామీనన్ నాయికలుగా నటిస్తున్నారు. ఎస్.జె. సూర్య మరో కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రానికి ఎ.ఆర్. రెహమాన్ బాణీలు అందిస్తున్నారు. దీపావళికి ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది.

జై జవాన్



దేశానికి జవాన్ ఎంత అవసరమో...ప్రతీ ఇంటికీ మా కథానాయకుడు లాంటి జవాన్ అవసరం ఎంతైనా ఉందని చెప్పే ప్రధానాంశంతో జవాన్ చిత్రాన్ని మలచడం జరుగుతోందని దర్శకుడు బి.వి.యస్.రవి తెలిపారు. సాయిధరమ్‌తేజ్, మెహ్రీన్ నాయకానాయికలుగా దిల్‌రాజు సమర్పణలో అరుణాచల్ క్రియేషన్స్ పతాకంపై కృష్ణనిర్మిస్తున్న ఈ చిత్రం టీజర్ విడుదలైంది. కొంతమంది మనుషులు కలిస్తే కుటుంబం అవుతుంది. కొన్ని లక్షల కుటుంబాలు కలిస్తే దేశం అవుతుంది. దేశభక్తి అనేది కిరీటం కాదు, కృతజ్ఞత అంటూ బి.వి.యస్.రవి చెప్పిన వాయిస్ ఓవర్ ఆలోచనాత్మకంగా ఉంది. ఈ చిత్రం ద్వారా సాయిధరమ్‌తేజ్‌ని ఆయన కొత్తగా చూపించబోతున్నట్లు అర్థమౌతోంది.

మధ్యతరగతి యువకుడి పాత్రలో సాయిధరమ్ కనిపిస్తున్నారు. తన కుటుంబాన్ని, మనోధైర్యంతో, బుద్ధిబలంతో కథానాయకుడు ఎలా కాపాడుకున్నాడన్నదే చిత్రకథ అని చిత్రబృందం వెల్లడించింది. అందుకే ఇంటి కొక్కడు అనే ఉపశీర్షికను పెట్టాం. పక్కా, ఫ్యామిలీ ఎమోషన్స్‌తో కూడుకున్న ఎంటర్‌టైనర్ ఇదని వారు చెప్పారు. సాయిధరమ్ కెరీర్‌లో మరో ఎత్తుగా ఈ చిత్రం ఉంటుందన్న అభిప్రాయాన్ని వారు వ్యక్తంచేశారు.తమన్ సంగీతం అలరిస్తుందని, మెహ్రీన్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని అన్నారు. ప్రసన్న ప్రధాన విలన్‌గా నటించారని, సెప్టెంబర్‌లో చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు వారు తెలిపారు.

ఈ చిత్రంలోని ఇతర ముఖ్యపాత్రల్లో జయప్రకాష్, ఈశ్వరీరావు తదితరులు తారాగణం. ఈ చిత్రానికి కెమెరా: కె.వి.గుహన్, సంగీతం: తమన్, ఆర్ట్: బ్రహ్మ కడలి, ఎడిటింగ్: ఎస్.ఆర్.శేఖర్.

మాస్ పవర్ ప్రారంభం



శివ జొన్నలగడ్డ కథానాయకుడిగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో రూపొందిస్తున్న తాజా చిత్రం మాస్ పవర్. ఇందులో ఆయన సరసన ప్రియచైతన్య కథానాయికగా నటిస్తోంది. సర్వేశ్వర మూవీస్ పతాకంపై గుద్దేటి బసవప్ప మేరు నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రారంభోత్సవం హైదరాబాద్‌లోని ఫిలిం చాంబర్‌లో జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ పారిశ్రామికవేత్త సారిపల్లి కొండలరావు క్లాప్ నివ్వగా, తుమ్మలపల్లి రామసత్యనారాయణ కెమెరా స్విచ్చాన్ చేశారు. ముత్యాల రామదాసు గౌరవ దర్శకత్వం వహించారు. స్క్రిప్ట్‌ను వి.సాగర్, టి.ప్రసన్నకుమార్‌లు దర్శక, నిర్మాతలకు అందించారు. ఈ సందర్భంగా సారిపల్లి కొండలరావు మాట్లాడుతూ, శివ కష్టపడి పైకి వచ్చారు. పోలీస్‌పవర్‌లో మాస్ పాత్రలో అందర్నీ ఆకట్టుకున్నారు. మళ్లీ ఆ తరహా మాస్ కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. అతనితో పాటు చిత్రబృందానికి విజయం చేకూరాలని కోరుకుంటున్నా అని అన్నారు. కథానాయకుడు, దర్శకుడు శివ జొన్నలగడ్డ మాట్లాడుతూ, లోగడ బసవప్ప, నా కాంబినేషన్‌లో వచ్చిన పోలీస్ పవర్ మంచి విజయం సాధించింది. మళ్లీ మా ఇద్దరి కలయికలో రూపొందిస్తున్న మరో చిత్రమిది. కాలనీలో ఒక ఇంటిని ఓ రాజకీయ నాయకుడు కబ్జా చేస్తే ఎలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయన్న అంశంతో సాగే ఈ చిత్రం పక్కా మాస్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుంది. యాక్షన్ సన్నివేశాలు చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి అని అన్నారు.నిర్మాత గుద్దేటి బసవప్ప మేరు మాట్లాడుతూ, లోగడ మేము తీసిన పోలీస్ పవర్ చిత్రం హిందీ, తమిళ హక్కులు కూడా అమ్ముడయ్యాయి. మళ్లీ ఈ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నాం. ఇందులోని ఐదు ఫైట్స్‌ను ఐదుగురు ఫైట్ మాస్టర్స్, ఐదు పాటలను ఐదుగురు డ్యాన్స్ మాస్టర్స్ కంపోజ్ చేస్తున్నారని చెప్పారు. ఈ నెల 10 నుంచి రెగ్యులర్ షూటింగ్‌ను మొదలుపెడతాం అని చెప్పారు.

ఈ చిత్రానికి కెమెరా: కె.శివ, ఫైట్స్: మల్లేష్ యాదవ్, సభా, నిర్మాత: గుద్దేటి బసవప్ప మేరు, కథ, మాటలు, సంగీతం, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: శివ జొన్నలగడ్డ.

పోలీస్‌పవర్ అర్థ శతదినోత్సవం

కాగా ఇదే వేదికపై శివ జొన్నలగడ్డ నటించిన పోలీస్‌పవర్ అర్థ శతదినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా చిత్రబృందానికి జ్ఞాపికలను ప్రదానం చేశారు.